# పోతన - అన్నమయ్య సాహిత్య దృక్పథాలు



డా॥ యడవల్లి పరమేశ్వరయ్య
బి.మ్యూజిక్, ఎం.ఏ., పిహెచ్.డి.

# Pothana - Annamayya Sahithya Drukpathalu

# పోతన - అన్నమయ్య సాహిత్య దృక్పథాలు

రచయిత : డా॥ యడవల్లి పరమేశ్వరయ్య, (తెలుగు లెక్చరర్)
యస్.వి. సంగీత, నృత్య కళాశాల
తిరుపతి.

హక్కులు రచయితవి

ప్రథమ ముద్రణ ఏప్రిల్ 2008
కాపీలు : 1000

ప్రతులకు :
డోర్ నెం. 4-4-900సి, నెహ్రూనగర్, తిరుపతి.
సెల్ : 9440254285, 9704271228


ధర రూ॥ 150/-

ముద్రణ
కీర్తి ఆఫ్‌సెట్,
103, ప్రకాశం రోడ్, తిరుపతి.
సెల్ : 94402 70706

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | నివాళి | X-XV |
| 2. | ప్రస్తావన | 1-4 |
| 3. | పోతన - అన్నమయ్యల జీవిత నేపథ్యాలు | 5-36 |
| 4. | పురాణం - భాగవతం | 37-48 |
| 5. | పదం - కీర్తన - కృతి | 49-77 |
| 6. | పోతన, అన్నమయ్యల భక్తితత్త్వం | 78-143 |
| 7. | సాహిత్య దృక్పథాలు - పోతన, అన్నమయ్య | 144-242 |
| 8. | పోతన, అన్నమ్యల భావసామ్యం | 243-258 |

ఈ గ్రంథం 'తిరుమల తిరుపతి దేవస్థానముల' వారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడింది.



## అంకితం

ఉ॥ పోతన అన్నమయ్యలటు పూజలుఁ జేసిరి భక్తిముక్తికై
చిత్తము నీపదాబ్జముల చెంతన నిల్పిరి గాన, నీకథల్
కీర్తన చేయుచున్న నను [illegible] నీకు నీ
గ్రంథము నీకు నంకితము సేయుదు శ్రీనిధి వేంకటేశ్వరా!



శ్రీ పరమాత్మానందగిరి స్వామి (తాతగారు, సంగీత, సాహిత్య స్ఫూర్తి ప్రదాత)
శ్రీ కృష్ణభక్తాశ్రమ స్థాపకులు, గోవిందప్ప కండ్రిగ



శ్రీమతి అంకమ్మ, శ్రీ వెంకటసుబ్బయ్య
అమ్మ నాన్నలు

# ఆకాంక్ష

ఆచార్య జి. దామోదర నాయుడు
ఎం.ఏ. ఎంఫిల్, పిహెచ్.డి.
తెలుగు అధ్యయనశాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

డా॥ పరమేశ్వరయ్య ఎం.ఏ లో నా విద్యార్థి. అప్పటి పరిచయం అంతంత మాత్రమే. 2002 ఫిబ్రవరిలో నావద్ద పరిశోధక విద్యార్థిగా చేరాడు. అప్పటికి నాకు అతనిలోని సంగీత ప్రావీణ్యం ఏమాత్రం తెలియదు. పరిశోధనాంశాన్ని నిర్ణయించవలసి వచ్చినప్పుడు అన్నమయ్య సాహిత్యాన్ని గూర్చి తన అభిమానాన్ని తెలియజేశాడు. అన్నమయ్య కీర్తన తెలుసా! అని అడిగాను, ఒకటి పాడి వినిపించాడు. అతని కంఠమాధుర్యానికి, సంగీత జ్ఞానానికి ఆశ్చర్యానందాలు కలిగాయి. పద్యాలు కూడా సంగీతపరంగా పాడగలవా! అని అడిగాను. అప్పుడు పోతన భాగవతంలోని "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అన్న పద్యాన్ని రాగయుక్తంగానే కాక భావయుక్తంగా కూడా పాడి పరవశింపజేశాడు. పరిశోధన చేస్తున్న కాలంలో ఏనాడు నా మనస్సు నొప్పించకుండా ప్రవర్తించడం పరమేశ్వరయ్య ప్రత్యేకత. వ్యక్తి స్వభావం చాలా నిదానమైంది, మాటలూ అంతే, చాల నెమ్మదిగా వుంటాయి. తొందర పాటు తొట్రుపాటు, అధిక ప్రసంగం, అనవసర విషయాలజోలికి పోకపోవడం పరమేశ్వరయ్యలో నాకు నచ్చిన అంశాలు. శ్రీవిద్యానికేతన్ వాళ్ళు నన్ను ఒక తెలుగు ఉపాధ్యాయుడు కావాలని కోరినప్పుడు నేను వారికి పరమేశ్వరయ్య పేరు సూచించాను. అక్కడ మంచి ఉపాధ్యాయుడుగా పేరు తెచ్చుకోవడమేకాక మంచి ఉపాధ్యాయుని పంపారన్న కీర్తిని కూడా నాకు తెచ్చిపెట్టాడు. అయితే అతని మనస్సు ఎప్పుడు సంగీతం వైపే మొగ్గుచూపేది. అన్నమయ్య కీర్తనలు ఆలపించడం ఊపిరి పీల్చినంత సహజంగా అతనికి అలవడింది. అందుకే శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్యకళాశాలలో అధ్యాపకుడైనాడు. భారత దేశమంతటా తిరుమల తిరుపతి దేవస్థానము వారి తరపున అన్నమయ్య కీర్తనలు ఆలపించడానికి వెళుతుంటాడు. ఆధునిక కాలంలో యువత వేష భాషలలో రోజురోజుకు నూతన పోకడలు వస్తున్నా ముఖాన బొట్టు లేకుండా పరమేశ్వరయ్య కన్పించడు. ఆ ముఖ వర్చస్సు నన్నెంతో ఆకర్షించింది. అందుకే ఎప్పుడూ నేను అతనిని మనస్సులో అభినందిస్తుంటాను. నాకంటే వయస్సులో చిన్నవాడు,

నావిద్యార్థి కావడం వల్ల ఇంతకంటే ఎక్కువ చెప్పడం అతనికి మంచిది కాదు కాబట్టి, జీవితాంతం ఈ సత్సాంప్రదాయాలు అతడు తప్పక పాటిస్తాడని ఆశిస్తూ గ్రంథం గురించి మూడు మాటలు చెప్పదలచాను.

ఈ గ్రంథంలో మహాకవులైన పోతన అన్నమయ్యల జీవిత నేపథ్యాలు, సామ్యభేదాలు చర్చించబడ్డాయి. పురాణ భాగవత ప్రాశస్త్యాలు పరిశీలింపబడ్డాయి. పదం- కీర్తన - కృతి నిర్వచనం, ప్రాశస్త్యం ప్రస్తావించబడ్డాయి. తర్వాత భక్తికి సంబంధించి ప్రాచీన, అధునికులు నిర్వచించిన అనేక అంశాలు వివరిస్తూ, అందులో మధుర భక్తిని గురించిన అంశాలు ప్రత్యేకంగా ప్రస్తావించాడు. నవవిధ భక్తి మార్గాలు తెలియజేస్తూ, భక్తి ప్రాశస్త్యాన్ని గూర్చి పరమేశ్వరయ్య ఒకరకంగా పరవశించి వివరించాడు. 'భక్తితత్త్వం' అన్న ఈ ప్రకరణం ఈ గ్రంథానికి గుండెలాంటిది అని చెప్పవచ్చు. ఈ ఇరువురి మహాకవుల సాహిత్య దృక్పథం సవిమర్శ నాత్మకంగా ఉదాహరణ విపుల వ్యాఖ్యానాలతో వివరించబడింది. చివరిగా పోతన అన్నమయ్యల భావసామ్యం ఇంచుమించు ఒకటే అని చెప్పడం ఇందులో విశేషం. భక్తులేకాక, పండిత విమర్శకుల కూడా చదవదగింది. 'పోతన - అన్నమయ్య సాహిత్య దృక్పథాలు' అన్న ఈ సవిమర్శనాత్మక గ్రంథాన్ని సాహిత్య లోకానికి అందించిన పరమేశ్వరయ్య నా శిష్యుడు కావడం నాకెంతో ముదావహం.

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుని, ఇష్టదైవంగా భావించేవాణ్ణి నేను. ఆ వైకుంఠవాసుని నిరంతరం కీర్తిస్తూతన సర్వాంతరాత్మగా భావించేవాడు పరమేశ్వరయ్య అటువంటి పరమేశ్వరయ్యకు ఇటువంటి గ్రంథాలు అనేకం వెలువరించే శక్తిని, అయురారోగ్యాలను ప్రసాదించాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నాను. పరమేశ్వరయ్య జీవితం సుఖ శాంతులతో వర్ధిల్లాలన్నదే నా ఆకాంక్ష.

(ఆచార్య జి.దామోదర నాయుడు)

# ముందుమాట

శ్రీ వేంకటేశ్వరుని కృప, పోతన అన్నమయ్యల ఆశీర్వాద బలం నాచేత ఈ పని (గ్రంథరచన) చేయించాయి. పోతన, అన్నమయ్యల జీవిత నేపథ్యాలు, భాగవత ప్రస్తావన, పురాణాలలో భాగవత స్థానం, పదం-కీర్తన-కృతిల వివరణ, వాటి ప్రాశస్త్యం, వీరి భక్తితత్త్వం, సాహిత్యం ద్వారా కనిపించే వీరి దృక్పథం, భావసామ్యం ఈ గ్రంథంలో చర్చించిన ప్రధాన అంశాలు.

పోతన అన్నమయ్యలు ఇంచుమించు ఒకే దృక్పథాన్ని కలిగినవారు. వీరికి లౌకికమైన వస్తు విషయ వాంఛ ఉన్నట్లు కనిపించదు. అలౌకికమైంది, శాశ్వతమైంది అయిన మోక్షవాంఛ మాత్రమే వీరిలో ప్రధానంగా కన్పిస్తుంది. అంటే లౌకిక సంపద కంటే అలౌకిక సంపదపై వీరికి ఆసక్తి ఎక్కువ అని తెలుస్తుంది. అందుకే వీరి విషయంలో 'భక్తి' రసస్థాయికి చేరింది. భక్త కవులుగా లోకం కొనియాడింది. నానా విధ సాహిత్య కళానైపుణ్యానికి వీరు ప్రతీకలుగా కనిపిస్తారు. **ముక్తి భక్తి శక్తి** అనే అంశాలు వీరిలో కనిపించే ప్రధానమైన అంశాలు.

మానవ జన్మ దుర్లభమని పెద్దల మాట. మానవ జన్మలో సాధించలేనిది మరే జన్మలోనూ సాధించటానికి వీలులేదు. అందులో ప్రధానంగా చెప్పుకోదగింది మోక్షం. కర్మ, జ్ఞాన, భక్తి మార్గాల ద్వారానే సాధించే అవకాశం ఉంది. కాబట్టి మానవేతర జన్మలందు మోక్షం సాధించడమనేది అరుదైనది. కష్టసాధ్యమైంది.

సువాసన గల పుష్పాలు భగవంతుని చేరాలని అనుకుంటాయి. అట్లే పరిమళ పుష్పాలైన పోతన అన్నమయ్యలు, పద్య పద రచనా మార్గంలో పయనించి, ప్రతి నిమిషం భగవత్సన్నిధి అయిన మోక్షాన్ని పొందాలన్న తపనతో ఆరాటంతో ఉన్నట్లుగా కన్పిస్తారు. ఇది వారి స్వకాంక్ష, స్వప్రయోజనం.

సామాజిక ప్రయోజనం కోసం, **నిత్యం, సత్యం, నిర్మలం, మోక్షం, స్ఫూర్తి** అన్న పంచ సూత్రాలను లోకానికి బోధించిన సద్గురువులు పోతన, అన్నమయ్యలు. ఎల్లప్పుడు (నిత్యం) నిజమైన (సత్యం) శాశ్వతమైన పరబ్రహ్మను అనన్య (నిర్మలం) మైన భక్తితో కీర్తించి మోక్షాన్ని పొంది స్ఫూర్తి ప్రదాతగా మానవుడు కీర్తి పొందాలన్నదే పై పంచసూత్రాల సారాంశం. పోతన అన్నమయ్యల విశిష్టమైన దృక్పథం ఇదే. అందుకే వారు ఈ సూత్రాన్ని పాటించి ఈ విషయాన్ని లోకానికి చాటి చెప్పారు.

గమన మార్గాలు వేరువేరైనా గమ్యం మాత్రం పోతన, అన్నమయ్యలది ఒక్కటే అదే భక్తిమార్గం ద్వారా ముక్తిని పొందాలని భావించడం. ఒకరు పద్యగద్యాలలో, మరొకరు కీర్తనలలో జీవాత్మ పరమాత్మ చేరుకోవడానికి పడే తపనను అత్యద్భుతంగా చిత్రించినారు. సూర్యచంద్రు లున్నంత కాలం అటు పండితుల హృదయాలలోను, ఇటు భక్తకోటి మనస్సులలోనూ ఈ కవి రవిచంద్రులు సజీవులై నిలిచివుంటారు.

నాకు అన్నివిధాల సహకరించిన గురువర్యులు డా॥ జి. దామోదర నాయుడు గారికి (తెలుగు అధ్యయన శాఖ, యస్.వి.యు) ఆచార్య సర్వోత్తమ రావు (Rtd., తెలుగు అధ్యయన శాఖ, యస్.వి.యు) గారికి నాకృతజ్ఞతలు. ఈ గ్రంథ ముద్రణకు అర్థిక సహాయం అందించిన 'తిరుమల తిరుపతి దేవస్థానములు' వారికి ధన్యవాదాలు.

ఈ పుస్తకాన్ని ముద్రించిన కీర్తి ఆఫ్‌సెట్ వారికి నా ధన్యవాదాలు.

యిమ్మహాకవుల్పొగిడిన కమ్మనైన
హరికథాలీలలంజవిఁ గొన్నట్టి నామ
నస్సు శ్రీపరమేశ్వర నామ ముద్రఁ
బొందగాఁజన్మ సఫలముఁ బొందగలదు

డా॥ వై. పరమేశ్వరయ్య

# పద్యనివాళి

సీ. పరమభక్తాగ్రణి ప్రహ్లాదునంశయే
పోతనయన్నట్లు పాదముఁజూపి
భాగవతంబును భాసించునట్లుగాఁ
దెలుగునజేసి తాఁ దేజరిల్లె
మందార మకరంద మాధుర్యమునఁ దేలు
తెలుగుతేనెల నిండుతీపిఁ గ్రోలి
సహజ పాండిత్యపు సాహిత్య సంపదన్
సీసపద్యంబులఁ జెలువుఁగూర్చె

తే. విష్ణుతత్త్వంబు లోకాన విస్తరింపఁ
భక్తకవియను పేర తాఁ వాసికెక్కె
భావికవులకు నాదర్శప్రాయుడనగ
పద్యరీతినెంచి పరమపదముగాంచె

సీ. హరినందకాంశమై హరితత్త్వము దెలుప
నరుదెంచె భూమికి నన్నమయ్య
కలియుగంబున ముక్తి కారణంబైన కీ
ర్తనఁ హరిఁ గీర్తించె నన్నమయ్య

సంగీత సాహిత్య సమ్మిళిత సరాగ
సద్భక్తియోగాన నీవు నమ్ముమయ్యా
అరయ వేంకటపతి సంకీర్తనయోగ నీవు
అంత [illegible]మయ్యా

౩. అక్షరమంటు నాధారమైన విధంబు
[illegible] నమ్ముమయ్యా
జాతిభేదము లేదని చాటిచెప్పి
అంతరాత్ముని గొలిచినాడె నమ్ముమయ్యా

# పద్య ప్రశంస - పోతన

తెలుగున నవనీతచోరుని లీలలన్ మెచ్చగా నవ
లీలగా రచియించి తన సాహితీ సహజ పాండితీ ధా
రలన్ కురిపించి నవ శబ్దాలంకార ప్రాసయతి యుక్తు
లను కనిపించి భక్తపోతన నామంబుగ వెలుగొందె

చిన్నికృష్ణుని సమస్తలోకములకు పెద్దగా జేసి ప్రతిభన్
నన్న పోతనార్యుడు తన కపోల కల్పనలచే మేలన్
మిన్నయైన హరికథా శ్రవణమే పరమ పదమని తలచెన్
సన్నుగ భాగవతంబు తెలుగున జేసెన్ గరిమన్

కన్నుని తారక మంత్రపు మకరందమును గ్రోలెన్
పెన్నురవు ప్రతిభ గల సహజ పాండిత్య శోభాఢ్యుడైన్
బమ్మెరవు బ్రతుకుగల జీవిత ముక్తిదాయకుడై ఘనిన్
బమ్మెర పోతన పోతనవిభుడైన భాగవతము తెనిగించె మేలన్

భాగవత మూలవిరాట్ స్వరూపమే కృష్ణచరితమని
నగధరుని గొలుచుటకు ధారపోయు జీవితమే విజయమని
వెగడి [illegible]
తెగువగా తెలుగుజాతి పురాకృత సుభాగ్యమని

# పద ప్రాభవతి - అన్నమయ్య

వెన్నముద్ద తిని వేదాంత రహస్యము దెల్పి వేదమయుడయ్యె
యెన్నగ పదములకు వెంచ సంగీతము గూర్చి నాదమయుడయ్యె
అన్నమయ నిజ పరబ్రహ్మ తత్త్వము దెల్పి పరబ్రహ్మమయుడయ్యె
చెన్నుని మెండుగ చెలగి మెప్పించి ధాత్రిన్ మహనీయుడయ్యె

అర్చామూర్తియై ఆదిమూలమైన శ్రీ వేంకటేశుని కీర్తించి
అర్చించి తన పసిడి సంకీర్తన కుసుమాల మెప్పించి
నర్తించి మైమరచి గానమున అలరించి తా పరవశించి
అర్పించె హరికిన్ జీవితమునన్నమయ్య భువి తరించి

చిన్ననాటికి నమువుగా లాలి జోల పదముల్, యౌ
వ్వన నాటికి నరుదైన శృంగార పదముల్ గార్హ
మునకు ఘాటైన నీతిశాస్త్ర పదముల్ వార్ధక్య
మునకు తగునట్టి వేదాంతములన్నయ పదముల్

# బిరుదు సార్థకత - అన్నమయ్య

హరిపదమే పరమపదమని యెంచి కందువన్
హరికీర్తి తలంచి కీర్తించి వర్తించి యెంచగాన్
ధరలో బహురచనకు ప్రథమాచార్యుడనంగాన్
బిరుదు సార్థకమై పదకవితా పితామహుడనబడెన్

సంకీర్తన లక్షణసారమునంగ నేమిటో తెలియజెప్పె
సంకీర్తన భక్తి సులభం ముక్తి ప్రదాయకమని దెల్పె
సంకీర్తన సామ్రాజ్యము ముప్పదిరెండు వేలు కాపు
సంకీర్తనాచార్యుడైన అన్నమయ ఆచార్యుడయ్యె!

నిగమాగమంబుల సారమును తనసంకీర్తములన్
నిగిడించి ఆటపాటలతో కూడి హరికథా లీలలన్
పొగిడించి నిగమాంత వర్ధుని సంకీర్తనములన్
తెగ వినిపించి పంచమాగము సార్వభౌముడై వెలగెన్

# పద ప్రాశస్త్యత - పోతన, అన్నమయ్య

సంగీత సాహిత్యములు లలిత కళా ప్రధానమంత్రు
సంగతి గల భక్తి గలిగిన ముక్తినిచ్చు మూలాధారమైన
అంగజ గురుని భక్తిన్ పద్య పద సాహిత్య రీతుల
అంగరంగ వైభవముగ కృతులు కని రచ్చ పోతన్న అన్నలోర

ఎద మురిపించగ పోతన పండించిన భాగవత కథలు
అదనపు ఒంపు సొంపులున్నవని చూడ హరికథా రచనలు
పదములు జాతీయములు మృదుమధుర పదములు
మదినెంచవలె హరి సంకీర్తనములన్నయ పదములు

గూఢరాజాల తీపులు పదుమృప్తియుని పోతన పల్కగాన్
మేలుగా వరహరి కీర్తనల నాదిని నా జిహ్వ గరిమన్
మలయప్పను దన్ను నోరుల భజించునాయని అన్నయ పలికెన్

మన్నయగు సహజ సౌందర్య శోభగా రామభద్రుండు
ఎన్నగాను మెచ్చ పలికించె కృతులలు పోతన పలుకులోన
అన్నమయ్య కలమున కంగ పల్లవించె మహిమలు
వెన్నుమయమై సాగిన వెంకన్నపై పద్యములు

ఘనముగ వెన్నెల పోతనామాత్యుని పోతె భాగవతము తెలు
గింటి వారి కాన్పానించ అమృతమైన గంధమై అలరెన్
అలహారింపగ సాగిన అన్నమయ పదములు తెలుగు
నేల నాలుగు చెరగుల నాదమయమై అలరారెన్

డా॥ [illegible]

శ్రీ

## ప్రస్తావన :

శా॥ "శ్రీకైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్ లోక ర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁగేళిలోలవిలసద్దృగ్జాల సంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్ (1-1)

తెలుగు సాహిత్య చరిత్రలో 15వ శతాబ్దానికి విశిష్టమైన స్థానం ఉంది. పద్య యౌవనం, పద బాల్యంగా గలిగిన ఈ శతాబ్దానికి తండ్రి వైష్ణవం.

మహాకవుల దృక్పథం వారి గ్రంథాలలో ప్రతిబింబిస్తుంది. తమ కాలంలో జరిగిన అనేక సంఘటనలకు కవులు ప్రత్యక్ష సాక్షులుగా కన్పిస్తారు. అలాంటి మహాకవులలో పేరెన్నిక కలిగిన భక్తకవులు పోతన, అన్నమయ్యలు. భాగవత రచన ద్వారా పోతన, సంకీర్తన రచన ద్వారా అన్నమయ్య ప్రశస్తి పొందారనడం నిర్వివాదాంశం.

"జయన్తితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తితేషాం యశఃకాయే జరామరణజం భయం"

అనిన భర్తృహరి సుభాషితానికి ఉదాహరణగా పోతన, అన్నమయ్యలు కనిపిస్తారు. పోతన భక్త కవి, అన్నమయ్య భక్త వాగ్గేయకారుడు అన్న విషయం ప్రధానంగా తెలుసుకున్నప్పటికీ వాగ్గేయకార లక్షణాలు పోతనలోనూ, పద్యకవిత్వ లక్షణాలు అన్నమయ్యలోనూ కనిపిస్తాయి. పోతనది రాగయుక్తంగా సాగిన పద్య లక్షణాలు గల కవిత్వం. అన్నమయ్య సంకీర్తన రచన పద్య లక్షణాలతో కూడిన రాగయుక్తమైన కవిత్వం. పోతన భాగవత రచన భక్తి సమ్మిళితం గల పురాణ రచన. అట్లే అన్నమయ్య సంకీర్తన రచన కూడా సంగీతం, సాహిత్యం, సమప్రాధాన్యంగల భక్తి సమ్మేళనం. వీరిరువురు కర్మ, జ్ఞాన యోగాలను అనుసరించి వాటిని భక్తితో పూర్తి చేయడం జరిగింది.

ఏ సాహిత్యంలోనైనా ఏ ఇద్దరికవుల రచనల్ని పోల్చి చూసి తారతమ్య నిరూపణ చేయడం సహృదయ విమర్శక లక్షణం కాదు. కారణం వారు ఎన్నుకున్న విషయం ఒక్కటే అయినా వారు జీవించిన కాలం, వారు సంచరించిన ప్రాంతం, వారి సమకాలీన రాజకీయ, సాంఘిక, మత పరిస్థితుల కనుగుణంగానే వారి రచనలు సాగుతాయి. అందులో పురాణ పక్కీలో భాగవతము వ్రాసినవాడు పోతన, సంకీర్తనల రూపంలో ఆ దేవదేవుని ధ్యానించి తరించిన వాడు అన్నమయ్య. అట్టి అనన్య సామాన్యమైన కవుల మధ్య తారతమ్య పరిశీలన అసమంజసం.

అయితే ఈ ఇద్దరి కవుల మధ్య తగినన్ని సాదృశ్యాల్ని మనం గుర్తించవచ్చు. సాదృశ్యాల్ని గుర్తించడమే గాని పోలిక చెప్పడం భావ్యం కాదు. పోతన, అన్నమయ్యల రచనల్ని మనం పరిశీలిస్తే వారి ప్రధాన మనోభావాలు ఒక్కటిగానే కనిపిస్తాయి. "శ్రీ కైవల్య పదంబు చేరుటకై" చింతించినవాడు పోతన. తన ఆత్మను ఆ పరమాత్మలో ఐక్యం చేయదానికి తపించినవాడు అన్నమయ్య. ఇద్దరి మతం ఒక్కటే. ఈ ఇద్దరూ చెప్పిన సాహితీ పద్ధతులు శతధా భిన్నాలైనా, భక్తిమార్గం ద్వారా భగవంతుని చేరడం సులభమని ఇద్దరు నొక్కి వక్కాణించారు. మనోభావాల విషయంలోనే గాక జీవన ప్రయాణంలో గూడ వీరిద్దరి మధ్య సాదృశ్యం కనిపిస్తుంది.

ఒకటి వీరిద్దరు ఇంచుమించు ఒకే శతాబ్దానికి చెందినవారు. రెండు అన్నమయ్య రాయలసీమ వాసి అనుటలో అనుమానం లేదు. పోతన తెలంగాణా ప్రాంతం వాడని, రాయలసీమ వాడని చారిత్రక విమర్శకుల మధ్య అభిప్రాయ భేదాలున్నాయి. రాయలసీమ వాడని అనుకుంటే ఇద్దరూ ఒకే ప్రాంతం వారు అవుతారు. మూడు ఇద్దరూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవారే. నాలుగు ఇద్దరూ ఊరిపేరు ఇంటి పేరుగా ప్రసిద్ధికెక్కిన వారే. ఒకరు బమ్మెరపోతన, మరొకరు తాళ్ళపాక అన్నమయ్య. ఐదవది, ప్రధానమైనది ఇద్దరూ రాజాశ్రయాల్ని తిరస్కరించినవారే. పై ఐదంశాలు లౌకిక ప్రపంచానికి సంబంధించినవి.

మరొక విషయాన్ని గమనిస్తే, వీరిరువురి తల్లిదండ్రుల పేర్లు లక్ష్మీనారాయణ నామార్థాలుగా వుండడం విశేషం. పోతన తల్లి పేరు లక్కసాని (మాంబ). అన్నమయ్య తల్లిపేరు లక్కమాంబ. లక్కమాంబ అన్న పదం లక్ష్మీ నామార్థంగా వుంది. పోతన తండ్రి కేసన (కేతన). కేసన అన్న పదం కేశవ నామార్థాన్ని తెలుపుతుంది. ఇక అన్నమయ్య తండ్రి పేరు నారాయణసూరి. ఈ విధంగా వీరి

తల్లిదండ్రుల పేర్లు కూడా లక్ష్మీనారాయణ నామార్థాలుగా ఉండడంవల్ల సాక్షాత్తు లక్ష్మీనారాయణులే వీరి తల్లిదండ్రులుగా ఉండవచ్చని కూడా భావించవచ్చు. ఇక అలౌకిక ప్రపంచానికి సంబంధించి వీరు సృష్టించిన సాహిత్యంలోని అనేక అంశాలలో వీరి మధ్య గల సాదృశ్యాల్ని మనం గమనించవచ్చు. సృష్టి సర్వం ద్వంద్వాల సంయోగమని ఋషులు, ఋషితుల్యులు భావించారు. సుఖదుఃఖాలు, జయాపజయాలు, లాభనష్టాలు ఆర్య, అనార్యులు, ధనిక,పేదలు, పండిత పామరులు, స్త్రీ పురుషులు, ఈ విధంగా అనంతకోటి ద్వంద్వమయమని పెద్దల ఉవాచ. ఎక్కడ ద్వంద్వముంటుందో అక్కడ సంఘర్షణ తప్పదు. ద్వంద్వ సంఘర్షణకు అతీతులు నిర్మల మనస్కులైనవారు కొందరుంటారు. వారు జ్ఞానులు. ఈ ద్వంద్వ శక్తుల సమన్వయం వారికంతగా అవసరముండదు. ద్వంద్వ శక్తులను సమన్వయం చేసి శాంతిని కోరుకునే కర్మవీరులు కొందరు వుంటారు. వారు భూమ్యాకాశాలకు అంతరిక్షమనే నిచ్చెనవేసి లోకమనే ఈ మహాసముద్రాన్ని చిలికి అమృతాన్ని మాత్రమే లోకానికి అందించాలని అనుక్షణం ప్రయత్నిస్తుంటారు. అట్టి కర్మవీరులు పోతన, అన్నమయ్యలు.

బ్రహ్మ సృష్టి అనబడు ఈ జగత్ సృష్టి అదృష్టమైన కర్మఫలాదులచే నియతమైంది. కవి సృష్టి స్వతంత్ర మైంది. బ్రహ్మ సృష్టిలో కేవలం సుఖాలేగాక దుఃఖాలు వుంటాయి. కవి సృష్టిలో సుఖదుఃఖాలు చెప్పబడినా, అవి సమ్మేళనమై చివరికి పాఠకులకు లేదా శ్రోతలకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. బ్రహ్మసృష్టిలోని రసాలు పరిమితం. కవి సృష్టిలోని రసాలు కేవలం ఆనందదాయకాలు. అపరిమితాలు. కవి సృష్టిలోని రసం అత్యంత మనోజ్ఞమైంది. ఈ దృష్టితో మనం ఆలోచిస్తే అటు శబ్దాలంకార శోభాయమానంగా పోతన సృష్టించిన పద్యమయ ప్రపంచం, ఇటు అన్నమయ్య, అలౌకికానంద పరవశుడై సృష్టించిన సంకీర్తనా ప్రపంచం, బ్రహ్మసృష్టికన్నా ఆనంద దాయకమైందని చెప్పక తప్పదు.

ప్రాచీన కాలంలో సమాజ నిర్మాణం అధికంగా మతం చేతిలో వుండేది. మానవుని ఆధ్యాత్మిక, నైతిక సభ్యతలకు ధర్మమే ఆధారమై వుండేది. అటువంటి ధర్మ ప్రతిపాదనకు కృషిచేసినవారు బమ్మెరపోతన, తాళ్ళపాక అన్నమయ్యలు. సాహిత్య సత్యంతో ఆత్మ సంబంధం ప్రధానంగా మూడు విధాలుగా ఉంటుంది. అందు మొదటిది జిజ్ఞాస, రెండవది ప్రయోజనం, మూడవది ఆనందం. ఆధ్యాత్మిక విషయాల ద్వారా జిజ్ఞాస ఏర్పడుతుంది. విజ్ఞాన విషయాల ద్వారా ప్రయోజనం

కలుగ[illegible]యున్నది. ఎంతో దీర్ఘంగా ఆలోచిస్తే [illegible] కాదు. అటువంటి జ్ఞానము కలిగించేది పోతన, అన్నమయ్యల సాహిత్యం. జ్ఞానం, విజ్ఞానం, ఆనందం- ఈమూడు అంశాలు సాహిత్య లోకానికి అవసరమని మనం భావిస్తే వాటిని పోతన, అన్నమయ్యలు పోషించిన తీరును ఘనం గమనింపవచ్చు.

పోతన సీసపద్యాల్లోని శబ్దాలంకార సౌందర్యాన్ని, అన్నమయ్య సంకీర్తనలలోని గానామృతాన్ని విని ఆనందించేవారు కొందరు. పోతన తన పద్యాలలోనూ, అన్నమయ్య తన సంకీర్తనలలోనూ అలవోకగా ప్రయోగించిన సామాజికపరమైన లోకోక్తులు, సామెతలు, జాతీయాలు నానుడులు మొదలగు వానియొక్క విశిష్టార్థాన్ని గ్రహించి ఆశ్చర్యపడేవారు కొందరు. అట్లే పోతన పద్యాలలోను, అన్నమయ్య సంకీర్తనలలోను కనిపించే విష్ణుతత్వాన్ని జీవాత్మ, పరమాత్మల సంబంధాన్ని, మోక్షమార్గాన్ని, భక్తి పారవశ్యాన్ని మొదలగు అంశాలను అర్థం చేసుకొని వాటి లోతుల్ని గ్రహించి ఆత్మానందాన్ని పొందేవారు కొందరు.

"లలిత స్కంధము గృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై 1-20

ఇది పోతన భాగవత సారాంశం.

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీధులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభరతి క్రీడారహస్యంబులై
నుతులై తాళులపాకయన్నయ వచోనూత్నక్రియల్ చెన్నగున్"

ఇది అన్నమయ్య సంకీర్తనల సారాంశం.

# పోతన, అన్నమయ్యల జీవిత నేపథ్యం

ఏ కవులైతే వారి రచనల ద్వారా ముక్తిని (స్వప్రయోజనాన్ని) పొంది సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చారో, ఏ కవుల పద్యపదాలు ప్రతి ఇంటా ప్రార్థనాగీతాలుగా ప్రజల నాలుకలపై అబాలగోపాలం నాట్యం చేస్తూ శ్రవణానందాన్ని ఇస్తున్నాయో అలాంటి పోతన అన్నమయ్యల జీవిత నేపథ్యం తెలుసుకోవడం అవసరం.

## పోతన నేపథ్యం :

"ఎమ్మెలు సెప్పనేల జగమెన్నగ పన్నగ రాజశాయికిన్
సొమ్ములు వాక్య సంపదలు సూఱలు సేసిన వాని భక్తిలో
నమ్మినవాని భాగవత నైష్ఠికుడై తగువాని పేర్మిమై
బమ్మెరపోతరాయ కవి పట్టపురాజు తలంచి మ్రొక్కెదన్"

అని షష్ఠమ స్కంధాదిలో సింగన పోతనకు నమస్కరించిన విధం పోతన జీవిత సారాంశాన్నంతటినీ తెలియజేస్తుందని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు అభిప్రాయపడ్డారు.[1]

## తల్లిదండ్రులు :

పోతన తల్లి లక్కమాంబ, తండ్రి కేశనామాత్యుడు[2] వీరిరువురు శైవాచారపరాయణులు. పోతన తన తల్లిని బహుమాన నివారిత దీనమానస గ్లానియని భక్తితో కొనియాడాడు.[3] అట్లే తండ్రిని లలితమూర్తి బహుకళానిధి దానమాన నీతిధనుడు ఘనుడు అని కీర్తించాడు.[4]

## గోత్రం:

పోతనది కౌండిన్య గోత్రం, ఆపస్తంబన సూత్రం[5] ఊరి పేరే ఇంటి పేరుగా "బమ్మెర" వచ్చిందని పండితుల అభిప్రాయం.

## ప్రాంతం :

పోతన భాగవతము రచించే ప్రయత్నంతో "............. ఏకశిలానగరంబునకు ఏనుదెంచి యందు గురు, వృద్ధ, బుధ, బంధు జనాను

జ్ఞాతుండనై"[6] అని చెప్పిన వచనాల్ని బట్టి ఏకశిలానగరం అంటే ఓరుగల్లా? ఒంటిమిట్టా? అనే సందేహం పండిత లోకంలో విమర్శనాత్మకమై చివరికి పోతన ఓరుగల్లు (తెలంగాణ) వాడేనని నిర్ధారించారు.

వరదాచార్యులవారు తన "పోతన చరిత్రము" అనే గ్రంథంలో పోతన ఓరుగల్లులో పుట్టి పెరిగి భాగవత రచనానంతరం వృద్ధాప్యంలో తీర్థయాత్రల నెపంతో కంచి, తిరుమల మొదలైన పుణ్య క్షేత్రాల్ని దర్శించి కడప జిల్లా ఒంటిమిట్టలో వెలసిన కోదండరాముని సన్నిధిలోనే భాగవత ఉపన్యాసాలిస్తూ జీవితాన్ని చాలించినట్లు చెప్పారు.

**కాలం :**

పండితుల అభిప్రాయంలో పోతన 15వ శతాబ్దానికి చెందినవాడుగా పేర్కొని, పోతన కాలాన్ని ఖచ్చితంగా చెప్పాలంటే ఇప్పటికి లభించిన చారిత్రక సామగ్రి చాలదని శ్రీ మహాభాగవత సంపాదక వర్గం వారు అభిప్రాయపడ్డారు.[7]

**విద్యాభ్యాసం :**

పోతన తన విద్యాభ్యాసం గురించి ఎక్కడా చెప్పుకోలేదు. అయితే తన గురువు ఇవటూరి సోమనారాధ్యుడు అని చెప్పుకున్నాడు. "సహజ పండితుడను" అని భాగవత స్కంధాంతాలలో చెప్పుకున్న పోతన అందరినీ మెప్పించే సామర్థ్యం గలవాడు.[8] తెలుగు సంస్కృతాలలో మంచి ప్రావీణ్యం గల వాడని చెప్పడానికి భాగవతములోని పద్యాలే అందుకు నిదర్శనాలు కాగలవు. శ్రీధర వ్యాఖ్యానాన్ని అనుసరించి భాగవతాన్ని రచించిన పోతన సకల శాస్త్ర పాండిత్యం కలవాడని నిడదవోలు వేంకటరావు గారు అభిప్రాయపడ్డారు.[9]

**గుణాలు :**

పోతన వంశంలోని తాత ముత్తాతల్లో కన్పించే శుభ లక్షణాలు,[10] లలితమూర్తి అయిన తండ్రి బహుకళానిధిత్వం[11] దయామయి అయిన తల్లి సున్నితత్వంతో పాటు కన్పించే గంభీరత్వం పోతనలో వున్నాయి అనడంలో సందేహం లేదు. అందుకే పోతన తన గురించి "సాధునయయుక్తుండన్"[12] అని చెప్పుకున్నాడు.

తండ్రి శైవశాస్త్ర మతం ఎరిగినవాడు.[13] తల్లి సదాశివ పాద యుగార్చనాను కంపాన వాగ్భవాని.[14] అన్న తిప్పయ "ఈశ్వర సేవా కాముడు" శివారాధనం

పోతనకు వారి కుటుంబం నుండి సంక్రమించింది. జీవితానికి సార్ధకత అయినది భాగవత రచన అని భాగవతాన్ని రచించే కుతూహలంతో పోతన శివుని ప్రార్థించాడు.[15] కాని శివుడు కాక శ్రీరాముడు ప్రత్యక్షమయ్యాడు.[16] తెలుగులో భాగవతాన్ని రచించి ధన్యుడు కమ్మని అదృశ్యమయ్యాడు.[17] ఆరంభ పద్యాలలో ఒకటైన "చేతులారంగ శివుని పూజింపడేని నోరు నొవ్వంగా హరికీర్తి నుడువడేని దయయు సత్యంబులోనుగా(దలపడేని కలుగనేటికి తల్లుల కడుపుచేటు"[18] అంటూ శివకేశవాభేదాన్ని చాటిచెప్పడం పై సంఘటనకు కారణం కావచ్చు. అంతేకాకపై పద్యం ద్వారా పోతన నిరంతరం భక్తితో భగవంతుని సదా పూజించేవాడని, నోరారా కీర్తించేవాడని, దయ, సత్యం అనే గుణాలు గలవాడని తెలుస్తుంది.

## గృహస్థ జీవితం:

పోతన భార్య శ్రీనాథుని చెల్లెలని జనసామాన్యంలో ఉన్న కథ. ఈమె పేరు నర్సాంబ.[19] పోతనది పేద కాపురమని, వృత్తి వ్యవసాయమని జనశ్రుతిగా గడియారం వేంకట శేషశాస్త్రి తన విజ్ఞాన సర్వస్వంలో తెలిపినట్లు విడదవోలు వేంకటరావు గారు అభిప్రాయపడ్డారు.[20]

## బంధుత్వం:

శ్రీనాథుడు పోతనకు బావమరది అన్నది జనుల్లో ఉన్న కథలు మాత్రమే.[21] పోతన బంధువుల గూర్చి చెప్పుకున్నట్లు ప్రస్తావన లేదు.

## భక్తిమహిమ:

భక్తునికి సాధ్యం కానిదంటూ ఏదీలేదు. అందులో పోతన మహాభక్తుడుగా లోకంలో చెప్పబడుతున్నాడు. పోతన మహిమాన్వితుడని చెప్పే కట్టుకథ ఒకటి జనశ్రుతిలో కన్పిస్తుంది. శ్రీనాథ మహాకవి పల్లకీలో పోతూ పొలం దున్నుతున్న పోతనకు తన గొప్పదనాన్ని తెలియజేయాలని పల్లకీ మోసే బోయీలను పల్లకీ వదలమని చెప్పగా పల్లకీ దానంతటదే పోవసాగింది. అది చూసిన పోతన కూడా ఎద్దులులేని నాగలితో పొలం దున్నినట్లు అది చూసి శ్రీనాథుడు ఆశ్చర్యం పొందినట్లు కథ లోకంలో ఉంది. అయితే యిది పోతన కుమారుడు మల్లనకు శ్రీనాధునికి మధ్య జరిగిన సంఘటన అని మరొక కథ కూడా లోకంలో ఉంది.

**జీవితతత్త్వం :**

పోతన కాలంలో కవులు రాజుల మెప్పుకోరి కావ్యాలను రచించి వారికే అంకితమిచ్చి ఆర్థిక సహాయాన్ని పొందేవారు.[22] ఇది భాగవతము రచించేనాటికి పోతనకు నచ్చక ఆత్మవిశ్వాసం కలవాడై, కవులు తమ కావ్యాలను రాజులకు అంకితమివ్వడం పడుపువృత్తియని, అట్టిపాటి కూడు భుజించడం కన్నా అడవిలో కందమూలాలు తినో, వ్యవసాయం చేసో తమ భార్యాపిల్లలను పోషించవచ్చని తెలియజేశాడు.[23] తన కావ్యాన్ని, రాజులకు అంకితమివ్వనని సరస్వతిదేవికి ప్రతిజ్ఞచేశాడు.[24] సంసారికంగా పేదవాడైన, సంపదల మీద ఆసక్తి లేనివాడు పోతన. అలౌకికమైన మోక్షసంపద కంటే తుచ్ఛమైన లౌకిక సంపద పోతన దృష్టిలో నిరుపయోగమైంది. అందుకే "కడమల్ గావుగదా! భవన్నియముల్"[25] "కలుగడే నాపాలి కలిమి సందేహించి కలిమిలేములు లేక గలుగువాడు"[26] "కారేరాజులు? రాజ్యముల్ గలుగవే?......... వారేరి సిరిమూట గట్టుకొని పోవం జాలిరే"[27] అనే తత్త్వంతో పోతన జీవించాడు.

**కావ్యాలు :**

పోతన ఆంధ్ర మహాభాగవతమే కాక, వీరభద్ర విజయము, భోగినీ దండకము, నారాయణ శతకము రచించినట్లు తెలుస్తుంది. అయితే నారాయణ శతకము పోతనది కాదని, ఆయనది అనడానికి సరి అయిన ఆధారాలు లేవని పండితుల అభిప్రాయం.

## కావ్యాలు-పూర్వాపరాలు

### భోగినీ దండకము

భోగినీ దండకాన్ని పోతన యౌవనంలో రచించాడు.[28] ఈ భోగినీ దండకం సర్వజ్ఞరావు సింగభూపాలుని కోరికపై రచింపబడింది. 'భోగిని' సింగభూపాలుని ఆస్థానంలోని నర్తకి మరియు సింగభూపాలుని ప్రియురాలుగా ఉండేదని "భోగినీ దండకము" గ్రంథాంతంలో గల క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

"పండిత కీర్తనీయుడగు బమ్మెరపోతన యాసుధాంశు మా
ర్తాండ కులాచలంబునిధి తారకమై విలసిల్లభోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగభూ
మండల భర్తకున్విమత మానవనాథ మ[illegible]హర్తకున్"

## వీరభద్ర విజయము :

"ఇవటూరి సోమనారాధ్య దివ్య ప్రసాద పద్మారాధక కేసన మాత్యపుత్ర పోతన నామధేయ ప్రణీతంబయిన వీరభద్ర విజయంబను మహాపురాణ కథయందు" అని పోతన చెప్పుకున్న దాన్నిబట్టి, తన గురువు "వీరమహేశ్వరాచార విభుడు భక్తిపారగుండు" అయిన ఇవటూరి సోమనారాధ్యుడు పోతనను "మత్ప్రసాద దివ్యమహిమచే నెంతైన కవిత జెప్పునేర్పుగలదు నీకని" ఆశీర్వదించి ప్రోత్సహించినట్లు తద్వారా వీరభద్ర విజయము రచించినట్లు తెలుస్తుంది.

## ఆంధ్ర మహాభాగవతము :

"దేహము నిత్యము గాదని
మోహముఁదెగగోసి సిద్ధమునివర్తనుడై
గేహము వెలువడి నరుడు
త్సాహమునంజెందు ముక్తిసంపదన్"[29]

భాగవతము రచించేనాటికి పోతన ముక్తి సంపదను ఆశించాడు. అందుకే శరీరం శాశ్వతం కాదని, మోహం విడనాడి పరిశుద్ధమైన మనస్సు గల మునితత్త్వం గలవాడుగా కనిపిస్తాడు. కావున "శ్రీకైవల్య పదంబుజేరుటకునై చింతించెదన్" అని భాగవతారంభంలోనే, భాగవతాన్ని రచించడానికి గల కారణాన్ని తెలిపాడు. ఎందుకంటే భాగవతము పరమార్థ భూతమైంది, అధిక సుఖమైంది, వేద కల్పవృక్షం నుండి రాలినది, శ్రీమంతమైంది, మునిశ్రేష్ఠ కృతమైంది. ఇతర శాస్త్రాల వల్ల సాధ్యం కాని ఈశుని కనుగొనగలిగింది. "సత్యం పరం ధీమహి" అనే గాయత్రీ ప్రారంభంలో గాయత్రీ నామ బ్రహ్మరూపం చెప్పబడినది, వేదశాస్త్రాలు చదివినా లభించని ముక్తిని ప్రసాదించేది భాగవతం. అలాంటి భక్తికి ప్రతీక అయిన భాగవతాన్ని రచించిన పోతన కీర్తిశిఖరాలను అధిరోహించి చరితార్థుడయ్యాడు. తన జీవితంలో త్రికరణ శుద్ధి (మనసా, వాచా, కర్మణా) పాటించినట్లు తెలుస్తుంది.

తన మనసులో ఏముందో అదే చెప్పాడు, అదే చేశాడు. ఈ తత్త్వం అందరికీ సాధ్యం కాదు. కావుననే కేవలం పండితులకు, కవులకు మాత్రమే కాక సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమైంది పోతన జీవితం.

## అన్నమయ్య జీవిత నేపథ్యం:

కావ్యాలు చంపూ పద్ధతిలో వెల్లివిరిసే కాలంలో పద కవితకు పట్టం కట్టినవాడు అన్నమయ్య. అన్నమయ్య జీవిత నేపథ్యాన్ని తెలుసుకోవడానికి అన్నమయ్య మనుమడైన చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) రచించిన "అన్నమాచార్య జీవితచరిత్రము" అన్న ద్విపద కావ్యం ఆధారమవుతున్నది.

### జననం :

విశాఖ నక్షత్రం, వైశాఖ మాసం అన్నమయ్య జనన కాలంగా పేర్కొనబడింది.[30] నారాయణ సూరికి, లక్కమాంబకు "హరినందకాంశజుండు"గా అన్నమయ్య జన్మించాడు.[31]

### కులగోత్రాలు :

అన్నమయ్య నందవర వైదిక బ్రాహ్మణుడు. ఇతని వంశంలోని వారు ఋగ్వేదులు, అశ్వలాయన సూత్రులు, భరద్వాజ గోత్రులు[32]. "అన్నమయ్య పితృ పితామహులు నారాయణయ్య, విఠలయ్యలు విష్ణుపద భక్తి రతులై తాళ్ళపాక చెన్నకేశవస్వామిని సేవించుకొంటూ జీవితం గడిపేవారు" అని తెలుస్తుంది.[33]

### కాలం :

అన్నమాచార్య జీవితచరిత్ర రచించిన చిన్నన్న అనబడే చిన తిరువేంగళ నాథుడు, అన్నమయ్య కాలం (సంవత్సరం) చెప్పలేదు. నక్షత్రం మాసం మాత్రమే పేర్కొన్నాడు. అయితే అన్నమాచార్య సాహిత్య పరిశోధకులు క్రీ.శ. 1408 సంవత్సరాన్ని అన్నమయ్య జనన కాలంగా నిర్ణయించారు. సర్వధారి నామ సంవత్సర, వైశాఖ మాసం, విశాఖ నక్షత్ర యుక్త పూర్ణిమా తిథికి సరియగు 9-5-1408 జన్మతేదీగా నిర్ణయించి తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1978 నుండి అన్నమయ్య జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.[34]

## ప్రాంతం :

కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామం అన్నమయ్య జన్మస్థలం.[35] ఇచ్చట చెన్నకేశవస్వామి విగ్రహాన్ని జనమేజయుడు ప్రతిష్ఠించాడని కథనం. సస్యశ్యామలమై విరాజిల్లే ఈ గ్రామం సన్మునులకు, అఖిల దేవతలకు నిజవాసమై వుండేదని అంటారు స్థలజ్ఞులు, అని ఆ ప్రాంత ప్రాశస్త్యాన్ని కొనియాడడం జరిగింది.[36] పాల జలధిలోన పాయని దివ్యరత్నము అయిన శ్రీ వేంకటేశ్వరుని కొనియాడడానికి పుట్టిన రాయలసీమ కవిరత్నం అన్నమయ్య అని తెలుస్తుంది.

## బాల్యం :

వేదవిద్యలన్నీ అన్నమయ్య నాలుకపై నాట్యం చేశాయి.[37] ఆడిన మాటెల్ల అమృత కావ్యంగా పాడిన పాటెల్ల పరమగానంగా భాసించేది.[38] చిన్నతనంలోనే వేంకటపతి మీద వింత వింతలుగా సంకీర్తనలు ఆలపించేవాడు అన్నమయ్య. ఈ తత్త్వాన్ని మార్చటానికి తల్లిదండ్రులు, అన్నవదినలు అన్నమయ్యను గడ్డి కోసుకొని రమ్మని చెప్పారు. గడ్డికోస్తూ పరధ్యానంలో వున్న అన్నమయ్యకు వేలు తెగింది. ఆవేదనలో విరక్తి జనించింది. భక్తి రసావేశానికి నాంది పలికింది. తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు అన్నమయ్య మదిలో మెదిలాడు.

## తిరుమల పయనం :

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శించాలనే తలంపు కలిగింది. "కొడవలి నేల గ్రక్కున పాఱవైచె"– నెన్నటి చుట్టము లిటువంటివార...తల్లియు దండ్రియు దైవంబు గురువు నెల్లసంపదలునై యెల్లచందముల నన్బ్రోచుశేషాద్రినాథుని గొలిచి మనియెద ననుచు..."[39] తిరుమలకు పోతున్న ఒక భక్తబృందంలో చేరి "వేడుకొందామ వేంకటగిరి వేంకటేశ్వరుని వేడుకొందామా"[40] అంటూ ఆనంద పారవశ్యంతో స్వామిని కీర్తిస్తూ తిరుపతి చేరుకొన్నాడు.

## అలమేల్మంగ అనుగ్రహం :

తిరుపతిలో అలిపిరి చేరి అలిపిరి నుండి కాలినడకన మోకాళ్ళ పర్వతం చేరుకున్నాడు. అప్పటికే అలసత్వం పొందిన అన్నమయ్య మోకాళ్ళ పర్వతం వద్ద విశ్రమించాడు. అన్నమయ్యకు అలమేలు మంగ ప్రత్యక్షమయింది. "పడుచు ఏమిటికిట పడియున్నావు"[41] అని ప్రశ్నించింది. "కందర్ప జనకునిగన

తెయుమమ్మ"[42] అని అన్నమయ్య ప్రార్థించాడు. అలమేలుమంగ అనుగ్రహించింది ప్రసాదాన్ని అందించింది. వెంటనే అదృశ్యమయింది. ఆ ప్రసాదాన్ని తిన్న అన్నమయ్య నోటివెంట "వేంకటేశ్వరా" అన్న మకుటంతో ఆశువుగా శతకం ఒకటి వెలువడింది. అయితే అలమేలు మంగ ఇచ్చిన ఆ ప్రసాదం వెన్నముద్ద అయి వుంటుందని క్రింది అన్నమయ్య సంకీర్తన వల్ల తెలుస్తుంది. అందులో వెన్న జ్ఞానానికి ప్రతీక అని పెద్దలు చెపుతారు.

"అన్ని మంత్రములిందె ఆవహించెను
వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము"[43]

**తిరుమల కొండ వర్ణన :**

అమ్మవారిచ్చిన ప్రసాద మహిమతో వైకుంఠానికి నెలవైన తిరుమల కొండ అన్నమయ్యకు ఇలా కన్పించింది.

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయె మహిమలె తిరుమల కొండ

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెస పుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాది లోకముల కొనలకొండ
శ్రీదేవుడుండేటి శేషాద్రి యీకొండ

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్విదపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపుటంజనాద్రి యీ పొడవాటి కొండ

వరములు కొటారుగా వక్కణించి పెంచే కొండ
పరగులక్ష్మీకాంతు సోబనపు కొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీ వేంకటపు కొండ[44]

పై సంకీర్తనలో తిరుమల కొండ ప్రాశస్త్యాన్ని అన్నమయ్య కొనియాడాడు. తిరుమల కొండ మీద ఉన్న శిలలు (రాళ్ళు) వేదాలని, అక్కడ ప్రవహించే నదీజలాలు పుణ్యరాశులని, బ్రహ్మాది లోకాలకు నెలవైన ఆ కొండ శ్రీ దేవుడుండే శేషాద్రికొండ అని తెలిపాడు. అక్కడ చరించే మృగజాతులు దేవతా సమూహంగాను, నిర్వహించి జలధులే నిట్టచరులని, తాపసులే తరువులని (చెట్లు) పూర్వమున్న అంజనాద్రి యీ పొడవాటి తిరుమల కొండ అని కీర్తించాడు. అంతేకాక కోరిన వరాలను ఇచ్చేదని, పరగు లక్ష్మీపతి శోభనపు కొండని అదే శ్రీ వేంకటాద్రి కొండ అని ప్రశంసించాడు.

## దర్శనం :

అన్నమయ్య తిరుమల చేరి పుష్కరిణిలో స్నానం చేసి ఆ కోనేటమ్మను ఇలా కీర్తించాడు.

> దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
> వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా[45]

ఆ తర్వాత వరాహస్వామిని దర్శించి వేంకటేశ్వరుని దర్శించాడు.

ద్వాదశి రోజున మరలా స్వామిని దర్శించాలని వెళ్ళగా ఆలయం తలుపులు మూసి వుండడం చూసి వేంకటేశ్వర శతకాన్ని సవిస్తరంగా విన్నవించాడు.[46] వెంటనే తలుపులు తెరుచుకున్నాయట. అర్చకులు అన్నమయ్య మహిమను గుర్తించి లోపలికి తీసుకువెళ్లారని తెలుస్తుంది.

## పంచసంస్కారదీక్ష :

ఒకరోజు రాత్రి స్వామి తిరుమలలో నివాసమున్న ఘనవిష్ణువు అనే ముని కలలోకి వచ్చి తన భక్తుడు సంకీర్తనం చేస్తూ తిరుగుతున్నాడని అతనికి పంచసంస్కార దీక్ష చేయమని తన ముద్రికలను ఇచ్చాడట.[47] తెల్లవారిన వెంటనే ఆ యతి అన్నమయ్యను అన్వేషించి, గుర్తించి స్వామి ఆదేశానుసారం "వేదమార్గానుసారమున నాతని శంఖచక్రాంకితుజేసి రీతిగా(బంచసంస్కృతులు"[48] కావించాడు.

## వివాహం :

అన్నమయ్య తిరుమలలో సంకీర్తనలు పాడుతూ తిరుగుతున్నాడని తెలిసి అన్నమయ్యను తమ ఊరికి తీసుకొనిపోవడానికి అతని తల్లిదండ్రులు తిరుమలకు

వచ్చారు. అన్నమయ్య తిరుమల విడచి తాళ్ళపాక పోవడానికి ఇష్టపడక

"బల్లిదులు నీకంటేఁబరులున్నారా నన్ను
తొల్లిటి బారినుండి దోయకుమయ్య"[49]

అని ఆ సందర్భంలోనే అన్నమయ్య అన్నట్టుగా విమర్శకుల అభిప్రాయం. అదేరోజు అన్నమయ్యకు కలలో స్వామి కనిపించి "....జనని వాక్యము దోయ జనదుకుమారా! పోయిరమ్మని"[50] ఆజ్ఞ ఇవ్వగా అన్నమయ్య తల్లిదండ్రులతో కలిసి తాళ్ళపాక వెళ్ళి తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరిని వివాహమాడాడు.

## అహోబిల ప్రయాణం:

పుట్టుకతో వచ్చిన భక్తి విజ్ఞానానికి, సకల వేదాంత జ్ఞానం అవసరమని అహోబిల మఠ పీఠాధిపతి అయిన ఆదివన్ శఠగోపయతిని ఆశ్రయించాడు. శఠగోపయతి అన్నమయ్యలోని భక్తిని గుర్తించి అన్నమయ్యకు నారసింహ మంత్రాన్ని ఉపదేశించాడు. అందుకే తాను రచించిన సంకీర్తనలన్నిటిలో శ్రీ వేంకటేశ్వరునిపై రచించిన కీర్తనలు పక్కకు పెడితే అహోబిల నృసింహస్వామిపై రచించినన్ని కీర్తనలు మరి ఏదైవం పైన రచించలేదు.[51] కారణం నారసింహ మంత్ర ప్రభావమేనని విమర్శకులు భావిస్తున్నారు. అందులో అన్నమయ్య దృష్టిలో శ్రీ వేంకటేశ్వరుడే నారసింహుడై, అతడు అహోబిలాన వెలుగొందు తున్నాడు. అందుకే ఇలా కీర్తించాడు..

"కొండల శ్రీ వేంకటాద్రి కోరి అహోబలమున
మెండుగాను మెరసి లక్ష్మీనారసింహుడు" [52]

## రాజధిక్కారం:

అన్నమయ్య విఖ్యాతిని గుర్తించి ఆనాడు టంగుటూరును పరిపాలిస్తున్న రాజు సాళువ నరసింహరాయలు అన్నమయ్యను తమ కొలువుకు పిలిపించుకున్నాడు. అన్నమయ్య రాజసభలో క్రింది శృంగార సంకీర్తన పాడి వినిపించాడు.

ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపై తోచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరే చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన ఆ కొనచూపులు
నిలువున బెరుకగ నంటిన నెత్తురు కాదు కదా

పడతికి చనుగవ మెరుగులు పైపై పయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖ శశిరేఖలు
వెడలగ వేసవి కాలపు వెన్నెల కాదుకదా

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దిక లాగులివేమో వూహింపరే చెలులు
గద్దరి తిరు వేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపు చెమటల అందము కాదుకదా[53]

అలా పాడగా విని ఆనంద పరవశుడైన రాజు తనమీద కూడా ఒక శృంగార సంకీర్తన ఆలపించమని కోరగా "హరిముకుందుని కొనియాడు నా జిహ్వా నినుకొనియాడగ నేరదెంతైనా"[54] అని తిరస్కరించాడు. వెంటనే రాయలు కోపించి అన్నమయ్యకు సంకెళ్ళు వేయించాడు. అన్నమయ్య స్వామిని కీర్తించగా సంకెళ్ళు తెగిపోయాయి. ఈ విషయాన్ని భటులచే తెలుసుకున్న రాజు మళ్ళీ సంకెళ్ళు వేయించాడు. ఆ సమయంలో అన్నమయ్య "నీ దాసులభంగములు నీవు జూతురా యేదని చూచేవు నీకు నెచ్చరించ వలెనా?"[55] అంటూ కీర్తించగా సంకెళ్ళు విడిపోవడం ప్రత్యక్షంగా చూసిన రాయలు అన్నమయ్య మహిమను గుర్తించి అతని శరణువేడి రాచమర్యాదలతో ఆదరించాడు. భాగవతావమానమే భగవదవమానమని బోధించి, హరి భక్తులను సేవించమని రాయలకు చెప్పి అన్నమయ్య తిరుమలకు పయనమయ్యాడు.

**భక్తి మహిమ :**

అలమేలు మంగా శ్రీనివాసులను అమలిన శృంగారంతో కీర్తించాడు. అందుకు "జగతి నీ శృంగార సంకీర్తనముల కగపడి మంచి ప్రాయపు వాడనైతినని

వెంకటేశ్వరుడన్నమాచార్య గనుగొని వాక్రుచ్చి" గౌరవించాడు. పావన వినుతుని ప్రభావంచేత సకల వాచాశుద్ధి కలిగింది[57] పుల్లని మామిడి పండ్లు తియ్యగా మారుట, పేద బ్రాహ్మణునకు ధన సహాయం లభించుట మొదలైనవి అన్నమయ్య మహిమలుగా చిన్నన్న పేర్కొన్నాడు.[58] ఈ సన్నివేశాన్ని స్ఫురింపజేసే క్రింది కీర్తన గమనింపదగింది.

"కరము జీడి పులుసు గలిగిన మామడి కరము సోకిన యంతనే
సరవి జక్కెర వలెఁజవి గలిగించు వాని చనవరి సుతుడితడే"[59]

## పురందరదాసు-అన్నమయ్య :

అన్నమయ్య, పురందరదాసులు పరస్పరం సంభావించుకొన్నట్లు చిన్నన్న తెలిపాడు. సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరుడవని పురందరదాసు అన్నమయ్యను పొగడగా, నీవు విఠలుని అవతారమని అన్నమయ్య పురందరదాసుని కొనియాడాడు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించగా, పురందరదాసు 4,75,000 కీర్తనలు రచించాడని కన్నడ పండితుల అభిప్రాయం. అయితే వీరిరువురి కీర్తనల్లో భావసామ్యాలు కనిపిస్తాయి.

ఉదా: ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము[60] (అన్నమయ్య)
సుమ్మనే బరువిదే ముక్తి (పురందరదాసు)

ఉదా : శరణు శరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీసతి వల్లభ
శరణురాక్షస గర్వసంహార శరణు వేంకట నాయక[61](అన్నమయ్య)
శరణు శరణు సురేంద్ర వందిత శరణు శ్రీసతి సేవిత
శరణు పార్వతి తనయ మారుతి శరణు సిద్ధి వినాయక
(పురందరదాసు)

## రచనలు :

అన్నమయ్య రచనలుగా, 12 శతకాలు, శృంగార మంజరి, వేంకటాచల మాహాత్మ్యం, ద్విపద రామాయణం, సంకీర్తన లక్షణం, 32 వేల సంకీర్తనలు మొదలైనవి అని చిన్నన్న పేర్కొన్నాడు.[62]

# పూర్వాపరాలు

**శతకాలు :**

అన్నమయ్య రచించిన 12 శతకాలలో అలమేలు మంగపై చెప్పబడిన 'వేంకటేశ్వరా' అన్న మకుటంతో ఉన్న శతకం ఒక్కటే లభించింది. తక్కిన శతకాలు లభించలేదు.

"అమ్మకుఁదాళ్లపాకఘనుఁడన్నడు పద్యశతంబుఁజెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనముల గూరిమితోఁ నలమేలుమంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబుల బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలను జవ్వన లీలల వేంకటేశ్వర"

**శృంగారమంజరి :**

అన్నమయ్య 'శృంగారమంజరి' అన్న కావ్యాన్ని (లఘుకృతి) ద్విపదలో రచించాడు. ఇది లభ్యమైంది. అలమేలు మంగా శ్రీనివాసుల శృంగార తత్వాన్ని తెలిపేదే శృంగార మంజరి. ఈ లఘుకృతి భక్తి సూనృతంగా, భావ ప్రధానంగా సాగిన రచన. విరహిణుల వివిధ మన్మథావస్థలు, వసంతోత్సవం, జలక్రీడ, చలోక్తులు మొదలైనవి ప్రబంధ ధోరణిలో విస్పష్టంగా కనిపిస్తాయి.

"భక్తి దిరువేంకటాద్రీశు పేరఁ
గారుణ్య లక్ష్మీప్రకాశుని పేర
రాజితాఖిలలోక రక్షణు పేర
భూరికౌస్తు రత్నభూషణు పేర
గురుభరద్వాజైక గోత్రపావనుడు
నందవరీవంశ నాయకోత్తముడు
అనఘుడు తాళ్లపాకన్నయార్యుండు
మధురంపు శృంగార మంజరి జెప్పె
ధరమీద నాచంద్రతారకం బగుచుఁ
గడిమిఁబెంపొందు మంగళ మహాశ్రీల
శ్రీకృష్ణార్పణమస్తు మంగళ మహాశ్రీశ్రీజేయున్

**వేంకటాచల మాహాత్మ్యం :**

అన్నమయ్య వేంకటాచల మాహాత్మ్యం అన్న కావ్యాన్ని సంస్కృతంలో రచించినట్లు తెలుస్తుంది. కాని ఇది అలభ్యం.

**ద్విపద రామాయణం:**

అన్నమయ్య రామాయణ కథను ద్విపద కావ్యంగా రచించినట్లు తెలుస్తుంది. ఇదీ అలభ్యం. అయితే అన్నమయ్య సంకీర్తనల్లో రామాయణ కథకు సంబంధించిన కీర్తనలు ఎన్నో కన్పిస్తాయి.

**సంకీర్తన లక్షణం :**

ఈ గ్రంథాన్ని సంస్కృతంలో రచించినట్లు తెలుస్తుంది. ఇదీ అలభ్యం.

**సంకీర్తనలు :**

అన్నమయ్య రోజుకొక సంకీర్తనకు తక్కువ కాకుండా రచించాలనే నియమం పెట్టుకొని 32 వేల సంకీర్తనలు రచించినట్లు తెలుస్తుంది. అయితే ఈ సంకీర్తనలు 12 వేల పై చిలుకు మాత్రమే లభ్యమవుతున్నాయి. వీటిని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బాశర్మ మొదలైనవారు శృంగార, అధ్యాత్మిక కీర్తనలుగా పరిష్కరించారు.

పై అన్నమాచార్యుల రచనలు వాటి పూర్వాపరాలు గమనిస్తే అన్నమయ్య కవి, వాగ్గేయకారుడు, లాక్షణికుడుగా కనిపిస్తాడు.

## పోతన, అన్నమయ్యల జీవిత సామ్యాలు

సదాచార భక్తి ప్రపత్తులు గల సాంప్రదాయ కుటుంబంలో పుట్టి, పూర్వ వంశ వాసనలతో, జన్మజన్మల పుణ్యఫలంగా దైవానుగ్రహంతో పరిపూర్ణత చెందిన పాండిత్యం కలిగి, భక్తిరసంతో కూడిన అధ్యాత్మిక జ్ఞానాన్ని వికసింపజేశారు. గృహస్థాశ్రమాన్ని నిర్వర్తించి, నిరంతరం శ్రవణ, కీర్తనాది, శరణాగత ప్రపత్తులతో మునిగి తరించి, లోకాన్ని తరింపజేసిన కారణజన్ములు పోతన, అన్నమయ్యలు. వీరి జీవితంలో సామ్యం కనిపించే అంశాలు గమనించదగినవి.

**కుటుంబం :**

పోతన అన్నమయ్యలు యిరువురు కూడా పండిత వంశస్థులు. పోతన వంశం వారు శైవాచార పరాయణులు. అన్నమయ్య వంశంలోని వారు చెన్నకేశవ సేవా తత్పరులు.

**వృత్తి :**

పోతన వృత్తి వ్యవసాయమని పండితుల అభిప్రాయం. అయితే పోతన చాటుపద్యంగా చెప్పబడుతున్న "బాలరసాలసాల .... సత్కవుల్ హాలికులైననేమి" అన్న పద్యం వారి అభిప్రాయానికి కారణం కావచ్చు. అంతేకాక "ఎండకన్నెరుగని"[63] లాంటి పదాలు భాగవత రచనలో కనిపించడం వల్ల పోతన వ్యవసాయదారుడని చెప్పవచ్చు. అన్నమయ్య కూడా వ్యవసాయ కుటుంబంలో పుట్టినవాడే అనటానికి అన్నమయ్య పశువుల కోసం గడ్డి కోయడం, వేలు తెగడం జరిగింది. పశువులు, కొడవళ్ళు మొదలైనవి వ్యవసాయదారుని యింట మాత్రమే వుంటాయి.

**పేరు సార్థక్యం :**

పోతన అనే పేరులో 'పోతనం' అన్న పదానికి గొప్పదైన, శ్రేష్ఠమైన అన్న అర్థాలున్నాయి. మునిశ్రేష్ఠకృతంబైన మహాభాగవతాన్ని రచించి పేరు సార్థక్యం చేసుకున్నవాడు పోతన.

సకల వేదాంత జాత చోదితమునై జలజోదరునకు నామమైన[64] అన్నమయ్య అన్న పేరు పరబ్రహ్మ వాచకంగా పెట్టడం "అన్నంబ్రహ్మేతి వ్యజనాత్" అన్న శ్రుతి కారణం కావచ్చని పండితాభిప్రాయం.[65]

సకల వేదాలలో ఉన్నవాడు విష్ణువు. సకల వేదాల సారమైన పరబ్రహ్మ తత్వాన్ని కీర్తనలు చేసి[66] పేరు సార్థక్యం చేసుకున్నవాడు అన్నమయ్య.

**గృహస్థాశ్రమం :**

సంసార జీవితంలో సత్కవులను పుట్టించిన వారు పోతన అన్నమయ్యలు. పోతన తర్వాత కొడుకు, మనవళ్ళు కవులుగా ప్రసిద్ధి పొందారు.[67] అట్లే అన్నమయ్య కొడుకులు, మనవళ్ళు కవులు, పదకర్తలుగా ప్రసిద్ధి పొందారు.[68]

## రాజధిక్కారం :

పోతన అన్నమయ్యలు రాజాశ్రయాన్ని, ఆదరణను కోరుకోలేదు. కావ్యాన్ని రాజులకు అంకితమివ్వడాన్ని వ్యతిరేకించిన వాడు పోతన. "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి..." లాంటి పద్యం ద్వారా "బాలరసాలసాల.......", "కాటుక కంటినీరు........." లాంటి చాటువుల ద్వారా అనాటి రాజులపై పోతనకు గల న్యూనత తెలియజేస్తున్నాయి. నరహరిని తప్ప నరుని కీర్తించడాన్ని వ్యతిరేకించినవాడు అన్నమయ్య. అనాడు నరసింహరాయలు అనే రాజు అన్నమయ్యను తనమీద కూడా ఒక శృంగార సంకీర్తన పాడమని ఆజ్ఞాపించగా "నరహరి కీర్తన నానిన జిహ్వ వొరుల నుతింపగ నోపదు జిహ్వ"[69] అని అన్నమయ్య సమాధానం చెప్పాడు. అంతేకాక "ధనమధాందుల కొలువేల తాపసులకు"[70] అంటూ పోతన, "మనుజుడై పుట్టి మనుజుని సేవించి అనుదినము దుఃఖమందనేల"[71], "వడినితరుల గొలువగవచ్చునా"[72] మొదలైన కీర్తనల ద్వారా అన్నమయ్య నరహరిని తప్ప నరుని నుతింపనని ప్రతిన బూనినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా పోతన, అన్నమయ్యలు రాజధిక్కారానికి కూడా వెనుకాడకుండా ప్రవర్తించడానికి గల కారణం ఆలోచిస్తే భగవంతునిపై వారికి గల విశ్వాసం, భక్తి పటిష్ఠమైంది. తద్వారా వారి ఆత్మవిశ్వాసం ప్రకటితం.

## దైవానుగ్రహం:

పోతనకు "శ్రీ పరమేశ్వర కరుణాకలిత". వరప్రసాదం మరియు శ్రీరామ సాక్షాత్కారం కలిగింది.[73] అన్నమయ్య "హరినందకాంశజుడు",[74] అలిమేలుమంగ వరప్రసాదం, వేంకటేశ్వర సాక్షాత్కారం కలిగింది. పోతనకు భాగవతాన్ని పలికించిన వాడు శ్రీరాముడు, అన్నమయ్య నాలికపై నుండి నానా సంకీర్తనలు పాడించినవాడు శ్రీ వేంకటేశ్వరుడు. దైవానుగ్రహానికి నోచుకున్న ఏ కొందరిలో పోతన అన్నమయ్యలు కూడా ఉన్నారు.

## బహుగ్రంథకర్తలు :

పోతన భాగవతము ద్వారా, అన్నమయ్య సంకీర్తనల ద్వారా ప్రాశస్త్యం పొందినా, వీరు ఇతర రచనలు కూడా చేసి బహు గ్రంథకర్తలుగా పేరుపొందారు. పోతన భోగినీదండకం, వీరభద్రవిజయం, అన్నమయ్య 12 శతకాలు, శృంగారమంజరి, వేంకటాచల మాహాత్మ్యం, ద్విపద రామాయణం సంస్కృత సంకీర్తన లక్షణం మొదలైనవి వీరి ఇతర రచనలుగా ఉన్నాయి.

**శివకేశవాభేదం :**

శ్రీధర వ్యాఖ్యానాన్ని, అనుసరించి భాగవతము రచించిన పోతన అద్వైతిగా [75] శివకేశవులందు సమాన ప్రతిపత్తి గలవాడుగా కనిపిస్తాడు. [76] చిన్నికృష్ణునిలో శివుని చూసిన పోతన అతని శివకేశవాభేదాన్ని సూచిస్తుంది.

సీ॥ తనువున నంటిన ధరణీప రాగంబు
పూసిన నెఱి భూతి పూతగాక
ముందట వెలుగొందు ముక్తాలలామంబు
తొగల సంగడి కాని తునుక గాగ
ఫాల భాగంబుపైఁబరగు గావలిబొట్టు
కాముని గెల్చిన కన్నుగాగ
కంఠమాలికలోని ఘననీల రత్నంబు
కమనీయమగు మెడ కప్పుగాగ

ఆ॥ హారవల్లులురగ హారవల్లులుగాగ
బాలులీల ప్రౌఢ బాలకుండు
శివుని పగిదినొప్పె శివునికిందనకును
వేఱులేమిఁదెలుప వెలయునట్టు[77]

పై పద్యంలో బాలకృష్ణుడు మట్టిలో ఆడుకోవడం చేత అతని శరీరంపై అంటుకున్న మట్టి విభూతిలాగా ఉంది. మెరిసే ముత్యాలహారం కలువల స్నేహితుని ముక్కులాగా ఉంది. నుదుటపై ఉన్న రక్షణబొట్టు (తిరునామం) కాముని (మన్మధుని) గెలిచిన ఫాలనేత్రంలాగా ఉంది. కంఠమాలికలోని ఘన నీల రత్నం శివుడు విషం తాగడం చేత కలిగిన నల్లటి మచ్చలాగా ఉంది. ఆభరణాలు పాములు (ఉరగ) లాగా ఉన్నాయి. ఈ విధంగా శివునికి, తనకు భేదం లేదని తెలిపే విధంగా బాలకృష్ణుడు 'ఉన్నాడు అని పోతన చెప్పడంలో శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే అన్న శ్లోకం గుర్తుకొస్తుంది.

అన్నమయ్య నందవరీక వంశంలో జన్మించినందువల్ల స్మార్త బ్రాహ్మణుడు కావున కులాను గతంగా అద్వైతి. అయితే అది తన పుట్టుకతో గట్టి వైష్ణవంగా మారింది.[78] కొన్ని సందర్భాలలో అన్నమయ్యలో అద్వైత భావన కన్పిస్తుంది. నమక చమకాలతో నామసింహ స్తోత్రం కన్పిస్తుంది.[79] స్మార్తులు ఈనాటికి నృసింహ పూజలో నమక చమకాలను వేదమంత్రాలతో అభిషేకించడం సంప్రదాయం.[80] అన్నమయ్య శ్రీకృష్ణుని కీర్తించే సందర్భంలో "ఈతడే హరుడు యీతడే అజుడు"[81] అని త్రిమూర్తులకు అభేదం ప్రకటించాడు. "కాలకూటవిషమైన గ్రక్కున మింగిన నాటి నీలవర్ణుడే మానిజదైవము"[82] అని చెప్పుటలో శివకేశవాభేదం కన్పిస్తుంది.

వీరి జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు వారి మనస్సును గాయపరచినట్లు తెలుస్తుంది. భాగవతము రచించేనాటికి "వ్యాప్తింబొందక వగవక ప్రాప్తంబగు లేశమైన(బదివేలనుచున్"[83] అన్న తత్త్వం పోతనది. అందుకే వ్యవసాయదారుడై నాగలిచేత బట్టిజీవితాన్ని గడిపాడు. అంతేకాని కావ్యాలను అమ్ముకొని జీవించే తత్త్వం కాదు. అందుకే "కర్ణాట కిరాట కీచకులకునమ్మ త్రిశుద్ధిగ నమ్ముభారతి" అని సరస్వతి దేవికి ప్రతిజ్ఞ చేశాడు. రాజులే కాక కవులు కూడా పోతనతో భాగవతాన్ని రాజులకు అంకితమివ్వమని చెప్పినట్లు, ఆ విషయం పోతనకు బాధ కల్గించి కావ్యాలను రాజులకు అంకితం ఇవ్వడం పడుపువృత్తి అని [84], అలా రాజులకు అంకితం చేయడం ద్వారా వాళ్ళు నరకానికి పోతారని చెప్పాడు.[85] అట్లే అన్నమయ్య మనస్సు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఒకటి నరసింహరాయలు తన మీద కూడా పాటలు పాడమని చెప్పినప్పుడు అన్నమయ్య తిరస్కరించడం జరిగింది. అందుకు రాజు కోపించి సంకెళ్ళు వేయించడం జరిగింది. రెండవది తనను, తన పాటలను దూషించే వారిని కోపించి బాధపడి అలాంటివారిని సంహరించాలని శ్రీ వేంకటేశ్వరుని వేడుకొన్న సందర్భం క్రింది సంకీర్తన ద్వారా తెలుస్తుంది.

నరసింహ రామకృష్ణ నమోశ్రీ వేంకటేశ
సరుగ నా శత్రుల సంహరించవే

బావ తిట్లకు శిశుపాలుని జంపిన
యేవకోపగాడవు నేడెందు వోతివి
నీవాడనని నన్ను నిందించే శత్రువును
చావగొట్టి వానినిట్టే సంహరించవే

దాసుని భంగించేటి తరి కస్యపు జంపి
యీసుకోపగాడవిపుడెందుపోతివి
యేసుల నీలాంచనాలు మించిన నన్ను దూషించే
సాసించి శత్రువును సంహరించవే

కల్లలాడి గూబయిల్లు గైకొన్న గర్ద జంపిన
యెల్లగాక దోపగాడ విపుడెందుబోతివి
యిల్లిదే శ్రీ వేంకటేశ యానీమీది పాటలు
జల్లన దూషించు శత్రు సంహరించవే [86]

అయితే ఆనాటి పండితులకు పదకవిత పట్ల నిరసన భావం ఉన్నట్లు క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

"ముదివిటుల విధవ లంజలు
పదకవితకు మారుబాస బాపనవారల్
చదువని పండిత వర్యులు
కదనాస్థలి వీరవరులు కడిది పురమునన్" [87]

పై పద్యం శ్రీనాధుని చాటువుగా లోకంలో ఉంది. అయితే శ్రీనాధుడు పదరీతిలో పల్నాటి వీరచరిత్ర వ్రాయడం జరిగింది. కాబట్టి ఈ చాటు పద్యం శ్రీనాధునిదని చెప్పలేం.

ఆర్తజన రక్షకుడు భగవంతుడు కావున మహాభక్తులైన పోతన అన్నమయ్యల సందర్భోచిత ఆర్తనాదం ఫలించింది. భాగవతాన్ని అపహరించడానికి వచ్చిన సేనాపతిని, సైన్యాన్ని చూసి పోతన మనస్సులో శ్రీరాముని ధ్యానించగా శ్రీరాముడు వరాహ రూపంలో ఆ సైన్యాన్ని చెదరగొట్టి భాగవత కావ్యాన్ని కాపాడినట్లు వరదాచార్యుల వారు రచించిన "పోతన చరిత్రము" ద్వారా తెలుస్తుంది.

15వ శతాబ్దంలో మత రాజకీయ కల్లోలంతో ఆంధ్ర దేశం సతమతమయ్యేది. మహమ్మదీయులు హిందూ దేవాలయాలను ధ్వంసం చేశారు. అలాంటి పరిస్థితుల్లో అన్నమయ్య తిరుపతి యాత్ర సాగిస్తున్నాడు. ఒకరోజు దారిలో ఆంజనేయస్వామి గుడిలో విశ్రమించాడు. ఇంతలో కొందరు తురక సైనికులు వచ్చి ఆ గుడిని కూల్చారు. అక్కడున్న వాళ్ళను బెదిరించి వాళ్ళ మూటాముళ్ళను దోచుకొన్నారు.

అట్లే అన్నమయ్య దగ్గరున్న శ్రీ వేంకటేశ్వరస్వామి పూజా విగ్రహాన్ని కూడా దోచుకున్నారు. ఆ సమయంలో అన్నమయ్య పరమ భాగవతోత్తముల సహాయం కోరి ఇలా ప్రార్థించాడు.

ఇందిరా రమణుదెచ్చి యియ్యరో మాకిటువలె
పొంది యీతని పూజించ పొద్దాయనిపుడు

ధారుణి మైరావణుదండించి రాముతెచ్చి
నేరుపున మించిన అంజనీ తనయ
ఘోరనాగపాశముల కొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా

నానా దేవతలకు నరసింహు కంభములో
పొనిపట్టి చూపినట్టి ప్రహ్లాదుడా
మానవుడై (డౌ?) కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండి నుంచుకొన్న పోటుబంట అర్జునా

శ్రీవల్లభునకు అశేష కైంకర్యముల
శ్రీ వేంకటాద్రివైన శేషమూరితి
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుడా
దేవుని నీవేళ నిట్టే తెచ్చి మాకు నియ్యరే [88]

అన్నమయ్య ఆర్తనాదం విన్న ఆంజనేయస్వామి సూక్ష్మ కపి రూపంలో వచ్చి ఆ పూజా విగ్రహాన్ని తెచ్చి అన్నమయ్యకు ఇచ్చాడు.

పోతన శ్రీధర వ్యాఖ్యానానికి అనుగుణంగా భాగవత రచన. అన్నమయ్య నాలాయిరమ్ (ఆళ్వారుల రచనల సంకలనం) అనుగుణంగా సంకీర్తన రచన చేశారు.

వ్యాస భాగవతాన్ని అనుసరించి పోతన భాగవతాన్ని అనువదించాడన్నది నిర్వివాదాంశం. అయితే అద్వైత పరమైన శ్రీధర వ్యాఖ్యానాన్ని ఆధారంగా కూడా పోతన అనువాదం సాగించాడు.

ఉదాహరణకు : ఏకాయనో సౌద్విఫల స్త్రీమూల

శ్చతుూరసః పంచవిధః షడాత్మ
సప్తత్వ గష్టవిటపో నవాక్షో
దశచ్ఛదీ ద్విఖగోహ్యాది వృక్షః "

అని మూలంలో ప్రపంచమనే ఆదివృక్షాన్ని వర్ణించిన విధానం శ్రీధర వ్యాఖ్యానంలో ఇలా ఉంది.

"లోకాది రూపం ద్వైతంచ సర్వం తద్వ్యతిరే కేణ నాస్తీతి వక్తుం ద్వైత ప్రపంచం వృక్షరూపేణ నిరూప యన్తీ ఏకాయన ఇతి. అసౌప్రపంచః అది వృక్షః వృశ్చ్యత ఇతి వృక్షః సమిష్టి వృష్టి దేవరూపః కథం భూతః ఏకాయనః ఏకాప్రకృతిః అయనం ఆశ్రయో యస్యసః ద్వేసుఖ దుఃఖే ఫలే యస్యసః

త్రయోగుణాస్సత్త్వా దయో మూలా నియస్యసః ధర్మార్థ కామ మోక్షశ్చత్వారో రసాయస్యసః పంచ యింద్రియాణి శిఫా జ్ఞాన ప్రకారా యస్యసః షడూర్మయః

శ్లో॥ బుభుక్షాచ పిపాసాచ ప్రాణాస్యమనసః స్మృతౌ
శోకమోహౌ శరీరస్య జరామృత్యు షడూర్మయః
కోశావాత్వ గ్రుధిర మాంసమే దోఽస్థి మజ్జా ఏతేషట్కో శాః
ఆత్మానః స్వభావాః యస్యసః షడాత్మా సప్తధాతవః
త్వచో యస్యసః పంచభూతాని మనోబుద్ధ్యాహంతారాశ్చే
త్యష్టౌ విటపాః శాఖావిస్తరా యస్యసః సవాక్షః నవ
ద్వారాణి అక్షిణీ ఛిద్రాణి యస్య దశప్రాణాః నాగ
కూర్మ కృకర దేవదత్త ధనంజయ ప్రాణాపాన జ్ఞానో.
దానసమానాః చదాః పత్రాణి యస్యసః దశచ్ఛదః
ద్వౌజీవేశ్వరౌ ఖగౌయస్మిన్ సః ద్విఖగః

పోతన అనువాదంలో ఇలా ఉంది. క్రింది పద్యం శివబ్రహ్మలు, ఇంద్రాదిదేవతలు, నారదాది మునులు, దేవకీ గర్భంలో వున్న విష్ణువును, అతడు ధరించిన అవతారాలను ప్రస్తుతించిన సందర్భంలోనిది.

ప్రకృతి యొక్క టిపాదుఫలములు సుఖ దుఃఖ
ములు రెండు గుణములు మూడు వేళ్ళు
తగు రసంబులు నాల్గు ధర్మార్థ ముఖరంబు
లెతిగెడి విధము లైంద్రియంబు
లాఱు స్వభావంబులాశోక మోహాదు
లూర్ములు ధాతువులొక్క యేడు
పైపొరలెనిమిది ప్రంగలు భూతంబు
లైదు బుద్ధియు మనోఽ హంకృతులును

రంధ్రములు తొమ్మిదియుఁగోటరములు ప్రాణ
పత్ర దశకంబు జీవేశ పక్షియుగము
గలుగు సంసార వృక్షంబుఁ గలుగజేయఁ
గావ నణగింప రాజవొక్కరుడ వీవ "

అని మూలానికి, వివరణాత్మకంగా, శ్రీధరుని వివరణకు కొన్ని చోట్ల సన్నిహితంగా, మరికొన్ని చోట్ల అతి సన్నిహితంగా ఉన్న పై పద్యం పాఠకులకు అవగాహన కావడానికి తగిన వివరణ పోతన ఇవ్వడం శ్రీధరుని అద్వైత తత్త్వాన్నే గాక వ్యాఖ్యానాన్ని కూడా గౌరవించాడు అనటానికి నిదర్శనం.

కలియుగంలో వైష్ణవమతానికి ఉన్నతమైన స్థానాన్ని కల్పించినవారు ఆళ్వారులు. తమిళ దేశంలో వీరు తమ భక్తిగీతాల ద్వారా వైష్ణవ మత వ్యాప్తికి శ్రీకారం చుట్టారు. ఆళ్వారుల లోని శ్రీ శఠగోపులు (నమ్మాళ్వార్) రచించిన "తిరువిరుత్తము", "తిరువాఖిరియమ్", "తిరువందాది", "తిరువాయ్ మొ" అన్న కృతులకు శ్రీవైష్ణవంలో చతుర్వేదాలతో సమానమైన ప్రతిపత్తి కలదు. ఆళ్వారుల రచనల సంకలనానికి 'నాలాయిరమ్' అని పేరు. ఈ నాలాయిర దివ్య ప్రబంధం ఉపనిషత్సారంతో నిండిఉంది. ఈ విధంగా విశిష్టాద్వైతాన్ని చాటిచెప్పిన ఆళ్వారులను వారి రచనలను అనుసరించిన అన్నమయ్య తన సంకీర్తనల్లో విశిష్టాద్వైతాన్నే అధికంగా చేసి చెప్పడం ద్వారా ఆళ్వారుల రచనలైన 'నాలాయిరమ్'ను అనుసరించాడు. ఉదాహరణకు ఆళ్వారుల లాగావే సామాన్య ప్రజలకు చేరుటకు ప్రాంతీయ భాషను ఊతగా గొని సంకీర్తనలు ఆలపించి ప్రజామోద భాషలో మతప్రచారం చేయడం.

ఆళ్వారులు వివిధ కులాలలో పుట్టినవారు. వీరు అపార జ్ఞానాన్ని, విశుద్ధ జీవనాన్ని కలిగిన వారు. వీరి మత ప్రబోధం కుల సంప్రదాయ పరిధులను అధిగమించి బహుళ ప్రచారం పొందింది. అందుకే అన్నమయ్య ఇలా తెలియజేశాడు.

"ఏ కులజుడైన నేమి ఎవ్వడైన నేమి
ఆకడనీతడే హరి నెఱిగినవాడు" [91]

హరిని ఎరిగినవాడు ఏకులం వాడైన పరవాలేదు, అతడూ ఆళ్వారుల్లో ఒకడే అని అన్నమయ్య చెప్పిన తీరులో 'నాలాయిరమ్' సారం ఉంది. ఆళ్వారులు అన్న పదానికి 'గంభీరమైన లోతులోకి చొచ్చుకొనిపోయేవారు' అని అర్థం. భగవంతుని అనుగ్రహం, సర్వసంఘ పరిత్యాగం చేసే ఏ కొద్దిమందికో కాక నారాయణ నామాలను భక్తిపూర్వకంగా ధ్యానించి శరణుకొచ్చిన వారందరికీ లభిస్తుందని వీరిచరిత్ర వల్ల తెలుస్తుంది. అదే శరణాగత తత్త్వం అన్నమయ్య సంకీర్తనలలో ఎక్కువగా కన్పిస్తుంది.

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడు తీర్థ ప్రసాదేచ్ఛ తోడ
నిపుణత శ్రీ వేంకట నిలయుడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమ వైష్ణవము [92]

ఏ ఉపాయం లేకుండా శ్రీ వేంకటపతి గతియని శరణంటే అదే వైష్ణవం అని చెప్పడంలో 'నాలాయిరమ్'లో ఉన్న విశిష్టాద్వైతం స్పష్టమవుతుంది.

భక్తి :

"భక్త్యా భాగవతం జ్ఞేయం
నవ్యుత్పత్త్యా నటీకయా"

భాగవతాన్ని అర్థం చేసుకోవాలంటే భక్తి కావాలి, పాండిత్యం, టీకా తాత్పర్యాలు భాగవతాత్మను అర్థం చేసుకోవడానికి చాలవు". [93] భక్తితో భగవదాత్మను తెలుసుకొని పండిత పామరులను అలరించిన వారు పోతన అన్నమయ్యలు. పోతనది శ్రీరామభక్తి, అన్నమయ్యది శ్రీ వేంకటేశ్వర భక్తి. ఇరువురిలో భాగవత భక్తి సమానం. ఇద్దరూ నవవిధ భక్తిమార్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దీన్ని

గురించి భక్తితత్వం అనే ప్రకరణలో చర్చించడం జరిగింది. ఇద్దరూ సగుణ నిర్గుణ భక్తికి ప్రాధాన్యం ఇచ్చారు. అయితే భాగవత రచన ద్వారా కైవల్యం లభిస్తుందని విశ్వసించిన పోతనలో నిర్గుణ భక్తి కొంత ఎక్కువగా కన్పిస్తుంది.

భాష :

పోతన అన్నమయ్యలు పండిత పామర రంజకంగా రచనలు చేయటానికి ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. పోతన సహజ పండిత బిరుద నామంలో, భాగవతము అన్నీ వర్గాల వారికి మెప్పించే రీతిలో రచిస్తానని చెప్పడంలోనే గ్రంథంతో పాటు వ్యవహారికాన్ని తన రచనలో పాటించినట్లు, తద్వారా జానపద బాణీలను గౌరవించాడని తెలుస్తుంది. ఉదాహరణకు కొన్ని పద్యాలు గమనించవచ్చు.

"అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలపె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి పుచ్చినయమ్మ తన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యీవుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్" [94]

"ఏమి నోము ఫలమొ? యింత ప్రొద్దొక వార్త
వింటిమబలలార! వీనులార
మన యశోదచిన్ని మగవాని గనెనట
చూచివత్తమమ్మ! సుదతులారా!!" [95]

నోము ఫలము, చిన్ని మగవానిని, మన యశోద మొదలైన ఈ పదాలు ప్రజా భాషను గుర్తుకు తెచ్చేవే. ఇలాంటిది మరొకటి:

ఓయమ్మ నీ కుమారుడు
మాయిండ్లనుఁబాలుఁబెరుగు మననీడమ్మ
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన! మంజులవాణీ [96]

ఇలాంటి పద్యాలన్నీ సామాన్య ప్రజల నాలుకల్లో నిలిచిపోవటానికి ప్రజాభాషలో పోతన అధికంగా పద్యాలు రచించడమే కారణమని చెప్పవచ్చు.

అన్నమయ్య గ్రాంధిక భాష ఎరిగినవాడైనా సంకీర్తనల్లో చాలా చోట్ల వాడుక భాషనే వాడాడు.[97] అన్నమయ్య సంకీర్తన లక్షణములో చెప్పినదానికి చినతిరుమలయ్య తెలుగులో ఇలా చెప్పాడు.

"పల్లవ నారీష్వేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్య నాటకాదిఫణితిన్"
"జగతి గడు జెల్లుబడ్లై
నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగదన రహిచెడుఁబువ్వుల
సొగసుడుగన్ బిసికి కంపు సూపిన భంగిన్" [98]

వచ్చీనీ, పోయీనీ, చేసినీ, ఆడుతా, చేయరంటా, చిముడుతా, ఏమి చెప్పేదమ్మా, అమ్మలాలా, అయ్యలాలా, ఏవూరికేవూరు, మొదలైనవి వాడుక భాష ప్రయోగాలు.

## సంగీతం :

సాహిత్యం సంగీతం కావ్యానికి నేత్రాలు. పోతన పద్యాల్లో సంగీతం ఉంది. పోతనకు సంగీతంలో ప్రావీణ్యం ఉందనటానికి క్రింది వచనం, పద్యం గమనించదగినవి.

"......... మంద్ర మధ్యమతారముల నింపుదళుక్రొత్త్తు రాగ భేదములఁ దనరి దైవత ఋషభ గాంధార నిషాద పంచమ షడ్జమధ్యమ స్వరము......."[99] సంగీత స్థాయీ భేదాలు, స్వరాలు సంగీత ప్రావీణ్యం ఉన్నవారికే తెలుస్తుంది.

"పాటించి గాన విద్యా
పాటవమునఁ దేరులెక్కి బహుతానములం
బాటలగంధులు కృష్ణునిఁ-
పాటలు వాడిరి విరోధి పాటనుదనుచున్" [100]

పై తానం అన్న పదం సంగీత సంప్రదాయంలో మనోధర్మానికి సంబంధించింది. ఈ విషయాలను గమనిస్తే పోతనకు సంగీతంలో ప్రవేశం, ప్రావీణ్యం ఉందని తెలుస్తుంది. ఇక అన్నమయ్యసాహిత్యం సంగీతమయం. అన్నమయ్యవి కీర్తన రూప సాహిత్యం. సంగీతం సాహిత్యం సమ్మిళితమే కీర్తన. ప్రతి సంకీర్తనకు రాగం పేరు చెప్పబడింది.

పోతన పద్యాలలో సంగీతపరమైనవి ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే అవి ప్రార్థనా గీతాలుగా కూడా ఉన్నాయి.

కృష్ణవాసుదేవ కేశవ పరమాత్మ
యప్రమేయ వరద హరి ముకుంద
నిన్ను జూడగంటి నీకృప గనుగొంటి
అఖిల సౌఖ్య పదవులందగంటి [101]

నీపాద కమల సేవయు
నీపాదార్చకులతోటి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
తాపసమందార ! నాకు దయసేయగదే [102]

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందు బరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుఁడెవ్వడు సర్వముఁదానయైన వాఁ
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబువేడెదన్ [103]

వాలిన భక్తి మ్రొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖ పద్మమయూఖమాలికిన్
బాలశశాంక మౌళికిఁగపాలికి మన్మథ గర్వపర్వతో
న్మూలికి నారదాది మునిముఖ్య మనస్సరసీరుహాళికిన్ [104]

మొదలైన పద్యాలలో సంగీతం ఉంది. అంతేకాక పోతన శబ్దాలంకార శోభితాలైన సీస పద్యాలన్నీ పాటల రూపంలో పాడుకొనే అవకాశం

కల్గినవే. పోతన గోవిందుని మీద పద్యాలుగా కాక పద్యలక్షణాలతో పాటలు రాశాడేమో అన్న సందేహం కల్గించే క్రింది పద్యం గమనించదగింది.

జోజో కమల దళేక్షణ
జోజో మృగరాజమధ్య! జోజోకృష్ణా
జోజో పల్లవ కరపద!
జోజోపూర్ణేందువదన! జోజోయనుచున్ [105]

ఇక అన్నమయ్య సంకీర్తనలు కూడా రాగతాళమయమైనవే కాక అవి పద్యలక్షణాలు గల సంకీర్తనలుగా కన్పిస్తాయి.

# పాదసూచికలు

1. కథలు-గాథలు, తృతీయభాగము, పుట-1
2. ఆం.మహా.భాగ-స్కం1-22, తెలుగు విశ్వవిద్యాలయం
3. ఆం.మహా.భాగ-స్కం 1-24
4,5. ఆం.మహా.భాగ-స్కం 1-22
6. ఆం.మహా.భాగ-స్కం 1-21
7. శ్రీ మహాభాగవతము- పీఠిక- పుట 10
8. ఆం.మహా.భాగ-స్కం 1-18
9. పోతన-పుట 7 నిడదవోలు వేంకటరావు
10. ఆం.మహా.భాగ-స్కం 1-22
11. ఆం.మహా.భాగ-స్కం 1-22
12. ఆం.మహా.భాగ-స్కం 1-25
13. ఆం.మహా.భాగ-స్కం 1-22
14. ఆం.మహా.భాగ-స్కం 1-24
15. ఆం.మహా.భాగ-స్కం 1-18
16. ఆం.మహా.భాగ-స్కం 1-14
17. ఆం.మహా.భాగ-స్కం 1-15
18. ఆం.మహా.భాగ-స్కం 1-12
19. పోతన చరిత్రము- వానమామలై వరదాచార్యులు
20,21. పోతన పుట-8, నిడదవోలు వేంకటరావు
22. ఆం.మహా.భాగ-స్కం 1-11
23. "బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతర సీమల కందమూల కౌ
ద్దాలికులైననేమి నిజ దార సుతోదర పోషణార్థమై" చాటుపద్యం, పోతన

24. "కాటుకకంటినీరు చనుకట్టుపయింబడ నేలనేడ్చెదో
కైటభ దైత్యమర్దనుని గాదిలి కోడల యో మదంబ యో
హాటకు గర్భురాణి నినునాతటికిం గొనిపోయి యల్లక
ర్ణాట కిరాట కీచకులకమ్మ త్రిశుద్ధిగనమ్ము భారతీ!"చాటుపద్యం, పోతన

25. అం.మహా.భాగ-స్కం 1-265

26. అం.మహా.భాగ-స్కం 8-88

27. అం.మహా.భాగ-స్కం 8-589

28. శ్రీ మహాభాగవతము, పీఠిక, పుట-14

29. అం.మహా.భాగ-స్కం 1-313

30. అన్నమాచార్య చరిత్ర పుట-9

31. అన్నమాచార్య చరిత్ర పుట-9,10

32. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, అన్నమాచార్య చరిత్ర, పీఠిక, పుట-2,టిటిడి 2001

33. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర, పుట-8, డా. కె.వాణి, 1997

34. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర, పుట-11, డా. కె.వాణి, టిటిడి

35,36. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర, పుట-6, డా. కె.వాణి

37. అన్నమాచార్య చరిత్ర, పుట-10
"..........అహినాయకాద్రి
వెన్నునివరముచే విద్యలన్నియును
నమితంబులగుచు జిహ్వారంగ సీమ
తము దామె సొచ్చి నర్తన మాడ దొడగె"

38. అన్నమాచార్య చరిత్ర పుట-11
"ఆడిన మాటెల్ల అమృత కావ్యముగ
పాడిన పాటెల్ల(బరమగానముగ
తన కవిత్వమునకున్ దన గానమునకు(

గనుగొని సకలలోకములు గీర్తింప
వేంకటపతి మీద వింతవింతలుగ
సంకీర్తనంబులు సవరించు....”

39. అన్నమాచార్య చరిత్ర, పుట 12
40. అన్నమాచార్య జీవితచరిత్ర, పుట 6
41,42. అన్నమాచార్య చరిత్ర, పుట 16
43. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం-4, సంకీర్తన, 438
44. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం-4, సంకీర్తన, 471
45. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం-2, సంకీర్తన, 426
46. అన్నమాచార్య చరిత్ర, పుట-25
“వేంకటపతి మీద వివరస్తవముగ
వేంకటశతకంబు విన్నవించుటయు”
47. అన్నమాచార్య చరిత్ర, పుట 27
48. అన్నమాచార్య చరిత్ర, పుట 28
49. అన్నమాచార్య చరిత్ర, పుట 27
50. అన్నమాచార్య చరిత్ర, పుట 19
51. అన్నమాచార్య సంకీర్తనలు (పీఠిక), సంపుటం-2, పుట 49
52. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం 26-18, కీర్తన
53. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం 5-82, కీర్తన
54. అన్నమాచార్య చరిత్ర పుట-37
55. అన్నమయ్య సంకీర్తనలు, సంపుటం -3, 266 కీర్తన
56,57. అన్నమాచార్య చరిత్ర, పుట 42
58. అన్నమాచార్య చరిత్ర, పుట 43
59. అన్నమాచార్య చరిత్ర, పీఠిక, పుట 65
60. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం-2, 104
61. అన్నమాచార్య జీవితచరిత్ర పీఠిక
62. అన్నమాచార్య చరిత్ర, పుట 45, 46
63. అం-భాగ-స్కం 8-471

64. అన్నమాచార్య చరిత్ర, పుట 9

65. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, (అన్నమాచార్య చరిత్రము)
పుట-12,2001 టిటిడి

66. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం 2-24, కీర్తన
"సకల వేదములు సంకీర్తనలు జేసి
ప్రకటించి నినుబాడి పావనుడైన
అకలంకుడు తాళ్ళపాకన్నమాచార్యులు"

67. శ్రీమహాభాగవతము, పీఠిక, పుట 12,13

68. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర, కె.వాణి, పుట 81, 82, 83

69. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం-2-144 కీర్తన

70. ఆం. మహా భాగవతం - స్కం-2-21

71. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం-2-196 కీర్తన

72. అన్నమాచార్య సంకీర్తనలు, సంపుటం-1-397 కీర్తన

73. ఆం.మహా.భాగ-స్కం-1-14,15 పద్యాలు

74. అన్నమాచార్య చరిత్ర పుట-10

75. పోతన-పుట-6, నిడదవోలు వేంకటరావు

76. ఆం.మహా.భాగ-స్కం-1-12,
"చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తినుడువడేని"

77. ఆం.మహా.భాగ-స్కం-10-పూర్వ-296

78. అన్నమాచార్య సంకీర్తనలు- సంపుటం-1, పీఠిక పుట-30

79. అన్నమాచార్య సంకీర్తనలు- సంపుటం-1-259 కీర్తన

80. అన్నమాచార్య సంకీర్తనలు- సంపుటం-1, పీఠిక పుట-33

81. అన్నమాచార్య సంకీర్తనలు- సంపుటం-4-2-47

82. అన్నమాచార్య సంకీర్తనలు- సంపుటం-1-214

83. ఆం.మహా.భాగ-స్కం, 8-573

84. "బాలరసాలసాల... పోషణార్థమై" చాటుపద్యం, పోతన

85. "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్

సొమ్ములుగొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్'
అం.మహా.భాగ-1-11

86. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం 4-454 కీర్తన
87. శ్రీనాథుని వీధినాటకం-చాటుపద్యం-47
88. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం 4-430 కీర్తన
89. సంస్కృత భాగవతము, 10-2-27
90. అం.మహా.భాగ-స్కం-10-పూర్వ-91
91. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం 1-292 కీర్తన
92. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం 2-317 కీర్తన
93. శ్రీ తల్లంపుల్లన్నగుప్త ధర్మనిధి ఉపన్యాసాలు-పుట-19, డా.దాశరధి, 1980
94. అం.మహా.భాగ-స్కం 1-8 పద్యం
95. అం.మహా.భాగ-స్కం 10-పూ-184 పద్యం
96. అం.మహా.భాగ-స్కం 10-పూ-328 పద్యం
97. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము-పుట-97, 2001, టిటిడి
98. సంకీర్తన లక్షణం
99. అం.మహా.భాగ-స్కం-2-188 వచనం
100. అం.మహా.భాగ-స్కం-10-పూ-893
101. అం.మహా.భాగ-స్కం-10-ఉ-473
102. అం.మహా.భాగ-స్కం-10-పూ-1268
103. అం.మహా.భాగ-స్కం-8-73
104. అం.మహా.భాగ-స్కం-1-3
105. అం.మహా.భాగ-స్కం-10-పూ-189

# పురాణం-భాగవతం

ప్రస్తావన :

భారతీయుల ఆధ్యాత్మికతకు మూలగ్రంథాలు రామాయణ, మహాభారత, భాగవతాలు. భారత దేశానికి కర్మభూమి అని పేరు. వివిధ కర్మమార్గాల చేత జ్ఞానాన్ని, తద్వారా భక్తిని వరసగా రామాయణ, మహాభారత, భాగవతాల మూలంగా భారతీయుడు కర్మ, జ్ఞాన, భక్తిని అలవరచుకొని ముక్తిని పొందాలని ఆశిస్తాడు.

గృహస్థుడు (మానవుడు) తన ధర్మాన్ని ఎలా నిర్వర్తించాలి అందుకు తగిన కర్మావసర సూచనల్ని తెలియజేస్తుంది రామాయణం. అంటే సంస్కారం ద్వారా కర్మ చేయాలన్నదే దీని భావం.

గృహస్థుడు (మానవుడు) తన కర్మలను నిర్వర్తిస్తూ సమాజంలో తాను ఎలా నడుచుకోవాలి, ఎలా నడుచుకుంటే గౌరవ మర్యాదలు లభిస్తాయి అన్న జ్ఞానాన్ని బోధిస్తుంది మహాభారతం. అయితే భక్తి లేని కర్మ, జ్ఞానాలు వ్యర్థాలు. అందుకే భక్తికి నిదర్శనమైన భాగవతుల చరిత్రలను తెలిపే భాగవతం. కర్మ, జ్ఞానాలను సుగమ్యానికి చేరుస్తుంది. అంటే భక్తితో కర్మను, కర్మ ద్వారా జ్ఞానాన్ని, తద్వారా విజ్ఞానాన్ని సంపాదించి మోక్షాన్ని పొందగలడు.

పురాణ ప్రస్తావనలో రామాయణ, మహాభారతాలు ప్రసక్తి అప్రస్తుతం అనిపిస్తుంది. ఎందుకంటే రామాయణ, మహాభారతాలు, ఇతిహాసాలుగా భాగవతం మాత్రమే పురాణంగా లోకంలో చెప్పబడుతుంది. అయితే ఈ మూడింటిని కూడా పురాణాలుగా భావించడం కొందరిలో కనిపిస్తుంది. ఆంధ్ర భాగవత కర్త పోతన చెప్పిన క్రింది పద్యమే అందుకు నిదర్శనం.

"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విం బురాణావళుల్
తెనుగుంజేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనినేదెనింగించినా
జననంబున్ సఫలంబుజేసెద బునర్జన్మంబు లేకుండగన్"[1]

అన్న పద్యాన్ని బట్టి నన్నయ తిక్కనాది కవులు అనుటలో ఎఱ్ఱనను చేర్చి ఈ కవిత్రయం రచించిన ఆంధ్ర మహాభారతం, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, తాను తెలుగు చేయబోతున్న భాగవతం ఈ మూడు పురాణాలని పోతన భావించడం జరిగింది. దీనికి కారణం పురాణం ఇతిహాస లక్షణాలకు దగ్గరి సంబంధం కలిగి వుండడమే అని తెలుస్తుంది. స్థూలంగా చూచినప్పుడు మూడు గ్రంథాలు కూడా ఒకేవిధంగా భావించబడుతున్నాయి.

పోతన భాగవతాన్ని పురాణమని[2] దాని కర్త వ్యాసుడని చెప్పాడు[3]. అట్టి భాగవత పురాణ ప్రాశస్త్యాన్ని గుర్తించాలి. దానికి ముందు పురాణ ప్రాశస్త్యాన్ని గమనించాలి.

"పురాణము ప్రధానముగా భగవద్విషయకమైనది. సృష్టికాధారభూతుడై, తత్పరిపాలకుడైన పరమేశ్వరుని లీలావిశేషములను వర్ణించుట దాని ధ్యేయము."[4]

పురాణ ప్రాశస్త్యాన్ని ప్రాచీన వాఙ్మయం, ఇతరులు పొగిడిన విధం గమనించదగింది.

### పురాణ ప్రాశస్త్యం- ప్రాచీన వాఙ్మయం :

సకల వేదాల సారమే పురాణం అని నారద పురాణం[5] చెప్పగా సర్వశాస్త్రాలలో పురాణం మొదటిదని, బ్రహ్మచే చెప్పబడిందని, ఆ తర్వాతనే బ్రహ్మముఖం నుండి వేదాలు పుట్టాయని వాయుపురాణం[6] చెబుతుంది.

వేదేతిహాసాలు ఆ మహాభూతం యొక్క అనగా పరబ్రహ్మం యొక్క నిశ్వాసాలు అని వాజసనేయ బ్రాహ్మణోపనిషత్తు.[7]

శ్రుతి, స్మృతులు విరాట్పురుషునికి నేత్రాలైతే పురాణం హృదయమని, దీనిచేత చెప్పబడిందే ధర్మమని దేవి భాగవతం.[8]

ఇతిహాస పురాణాల చేత వేదాలు విస్తరించాలి అని మహాభారతం[9] పురాణ ప్రాచీనత్వాన్ని, ప్రాశస్త్యాన్ని కొనియాడింది.

### పురాణ ప్రాశస్త్యం-ఇతరులు :

"పురాణములు పూర్వ చరిత్రలను, ప్రాచీన సంస్కృతిని గుర్తుచేసేవి. కాబట్టి వాటిని మరచిన జాతి ఎందులోనూ ప్రగతి సాధించలేదు."[10]

"పురాతన సామాజిక, రాజకీయ, నైతిక, మత ధార్మికాచార వ్యవహారములను పురాణములు వర్ణించి చెప్పుచున్నవి. శిల్ప కావ్య సాహిత్యాలంకార వ్యాకరణాది శాస్త్రములలోని రహస్యములను దెలుపుచున్నది."[11]

"చదివినది చదివించడం, విన్నది వినిపించడం ఈ పద్ధతుల ద్వారా సమాజానికి అనుభవ జ్ఞాన పూర్వకమైన నూతన స్ఫూర్తిని కలిగించడం పురాణ పారమ్యం."[12]

"విశ్వము యొక్క సృష్టి స్థితి లయములు, రాజవంశములు మున్నగువాని చరిత్రములను పురాణములు వివరించును. మరియు భగవంతుడొనర్చు దుష్టశిక్షణ–శిష్టరక్షణములను, మనుజులు పాటింపవలసిన ధర్మములను, ఆధ్యాత్మిక క్షేత్రములు. తీర్థస్థలములు, మున్నగు వాని మాహాత్మ్యములు గూడ పురాణములలో వర్ణింపబడినవి."[13]

"పురాణాలంటే ఒక సర్వశాస్త్ర సముచ్చయాన్ని, సమస్త విజ్ఞాన సమన్వయాన్ని కలిపి వైజ్ఞానిక సూత్రాల రూపంలో అన్ని శాస్త్రాల వెనకాల వున్న ఏకసూత్రమైన ఒక మహాసత్యాన్ని తెలిపే సైన్సు.[14]

"మన పురాణాలు భారతీయ విజ్ఞాన నిధులు. వేదధర్మాన్ని సుప్రతిష్ఠం చేయడానికి ప్రముఖ సాధనాలు. శ్రుతి స్మృతులలో కానరాని సర్వధర్మాది విషయాలను బోధించే గురువులు. మానవ జీవితాలకు సంబంధించిన సర్వాంశాలను సృజించే పురాతన వస్తువులు. లోకంలో పరమ ఆస్తిక్య బుద్ధిని పరిపోషించే రక్షక కవచాలు. హిందూ ధర్మ ప్రచారానికి అత్యుత్తమ పరికరాలు. కావ్య కథా స్రవంతులకు జన్మస్థానాలు. అర్థ ప్రధానాలు మిత్రసమ్మితాలు. శాస్త్ర దృష్టులు. ప్రాక్తన విషయాభిరతులు, ప్రామాణికతకు అత్యంత పాత్రలు పురుషార్థ సాధనోపయోగాలు."[15]

పై పురాణ ప్రాశస్త్యాన్ని గురించి ప్రాచీన వాఙ్మయం, ఇతర పండితులు ఇచ్చిన వివరణ గమనిస్తే ప్రాచీనమైనవి పురాణాలు అని, అవి కథల రూపంలో ఉంటాయని తెలుస్తుంది. ఈ పురాణాలు ఎన్నో నీతి విషయాలను సమాజానికి తెలియజేసి మానవుని ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి తద్వారా స్ఫూర్తినిచ్చి మానవ జీవితాన్నిసుబోధం చేయడానికి ఆవిర్భవించాయని తెలుస్తుంది.

అంతేకాక, ఈ పురాణాలు అన్ని కాలాల్లో వున్న పరమసత్యాన్ని, జీవకోటి మనస్తత్వాన్ని ప్రతిఫలింపజేస్తాయి. ఆకాశంలోని గ్రహ సంచారానికి, పరమేశ్వరుని లీలలకు, మానవుని జన్మలకు, వారి ప్రవర్తనకు, మనస్తత్వానికి బింబ ప్రతిబింబ భావముంది. పురాణాలలో కథలుగా కనిపించే గాథలు మనస్తత్వాలను విభజిస్తాయి. ఇందులో కథలే ప్రధానంగా తీసుకోకూడదు. కొన్ని వేదాలలోలాగా అర్థవాదాలుగా కూడా వర్ణించబడి వుంటాయి. అట్లే లోకంలో వున్న మానవాళి మీద నిర్హేతుకమైన దయతో నారాయణుడు కృష్ణద్వైపాయన రూపంగా అవతరించి ప్రోదిచేసిన వేదసారం ధర్మ భారం లోకోపకారమే ఈ పురాణ భారతి. ఈ పురాణ వాఙ్మయం సర్వకాలానికి సంబంధించిందే. కాని ఏ కాలానికో, ఏ చరిత్రకో సంబంధించింది కాదు. ఈ పురాణం నేటి సమాజానికి ఎంతైనా అవసరం. ఏదో ప్రొద్దుపోనివారు చదువుసంధ్యలు, సంస్కారం లేనివారు ఈ పురాణాలు వినాలి, కాని అధునిక, వైజ్ఞానిక ప్రపంచంలో వీటివల్ల ఉపయోగం లేదనుకోవడం ఆలోచనారహితం, అవాస్తవం కూడా. ఈ పురాణ వాఙ్మయమే లేకపోతే కళలుగాని, శాస్త్రాలుగాని, సృష్టిస్థితుల వివరాలు తెలిపే విశేషాలుగాని గ్రహించుటకు వీలులేదు. ఖగోళ, భూగోళాలు గ్రహాల స్థితిగతులు, నక్షత్ర మండల వివరాలు , ధృవమండల స్వరూపాలు, గ్రహమండల కొలతలు, నదీ నద సముద్రాల విస్తారాలు, సంగీతం సాహిత్యం, కవిత్వం, వాద్యాల భేదాలు, నృత్త, నృత్య నాట్యాది విభేదాలు, వ్రతాలు, తపస్సులు, పుణ్యక్షేత్రాలు, తీర్థాలు, పర్వకాలాలు, ఇంతేకాదు– జగత్తులోని సర్వ విషయాలను పురాణ వాఙ్మయం స్పృశించి విమర్శించింది అనడంలో సందేహం లేదు.

"పురాణం సర్గాది పంచ లక్షణాలతో కూడి ఉంటుంది. పురాణాలలో భాగవతం విశిష్టమైన పురాణం. ఇది దశ లక్షణాలతో కూడి ఉంటుంది."[16] అలాంటి భాగవతం గురించి దాని ప్రాశస్త్యాన్ని గురించి తెలుసుకోవాలి.

**భాగవతము :**

పురాణాలు సాత్విక రాజస తామసాలని మూడు విధాలు. భాగవతం సాత్విక పురాణం. ఇది భక్తి నిధానం ముక్తిప్రదాయకం. అలాంటి ఈ భాగవత పురాణాన్ని "ఇతర పురాణములన్నింటిని రచించిన పిదప వాని యందలి సారమును గ్రహించి వ్యాసుడు భాగవతము రచించినట్లు పద్మ పురాణములో కలదు."[17] "భగవతః ఇదమ్ భాగవతమ్" భగవంతుని కథలు చెప్పునది భాగవతము అనగా

దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొఱకు విష్ణువు ధరించిన ఏకవింశద్వ్యవతార గాథలను వివరించునది గావున భాగవతమని పేరు."[18].

## భగవత్ శబ్దం :

వాఙ్మయంలో 'భగవత్' శబ్దానికి సంబంధించి రెండు గ్రంథాలున్నాయి. 1. భగవద్గీత 2. భాగవతము. భగవద్గీత భగవంతునిచే చెప్పబడింది. భాగవతము భగవంతుని గూర్చి చెప్పబడింది.[19] భగవద్గీత భాగవతానికి భాష్యం.[20]

## భాగవత శబ్దార్థం :

భాగవతము అక్షర శబ్దాన్ని బట్టి వచ్చే అర్థం గమనించదగింది. భా= భక్తి (భాగవతుడు), గ= జ్ఞానం వ=వైరాగ్యం త= తత్త్వం ము=ముక్తి అన్న సంకేతం తెలుగునాట ప్రచారంలో ఉంది. అనగా భక్తిని, జ్ఞానాన్ని అనగా విజ్ఞానాన్ని తద్వారా వైరాగ్యాన్ని ప్రసాదించి పరమాత్మ తత్త్వాన్ని తెలిపి ముక్తిని ప్రసాదించేది భాగవతమని తెలుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే భాగవతము భక్తునికి మోక్షం అన్న అర్థంలో చెప్పవచ్చు.

## భాగవత ప్రాశస్త్యం :

వేదాలు విభజించి, మహాభారతాన్ని రచించినా మనశ్శాంతి లేక పరితపిస్తున్న వ్యాస మహర్షి నారద మహర్షి ప్రేరణతో భాగవతాన్ని రచించి మనశ్శాంతిని పొందాడు. మనశ్శాంతి కోసం వ్యాసునిచేత రచింపబడింది భాగవతము. హరిగుణ లీలా విభూతుల్ని కొనియాడి ముక్తికి మార్గమైంది భాగవతము.

భాగవతంలోని ప్రధాన విషయం గ్రహించడానికి దానిలో చెప్పబడ్డ దశవిధ లక్షణాలను గ్రహించాలి. అవి ఇవి -

"అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణ మూతయః
మన్వంతరేశాను కథా నిరోధో ముక్తిరాశ్రయః"

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశానుకథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం ఈ పదింటి వర్ణన భాగవతంలో సృష్ట్యాది స్థానాలలో శ్రుతి ప్రతి పాద్యరూపంగా ప్రత్యక్షంగాను, తత్తదాఖ్యానాల్లో తాత్పర్య వృత్తి చేతను ఉంది.

సర్గం అంటే పరమేశ్వరుడు. త్రిగుణాల యొక్క పరిణామం వల్ల ఆకాశాది పంచమహాభూతాలు, శబ్దాది పంచతన్మాత్రలు, ఏకాదశ ఇంద్రియాలు, మహదహంకారాలను సృష్టించడం. ఈ సర్గం అనే లక్షణం భాగవతంలోని తృతీయ స్కంధంలో ఉంది. పరమేశ్వరుని ఈక్షచే ప్రకృతి గుణాలకు క్షోభ కలిగి బ్రహ్మాండం ఏర్పడింది. ఈ బ్రహ్మాండ సంభవమే సర్గం. ఈ ఉపాఖ్యానంలో త్రిగుణాత్మకం, పాంచభౌతికం, పంచతన్మాత్రయుతం, ఇంద్రియసహితం అయిన నారద జననంలోను, 'విష్ణువే విశ్వం' అని నారదుడు చెప్పిన మాట ప్రకారం నారదుడు బ్రహ్మ మానస పుత్రుడుగా అవతరించడంలోను బ్రహ్మాండం స్ఫురించి సర్గం అనే లక్షణాన్ని స్థాపిస్తుంది.

విసర్గం అంటే చరచరాత్మకమైన బ్రహ్మ సృష్టి. తల్లి మరణానంతరం దాసీపుత్రుడు ఉత్తరాభి ముఖుడై వెళ్ళి, గ్రామాలు, పట్టణాలు, అడవులు, సరస్సులు దాటిపోయాడు అని చెప్పడంలో విసర్గం స్ఫురిస్తుంది. ఈ లక్షణం భాగవతంలోని చతుర్థ స్కంధంలో వర్ణించబడింది.

పంచమ స్కంధంలో స్థానం వర్ణించబడింది. స్థానం అంటే స్థితి. విసర్గ సంభవులైన జీవులు స్వమర్యాదా సంస్థితులై పరమేశ్వరునిచే రక్షింపబడతారన్న విషయం పంచమ స్కంధానికి పరమార్థం. ఈ ఉపాఖ్యానంలో యోగులు చాతుర్మాస్య దీక్ష వహించడం, దాసి వేదవాదుల ఇంటిలో పనులు చేయడం. యోగుల సేవకు నియోగింపబడ్డ దాసీ పుత్రుడు అయిదేండ్ల ప్రాయం మాత్రమే కలవాడై, బాల్య సహజమైన ఆటలు వదలి భక్తితో నుండి యోగుల సేవలు చేయడం స్థానం. ఈ ఉపాఖ్యానంలోని పాత్రలన్నీ స్వమర్యాదా పాలనంలో అప్రమత్తులై ఉన్నారు.

షష్ఠ స్కంధంలో పోషణం వర్ణింపబడింది. పోషణం అంటే భక్తుల రక్షణం. ఆరవ స్కంధంలోని 19 అధ్యాయాల్లో ఇది వర్ణింపబడింది. యోగుల రూపంలో దాసీ పుత్రునికి 'ఈశ్వర రహస్య విజ్ఞానాన్ని' ఉపదేశించడం, తన కోసం పరితపించే అతనికి స్పష్టాస్పష్టంగా కనబడి 'ఈ జన్మలో నన్ను చూడలేవు. మరుజన్మలో నా భక్తుడవై పుడతావు' అని చెప్పడం వల్ల భక్తుని భగవంతుడు రక్షించాడు. ఇదే ఈ ఉపాఖ్యానంలోని పోషణం అనే లక్షణం, యోగులు నారదునికి ఇలా ఉపదేశించారు. 1) విశ్వమే విష్ణువని మొదట ఉపాసించాలి. 2) సృష్టిలోని జీవుల ప్రవర్తనలన్నీ వాసుదేవుని మాయ అని గుర్తుంచుకొని భక్తి భావం

వహించాలి. 3) కర్మాచరణం బంధం కలిగిస్తుంది. దైవానికి తమ కర్మలు సమర్పించేవారు నిరంతరం దైవస్మరణంలో ఉంటారు. 4) భగవదర్పిత కర్మాచరణం బంధం తొలగి ప్రతిరోజు – ఓం నమో వాసుదేవాయ, ఓం నమో ప్రద్యుమ్నాయ, ఓం నమస్సంకర్షణాయ, ఓం నమో అనిరుద్ధాయ– అని ఉచ్చరిస్తూ మంత్రాక్షరాలే దేవుని ఆకారంగా ధ్యానిస్తే చక్కని దర్శనం కలుగుతుందని చెప్పారు. ఇలా యోగుల ద్వారా చెప్పించడం వల్లనూ, తానే స్వయంగా అరిషడ్వర్గాలను జయిస్తే నా దర్శనం కలుగుతుందని చెప్పడం వల్లనూ దాసీపుత్రునికి భగవంతుడు మార్గం చూపించి రక్షించాడు.

సప్తమస్కంధంలో 'ఊతి' లక్షణం నిరూపితమైంది. ఊతి అంటే తత్కర్మానుసారి అయిన వాసన. ఈ వాసన రెండు రకాలు. మహదనుగ్రహం వల్ల శుభవాసన. మహదాగ్రహం వల్ల అశుభవాసన కలుగుతుంది. దైత్య గర్భవాసి అయిన ప్రహ్లాదునికి నారదుని అనుగ్రహం వల్ల విష్ణుభక్తి అనే శుభవాసన కలిగినట్లు ఈ ఉపాఖ్యానంలో వేదవాదుల అనుగ్రహం వల్ల దాసీపుత్రునికి దాస్యభక్తి, యోగుల ఉపదేశం వల్ల విష్ణుభక్తి, వైరాగ్యాలు అనే శుభవాసనలు కలిగాయి.

అష్టమ స్కంధంలో ఇరవైనాలుగు స్కంధంలో ఇరవైనాలుగు అధ్యాయాలలో మన్వంతరవర్ణన చేయబడింది. ఈ ఉపాఖ్యానంలో దాసీపుత్రుడు, యోగులు మొదలైనవారు ఆచరణాత్మకంగా పాటించిన ధర్మాలలో మన్వంతరాధిపతుల ధర్మాలు ధ్వనింపజేయబడ్డాయి.

నవమస్కంధంలో సూర్య సోమాన్వయాఖ్యానంచే ఈశాను కథ వర్ణితమైంది. పరమేశ్వరుని అవతారానుచరితలు, తదనువర్తనులైన మహానుభావుల చరిత్రలు వర్ణించడం ఈశానుకథలు. ప్రథమ స్కంధంలో ఏకవింశత్యవతార వర్ణనం, వ్యాస, శుక, భీష్మాదుల వర్ణనం. భీష్మస్తుతి, కుంతీస్తుతులు ప్రత్యక్షంగా ఈశానుకథలను వర్ణించిన ఘట్టాలు. నారదుని పూర్వజన్మ వృత్తాంతంలో విష్ణ్వంశ సంభూతుడైన నారదుని ధర్మ, కర్మలను చెప్పడం, అతడు విష్ణుభక్తుడు కావడం మొదలైన అంశాలు ఈశానుకథలే.

దశమ స్కంధంలో నిరోధం వర్ణించబడింది. నిరోధం అంటే ప్రళయం, పరమేశ్వరుడు యోగ నిద్రాగతుడు కాగా జీవుడు ఉపాధులతో గూడా లయం పొందడం. ఈ ఉపాఖ్యానంలో ప్రళయమేర్పడి జల మధ్యంలో యోగనిద్ర పోగోరే పరమాత్మలోకి దాసీపుత్రుడు ప్రవేశించడం నిరోధం.

ఏకాదశ స్కంధంలో ముక్తి నిరూపించబడింది. అవిద్య వల్ల ఏర్పడ్డ కర్తృత్వ భోక్తృత్వాది ఇతర రూపాన్ని వదలి స్వరూపమైన బ్రహ్మస్థితి పొందడం ముక్తి. ఈ ఉపాఖ్యానంలో దాసీపుత్రుడు దాస్యభక్తి సాధనతో యోగులచే 'ఈశ్వర రహస్య విజ్ఞానం' పొంది దేహ త్యాగం చేసి పరమాత్మలో లయం కావడం. తర్వాత బ్రహ్మ మానసపుత్రుడై నారదుడుగా భగవన్నామ స్మరణచే నిత్యానందాన్ని పొందడం ముక్తి. ఇక్కడితో సాధనల్నీ సమాప్తమై సాధ్యాన్ని (ముక్తిని) పొందడం జరిగింది.

ద్వాదశ స్కంధంలో ఆశ్రయ స్వరూపం వివరింపబడింది. సృష్టిలయాలు ఎవని వల్ల జరుగు తున్నాయో అతడు ఆశ్రయం. బ్రహ్మ, పరమాత్మ మొదలైన శబ్దాలచే చెప్పబడేవాడు. పరమేశ్వరుడు అధిష్ఠాన రూపం. అధిష్ఠానం మహాపురుష వర్ణనంలో నిరూపితమౌతుంది. 'విశ్వమే విష్ణువు' అన్న నారదుని మాటలలో అధిష్ఠానం నిరూపింపబడింది. పరమేశ్వరుడు అవధిరూపం. అవధి అంటే లయావధి. ఈ ప్రళయం కూడా ఈ ఉపాఖ్యానంలో వర్ణించబడింది.

భాగవతము 'సర్వవేదేతిహాసమని' సంస్కృత భాగవతము కొనియాడింది.[21] అట్లే పోతన కూడా భాగవతాన్ని "సకల పురాణ రాజమని, సకల వేదేతిహాసమెల్లసారమని,[22] పరమార్థ భూతమని, అధిక సుఖదమని [23] వేదకల్పవృక్షం నుండి రాలినది[24] శ్రీమంతమైంది, మునిశ్రేష్ఠకృతమైంది, సద్భక్తితో వినగోరు వారి విమల చిత్తంలో ఈశుని కనుగొనగలిగింది,[25] 'సత్యం పరం ధీమహి' అన్న గాయత్రీ ప్రారంభంలో గాయత్రీ నామ బ్రహ్మరూపాన్ని చెప్పబడిందని కొనియాడాడు.[26] అంతేగాక భాగవతము కోర్కెలు తీర్చు కల్పవృక్షమని [27], సంసార దుఃఖాన్ని పోగొట్టేదని,[28] ముక్తిప్రదాయకమని ప్రశంసించాడు.[29].

"బ్రహ్మసూత్రోపనిషద్భగవద్గీతలనియెడు ప్రస్థాన త్రయముతో బాటు ప్రస్థాన చతుష్టయమున నొకటిగా ప్రశంసింపబడిన భాగవత పురాణ ప్రాశస్త్యము వర్ణనాతీతము".[30] ఈ భాగవత పురాణంలో చతుర్వింశత్యవతారాలు, వివిధ ఇతిహాసాలు, ఉపాఖ్యానాలు వర్ణించబడ్డాయి. అంతేకాక నిత్యశుద్ధ, బుద్ధ ముక్తమైన అద్వితీయ అఖండ బ్రహ్మత్వాన్ని భాగవతం నిరూపించింది.

భాగవతములో ఉన్న ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు మొదలైన భగవద్భక్తుల కథల ద్వారా శ్రద్ధ, భక్తి అనే రెండు ప్రధానమైన అంశాలు కన్పిస్తాయి. ఇవే మానవుని ముందుకు నడిపించగల సాధనోపకరణాలు. శ్రద్ధ ద్వారా పట్టుదల, భక్తి ద్వారా ఆత్మవిశ్వాసం కలుగుతుంది. కాబట్టి ఇలాంటి భాగవతుల కథలు మానవాళికి స్ఫూర్తిదాయకాలు. అందుకే భాగవతము శ్రద్ధను, భక్తిని, ముక్తిని ప్రసాదించే విశిష్టదైవతంగా ప్రశంసించబడింది.



# పాదసూచికలు

1. అం-భాగ-స్కం1-19
2. అం-భాగ-స్కం 1-33

   "యీ పురాణంబు శ్రీభాగవతంబన నొప్పుచుండు"

   "భాగవతపురాణ ఫలరసాస్వాదన..." 1-35

   "భాగవత సకల పురాణ రాజము" 1-71

   "యీ పురాణమెల్ల నెలమి..." 1-71
3. "........ లోకైక విఖ్యాతిన్ వ్యాసుడు మున్ను భాగవతముం గల్పించెc దత్పుత్రుcడే ప్రీతిన్

   రాజునకీ పురాణకథc జెప్పెన్" 1-73
4. ఆంధ్ర భాగవత విమర్శ పుట-2
5. "సర్వవేదార్థ సారాణి పురాణాని" నారదపురాణం 1-1-100
6. పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతమ్

   అనతరంచ వక్త్రే భ్యో వేదాస్తస్య వినిర్గతాః - వా.పు. 1-60
7. అస్యమహతో భూతస్య నిశ్వసిత మేతదృదృగ్వేదో

   యజుర్వేదో స్సామవేదో ధర్వాంగిరస ఇతిహాస పురాణమ్ - వాజసనేయ బ్రాహ్మణోపనిషత్తు
8. శ్రుతి స్మృతి ఉభేనేత్రే పురాణం హృదయం స్మృతమ్

   ఏతత్త్రయుక్త ఏవస్యాద్ధర్మో నాన్యత కుత్రచిత్ - దేవీభాగవతం
9. ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్

   బిభేత్యల్ప శ్రుతాద్వేదో మామయం ప్రతిరిష్యతి - భారతం
10. అమరవాణి నివేదన- పుట-2 శ్రీ మళయాళస్వామి

11. ప్రథమాంధ్ర మహాపురాణము- పుట-2 జి.వి.సుబ్రహ్మణ్యం
12. తెలుగు-వెలుగులు - పుట-78
(సమాజముపురాణ ప్రయోజనము- శ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి
13. హిందూధర్మ పరిచయం-పుట-160 1992 టిటిడి
14. భగవాన్ వేదవ్యాస్, వాల్యూమ్-1, పుట-87, ఇ.వేదవ్యాస్
15. మన పురాణాలు - జి.దామోదరనాయుడు
16. ఆంధ్ర మహాభాగవతం కథా పరమార్థం పుట-1
ప్రథమస్కంధం, డా.బి.జయరాములు
17. ఆంధ్ర భాగవత విమర్శ - పుట-17, డా. ప్రసాదరాయ కులపతి
"తత్ర పద్మ పురాణాంతు ప్రథమంచ ప్రణీతవాన్
తతోన్యాని పురాణాని కృత్వాషోడశతు క్రమాత్
అష్టాదశం భాగవతాం సారమాకృష్య సర్వతః
కృతవాన్ భగవాన్ వ్యాసః శుకమధ్యా పయత్స్వయం"
18. శ్రీకృష్ణభారతి-పుట-11, డా. ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి
19. శ్రీమద్భాగవత పురాణ పరిశీలనము- పుట-19, డి.నాగసిద్ధారెడ్డి
20. తెలుగు-వెలుగులు- పుట-69 (భాగవత తత్త్వము డా. నందూరి రామకృష్ణమాచార్యు)
21. "ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్
ఉత్తమశ్లోకం చరితం చకార భాగవాన్నృషిః
సర్వం వేదేతిహాసానాం సారంసారం సముద్ధృతమ్
సతుసంశ్రావయా మాస మహారాజాం పరీక్షితమ్" - సంస్కృత భాగవతము, 1-40-42
22. ఆంధ్ర-భాగ-స్కం 1-71
23. "పరగనాధ్యాత్మి కాదితాపత్రయంబు
నడచి పరమార్థభూతమై యఖిలసుఖద
మైసమస్తంబు గాక యునయ్యునందు" 1-34

24. "వేదకల్పవృక్ష విగళితమై శుక
ముఖ సుధాద్రవమున మొనసియున్న
భాగవత పురాణ ఫలరసాస్వాదన
పదవిగనుడు రసిక భావ విధులు" 1-35

25. "శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతంబైన
భాగవతంబు సద్భక్తితోడ
వినగోరువారల విమలచిత్తంబుల
జెచ్చర నీశుండు చిక్కుగాక" 1-34

26. "సత్యం పరంధీమహి"యను గాయత్రీ ప్రారంభంబున గాయత్రీనామ బ్రహ్మరూపంబై" 1-1-33

27. లలిత స్కంధము కృష్ణమూలము శుకాపాలాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై
1-20

28. అతి రహస్యమైన హరిజన్మకథనంబు
మనుజుడెవ్వడేని మాపురేపు
జాలభక్తితోడఁ జదివిన సంసార
దుఃఖరాశిఁబాసి తొలగిపోవు 1-64

29. నిగమములు వేయుచదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను
నిగమంబుఁబఠింప ముక్తి నివసనము బుధా 1-139

30. శ్రీకృష్ణభారతి పుట-11

# పదం - కీర్తన - కృతి

పదం, కీర్తన, కృతి అనేవి సంగీత రచనలో ప్రధానమైనవి. ప్రకృతి, కథ భగవత్ గుణలీలలు మొదలైనవి మరియు అనేక వస్తు, విషయ అంశాల వర్ణనాత్మక సాహిత్యానికి రాగ తాళాత్మకమైన సంగీతాన్ని జోడించి ఆలపించడం ద్వారా ఆ సాహిత్య రచన పదం, కీర్తన, కృతి అనే పేర్లతో పిలువబడుతుంది. పూర్వం నారద తుంబురాదులు భగవత్సంకీర్తనలు గానంచేసేవారని పురాణేతిహాసాల ద్వారా తెలుస్తుంది.

**పదం :**

పదం ప్రాచీన జానపదుల (పామరుల) శృంగార పారమార్థిక గేయంగా ఆవిర్భవించిందనడం నిర్వివాదాంశం. ఈ పదం పరిణతిలో కొంత మార్పు చెంది పండితుల శృంగార, ఆధ్యాత్మిక భావం గల కీర్తనగా మారింది, అయితే కీర్తన పరిణతిని కూడా దాటి సంగీత లక్షణాలను కలిగి లాక్షణికుల అంగీకారం పొందగల సంగీత సంప్రదాయ రచనగా కృతి అనే విశిష్ట నామంతో పిలువబడుతుంది. ఇది సంగీత త్రిమూర్తులైన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామాశాస్త్రి గార్ల కాలంనుండి ప్రాచుర్యం పొందింది.

అయితే, పదం, కీర్తన, కృతి ఈ మూడింటిని నిఘంటువులు, లక్షణ గ్రంథాలు, విమర్శకులు నిర్వచించిన విధం గమనించాలి.

**నిఘంటువులు :**

'గురుబాల ప్రబోధిక' అనబడే అమరకోశంలో పదం 'వ్యవస్థిత త్రాణ స్థాన లక్ష్మాంఘ్రి వస్తుషు' అని చెప్పబడింది. అంటే ఉద్యోగానికి, రక్షించడానికి, స్థానానికి, చిహ్నానికి అడుగుకు వస్తువుకు పదమని పేరు. సంగీత శబ్దార్థ చంద్రికలో పదశబ్దానికి ఈ విధంగా వివరణ ఇవ్వబడింది. "నాయికా నాయక లక్షణము గలిగి శృంగార రస ప్రధానమైనట్టి సంగీత రచనలకు పదములని పేరు. ఇందు పల్లవి అనుపల్లవి చరణములను విభాగములు గలిగియుండును. దీనిలోని సంగీతము యొక్క నడక నెమ్మదిగను, ఆకర్షణీయముగను నుండును. సాహిత్యముపొందిటీ ప్రతిభ గలిగి గంభీరమైన వేదాంతార్థము యిమిడి ఉండును".

"లఘుశబ్దార్థ దీపిక"లో పదానికి ఈ క్రింది అర్థాలు ఉన్నాయి. పాదము, పద్యచరణము, చిహ్నము, ధనము కిరణము, చోటు, పూనిక, వాక్యము, పాట, శబ్దము, లక్షణము, కారణము, వేదపద విభాగము, సంరక్షణము, ఇదేవిధంగా తెలుగు నిఘంటువుల్లో కూడా ఈ అర్థాలే కనిపిస్తాయి.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో పదానికి అర్థాలు ఇలా ఉన్నాయి. పాదము, పద్యపాదము, ఇసుకలోకనబడెడు పాదచిహ్నము, శబ్దము, స్థానము, కపటము, కీర్తన, ఉద్యోగము, అంగస్థితి, అంశము, కారణము వేదపరిచ్ఛేదము. సంరక్షణము.

'శబ్దరత్నాకరము'లో పదానికి పై వివరించిన అర్థాలే కాకుండా వాక్యము, ప్రయత్నము, వస్తువు, కిరణము అనే అర్థాలు కన్పిస్తాయి.

'తెలుగు పర్యాయపద నిఘంటువు'లో పదానికి కీర్తనము, గాధగానము, గీతము, గాయము, గీతి, గేయము, పదము, పల్లాండు, ప్రగీతము అనే అర్థాలు ఉన్నాయి.

'ఆంధ్రవాచస్పత్యము'లో కూడా పదానికి అనేక అర్థాలు ఇవ్వబడ్డాయి. పాదము, పాళ్ళ, పద్యపాదము, చరణము, వృత్తము, ఇసుకలోనగు చోట్ల పాదచిహ్నము, లక్షణము, శబ్దము, వాక్యము, పాట, ప్రయత్నము, స్థానము, వ్యాజము, సరకు, వేరు, కిరణము, హాయనము, కత్తెము.

**'Theodoro Benfery Sanskrit**- ఇంగ్లీషు నిఘంటువులో పదం అంటే **= Averse, A kind of reading veda without applying the rules sandhi.**

**V.S.Abtes enlarged edition** నిఘంటువులో **= A fourth part of a stanza.**

వావిళ్ళ నిఘంటువులో పదానికి అర్థాలు ఇలా ఉన్నాయి. పాదము, గుఱుతు, మోసము, సుబంతము, తిఙంతము, బాణము, పదార్థము, వాక్యము, ఉద్యోగము, అడుగుజాడ, పాట అంగుళములు కొలత, పద్యపాదము.

**లక్షణ గ్రంథాలలో పదం :**

భరతముని పదం అంటే ఏమిటో నిర్వచించిన విధం ఈ విధంగా ఉంది.

శ్లో: "గాంధర్వం యన్మయాప్రోక్తం స్వరతాళ పదాత్మకమ్
పదాంతస్య భవేద్వస్తు స్వరతాళాను భావకమ్
యత్కించి దక్షరకృతం తత్సర్వం పదసంజ్ఞితమ్
నిబద్ధాంచానిబద్ధాంచ తత్పదం ద్వివిధం స్మృతమ్
అతాళాంచ సతాళాంచ ద్విప్రకారంచ తద్భవేత్"[1]

భావం : స్వరతాళ పదాత్మకమైంది గాంధర్వమనీ, స్వరతాళానుభావకమైన పదమే వస్తువనీ, అర్థ సహితమైన అక్షరాలతో కూడి ఉండేది పదమనీ, ఈ పదం నిబద్ధం, అనిబద్ధం అని రెండు విధాలనీ, అవి అతాళం, సతాళం అని మరి రెండు విధాలని పై శ్లోకం తాత్పర్యం.

"నియతాక్షర సంబంధము కలిగి, ఛందోయతిసమన్వితమై తాళపాతములలో కూడిన పదము నిబద్ధం అనబడును. యతిపాద నియమము లేనిదియును, అనియతాక్షరమును అగు పదము అనిబద్ధమనబడును."[2]

తాళ్ళపాక అన్నమాచార్యులు సంస్కృతంలో రచించిన 'సంకీర్తన లక్షణము' అలభ్యం. ఈ గ్రంథానికి పెదతిరుమలయ్య రచించిన వ్యాఖ్య కూడా దొరకలేదు. కాని వాటి ఆధారంగా చినతిరుమలయ్య తెలుగులో రచించిన సంకీర్తన లక్షణము లభించింది. దానిలో పదస్వరూపం గూర్చి ఇలా ఉంది.

"పదమగు సుప్తిఙ్గన్తము
పదమవయవ, మవయవియును బదమన బరగున్
దుదినీ తెఱంగు అన్నియుఁ
బదకవితామార్గసార్వభౌముడు దెలిపెన్

పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగాఁబొంక మెఱిగి పలుకగఁజెల్లున్

వైరాగ్య వృత్తితరగం
భీర పద్మశ్రేణి ఫ్రానగంటినుపుచు నగ్రా
మ్యారమ్య విష్ణుచరితో
దారములై యున్నజాలు ధరణిన్వెలయన్

ఇందులో అవయవ పదం చతుష్పాదం, వృత్తధాతు అవయవాలతో పాటించబడుతుంది.

శృంగార పదమని, వైరాగ్య పదమని పదాన్ని రెండు రకాలుగా విభజించారు. ఈ శృంగార పదాలలో గ్రామ్యోక్తులకు స్థానం ఉంది. అయితే వైరాగ్య పదాలు ఉదాత్తంగా ఉంటాయి. వీటిని ఆధ్యాత్మిక పదాలని అంటారు. ఈ పదాలు సంస్కృత ప్రాకృత దేశభాషల్లో చెప్పవచ్చు. వీటికి పద్యాల్లాగా యతిప్రాసలు వర్తిస్తాయని భరతాదుల మతం. అన్నమాచార్య పదసాహిత్యం అంతా యతిప్రాసలతో కూడి ఉంది.

సంగీత కళాప్రదర్శినిలో పద నిర్వచనం ఇలా ఉంది.

"ఇది పల్లవి అనుపల్లవి చరణములను విభాగములు గలిగి పాండితీ ప్రతిభగల యొక్క విధమగు రచనయగును. దీని నడక నెమ్మదిగాను, ఆకర్షణీయముగాను, వుండి వినువారి హృదయ కుహరములందు గాఢమైన నూతన భావములు రేకెత్తించు సాహిత్యము గలదిగా నుండును. మరియు నీ సాహిత్యము గంభీరమైన వేదాంతార్థములతో నిమిడియుండి, శృంగార రస ప్రధానమైన నాయికా నాయక లక్షణములకు సంబంధించి యుండును. అనుపల్లవి, చరణము లందలి సాహిత్యము పల్లవి నందుకొనుటకు తగినట్లుగా యుండును. ఇందు అనుపల్లవిలో గాని, చరణములోగాని నాయక ముద్ర యుండును. చరణములన్నియు ఒకే ధాతుశైలిలో నుండి సాహిత్యమునకును, సంగీతమునకును సరియైన సామరస్యము తుదవరకు పోషింపబడి యుండును. పదములను పాడునపుడు సాహిత్యములోని శబ్దార్థములను చక్కగా నెఱిగి రసానుభావముతో చౌకముగాను, రంజకముగాను గానము చేయుటయే సంప్రదాయమగును."[4]

సంగీత శాస్త్ర సంగ్రహములో పదనిర్వచనం ఇలా ఉంది.

"సంగీత రచనలో మిక్కిలి పాండిత్యం గల రచన. పదమనగా ప్రాచీనకాలమున భక్తి పాటలకు సూచించు రచనగా ఉండినది... కాని ప్రస్తుతము

కొన్ని ప్రత్యేక లక్షణములు కలిగి నాట్య కచ్చేరిలలో ప్రధానాంశముగా ఉండి నాయికా నాయకి భావముతో ఏర్పడిన సాహిత్యము కలిగిన సంగీత రచనను పదము అనుచున్నాము"[5]

## విమర్శకుల దృష్టిలో పదం :

పదస్వరూపాన్ని గురించి సంగీత సాహిత్య నిష్ణాతులు నిర్వహించిన విధం ఈ విధంగా ఉంది. సంగీత సాహిత్యాలలో చక్కని పాండిత్యాన్ని అలవరచుకొన్న వాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు ఇచ్చిన పద నిర్వచనాన్ని యస్.గంగప్ప గారు తన క్షేత్రయ్య పదసాహిత్యం అన్న గ్రంథంలో చెప్పటం జరిగింది. ఆ పద నిర్వచనం ఇలా ఉంది.

"సుప్రసిద్ధమైన దేశీయ రాగములలో సుగ్రహమైన లయ తాళములలో నిబంధించి సులభీకరించిన రచనలే పదములు. ఇవి శృంగారమయమై, ఎక్కువగా విలంబకాలమందు క్వచిత్తుగా మధ్యమ కాలమందు నడచుచు పల్లవాను పల్లవములు మూడింటికి తక్కువగాని చరణములు కలిగి ప్రాచీన రక్తి రాగములలో చేయబడిన గేయ రచనకు పదములని పేరు"[6]

వడ్లమూరి గోపాలకృష్ణయ్య గారు తన సుదీర్ఘ చర్చలో సహేతుకంగా నిరూపించిన పదనిర్వచనం ఇలా ఉంది.

"పదమంటే కేవలము సంకీర్తన, పాట అనేగాక పదపద్యాలకు అది సంకేతమవుతుంది"[7] బాలాంతరపు రజనీకాంతరావు గారు పదనిర్వచనం చేసిన విధం ఇలా ఉంది.

"పదము యొక్క మాతువు శృంగార రసనాయికా నాయక లక్షణ వ్యవహారాదులతో పల్లవి వెంట అనుపల్లవి చరణ మాతువులు విళంబకాలముగా పాడదగినది. అనుపల్లవిలోనూ, మూడవ చరణమందును నాయక ముద్రలు అనగా నాయక నామాంకితము ఉండవలెను. అనుపల్లవిలో నాయక ముద్ర ఐచ్ఛికము. మొదట చరణ ధాతువు ప్రకారమే రెండవ, మూడవ చరణములు కూడా అనుసరించి వుండాలి. కీర్తన శృంగారాత్మకమై పదముగా మారినది"[8]

సుబ్బరాయ దీక్షితులు పదనిర్వచనం చేస్తూ "పదము యొక్క మాతువు శృంగార రస నాయికా, నాయక లక్షణ వ్యవహారాదులతో కూడినది"[9] అని చెప్పారు.

సంగీత విద్వాంసులు ఏకా సుబ్బారావు గారి అభిప్రాయంలో పదనిర్వచనం ఇలా ఉంది. "పదం దేవతా సంబంధముగాను, శృంగార రసముగల్గి నాయికా నాయక లక్షణములకు సంబంధించి యుండును. మఱియు పల్లవి, అనుపల్లవి చరణములు గల్గియుండును."[10]

యస్.గంగప్ప గారి అభిప్రాయంలో పదనిర్వచనం ఇలా ఉంది.

"పదమంటే పాట పాడుకోవడానికి ఉపకరించేది. పద పద్యకవితల్లో విశ్వసాహిత్యంలో పదమే ముందావిర్భవించింది. మానవుడు అతి ప్రాచీన కాలంలో మాట నేర్చిన వెంటనే తనలోని ఆవేశ కావేషాలను, భావోద్రేకార్ద్రతలను, భక్తి ప్రేమలను మొదలైన వాటిని అభివ్యక్తీకరించడానికి పాట నేర్చుకొన్నాడు. మాట, పాట, ఆట అనేవి క్రమంగా మానవుని వ్యక్తిత్వాన్ని పెంచాయి. అయితే ఆ పాటల మౌఖికమే (**Oral**) తరువాతి కాలంలో పాండిత్య ప్రకర్ష పెరిగాక పద్యమై పండితులకు పరిమితమైంది. ఇది లిఖిత (**Written**) సాహిత్యం. మౌఖికమైన జానపద సాహిత్యం అనాది, పునాది. లిఖిత సాహిత్య రీతిననుసరించి అనిబద్ధమైన జానపదమే. తరువాతి కాలంలో నిబద్ధీకరించబడి పదకవిత్వమైంది. ఇది మన తెలుగుకు మాత్రమే పరిమితం కాదు. అన్ని సాహిత్యాలకు వర్తించే లక్షణం"[11]

పై పరిశీలన ద్వారా పదం అనే మాటకు పాదం లేదా అడుగు అని, సాహిత్యరూపమైన పదం పాట అని తెలుస్తుంది. ఈ రెండింటిని అన్వయించుకున్నప్పుడు పదం అంటే పదములు (పాదలు)తో నృత్యం చేస్తూ అభినయించి పాడే పాటలను పదాలని చెప్పవచ్చు. ఇవి శృంగార పరమైనవి కావచ్చు, ఆధ్యాత్మిక పరమైనవి కావచ్చు.

పదం సాహిత్య ప్రధానమైన రచన. అశువుగా వెలువడే సాహిత్యానికి కొంత సంగీతాన్ని జోడించి ఆలపించడం ద్వారా పాటలాగా నోటినుండి వెలువడుతుంది. లయబద్ధంగా అడుగులు వేస్తూ, నృత్యం చేస్తూ, శృతికి ఆధారంగా ఒంటితీగ తంబురమీటుతూ భక్తితో గానం చేసేది పదం. ఇందులో రాగతాళ ప్రాధాన్యం తక్కువ అంటే లయకు సంబంధించి నిబద్ధ అనిబద్ధ అని రెండు రకాలు కలవు. అందులో పదం అనిబద్ధమైన లయకు సంబంధించింది. ఇందులో దైవికమైనవి దైవికం కానివి పదాలుగానే చెప్పబడుతున్నాయి. దైవికం కానివి

జానపదాలు. ఇవి జనజీవితంలో సందర్భానుసారంగా పాడుకొనేవి అని చెప్పవచ్చు.

ఇందులో పల్లవి, అనుపల్లవి చరణాలు ఉంటాయి. చరణాలలో చెప్పిన విషయానికి పల్లవి ప్రధాన వస్తువుగా ఉంటుంది. పదంలో అనుపల్లవికి అంత ప్రాధాన్యత లేదని చెప్పవచ్చు. అంటే పల్లవి, చరణాలు గల పదస్వరూపమే అధికంగా కన్పిస్తుంది.

పదం పల్లవి తర్వాత మూడు లేదా నాలుగు చరణాలను కలిగి వుంటుంది. అయితే కథా రూపమైన పదమైతే ఎన్ని చరణాలైన ఉండవచ్చు. అంటే పదకర్త చెప్పదలచుకొన్న విషయం పూర్తి చేయటానికి అవసరమైనన్ని చరణాలు రచించవచ్చు. ఈ పదం, గేయం, గీతం, పాట అన్న పేర్లతో పిలువబడుతుంది. ఈ పదం అన్న పేరు పాల్కురికి సోమనాథుని కాలంనాటికే వివిధ రకాల పదాలు ప్రాచుర్యంలో ఉన్నట్లు తెలుస్తుంది. అవి తుమ్మెద పదాలని, ప్రభాత పదాలని, పర్వత పదాలని, ఆనంద పదాలని, శంకర పదాలని, వాలేశు పదాలని, గొబ్బి పదాలని, వెన్నెల పదాలని, సంధ్య వర్ణన, గణవర్ణన పదాలని వివిధ నామాలతో చెప్పబడింది.

"పదములు తుమ్మెద పదముల్ ప్రభాత
పదములుఁబర్వత పదములానంద
పదములు శంకర పదముల్ నివాళి
పదములు వాలేశు పదములు గొబ్బి
పదములు వెన్నెల పదములు సంజ
వర్ణనమతిగణవర్ణన పదము" [12]

"లక్షణ భేదాన్ని బట్టి ఈ పదాలు 1.వృత్తపదం, 2.నిబంధ పదం, 3.చూర్ణపదం- అని మూడు తెఱగులుగా విభజించినారు. వృత్తపదాలు షడ్వింశచ్ఛందో భేదాలకు చెందినవి. యతులు, ప్రాసలు, మాత్రలు తాళ సంగతులు కలిగినవే నిబంధ పదాలు. తాళ్ళపాకవారి సంకీర్తనల్లో ఇవే కనిపిస్తున్నాయి.

గేయ గంధులైన కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు, రాగతాళ బంధములైన పెదతిరుమలయ్య వైరాగ్య వచన మాలికలు చూర్ణ పదశాఖకు చెందినవి"[13]

**కీర్తన-నిఘంటువులు :**

'లఘు శబ్దార్థ దీపిక'లో మరియు 'తెలుగు నిఘంటువు'లో కీర్తనకు, పొగడిక, చెప్పుట అన్న అర్థాలు కన్పిస్తున్నాయి.

'శబ్ద రత్నాకరము'లో స్తుతి, పొగడిక అన్న అర్థాలున్నాయి.

'శబ్దార్థచంద్రిక'లో కీర్తన అంటేపాట, చెప్పుట అనే అర్థాలున్నాయి.

తెలుగు పర్యాయ పద నిఘంటువులో కీర్తనము, గాథ, గానము, గాయము, గీతము, గీతి, గేయము, పదము, పల్లాండు, ప్రగీతము అన్న అర్థాలు కన్పిస్తాయి.

వావిళ్ళ వారి నిఘంటువులో యశము, కథనము, పొగడిక, స్తోత్రము అని ఉంది.

ఆంధ్రవాచస్పత్యములో కీర్తి, రాగము, యశస్సు, స్వరము అన్న అర్థాలున్నాయి.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో కీర్తనకు కథనము, చెప్పుట, పొగడిక, స్తుతి, యశస్సు, కీర్తి అన్న అర్థాలు కన్పిస్తున్నాయి.

**కీర్తన-లక్షణ గ్రంథాలు :**

చినతిరుమలాచార్యుని సంకీర్తన లక్షణములో 'మహనీయంబగు సంకీర్తననామక పద సంప్రదాయం బెట్టిదనిన'[14] అని ఉంది. అంటే సంకీర్తనకు పదానికి భేదం లేదని తెలుస్తుంది.

సంగీత కళా ప్రదర్శినిలో కీర్తన గురించి ఇలా ఉంది. "పల్లవి అనుపల్లవి, చరణములను ముఖ్యాంగములు గలిగి యుండు మాధుర్యమైన రచన 'కీర్తన' అని చెప్పబడును. ఇందుగల సాహిత్యము కేవలము భక్తిరస ప్రధానమై యుండును. కృతికి వలె కీర్తనకు కూడా పల్లవి అనుపల్లవి చరణములు సాధారణముగా నుండును. అయితే కొన్ని కీర్తనలలో పల్లవి, చరణములు మాత్రమే యుండటం కద్దు. శ్రీ త్యాగరాజుని దివ్యనామ సంకీర్తనలలో చాలావరకు యీ రకమునకు చెందినవి గానే చెప్పవచ్చును. ప్రాచీనమైన కొన్ని కీర్తనలల చరణము ఒకటిగానే

వుండి, అచరణమునకు 4 లేక 8 లేక 12 ఆవర్తములు కలిగి ధాతు భేదము పొందియుండును. కృతుల కంటేకీర్తనలు చాలా పురాతనమైనవి. ఇవి మొట్టమొదట సంస్కృతములలో మాత్రమే రచింపబడెను. తరువాత కన్నడ భాషలో శ్రీ పురందరదాసు కీర్తనములు (దేవరనామములు) రచించెను. తరువాత అనేకమంది రచయితలు తెలుగు, తమిళ భాషలందు కీర్తనలు రచించియుండిరి."[15]

'సంగీత శాస్త్ర సంగ్రహము'లో కీర్తన గురించి ఈ విధంగా ఉంది.

"భక్తి సంగీతమునకు అనగా వైదిక గానమునకు చెందిన రచన. కీర్తన అనగా స్తుతించుట. నవవిధ భక్తి మార్గములలో కీర్తన శ్రేష్ఠమైనది. సాహిత్య ప్రధాన రచన. అనేక విధములుగా భగవంతుని స్తుతించు భక్తి సాహిత్యములకు ప్రదర్శించుటకు సంగీతము ఒక ఉపకరణముగా వాడబడుచున్నది. సాహిత్య ప్రాధాన్యత కలిగి యుండి సంగీత పాండిత్య ప్రదర్శనకు అవకాశం లేదు. కావున కీర్తనలలో సంగీతము యొక్క స్థాయీ వ్యాపకము కొంచెముగా ఉండును. సంగతులుండవు. రాగము యొక్క ముఖ్యమైన రంజకమైన సంచారములు మాత్రము ప్రదర్శింపబడును. నయ రక్తిరాగములలో కీర్తనలు రచింపబడినవి. సులభమైన తాళములలో మాత్రము ఉండును. సాహిత్యము భక్తి భావముతో వుండును." [16]

శ్రీనివాసయ్యంగారి గానభాస్కరంలో కీర్తన గురించి ఇలా ఉంది.
"......... సర్వేశ్వరుని నామ కీర్తనమును జేయుటకై' యొక్క ధాతుశైలిని యనుసరించి వ్రాయబడి యున్న సాహిత్యముకీర్తనమనబడును".[17]

## విమర్శకులలో కీర్తన :

ఏకా సుబ్బారావు గారి కీర్తన నిర్వచనం ఇలా ఉంది.

"పల్లవి, అనుపల్లవి, చరణములను విభాగములను గలిగియుండు మాధుర్యమయిన సంగీత రచనకు కీర్తనమని పేరు. ఇందుగల సాహిత్యము భక్తిరస ప్రధానమై యుండును."[18]

తాకేపల్లి లక్ష్మీనారాయణశాస్త్రి గారు కీర్తన నిర్వచనాన్ని ఇలా తెలిపారు.

"మానసికముగా భగవద్రూపమును ధ్యానించుచు నుచ్చైస్స్వరమున గానమొనర్చుచు, నృత్య మొనర్చుట త్రికరణోపేత సంకీర్తనము. ఇట్టి సంకీర్తనపరుడు శ్రీకృష్ణునకతిశయ ప్రీతిపాత్రుడు. అతడు త్రిలోకములను పవిత్రమొనర్చును".[19]

శ్రీ మానవల్లి రామకృష్ణకవి కీర్తన నిర్వచనం ఇలా ఉంది.

"సంకీర్తనమనగా రాగతాళములకనుకూలమైన గణయతి ప్రాసాదులచే బద్ధమై, మూడు నాల్గైదెనిమిది చరణములతో .... వేదాంత విషయకమో, శృంగార రస భావబంధురమోయగుచు భగవంతుని లీల విభూతులను ప్రశంసించు గేయరూపమగు వాక్యసముదాయమే".[20]

"The kirtana is strictly speaking, a sacred form. Its sahitya may be of a devotional character, or may relate to a puranic theme. It may also be in praise of great devoties (bhaktas). Many kirtanas are doxologies. The music as well as the rhythem of a kirtana are simple in character. It is a comparision belonging to the realm of applied music".[21]

**కృతి నిఘంటువులు :**

'లఘుశబ్దార్థ చంద్రిక', 'శబ్దార్థ దీపిక' శబ్దరత్నాకరం, ఈ మూడు నిఘంటువుల్లో ఒకే విధంగా కృతికి అర్థాలున్నాయి. ధన్యుడు, పండితుడు, నేర్పరి, కావ్యము, పని, యత్నము, ఇరువది, పీడ, ఒకానొక ఛందస్సు. వావిళ్ల వారి నిఘంటువులో కృతికి ఇలా అర్థాలున్నాయి. చేయుట, పని, ప్రబంధము, గ్రంథము, యత్నము, హింస, ఇరువది, ఒకానొక ఛందస్సు, నేర్పరి, ధన్యుడు, ప్రాజ్ఞుడు, పండితుడు.

సూర్యరాయాంధ్ర నిఘంటువు కృతికి ఇచ్చిన అర్థాలు ఇలా ఉన్నాయి. నెరవేర్చుకొనిన పనిగలవాడు, ధన్యుడు కుశలుడు, నేర్పరి, పండితుడు, చేయుట, క్రియ, పని, ప్రబంధము, గ్రంథము, ప్రయత్నము, హింస, ఇరువదియను సంఖ్య-ఒక్కొక్క పాదమునకు ఇరువది యక్షరములు గల ఒకానొక ఛందస్సు.

ఆంధ్ర వాచస్పత్యములో ఈ క్రింది అర్థాలు ఇవ్వబడ్డాయి. ఇరువది, వాగ్విషయకర్మ ప్రయత్నము, వర్గగణితము, చేయుట, నొప్పించుట, ప్రబంధము, చదువరి, ధన్యుడు, నేర్పరి ఛందస్సు, సంతానములు.

సంగీత శబ్దార్థ చంద్రికలో కృతి నిర్వచనం ఇలా ఉంది. "సంగీత మాధుర్యమును బట్టి చేసిన ప్రధాన భాగములలో ముఖ్యమైన రచనకు కృతియను

పేరు. ఇందు ముఖ్యముగా సంగీతమునకే ఎక్కువ ప్రాముఖ్యము గలిగియుండును. సంగీత త్రిమూర్తులు శ్రీమత్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితు, శ్యామాశాస్త్రులు ఇట్టి రచయితలలో నగ్రగణ్యులుగా విలసిల్లిరి."

**లక్షణ గ్రంథాలు-కృతి :**

సంగీత కళాప్రదర్శినిలో కృతిని సలక్షణంగా వివరించడం జరిగింది. "ఇది సంగీత మాధుర్యము కలిగిన ప్రధానమైన భాగములతో కూడిన ఒక ముఖ్య రచన యగును. ఆధునిక కాలములో గల సంగీత రచనలో విశేష భాగము కృతులని చెప్పుట నిర్వివాదాంశమైన విషయమగును. కొందరు పండితులు కృతి, కీర్తన యివి రెండును సమానమని చెప్పుదురు. కాని సంగీతమునకు విశేష ప్రాముఖ్యమునిచ్చు రచనలనే కృతులని చెప్పుట యెంతయు సమంజసముగా నుండును. ఏలననగా కృతులలోని సంగీతము అనేకమైన సౌందర్యముతోను, కూడియుండును. మరియు సాహిత్యము చాలావరకు తక్కువగా నుండును. కృతికి ముఖ్యముగా 3 అంగములుండును. అవి 1.పల్లవి, 2.అనుపల్లవి, 3.చరణములగను. ఈ చరణములు 1 గాని లేక అంతకంటే యెక్కువగాని వుండును. కొన్నిటిలో ఆ ముఖ్యాంగములు కూడా కొన్ని వుండును."[22]

**విమర్శకులు-కృతి :**

ఏకా సుబ్బారావు గారి కృతి నిర్వచనం ఇలా ఉంది. "భగవత్సంబంధమైన స్తుతి గలిగి, పల్లవి, అనుపల్లవి, చరణములు గలిగియుండును. కృతిలోని సంగీతము, సంగతులతోనూ గమకములతోనూ ఇమిడియుండును."[23]

బాలాంతరపు రజనీకాంతరావు గారి అభిప్రాయంలో కృతి నిర్వచనం ఇలా ఉంది. "కీర్తన ధాతువులో సంగతుల విస్తృతిలో కూడిన ప్రస్తారము తోడయి త్యాగరాజు నాటినుంచి నెరవ కల్పనతో, చిట్టస్వర కల్పనలతో మరింత పటిష్టమయి కీర్తనకు కృతి అనే వ్యవహారము వచ్చినది".[24]

ఆచార్య సాంబమూర్తి గారిచ్చిన కృతి నిర్వచనం ఇలా ఉంది. "In the kriti, the Sahitya may be of a sacred or secular character. It may related to an ethical or didactic theme. Its sahitya may also consist of doxologies.... words are generally few and they serve only as a vehicle to sing the music. The music is

complex and bristles with technical beauties. There may be one or more charanas. The charanas may have the same dhatu or different dhatus.[25]

పై పరిశీలన ద్వారా 'పదం' అనే మాటకు పాదం లేక అడుగు అని, సాహిత్యరూపమైన 'పదం' అయితే పాట అని తెలుస్తుంది. ఈ రెండింటిని అన్వయించుకున్నప్పుడు పదం అంటే పదముల (పాదాలు)తో నృత్యం చేస్తూ అభినయించి పాడే పాటకు పదం అని పేరు స్థిరపడి ఉండవచ్చు. అయితే ఇవి శృంగార పరమైనవి కావచ్చు, ఆధ్యాత్మికపరమైనవి కావచ్చు.

ఇది సాహిత్య ప్రధాన రచన. అతువుగా వెలువడే సాహిత్యానికి కొంత సంగీతాన్ని జోడించడం ద్వారా పాటలాగా నోటినుండి వెలువడుతుంది. లయబద్ధంగా అడుగులు వేస్తూ, నృత్యం చేస్తూ శృతికి ఆధారంగా ఒంటితీగ తంబుర మీటుతూ భక్తితో గానం చేసేది పదం. ఇందులో రాగతాళ ప్రాధాన్యం తక్కువ అంటే లయకు సంబంధించి.నిబద్ధ అనిబద్ధ అని రెండు రకాలు కలవు. అందులో ఇవి అనిబద్ధ మైనవిగా చెప్పవచ్చు. అయితే ఇవి దైవికమైనవి మాత్రమే. దైవికం కానివి జానపదాలు. ఇవి జనజీవితంలో సందర్భానుసారంగా పాడుకొనేవి. ఇవి శృంగార, శ్రామిక కథలు, సంభాషణల రూపంలో కూడా వుంటాయి. ఇందులో పల్లవి, అనుపల్లవి, చరణాలు మాత్రమే ఉంటాయి. చరణాలలో చెప్పిన విషయానికి పల్లవి ప్రధాన వస్తువుగా ఉంటుంది. ఇందులో ఎన్ని చరణాలైనా ఉండవచ్చు. ముఖ్యంగా పల్లవి రెండు పాదాలు, చరణం నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతి చరణం మధ్య పల్లవి వంత పల్కడం (పాడడం) కూడా జరుగుతుంది. అంటే ఇది ప్రధాన గాయకుడు గాక ఇతర వ్యక్తులు సహకార గాయకులుగా పాడడం (కోరస్) జరుగుతుంది.

కీర్తన భక్తి ప్రధానమైన రచనగా కన్పిస్తుంది. కీర్తించేవి కీర్తనలు. అనగా భగవంతుని నామ, రూప, గుణ లీలా విభూతుల్ని కొనియాడడానికి ఉపకరించే సాధనం కీర్తన. ఇవి శృంగార, ఆధ్యాత్మిక పరమైనవి. అయితే కీర్తన అనేది పద పరిణతిలో మార్పుచెంది కీర్తనగా మారింది. సాహిత్యం సంగీతం సమపాళ్ళలో ఉంటుంది. ఇందులో లయ ప్రాధాన్యంతో పాటు రాగ తాళ ప్రాధాన్యం కూడా ఉంది. అన్నమయ్యవి కీర్తన లక్షణానికి దగ్గరి సంబంధం గల్గిఉన్నాయి.

భాగవతంలో ప్రహ్లాదుని ద్వారా వ్యాసుడు ప్రతిపాదించిన నవవిధ భక్తి మార్గాలలో కీర్తన భక్తి ఒకటి. భగవంతుని కీర్తిని గానం చేయడమే దీని లక్ష్యం. లక్షణం కూడా. బహుశా ఈ నేపథ్యంలోనే భగవంతుని కీర్తిని గానం చేసే గేయానికి కీర్తన అన్న పేరు స్థిరపడి ఉంటుంది.

కీర్తన అంటే స్తుతిపూర్వకమైన స్తోత్రం. అంటే భగవంతుని కీర్తిని స్తుతించే స్తోత్రం లేదా గీతం లేదా గేయం. పై పేర్లతో పిలువబడేదే కీర్తన అని కూడా చెప్పవచ్చు.

ఇందులో పల్లవి, అనుపల్లవి, చరణాలు అన్న విభాగాలు ఉంటాయి. అయితే కీర్తనలో అనుపల్లవి చాలా అరుదుగా రావడం జరుగుతుంది. ఇందులో చరణాలు రెండు, మూడు లేదా నాలుగు చరణాలు కూడా ఉంటాయి. కీర్తనలు ప్రధానంగా భగవంతుని కీర్తించేవి కావున అవి సత్కీర్తనలుగా చెప్పబడి, సంకీర్తనలుగా రూపుదిద్దుకున్నవని తెలుస్తుంది.

కృతి అంటే గొప్పది, శ్రేష్ఠమైంది, విశిష్టమైంది అన్న అర్థాలు ఉన్నాయి. సాహిత్యపరంగా కృతి అంటే కావ్యమని చెప్పబడుతుంది. అంటే అకృతి, ఆకారం స్వరూపం, ప్రకృతి మూలపురుషుడు, లీలా విషయాలను వర్ణించే సాహిత్యం కృతి అనబడుతుంది.

కృతి అనేది పద, కీర్తన రూప లక్షణాలు దాటి సంగీత సాంప్రదాయంతో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. పూర్వం కృతి అంటే సాహిత్యపరమైన కావ్యాలకే కృతి అని పేరు. అయితే 18, 19 శతాబ్దాలలోని సంగీత త్రిమూర్తులుగా ప్రసిద్ధి పొందిన త్యాగరాజు, శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు 'పాట' అంటే కృతి అన్న నామాంతరాన్ని కల్పించి సంగీతానికి అధిక ప్రాధాన్యం కల్పించి, ఆ పద్ధతిలోనే రచనలు చేశారు. అంటే మాతు (సాహిత్యం) ప్రాధాన్యం తక్కువ ఉండి ధాతు (సంగీతం) ప్రాధాన్యం అధికంగా ఉండి అనేక సంగతులకు, సంచారాలకు అవకాశముండే రచనలు కృతి అని చెప్పబడుతుంది. ఇవి నిబద్ధ రచనలు. అనగా రాగ, తాళ ప్రాధాన్యం కల్పించబడింది. పల్లవి, అనుపల్లవి, చరణం ఖచ్చితంగా ఉండాలి. పల్లవి తర్వాత అనుపల్లవి పాడి చరణం పాడాలి. పదం, కీర్తనలో అయితే పల్లవి తర్వాత అనుపల్లవి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అయితే కృతిలో అనుపల్లవి ఖచ్చితంగా ఉండడం గమనించవచ్చు.

పదం, కీర్తనలో పల్లవి రెండు పాదాలు ఉంటాయి. కృతిలో పల్లవి, ఒక పాదం అనుపల్లవి రెండు పాదాలు చరణం నాలుగు పాదాలు ఉంటాయి. ఎక్కువ కృతులలో అనుపల్లవి లాగా చరణంలోని మూడునాలుగూ పాదాలు పాడడం జరుగుతుంది.

కృతి పాడే సంప్రదాయంలో మనోధర్మానికి అవకాశం ఉంటుంది. అనగా రాగాలాపన, తానం, నెరవు స్వరకల్పన మొదలైన అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి సంగీతకారుడు, వాగ్గేయకారుడు లేదా కృతికారుడు తన కృతి ద్వారా సంగీత పాండిత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తాడు.

కృతి అన్నది పదం, కీర్తన లక్షణాలకన్నా కొన్ని ప్రత్యేక లక్షణాలు గలదని తెలుస్తుంది. అంటే కృతి దాని స్వరూప స్వభావంలోనే కాకుండా, దానిని ఆలపించే తీరు కూడా వేరుగా ఉంటుందని తెలుస్తుంది. అయితే సంగీత త్రిమూర్తుల కాలం నుంచి ఇది ప్రత్యేకమైన రచనగా కన్పించినా అంతకుముందు పదం, కీర్తన, కృతి అనేవి సమానార్థకాలుగానే ఉన్నాయి. మరియు సమాన ఆకృతి కలిగినవని కూడా తెలుస్తుంది. తాళ్ళపాక కవుల దృష్టిలో ఈ మూడు వేరుకాదు.[26, 27] అయితే అన్నమయ్య వాఙ్మయానికి పరిష్కర్తలైన గౌరుపెద్ది రామసుబ్బశర్మ గారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు మొదలైనవారు అన్నమయ్య పద వాఙ్మయాన్ని సంకీర్తనలుగానే గుర్తించారు. కారణం సంగీతపరమైన అన్నమయ్య సాహిత్యాన్ని చిన్నన్న (చినతిరువేంగళ నాథుడు) సంకీర్తనలుగానే చెప్పాడు. స్వరప్రక్రియ ద్వారా సంగీతాన్ని అభ్యసించే విధానాన్ని పురందరదాసు, అన్నమయ్య తర్వాతి తాళ్లపాక కవులు ప్రవేశపెట్టారు. అందుకే పురందరదాసు కర్ణాటక సంగీత పితామహుడైనాడు. అప్పటినుండి సంగీత ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. 18వ శతాబ్దం నుండి పదం, కీర్తన, కృతి అనేవి వేటికవి ప్రత్యేకమైన రచనలుగా చెప్పబడుతున్నాయి. క్షేత్రయ్య రచనలు పదాలుగా, అన్నమయ్య, పురందరదాసు, రామదాసు మొదలైనవారి రచనలు కీర్తనలుగా, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు కృతులుగా పిలువబడుతున్నాయి. సంగీత రచనలో ఈ పదం, కీర్తన, కృతి అనేవే గాక సంగీత అభ్యాస [illegible] కోసం గీతం, జతిస్వరం, స్వరజతి, తానవర్ణం, పదవర్ణం [illegible] గల [illegible] వచ్చాయి. అంతేకాక జావళి, తిల్లానా అనేవి [illegible] రచనలుగా [illegible]న్నాయి. అయితే జతిస్వరం, పదవర్ణం, జావళి, తిల్లానా అనేవి ఎక్కువగా నాట్యాభినయాలకు పాడదగినవి.

అన్నమయ్య సంకీర్తనల్లో పల్లవి, మూడు చరణాలు కలిగినవి ఎక్కువగా కనిపిస్తాయి. అయితే పల్లవి మూడు చరణాలే కాక మరికొన్ని చరణాలు కలిగినవి కూడా ఇతని సంకీర్తనల్లో కనిపిస్తాయి. బహుశా అన్నమయ్య తాను చెప్పదలచుకున్న విషయం పూర్తికాకపోవడం వల్ల మూడు చరణాలకంటే ఎక్కువ చరణాలు రచించే అవసరం వచ్చి వుండవచ్చు. క్రింది కీర్తనలో ఐదు చరణాలుండడం గమనించవచ్చు.

"ఘోర విదారణ నారసింహా నీ
వీ రూపముతో ఎట్లుండితివో
ఉడికెడి కోపపుటూర్పుల కొండలు
పొడపొడియై నభమునకెగయ
బెడిదపు రవమున పిడుగులు దొరుగగ
ఎడనెడ నీవపుడెట్లుండితివో

కాలానలములు గక్కుచు నయన
జ్వాలల నిప్పులు చల్లుచును

కేలికవై నీవెట్లుండితివో

గుటగుటరవములు కుత్తిక గులుకుచు
గిటగిట పండ్లు గీటుచును
తట తట పెదవులు దవడలు వణకగ
ఇటువలె నీవపుడెట్లుండితివో

గోళ్ళ మెరుగుల కొంకుల పెదపెద
వేళ్ళ దిక్కులు వెదకుచును
నీళ్ళ తీగెలు నిగుడగ నో ర మ
చిళ్ళు గమ్మగ నెట్లుండితివో

హిరణ్యకశిపుని ఏపడచి భయం
కరరూపముతో కడుమెరసి
తిరువేంకటగిరి దేవుడ నీవిక
ఇరవుకొన్ననా డెట్లుండితివో" 1-68
క్రింది సంకీర్తనలో ఏడు చరణాలు కలిగిన లాలిపాట కనిపిస్తుంది.

"లా లనుచు నూచేరు లలన లిరుగడల
బాల గండవర గోపాల నిను చాల

ఉదటుగుబ్బల సరములుయ్యాల లూగ
పదరి కంకణరవము బహుగతుల మ్రోగ
వొదిగి చెంపల కొప్పులొక్కింత వీగ
ముదురు చెమటల నళికములు తొప్పదోగ

సొలపు తెలికన్నుగవచూపు లిరువంక
మలయురవళులకుంపలుమారును బెళంక
కొలది కోవిలగములు క్రోలు మదనాంక
ముల గ్రేణిసేయు రవములు వడి దలంక
సరసపదములు జంగచాపుచే పాయ
గురులీల మీగాళ్ల గుచ్చెళ్లు రాయ
కరమూలముల కాంతి కడుజాయ చేయ
సరస నురు కుసుమవాసన లెదురుడాయ

కొలది నునుమేను లతకూన లసియాడ
మెలకువతో నొకరొకరి మెచ్చి సరిగూడ
తలలూచి చొక్కి చిత్తములొమ్ము లాడ
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ

లలిత తాంబూల రసకలితంబు లైన
తళుకుదంతములు కెంపుల గుంపులీన
మొలక వెన్నెలదాలు ముసురుకొని తోన
చెల(గి సెలవుల ముద్దుచిఱునవ్వులాన

మలయమారుత గతులు మాటికి చెలంగ
పలుకు కపురపుతావి పైపై మెలంగ
ఖలుగానలహరి యింపుల రాల్గరంగ
బలసి వినువారి చెవి బడలిక దొలంగ

లలనాజనాపాంగ లలిత సుమచాప
జలజలోచనదేవ సద్గుణకలాప
తలపు లోపల మెలగు తత్వప్రదీప
భళిర గండవరేశ పరమాత్మరూప (అన్నమాచార్య చరిత్ర పీఠిక)

క్రింది కీర్తనలో ఒక పాదం కలిగిన పల్లవి, రెండు పాదాలు కలిగిన చరణాలు చూడవచ్చు.

"వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని

ఆమటి మ్రొక్కులవాడే ఆదిదేవుడేవాడు
తోమని పళ్యాలవాడే దురితదూరుడే

వడ్డికాసులవాడే వనజనాభుడే పుట్టు
గొడ్రాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే

ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడేవాడు
అలమేల్మంగా వేంకటాద్రినాధుడే" (అన్నమాచార్య చరిత్ర పీఠిక)

క్రింది కీర్తనలలో రెండుపాదాలు కలిగిన పల్లవితో పాటు రెండు పాదాలు గల చరణాలు కూడా కన్పిస్తాయి.

"ఆది దేవ పరమాత్మా
వేద వేదాంత వేద్య నమో నమో

పరాత్పరా భక్త భవభంజన చరా
చరలోకజనక నమో నమో

గదాధరా శ్రీ వేంకటగిరి నిలయ
సదానంద ప్రసన్న నమోనమో" (1-289)

"సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందను గనియె

శశి వొడచె అలసంబుల గడచె
దిశ దేవతల దిగుళ్లు విడచె

కావిరి విరసె కంసుడు గినిసె
వావిరి పువ్వుల వానలు గురిసె

గతి సేసె అటు గాడిద గూసె
కుతిలకుడిచి జనకుడు నోరు మూసె

గగురు పొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియగ యమునపై నడచె

కలిజారె వేంకటపతి మీరె
అలమేల్మంగ నాంచారమ్మ కలుకలుతీరె" (5-361)

క్రింది కీర్తనలో కన్పించే మూడుపాదాలు గల పల్లవి, మూడుపాదాలు గల చరణాలు కూడా అన్నమయ్య సంకీర్తన సృష్టిలో భాగమే. ఇందులో అనేక చరణాలు ఉండడం గమనించవచ్చు.

"మేడలెక్కి నిన్ను జూచి కూడేననే యాసతోడ
వాడుదేరి వుస్సురందురా వెంకటేశ
యాడనుంటి విందా కానురా

పిక్కటిల్లు చన్నులపై చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా వెంకటేశ
లక్కవలె ముద్రలంటెరా

దప్పిగొంటివని నీకు కప్పుర ముపారమిచ్చి
ముప్పిరి నీ విరహానను వెంకటేశ
నిప్పునుచు భ్రమసితిరా

నిండపూచిన మానిపై గండుకోవిల కూయగా
నిండిన నీ యెలుగంటాను వెంకటేశ
అండకు నిన్ను రమ్మంటిరా
వుదయచందురు జూచి అదె నీ పంజని సవి
యెదురుకొనె వచ్చితిరా వెంకటేశ
బెదరి మారుమోమైతిరా

మిన్నక కేళాకూళిలో వున్న తమ్మివిరులు నీ
కన్నులంటా జేరఁగాబోను వేంకటేశ
పన్ని మరునమ్ములాయరా

అనిన తుమ్మిదలు నీమేని కాంతిబోలునని
పూని చేతబట్టఁబోగాను వేంకటేశ
సూనాస్త్రుని వేగులాయరా

కందువమై చెమరించి గందవొడి చల్లుకొని
పొందనిన్ను దలచితిరా వెంకటేశ
అంది చొక్కమందు లాయరా

బొండుమల్లె పానుపుపై నుండి నిన్ను పాడిపాడి
నిండు జాగరము లుంటిరా వెంకటేశ
యెండలాయ వెన్నెలలురా

నిద్దిరించి నీవు నాకు వొద్దనుండ కలగంటి
చద్దివేడి వలపాయరావెంకటేశ
సుద్దులింకా నేమి సేసేవో

మల్లెపూవు కొనదాకి ఝల్లనను పులకించి
వుల్లము నీకొప్పించితిరా వెంకటేశ
కల్లగాదు  మమ్మ్మ(గావరా

జోడుగూడి నీవు నేను నాడుకొన్న మాటలెల్లా
గోడలేని చిత్తరువులై వెంకటేశ
యాడా నామతి బాయవురా
అద్దము నీడలు చూచి ముద్దుమోవి కంటుండగా
కొద్దిలేని కాకతోడను వెంకటేశ
పొద్దువోక తమకింతురా

పావురమురెక్కంజీటి నీటివొద్దికి గట్టియంపి
దేవరకే మొక్కుకొందురా వేంకటేశ
నీవిందు రావలెనంటాను

బంగారుపీటపై నుండి ముంగిటికి నీవు రాగా
తొంగి చూచి నిలుచుండగా వెంకటేశ
యెంగిలి మోవేలడిగేవు

దంతపుబావాలు మెట్టి పంతాన నేను రాగాను
యింతలో బలిమిబట్టేవు వెంకటేశ
దిట్టవు నీ యంతవారమా

కొప్పువట్టి తీసి నీవు చెప్పరాని సేతసేసి
తప్పక నేజూచినంతలో వెంకటేశ
చిప్పిలేల చెమరించేవు

బొమ్మల జంకించి నిన్ను తమ్మిపూవున వేసితే
తమ్మియేల తిట్టుఁదిట్టేవు వెంకటేశ
నిమ్మపంట వేతునటరా

నెత్తమాడేనంటా రతి పొత్తుల పందేలువేసి
వొత్తినీ వే వోడే వేలరా వేంకటేశా
కొత్తలైన జాణవౌదువు

వున్నతి శ్రీ వెంకటేశ మన్నించి కూడితివిదే
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు వెంకటేశ
కన్నుల పండువలాయరా

చిలుకలు మనలోన కలసినయట్టివేళ
పలుకు రతిరహస్యాలు వెంకటేశ
తలచి నే తలవూతురా

నీకు వలచిన వలపు లాకలొత్తె నామతిని
నాకున నే చెప్పఁజాలరా వెంకటేశ
లోకమెల్లా నెరిగినదే

పాయము నీకొక్కనికే చాయగా మీదెత్తితిని
యీయెడఁగైవాలకుండను వెంకటేశ
మా యింటనే పాయకుండరా

ముమ్మాటికి నీబాసలే నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ వెంకటేశ
చిమ్ము చీకటెల్ల పాయను" (7-223)

క్రింది కీర్తనలో నాలుగు పదాలు గల పల్లవి, నాలుగు పాదాలు గల అరు రణాలు కనిపిస్తాయి.

"అలర చంచలమైన ఆత్మలందుండ నీ
అలవాటు సేసె నీ వుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపె నీ వుయ్యాల

ఉదయాస్తశైలంబు లొనరకంబములైన
వుడుమండలము మోచె ఉయ్యాల
అదన ఆకాశపదము అడ్డదూలంబైన
అఖిలంబు నిండె నీ వుయ్యాల

పదిలముగ వేదములు బంగారు చేరులై
పట్టవెరపై తోచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల
వర్ణింపనరుదాయె వుయ్యాల

మేలుకట్లయి మీకు మేఘ మండలమెల్ల
మెరుగునకు మెరుగాయె నుయ్యాల

నీలశైలము వంటి నీ మేనికాంతికి
నిజమైన తొడవాయె వుయ్యాల

పాలిండ్లు కదలగా పయ్యదలు రాపాడ
భామినులు వడినూచు నుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరగునో యని భీతి
నొయ్యనొయ్యన నూచిరుయ్యాల

కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ము
కౌగిలింపగజేసె నుయ్యాల
అమరాంగనలకు నీ హావ భావ విలాస
మందంద చూపె నీ వుయ్యాల

కమలాసనాదులకు కన్నులకు పండుగై
గణుతింప నరుదాయె వుయ్యాల
కమనీయ మూర్తి వేంకటశైలపతి నీకు
కడువేడుకై యుండె నుయ్యాల" (1-67)

క్రింది కీర్తనలో పల్లవి, రెండే చరణాలు ఉండడం గమనించవచ్చు.

"శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ

కమలాసతీముఖకమల కమలహిత
కమలప్రియ కమలేక్షణ
కమలాసనహిత గరుడగమన శ్రీ
కమలనాభ నీ పదకమలమే శరణు

పరమయోగిజన భాగధేయ శ్రీ
పరమపురుష పరాత్పరా
పరమాత్మా పరమాణురూప శ్రీ
తిరువేంకటగిరి దేవా శరణు" (1-155)

ఈ విధంగా వివిధ రకాల స్వరూపాలుగా అన్నమయ్య సంకీర్తనలను గుర్తించాక కీర్తన ప్రాశస్త్యాన్ని గుర్తించాలి.

**కీర్తన ప్రాశస్త్యం :**

"సంకీర్త్య మానః శీఘ్రమే వావిర్భవతి
అనుభావ యతి చ భక్తాన్" (నారదసూత్రం 80)

ఈశ్వరుడు కీర్తనీయుడు, స్తవనీయుడు. అతడు సంకీర్తనకు సంతోషించి సాక్షాత్కరిస్తాడు. భక్తులకు భవ్యమైన దివ్యానుభవం ప్రసాదిస్తాడు.

కీర్తన ప్రసక్తి ప్రశంస సంస్కృత భారత భాగవతాలలో కన్పిస్తుంది.[28] "హరినామ స్తుతిజేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ సురుచిభ్రాజితమైన మానస సరస్ఫూర్తిన్ వెలుగొందు" అన్న పోతన గారి సూక్తికి అనుగుణంగా శ్రీ వేంకటేశ్వరుని కేంద్రంగా ఎంచుకొని కలియుగంలో కీర్తన ఫలం[29] తెలుసుకున్నవాడై సంకీర్తన తన జీవిత పరమావధిగా ఎంచుకొని 32 వేల సంకీర్తనలను వెలయించాడు అన్నమయ్య.. సంకీర్తన ప్రాశస్త్యాన్ని ఈ విధంగా కొనియాడాడు.

ఏవం శ్రుతిమత మిదమేవ త
ద్భావయతు మతఃపరం నాస్తి

అతులజన్మ భోగాసక్తానాం
హిత వైభవ సుఖమిదమేవ
సతతం శ్రీహరి సంకీర్తనం త
ద్వ్యతి రిక్తసుఖం వక్తుంనాస్తి

బహుళ మరణ పరిభవ చిత్తా నా
మిహపరసాధనమిదమేవ
అహిశయన మనోహర సేవా త
ద్విహరణం వినా విధిరపినాస్తి

సంసార దురిత జాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర
శంసైవా పశ్చాదిహనాస్తి (1-4)

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం

సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతము దలచుడే సంకీర్తనం

సామజము గాచినది సంకీర్తనం
సామమున కెక్కుదీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం

జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యము లిచ్చు సంకీర్తనం
శమదమాదుల జేయు సంకీర్తనం

జలజాసనుని నోరి సంకీర్తనం
చలిగొండ సుత దలచు సంకీర్తనం
చలువ కడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలచుడీ సంకీర్తనం

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం

సరుస వేంకట విభుని సంకీర్తనం
సరుగ నను దలచుడీ సంకీర్తనం (1-343)

ఇహపర సాధన మిదియొకటె
సహజపు మురారి సంకీర్తనొకటే (4-16)

చాలదా హరి సంకీర్తనం గల
మేలది దీనినే మొరసిరి ఘనులు

తలప వేదశాస్త్రములు గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరి మంత్రమే దగబేర్కొని
అలవిమీర గడు నధికములైర

యితర దైవముల నెఱగనేరక
ప్రతిలేని మహిమ(బార్వతి
మతి దలపుచు హరిమ్మంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె

చదువులు పలుమరు జదువనోపక
అదివో నారదాదులు
పదిలపై వేంకటపతి హరినామమే
వదలకిదియె జీవనమైమనిరి 1-205

చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు
చాలదా హితవైన చవులెల్లనొసగ

తగు వేంకటేశు కీర్తన మొకటిచాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ 1-52

అన్నమయ్య అనేక సంకీర్తనల ద్వారా కీర్తన ప్రాశస్త్యాన్ని కొనియాడాడు. అంతేకాక తన సంకీర్తన వాఙ్మయం మంత్రాలని[30], పరమౌషధమని[31], పంచమ వేదమని[32] "కామధేనువిదె కల్పవృక్షమిదె ప్రామాణ్యముగల ప్రపన్నులకు"[33] అని అనేక విధాల ప్రశంసించాడు. అందుకే అతని కీర్తనలు అజరామరాలైనాయి. హరిభక్తి గలవారికి ఆజన్మాంతం ఆనందడోలికల్లో ముంచి ముముక్షువులను చేస్తున్నాయి. శ్రీ వేంకటేశ్వరుని నామ కీర్తనలైన ఈ సంకీర్తనల గొప్పదనాన్ని లోకానికి చాటిచెప్పాలనే దృక్పథంతో తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్నమాచార్య ప్రాజెక్టు అన్న ఆధ్యాత్మిక సంస్థను 1978లో స్థాపించి, కీర్తనల ప్రచార నిమిత్తం ఉత్తమ సంగీత కళాకారులను ప్రోత్సహించి పోషిస్తున్నారు.

# పాదసూచికలు

1. భరతముని నాట్యశాస్త్రము, అధ్యాయం-32, శ్లోకం-25-47
2. నాట్యశాస్త్రము, పుట-809, 32 అధ్యాయం, పి.యస్.ఆర్.అప్పారావు, 1959
3. చిన తిరుమలాచార్య సంకీర్తన లక్షణము- 24, 56, 59 పద్యాలు
4. సంగీత కళాప్రదర్శిని- పుట-101, 102, అరిపిరాల సత్యనారాయణమూర్తి
5. సంగీత శాస్త్ర సంగ్రహము, పుట-196,197, పి.కె.ఇంద్రాణి
6. అన్నమాచార్యుని కవిత- రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ (యస్.గంగప్ప "క్షేత్రయ్య పదసాహిత్యం" పుట 86 నుండి తీసుకోబడినది)
7. వడ్లమూరి గోపాలకృష్ణయ్య శృంగార పదములు- పుట-iii
8. ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర, పుట-175, బాలాంత్రపు రజనీకాంతరావు
9. సుబ్బరాయ దీక్షితులు- పుట-109
10. క్రొత్త సంగీత విద్యాదర్పణము- పుట-549- ఏకా సుబ్బారావు
11. సాహిత్యానుశీలన-పుట-33-ఎస్.గంగప్ప
12. పండితారాధ్యచరిత్ర-వాద ప్రకరణము-పుట-513
13. అన్నమయ్య సంకీర్తనల సంపుటం-27, పీఠికపుట-ix
14. చిన తిరుమలాచార్య సంకీర్తన లక్షణము- పుట-140
15. సంగీత కళాప్రదర్శిని- పుట-110, అరిపిరాల సత్యనారాయణమూర్తి
16. సంగీత శాస్త్ర సంగ్రహము- పుట-85, 86- పి.కె.ఇంద్రాణి
17. గానభాస్కరము-శ్రీనివాసయ్యంగారు
18. క్రొత్త సంగీత విద్యాదర్పణము- పుట-549, ఏకా సుబ్బారావు
19. ఆంధ్ర మహాభాగవతము- భక్తితత్త్వోన్మీలనము, పుట-328
20. తాళ్లపాక కవుల సంకీర్తనలు- శ్రీ మానవల్లి రామకృష్ణ కవి
21. **SOUTH INDIAN MUSIC - Page 135, Book-3,** పి.సాంబమూర్తి
22. సంగీత కళాప్రదర్శిని, పుట-107, 108
23. క్రొత్త సంగీత విద్యాదర్పణము- పుట-549

24. ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర- పుట-75, 77
25. **SOUTH INDIAN MUSIC - Page 136,** పి.సాంబమూర్తి
26. చిన తిరుమలాచార్య సంకీర్తన లక్షణము-15 పద్యం
"కీర్తన నామక పద సంప్రదాయంబెట్టిదనిన"
27. అన్నమాచార్య జీవిత చరిత్ర- పుటలు 45, 46
"యోగమార్గంబున నొక కొన్ని బుధులు
రాగిల్ల శృంగార రస రీతిఁగొన్ని
వైరాగ్య రచనతో వాసింపఁగొన్ని
సారసనేత్రునిపై సంకీర్తనలు"
28. నామ సంకీర్తనం యస్య
సర్వపాప ప్రణాశనమ్ సంస్కృత భాగవతము-12-13-23
ఏతావతా ల మఘనిర్వరణాయ పుంసాం
యత్కీర్తనం భగవతో గుణకర్మనామ్నామ్ (సంస్కృత భాగవతము-6-3-24)
28,29. కృతేయద్ ధ్యాయతో విష్ణుః

ద్వాపరే పరిచర్యాయాం
కలౌతు తద్ధరి కీర్తనాత్"
మహాభారతము-శాంతిపర్వము, పుట-52
30. అన్ని మంత్రములిందె ఆవహించెను (4-438)
31. అన్నిటికిది పరమౌషధము (4-358)
32. కలియుగంబునకు గలదిదయె-
వెలసిన పంచమవేదమె కలిగె. (4-2-60)
పంచమవేదపు పద్మాక్షునామము
అంచెపాపహర మౌషధము (3-564)
33. కామధేనువిదె కల్పవృక్షమిదె
ప్రామాణ్యముగల ప్రపన్నులకు (2-488)

# పోతన, అన్నమయ్యల భక్తితత్త్వం

## భక్తి–నిర్వచనం :

పూర్వులు మానవులకు మోక్షప్రాప్తి సాధనాలుగా జ్ఞాన, కర్మ, భక్తిమార్గాలను నిర్దేశించారు. జ్ఞాన, కర్మ మార్గాలు మహాయోగులైన కొందరికి మాత్రమే సాధ్యం. అయితే పండిత, పామర, స్త్రీ, పురుష, వృద్ధ, బాలుర మొదలైన అన్ని వర్గాలవారికి అనుసరణ యోగ్యమైనది భక్తిమార్గం ఒక్కటే. అందుకే భక్తిమార్గానికి ఎక్కువ ప్రాధాన్యం వుంది. అలాంటి భక్తి ప్రాశస్త్యాన్ని పోతన, అన్నమయ్యలు కొనియాడిన విధం గమనించదగింది. అయితే, దీనికంటే ముందు నిఘంటువులు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణేతిహాసాలు, సూత్ర వాఙ్మయాలు, శతకాలు, ఇతరులు భక్తిని నిర్వచించిన విధం దర్శనీయాంశం.

## నిర్వచనం– నిఘంటువులు :

భక్తిః– స్త్రీ (భజ్యత+ఇతి)
భజ+క్తిన్– విభాగః– సేవా ఇతి మేదిని
గౌణ భక్తిః– భంగో అనురాగ విశేషః– పూజ్యేష్వనురాగో
భక్తి రిత్యుపదేశః– ఈశ్వరే పరానురక్తిః
"అథాతో భక్తి జిజ్ఞాసా సాపరాను రక్తిరీశ్వరే"
ఇతి శాండిల్య సూత్రం ఉపాసనా
"పరమేశ్వర విషయే పరమప్రేమా"
"ఉపాశ్యా కారాకారిత చిత్తవృత్త్యా వృత్తి రూపా పరిపక్వనిధి
ధ్యాస నాఖ్యా శ్రవణ మననాఖ్యాస ఫలభూతానురక్తిః"
"నహోస్య దేవాత్ పరమస్తికించిత్"
ఇతి బుద్ధి పూర్వకచిత్తవృత్తిః
సాచపరమ ప్రీత్యదినా
ఇది శబ్దకల్పద్రుమ, మేదినీ కోశాల్లోని భక్తి శబ్ద నిర్వచనం.

'భజ' ధాతువుపై 'క్తిన్' ప్రత్యయం చేరితే 'భక్తి' శబ్దం నిష్పన్నమయింది. భజ ధాతువుకు సేవ అని మేదినీకోశం చెప్పినా, ఆ ధాతువుకు అనురాగం, అర్చన, ప్రేమ అనే అర్థాలు కూడా వున్నాయి. పై అర్థాలే కాక ఉపాసన అనే విశేష అర్థం కూడా భజ ధాతువుకు వుంది.

పూజ్యులపై అనురాగం, భక్తి,[1] ఈశ్వరే పరానురక్తిః[2] అన్న ప్రమాణంతో 'పరమమైన అనురక్తి భక్తి' అని సారం. పరమేశ్వర విషయంలో వున్న పరమ ప్రేమభక్తి ఉపాసకుడి అవృత్తిరూపమైన పరిపక్వమైన నిధి, ధ్యాస, శ్రవణ, మనన, అభ్యాస ఫలభూతమైన చిత్తవృత్తి భక్తియని తాత్పర్యం. ఈ చిత్తవృత్తి పరమ ప్రీతికి అధీనం. పై పరిశీలన వల్ల భక్తి శబ్దానికి సేవ, భజన, అర్చన, అనురాగ విశేషం పరానురక్తి, ఉపాసన అనే అర్థాలు వున్నాయని తెలుస్తుంది.

"భజన మంతః కరణస్య భగవదాకారత రూపం భక్తిః" అని భక్తి శబ్దానికి భావ "వ్యుత్పత్తి"ని చెబితే నిరుపమ సుఖ "సంవిద్రూపం" అనే ఫలితం భక్తియోగంలో ప్రధానమవుతుంది. అలాకాక "భజతే సేవ్యతే భగవదాకార మంతః కరణం క్రియతే నయా" అని కరణ వ్యుత్పత్తిని చెబితే శ్రవణం, కీర్తనం మొదలైన సాధనాలు భక్తికి అర్థాలవుతాయి. ప్రేమాసక్తులతో కూడిన నిరంతర సేవాస్మరణలే భక్తియని చెప్పవచ్చు. పరిపక్వమైన నిధి, ధ్యాస, శ్రవణ, మననాభ్యాస, ఫలభూతమైన అనురక్తి విశిష్టమైన ఉపాసకుడి యొక్క అవృత్తి రూపమైన చిత్తవృత్తే భక్తియని సారాంశం.

శ్రీ సూర్యారాయాంధ్ర నిఘంటువులో భక్తికి విడదీయుట, విభాగించుట, భాగము, దైవభక్తి, తత్పరత, సేవ, ఆరాధన, రచన, పునవృత్తి, సంబంధించుట, చెందుట అని అర్థాలున్నాయి.

ఆంధ్రవాచస్పత్యం నిఘంటువులో భక్తికి బత్తి, కొలువు, సేవ, బత్తి అయముతో కూడిన స్నేహము, లక్ష్మివిరాళి, పాలు, భాగము, బత్తెము, కూలి, సంబళము, బాకీ, విలువ, శేషము అని అర్థాలున్నాయి.

త్రిభాషా నిఘంటువులో (ఆంధ్ర,తమిళ, కన్నడ) భక్తియంటే గౌరవముతో కూడిన స్నేహము, భాగము, సేవ, నమ్మకము, శ్రద్ధ అనే అర్థాలున్నాయి.

తెలుగునుడికడలి నిఘంటువులో భక్తికి వికృతి రూపమైన బత్తికి ప్రీతి, శ్రద్ధ అనే అర్థాలున్నాయి.

శబ్దరత్నాకరము నిఘంటువులో భక్తికి సేవ, ఇది అష్టవిధ భాగవత వాత్సల్యము, భగవత్పూజ యందు మోదము, భగవత్ కథా శ్రవణేచ్ఛ, స్వరనేత్రాంగ వికారము, సదా భగవదనుస్మరణము, అమాంస భక్షణము, భయంతో కూడిన స్నేహము, భాగము అనే అర్థాలున్నాయి.

## నిర్వచనం- వేదాలు :

వైదిక వాఙ్మయంలో శరణాగతి, ప్రపత్తి అనేవి పర్యాయపదాలుగా వాడబడ్డాయి. ఇదే భక్తి. ప్రపత్తితో భక్తి సమాప్తి అవుతుంది.[3] ప్రపత్తి న్యాస విద్యగా అరణ్యకాల్లో ప్రతిపాదించబడింది.[4] అదే వేదాల్లో ఆత్మసమర్పణ విద్యగా

"దేవా! మేము నీవారము. మేము నీపై ఆధారపడి యున్నాము" (వయంధాతేత్వే ఇద్ ఇంద్ర విప్రా అపిష్మసి ఋగ్వే 8-66-13) అనీ, "నీవు మావాడవు, మేము నీవారము" అనీ వేదరుక్కులు భక్తిని పరోక్షంగా నిర్వచించాయి.[5]

'ఓ పురుషోత్తమా! సుకృత జనులకే ప్రవేశార్హత గల స్వర్గాదిలోకాలపై త్రిపాద్విభూతి పొందేదానికి స్త్రీ, పుత్ర, సోదర, ధన, జన సహితంగా పూజ్యుడవు, అగ్రగతి ప్రధాతవు అయిన నిన్నే మేము శరణు పొందుతున్నాము"[6] అని యజుర్వేదంలో శరణాగతి రూపంలో భక్తి నిర్వచించబడింది.

పై నిర్వచనం వల్ల భక్తి శబ్దానికి ఆత్మసమర్పణ బుద్ధి అని, అదే శరణాగతి అని తెలుస్తుంది.

## నిర్వచనం- ఉపనిషత్తులు:

"ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెబుతున్నది. అనగా 'మోక్షకాంక్ష గల నేను శరణుజొచ్చుచున్నాను' అని భక్తి శరణాగతి రూపంగా చెప్పబడింది.

"యాప్రీతి రస్తివిషయేష్వ వివేక భాజాం
సైవాచ్యుతే భవతి భక్తి పదాభిధేయా
భక్తిస్తు కామ ఇవ తత్కమనీయరూపే
తస్మాన్ము నేరజని కాముక వాక్యభంగీ"

అని ద్రవిడోపనిషత్తు సారసంగ్రహం. అనగా ఇంద్రియ సుఖాల్ని పొందడానికి ఎటువంటి ఆతురత చూపిస్తారో దాన్నే భగవద్విషయంలో చూపిస్తే అదే భక్తి అని ప్రమాణం.

"భక్తిరస్యభజనం యేతదిహాము త్రోపాధి నైరాశ్యే నాముష్మిక మనః కల్పం"[7] అని గోపాల పూర్వతాపిన్యుపనిషత్తు చెపుతున్నది. అనగా భక్తియంటే భగవంతుని సేవ అని, ఇహ పరసుఖాల్ని ఆక్షేపింపక భగవంతునిలో మనస్సును లీనంచేసేదిగా ఆ సేవ వుండాలని తెలుస్తుంది.

శరణాగతి, ఆతురత (ఇష్టత), సేవ మొదలైనవి భక్తి శబ్దానికి అర్థాలుగా ఉపనిషత్తుల్లో చెప్పబడినట్టు తెలుస్తుంది.

## నిర్వచనం- పురాణేతిహాసాలు :

"నిరంతరత్వంతో అతి గాఢంగా వున్న పరమేశ్వర విషయకమైన ప్రీతి భక్తి" అని విషయ సుఖాల్లో అవివేకులకు గాఢతరమైన ప్రేమ వుంటుందని ఆ ప్రీతిని ఈశ్వరపరం చేయడమే భక్తి అని విష్ణుపురాణం.[8]

భగవంతునిపై భక్తి కలిగి వుండడమే మానవుని పరమ ధర్మంగా భాగవతం ప్రకటించింది.[9]

భగవంతుని యందు గాఢతమమైన మమకారాన్ని కలిగివుండడమే భక్తి అని నారదాది పాంచ రాత్రాగమాలు చెప్పాయి. ఇది భీష్మ, ప్రహ్లాద, ఉద్ధవ, నారదాదుల అభిప్రాయమని అందులోనే చెప్పబడింది.[10]

పంచమవేదమైన వ్యాసభారతంలోని భక్తి విషయాన్ని మధ్వాచార్యులు భగవంతుడి మాహాత్మ్య జ్ఞానంతో సుదృఢమైన సర్వాధికమైన స్నేహబుద్ధి భక్తియని, దానివల్ల మాత్రమే ముక్తియని అంటే జ్ఞానపూర్వకమైన, నిత్యమైన పరస్నేహమే భక్తియని వివరించారు.[11]

## నిర్వచనం - భగవద్గీత :

పూర్ణమైన శ్రద్ధతో మనస్సు భగవంతునికి అర్పించి ఉపాసించడమే భక్తి యని చెప్పబడింది.[12] మనో బుద్ధులను భగవదర్పణ చేసి భగవంతునిలో నివసించడమే భక్తి అనబడుతుంది.[13] ఇది స్థిరమైన విశ్వాసంతోకూడి వుంటుంది. భగవంతునిలో లీనమైన మనస్సుగల వ్యక్తి గుణధర్మాలు, భగవంతునివై వుంటాయి.

## నిర్వచనం- సూత్ర వాఙ్మయం:

భగవంతునిపై గల శ్రేష్ఠమైన ప్రేమ భక్తియని నారద మహర్షి నిర్వచించారు.[14] భక్తి ప్రేమ స్వరూపంగా చెప్పబడింది.

భగవంతుని కథలయందు ఆసక్తి చూపడమే భక్తియని గర్గ మహర్షి అభిమతంగా చెప్పబడింది.[15]

ఆత్మరతికి అవిరోధమైన విషయాలపై గల అనురాగమే భక్తియని శాండిల్య మహర్షి మతంగా చెప్పబడింది.[16]

అనురాగంతో భగవంతుని పూజించడమే భక్తియని వ్యాసమహర్షి మతం.[17]

"ఆత్మనిష్ఠ భక్తి" అని శంకరులు సూత్రభాష్యంలో ప్రవచించారు.[18]

ఒక పాత్ర నుండి మరోక పాత్రలోనికి యెడతెగని ధారగా పోయబడ్డ తైలంలాగా నిరంతరం భగవంతుని ధ్యానిస్తూ స్మరించడం భక్తియని శ్రీభాష్యం.[19]

## నిర్వచనం-శతకాలు :

భగవంతునిపై సేవాసక్తి కలిగివుండడమే భక్తి. ప్రేమకు మారుపేరు భక్తియని తెలుస్తుంది. దీనికి ఉదాహరణగా ధూర్జటి, వేమనలు చెప్పిన ఈ క్రింది పద్యాలను గమనించవచ్చు.

> 'ఏవేదంబు పఠించె లూత? భుజగంబే శాస్త్రముల్ చూసె తా
> నేవిద్యాభ్యసనం బొనర్చె కరి? చెంచేమంత్రమూహించె? బో
> ధావిర్భావ విహాదముల్ చదువులయ్యా! కాన నీ పాదసం
> సేవాసక్తియెకాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!"

ఆసక్తితో సేవించడం ద్వారా మూగజీవులు సైతం మోక్షం పొందాయని ధూర్జటి తన శ్రీకాళహస్తీశ్వర శతకంలో చెప్పాడు.

"భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు" ప్రేమతో పెట్టేది కొంచెమైనా చాలన్నది వేమన మతంలో భక్తి ప్రేమరూపంగా చెప్పబడింది.

## నిర్వచనం - భక్తులు :

ప్రేమ లేక ప్రపత్తి ద్వారా భగవదైక్యాన్ని పొందడంభక్తి అని రామకృష్ణ పరమహంస మతము. శ్రద్ధాపూర్వకంగా చిత్తశుద్ధితో చేసిన దైవపూజ భక్తియని వారే అన్నారు.[20]

ప్రేమతో ప్రారంభించి ప్రేమతో అభివృద్ధిగాంచి ప్రేమతో సమాప్తి పొందే పరమేశ్వరాన్వేషణమే భక్తి అని వివేకానందుడు చెప్పారు. వారి గురువులిచ్చిన పై [illegible]పనానికి వ్యాఖ్యాన ప్రాయంగా భక్తిని నిర్వచించడం ద్వారా అది విశిష్టతను [illegible]తరించుకుంది.[21] మానవ చిత్తవృత్తులకు ప్రత్యక్ష సంబంధం గలది భక్తియోగం అని శివానందసరస్వతి తన నారద భక్తి సూత్ర వివరణంలో నిర్వచించారు.[22]

భక్తి శబ్దానికి భజ్ ధాతువు అనీ, క్తిన్ ప్రత్యయం అనీ, దీనికి సేవ, ఉపాసన, పూజ్యులపై అనురాగం, ఈశ్వరునిపై పరమప్రేమ, అర్చన అనే అర్థాలున్నాయని, పామరులకు ఐహికమైన గాఢానురక్తి పరమేశ్వర పరమైతే అదే భక్తియని నిఘంటువుల్లోని నిర్వచనం భక్తి వేదోపనిషత్తుల్లో శరణాగతి రూపంగాను, పురాణేతిహాసాల్లో ప్రీతి, నిత్యమైన పరస్నేహంగాను, భగవద్గీతలో ఉపాసనగాను, సూత్రవాఙ్మయంలో ప్రేమ, ఆసక్తి, అనురాగం గాను వుంది. ఇదే రామకృష్ణ పరమహంస, వివేకానందులు మొదలైనవారి అభిప్రాయంగా తెలుస్తుంది.

నిస్వార్థంతో, నిష్కామంతో భగవదధీనుడై భగవత్సేవను నిర్విషయ ప్రేమతో చేయడం అనగా లౌకికమైన ఫలితాన్ని కాంక్షింపక భగవంతునిపై శ్రద్ధాసక్తులతో కూడిన నమ్మకం కలిగివుండడం. తనకు ప్రీతిపాత్రమైన వాటన్నిటిని సర్వార్పణం చేయడం, అదే అతి పవిత్రమైన త్యాగం, అదే భక్తియని చెప్పవచ్చు.

## భక్తితత్త్వం :

భగవంతుడిపై వున్న ప్రేమకు మూడు ప్రత్యేక లక్షణాలున్నాయి. ఇందులో అహంకారానికి చోటులేదు. భగవత్ప్రేమ ఏకాంతికం. భగవంతుణ్ణి ప్రేమించడం తప్ప భక్తుడికి ఇతర సంగతి తెలియదు. ఈ ప్రేమలో ఒక పారవశ్యం కలుగుతుంది. భక్తుడు ఆత్మారాముడై వుంటాడు.

ప్రేమ స్వరూపం అయిన భక్తితత్వం నిగూఢమైంది. ప్రేమరూపంగానేకాక, ద్వేషపూరితంగానైనా భగవన్నామాన్ని స్మరిస్తే అది కూడా భక్తిలో ఒక భాగమేనని చెప్పవచ్చు. భగవంతుడి [illegible] లాంటివి [illegible], భక్తి కన్నా ద్వేషాదుల్లో [illegible] చెప్పవచ్చు. [illegible]

"యథా వైరానుబంధేన మత్యస్తన్మయతామయాత్
నతథాభక్తి యోగేన ఇతిమే నిశ్చితామతిః"

భక్తితత్త్వం ప్రేమపూర్వకంగానే కాక, ద్వేషం, సఖ్యం,భయం, బంధం, విరహం మొదలైన ఎన్నో భావాల్లో ఇమిడివుంది. అందువల్లనే భక్తి చాలా విశాలమైన లక్షణాన్ని కలిగివుంది. ఏ జన్మ ఎత్తినా, జాతి, కుల, మత, లింగభేదాలు గాని, పశుపక్షి కీటకాది భేదాలుగాని, లేక నిరంతరం ఆ పరమేశ్వరుణ్ణి హృదయంలో నిలిపి ధ్యానిస్తే భగవంతుడి అనుగ్రహంతో ఆ ప్రాణికి మోక్షం ప్రాప్తిస్తుంది అనేది ప్రధానమైన భక్తితత్త్వం. దీన్నే వేదశాస్త్ర పురాణాలు ప్రవచించాయి.

అందుకే ఆదిశంకరులు ఈ విషయాన్నే మధుర కవితారూపంలో శివస్తుతి వ్యాజంతో ప్రవచించారు.

శ్లో॥ నరత్వం దేవత్వం నగవన మృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననం,
సదాత్వత్పాదాబ్జ స్మరణ పరమానందలహరీ
విహారాసక్తం చేద్హృదయ మిహకింతేన వపుషా
(శివానందలహరి 10వ శ్లోకం)

భక్తికి పూజక భావం బీజం. పూజ్య పదార్థ సంబంధాలైన విశేషాలు మొదట్లో పూజకుడి మనస్సును ఆకర్షిస్తాయి. పూజకుడు పూజ్య పదార్థంలోని విశేషాల్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నమే సాధన. ఇది మొదటి దశలో పూజించేవాడిని, పూజించబడే పదార్థానికి భేదభావం ఎక్కువగా వుంటుంది. క్రమంగా ఆ భేదభావం రూపుమాసి, అధీనస్థితి ఏర్పడుతుంది. కనుక జీవబ్రహ్మలయొక్క భేదభావంతోనే మొదట భక్తి పొడసూపుతుంది. తరువాత పరమేశ్వరుడు సకల కళ్యాణ గుణుడు అని నమ్మి ఆ గుణ సంపదను పొందాలనే తీవ్రమైన అభిలాష, మొదట పొటమరించిన భక్తిని ప్రోది చేసుకొని ధ్యేయాకారతత్వాన్ని పొంది దాని అంశను జీవుడికి పొందించి, చివరకు జీవబ్రహ్మల ఐక్యాన్ని కలిగిస్తుంది. ఇదే భక్తితత్త్వం. దీని భావమే క్రింది శ్లోకం.

"దేహబుద్ధ్యాతు దాసోహం జీవబుద్ధ్యాదంశకః
ఆత్మ బుద్ధ్యాత్వమే వాహమితిమే నిశ్చితామతిః"

## భక్తి మార్గం:

మానవుని నిత్యజీవితంలో దుఃఖ నివృత్తికి, సుఖప్రాప్తికి దైవ సందర్శనం పరమసాధనంగా వుంది. వ్యక్తావ్యక్తాలకు, కర్మజ్ఞాన మార్గాలకు, సగుణ నిర్గుణోపాసాలకు మానవ హృదయంలో భక్తిమార్గం సంధి బంధనంగా వుంది. రుద్రేంద్ర వరుణాగ్ని దేవతార్చనలతో ప్రారంభమైన వైదికమతం 'సర్వంఖలిద్వం బ్రహ్మ' అనే తత్త్వ పరిజ్ఞాన పరిణామం పొందింది. ఈ పరిణామాలు ద్వైతాద్వైతాల్లోను, శైవవైష్ణవాల్లోను, నిర్గుణ సగుణోపాసాల్లోను, కర్మభక్తి జ్ఞాన యోగాల్లోను నిగమాగమ పురాణాల్లోను కనిపిస్తుంది.

జైన బౌద్ధమతాలు సంసారం దుఃఖ సాగరమని, సన్యాసం సుఖసాధనమని ఉపదేశించాయి. అద్వైతం సంసారం మాయాకల్పితమని ఉపదేశించింది. పండితులు, బ్రాహ్మణులు కర్మలతోను, సిద్ధాంతాలతోను, సన్యాసాశ్రమంతోను కాలయాపన చేస్తుంటే ప్రజలు అజ్ఞానాంధకారులై దుఃఖవేదన అనుభవించేవారు. వైరాగ్యం, నిర్లిప్తత్వం, నిర్లక్ష్యం, నిస్పృహ, నిస్సహాయత్వం పరిపాటై భారతీయ చైతన్యం నిర్వీర్యమైంది.

## భక్తి-భేదాలు :

భక్తుల బట్టి భక్తి భేదాలు అవతరించాయి. భక్తుని అనుభవం, అనుభూతిని బట్టి భక్తి ఇలా వుంటుంది అని చెప్పిన పండితుల అభిప్రాయంలో సగుణ, నిర్గుణ భక్తితత్త్వం అని రెండురకాలు. సగుణారాధన అంటే విగ్రహారాధన చేయడం. నిర్గుణారాధాన అంటే భగవంతుడు విశ్వవ్యాపకుడు అని విశ్వసించడం. వీటినే బాహ్య, మానసిక పూజలని సాకార, నిరాకార ఆరాధనలని అంటారు. "ఇందుగల దందులేడను సందేహమువలదు చక్రి సర్వోపగతుండు" అన్న ప్రహ్లాదుని మాటల్లో నిర్గుణ భక్తి వెల్లడవుతుంది. మానవుల గుణ స్వభావాలను బట్టి భక్తి మూడురకాలు. దీనిని గౌణిభక్తి అంటారు అని నారదసూత్రం.[23] అవి సాత్త్విక, రాజసిక, తామసిక భక్తి భేదాలు.[24] వీటినే భాగవతం కూడా ప్రకటించింది.[25]

పాపకర్మలను పోగొట్టేవాడు భగవంతుడని తెలుసుకుని, భక్తితో తన బుద్ధిని భగవంతునికి అర్పించి తానుచేసే ప్రతిపని జనులకు మేలు చేసేదిగానే వుండాలని అనుకునే భక్తుని యొక్క తత్త్వమే సాత్త్విక భక్తి. ఫలితాన్ని ఆశించి ఐశ్వర్య, కీర్తులను కాంక్షించి పూజరూపుడైన భగవంతుని అర్థించి భజించు అర్చనరూప

భక్తి రాజసభక్తి. హింస, దంబ, మాత్సర్య గుణాలతో ఇతరులకు కీడు తలపెట్టే ప్రయత్నంలో భక్తి తామసభక్తి అని తెలుస్తుంది.

స్థూల దృష్టితో కాయిక, వాచిక, మానసిక భేదాలు చెప్పబడ్డాయి. పూజాదికం చేయడం పారశర్యుడి మతం. ఇది కాయిక భక్తి. అలాగే భగవత్కథాదుల్ని వినడం గర్గుడి మతమని నారదుడు చెప్పాడు. జప, కీర్తన, పురాణపఠన, వ్యాఖ్యాన, హరికథా శ్రవణం మొదలైనవి ఇందులోకి వస్తాయి. ఆత్మరతిలో విరోధం లేక దేహం గాని, వాక్కుగాని వుండడం మానసిక భక్తి అని నారదుడు చెప్పాడు. భగవద్భక్తి సాధనావస్థలో అపరభక్తి లేక గౌణ భక్తి అనీ, సిద్ధావస్థలో పరాభక్తి అని పిలువబడుతుంది.

భక్తి అనేది పరమార్థ దృష్టికి ఏకరూపమే అయినా అది వ్యవహారంలో 11 రూపాల్ని దాల్చు తోంది. అవి భగవత్కళ్యాణ గుణాభివర్ణనం. భగవద్దివ్య మంగళ విగ్రహానురాగం, భవగత్పూజ, భగవత్సేవ, భగవంతుని పట్ల ప్రదర్శించే సఖ్యభావ ప్రేమ, భగవంతుని పుత్రునిగా భావించుట, భగవంతుని భర్తగా భావించుట, భగవంతునికి సర్వం సమర్పించుట, భగవన్మయుడై వుండుట, భగవంతుని వీడి వుండలేక పోవుట, ఈ 11 రూపాలే శ్లోక రూపంలో క్రింది విధంగా వుంది.

శ్లో॥ "గుణమాహాత్మ్యా సక్తి, రూపాసక్తి, పూజాసక్తి,
స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి,
కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయాసక్తి,
పరమవిరహాసక్తి, రూపా ఏకదా అపి ఏకదశాభవతి".

గుణమాహాత్మ్యాసక్తి భక్తికి నారదుడు, వ్యాసుడు, రూపాసక్తి భక్తికి బృందావన స్త్రీలు, పూజాసక్తి భక్తికి అంబరీషుడు, స్మరణాసక్తి భక్తికి ప్రహ్లాదుడు, దాస్యాసక్తి భక్తికి హనుమంతుడు, సఖ్యాసక్తి భక్తికి ఉద్ధవార్జునులు, వాత్సల్యాసక్తి భక్తికి దేవకీ కౌసల్యలు, కాంతాసక్తి భక్తికి రుక్మిణీ సత్యభామలు, ఆత్మనివేదనాసక్తి భక్తికి బలి, విభీషణులు, తన్మయాసక్తి భక్తికి సనత్కుమార యాజ్ఞవల్క్యులు, పరమ విరహాసక్తి భక్తికి గోపికా స్త్రీలు ప్రాతినిధ్యం వహిస్తారు. వీటినే మధుర, భయ, వైర ప్రేమ భక్తి భేదాలని అవి మోక్షానికి కారణాలవుతున్నాయని భాగవతం ప్రకటించింది.[26] భక్తి అనేక రకాలని అన్నమయ్య భావించినట్లు తెలుస్తుంది.[27]

భగవంతుని భజించేవారు నాలుగుతెగల పుణ్యాత్ములని, భగవంతుడే స్వయంగా చెప్పిన విషయాన్ని క్రింది భగవద్గీతలోని శ్లోకంలో గమనించవచ్చు.

శ్లో॥ "చతుర్విధా భజంతే మాం జనాస్సు కృతినోఽర్జున
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ"[28]

ఆర్తులు : బాధల నుండి విముక్తిని ప్రసాదించమని కోరేవారు.

జిజ్ఞాసువులు : జ్ఞానాసక్తి కలవారు, వీరే ముముక్షువులగు సాధకులు.

అర్థార్థులు : ప్రాపంచిక సంబంధమగు ఐశ్వర్యం. అధికారం, కీర్తి వాంఛించేవారు

జ్ఞానులు : సాధనం ముగిసి అపరోక్ష అనుభూతి గల జీవన్ముక్తులు.

"పరమేశ్వర ప్రీతికై చేసే నిష్కామసేవ, భగవదారాధన సర్వశ్రేష్ఠం. అన్ని భక్తి పద్ధతులు, పరమభక్తిని చేర్చేవే. అన్నీ ఉత్తమ మార్గాలే"[29]

పై భక్తి భేదాలు పోతన, అన్నమయ్యలలో శృంగార ఆధ్యాత్మికంగా కనిపిస్తాయి. వీటినే మధురభక్తి, నవవిధ భక్తిమార్గాలని చెప్పవచ్చు. అయితే వీరు ప్రతిపాదించిన మధురభక్తి నవవిధ భక్తిమార్గాలు పరిశీలించవలసి వుంది.

## మధురభక్తి:

"మధురభక్తి అంటే సాకారబ్రహ్మాన్ని పరబ్రహ్మంగా భావించుకొని తనను ప్రేయసిగా భావించుకొని పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందడం".[30]

"సృష్టిలో భగవంతుడొక్కడే పురుషుడు. మిగిలినవారంతా స్త్రీలు. గోపికలందరూ కూడా శ్రీకృష్ణుని నాయకునిగా భావించి భక్తిభావంతో సేవించారు. పరమాత్ముని దివ్య, శృంగార లీలలను కీర్తించడం భక్తులకు మధురం కావడం వల్ల కూడా ఈ భక్తికి విస్తృత ప్రచారం కల్గింది. తన్ను నాయికగా భావించుకొని స్వామి విరహానికి తపించడం కూడా మధురభక్తిలో భాగమే".[31]

అంటే జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడానికి చేసే ప్రయత్నంలో పరబ్రహ్మను నాయకునిగా భావించి తాను నాయికగా మారడం మధురభక్తి.

ఈ భక్తి నిరంతరమైంది, శాశ్వతమైంది, అలౌకికమైంది. ఇందులో నాయిక నాయకుని ఎడబాటు సహించలేకపోవడం. సర్వస్వం అర్పించడం, అతను లేని జీవితం వ్యర్థమనుకోవడం. నాయిక లక్షణాలు. అలాంటి మధురభక్తి పోతన గోపికల ద్వారా ప్రకటించాడు. ఇక అన్నమయ్య శృంగార కీర్తనలన్నీ మధురభక్తిని ప్రకటించేవేనని చెప్పవచ్చు.

శరద్రాత్రి యందు శ్రీకృష్ణుడు తన మురళీగానంతో గోపికలను తన్మయులను చేసి ఒక్క క్షణం కనిపించక పోగా క్షణకాలమైనా విరహాన్ని సహించలేని గోపిక అన్వేషణ చేస్తూ శ్రీకృష్ణుని జాడ చెప్పమని అతని రూపు రేఖలను చెపుతూ మల్లియలకు మొరపెట్టుకోవడం జరుగుతుంది.

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు, నవ్వు రా
జిల్లెడు మోమువాడొకడు, చెల్వల మానధనంబుదెచ్చెనో
మల్లియలార! మీ పొదలమాటున లేడు గదమ్మా చెప్పరే"[32]

అదే గోపిక అన్నమయ్య క్రింది సంకీర్తనలో కనిపిస్తుంది.
'వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుందునంట

చెందమ్మి కన్నులవాడు చేతిపిల్లగోవి వాడు
ఇందువచ్చి కంటిరా యేలరే అమ్మ
మందల పశువుల వాడు మకరాంకముల వాడు
యెందునున్నాడో చెప్పరే యేలదాచేరమ్మ (వలచి)

నెమలి పింఛమువాడు నీలి మేఘకాంతివాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మ
జమళి చేతులవాడు సంకుచక్రములవాడు
అమరనీపాల జిక్కునట చూపరమ్మ[33] (వలచి)

గోపికా వస్త్రాపహరణ ఘట్టంలో గోపికలు తమ చీరలిమ్మని శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ "........నీచెంతన్ దాసులమై చరించెదము మా చేలంబులిప్పింపవే"[34] అని ప్రార్థిస్తూ

> "వచ్చెదము నీవు పిల్చిన
> నిచ్చెదమేమైనా గాని యెటుచొరుమనినం
> జొచ్చెదము నేడు వస్త్రము
> లిచ్చెదముం గరుణతోడ నేలుము కృష్ణా"[35]

ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తామని, ఏమి ఇవ్వమంటే అది ఇస్తామని, ఎక్కడికి పొమ్మంటే అక్కడికి పోతామని, అనడంలో గోపికలు తమ సర్వస్వం సమర్పించడానికైనా సిద్ధంగా వున్నామని తెలియజేయడంలో మధురభక్తి ప్రకటించబడింది.

కాంతాసక్తి కూడా మధురభక్తిలో భాగమే. రుక్మిణి శ్రీకృష్ణుడు లేని జీవితం వ్యర్థమనుకుంటుంది. పోతన గారి రుక్మిణిని ఇందుకు ఉదాహరణగా గ్రహించవచ్చు.

> సీ. "ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
> కర్ణరంధ్రంబుల కలిమియేల?
> పురుషరత్నమ! నీవు భోగింపగా లేని
> తనులతవలని సౌందర్యమేల?
> భువనమోహన! నిన్ను బొడగానగాలేని
> చక్షురింద్రియముల సత్త్వమేల?
> దయిత! నీ యధరామృతం బానగాలేని
> జిహ్వకు ఫలరస సిద్ధియేల?
> ఆ.వె. నీరజాతనయన! నీ వనమాలికా
> గంధమబ్బలేని ఘ్రాణమేల?
> ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని
> జన్మమేల? ఎన్ని జన్మలకును"[36]

పై పద్యం నిజమైన మధురభక్తి తత్త్వానికి మచ్చుతునక. "ప్రాణేశ" అన్న పద ప్రయోగంలోనే మధుర భక్తితత్త్వం బోధపడుతుంది. అంతేకాక

శ్రీకృష్ణుని తియ్యని పల్కులు (కథలు) వినడానికే చెవులు ఉన్నాయి. అతని కోసమే ఈ శరీర సౌందర్యం ఉంది. అతని భువనమోహన రూపాన్ని దర్శించడానికే కళ్ళు ఉన్నాయి. అతని అధరామృతాన్ని ఆస్వాదించని నాలుకకు ఫలరస సిద్ధిలేదు అతనికి దాస్యం చేయని జన్మ వ్యర్థం అని అనడంలో మధురభక్తి ప్రకటించబడింది.

నాయిక నాయకుని ఎడబాటు భరించలేని తత్త్వమే మధురభక్తి అనడానికి శ్రీ వేంకటేశ్వరుడు నాయకుడు కాగా అన్నమయ్య నాయికయై చరించిన విధం

"తమ్ములాల, అన్నలాల, తల్లులాల నే
నెమ్మనకుం హరివాసి నిలువలేనికను"[37]

"ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి యిదిగాక వైభవం" వేరొకటి లేదని మధురభక్తిని ప్రకటించారు.

"ఇది గాక సౌభాగ్యమిదిగాక తపము మఱి
యిది గాక వైభవంబిక నొకటి గలదా?

అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్షలన్నియు విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండ (ఇదిగాక)

తరుణి హృదయము కృతార్థత బొంది విభు మీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ (ఇదిగాక)
శ్రీ వేంకటేశ్వరుని జింతించి పరతత్త్వ
భావంబు నిజముగా బట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరవాయె"[38] (ఇదిగాక)

శ్రీ వేంకటేశ్వరుని పొందు ఘనమైన దివ్యభోగంబుగా భావించిన అన్నమయ్య మధురభక్తి ఇలా వుంది.

కామయాగము చేసె గలికి తన
ప్రేమమే దేవతాప్రీతిగాను

పొలుపలర సురతతాంబూల రసపానంబు
నలినాక్షి సోమపానంబుగాను
కలకలంబుల మంచి గళరవంబుల మోత
తలకొన్నవేద మంత్రమ్ములు గాను (కామయాగము)

పడతి తన విరహ తాపమున బుట్టిన యగ్ని
అదరి దరికొన్న హోమాగ్ని గాను
ఒడబడిక సమరతుల నుదయించిన చెమటల
దడియుటే యది యవభృదంబుగాను (కామయాగము)

తనరంగుచముల రుచులు దంతాక్షతక్రీడ
ననుపై పశుబంధనంబుగాను
యెనసి శ్రీ తిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను"[39] (కామయాగము)

## నవవిధ భక్తిమార్గాలు :

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం, వందనం, దాస్యం సఖ్యమాత్మనివేదనమ్[40]

అని సంస్కృత భాగవతము తొమ్మిది విధాలైన భక్తిమార్గాలను తెలియజేసింది. ఇదే తొమ్మిది రకాల భక్తిమార్గాలను పోతన భాగవతంలో ఇలా చెప్పాడు.

"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు తలతున్ సత్యంబు దైత్యోత్తమా"[41]

పై నవవిధ భక్తిమార్గాలలో ఆత్మనివేదన భక్తి పోతన విషయంలో ఆత్మలో నెరుకగా పరివర్తన చెందింది.

శ్రవణభక్తి :

"శ్రవణం నామచరిత గుణాదీనా శ్రుతిర్భవేత్"[42] అని భక్తిరసామృత సింధువు భగవంతుని నామగుణ చరిత్రలను శ్రద్ధతో ఆలకించడమే శ్రవణభక్తి.

"శ్రీ విష్ణోః శ్రవణే పరీక్షిద భవేత్" అను శ్లోకం బట్టి శ్రవణభక్తిలో పరీక్షిత్తు ముఖ్యుడు. ఏడు దినాలలో భగవంతుని కథలను విని ముక్తిని పొందినవాడు పరీక్షిత్తు.

విజ్ఞానవిధము లెరుగక
తజ్ఞులు నీవార్త(జెప్పదను వాఙ్మనముల్
యజ్ఞేశ నీకు నిచ్చిన
యజ్ఞులు నినుబట్టి గెలుతు రజితుడవైనన్"[43]

కేవలం విష్ణుకథా శ్రవణం ద్వారా అజ్ఞులు సైతం భగవంతుని పొందగలరని పోతన అంటున్నాడు.

"వినరో భాగ్యము విష్ణు కథ
వెనుబలమిదివో విష్ణుకథ"[44]
"శ్రీపతి మీ కథ చెవులను వింటిమి
పాపము లణగెను భయముడిగె" [45]

విష్ణుకథలను వినడం మహద్భాగ్యంగా చెపుతూ శ్రీపతి కథలను వింటే పాపాలను బాసి భయాలు తొలగిపోతాయని అన్నమయ్య అంటున్నారు. గోపికల శ్రవణభక్తి తన్మయత్వాన్ని పోతన ఇలా తెలియజేశాడు.

ఘనలక్ష్మీయుతమై మహాశుభదమై కామాది విధ్వంసియై
.......... జీవనమై యొప్పెడు నీ కథామృతము"[46]

తానే గోపికయై అన్నమయ్య శ్రీహరి కథామృతాన్ని నిరంతరం సేవించువాడుగనుక శ్రీహరి భక్తిని ఇలా ప్రకటించాడు.

"కలిగె మాకిదె కైవల్యము
కలకాలము హరికథా శ్రవణము"

"నీకథామృతము నిరతసేవన నాకు
చేకొనుట సకల సుఖసేవనంబటుగాన" [48]

కేవల హరికథా శ్రవణం వల్లనే మోక్షం లభిస్తుందని, అలాంటి శ్రీ హరి కథామృతాన్ని నిరంతరం వినడం ద్వారా సమస్త సుఖాలు ప్రాప్తిస్తాయని తెలుస్తుంది.

శ్రీకృష్ణుని మురళీ గానం విని పరవశించిన బృందావన మండలి చరాచర జగత్తు అంతా శ్రవణభక్తికి ఆలవాలమైనదనుటలో సందేహం లేదు. అందువల్లనే "విష్ణునాకర్ణించు వీనులు వీనులు"[49] అని ప్రహ్లాదుని మాటలుగా శ్రవణభక్తిని ప్రకటించాడు పోతన.

శ్రవణభక్తి ద్వారా కైవల్యం ప్రాప్తిస్తుందని, నిర్మలమైన భక్తిని కోరువారు శ్రీహరి పావన కథలను ఆసక్తితో వినాలని పోతన, అన్నమయ్య లిరువురు తెలియజేస్తున్నారు.

**కీర్తనభక్తి :**

భగవంతుని నామ గుణ లీలా విభూతుల్ని స్తుతించడం కీర్తనభక్తి అనబడుతుంది. కీర్తన భక్తిలో ముఖ్యుడు శుకుడు.

"శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ" [50] అని ప్రహ్లాదుని మాటగా ప్రకటించాడు పోతన.

".......... యింద్రియంబు
లీశ్వర విషయంబులైన మది
నంచిత నిశ్చలత్వమైనచో
సరసిజనేత్రు కీర్తనమె చాలు విపద్దశలన్ జయింపన్" [51]

సర్వేంద్రియాలు భగవదర్పణం చేసి, నిశ్చల మనస్సుతో భగవంతుని గుణగణాలును కీర్తించే సరసిజ నేత్రుని కీర్తనమే విపత్తుల నుండి కాపాడుతుందని పై పద్యం ద్వారా తెలుస్తుంది. అట్లే గోపికలు తమ తమ పనులను విడచి గోవిందుని సందర్శనం కోసం వచ్చిన సందర్భంలో శ్రీకృష్ణుడు వారితో ఇక మీ గృహాలకు వెళ్ళిపొండి అన్నప్పుడు గోపికలు బదులు చెప్పిన విధానం పోతన కీర్తనాసక్తిని ప్రకటిస్తున్నది.

నిన్నెగాని పలుకనేరవు మా జిహ్వ
లొల్లననుచు బలుక నోడనీవు
మామనంబు లేల మఱపి దొంగిలితివి
యేమి సేయువార మింక కృష్ణ [52]

ఇట్లు మనోవాక్కాయ కర్మలతో శ్రీకృష్ణుని కీర్తించి గోపికలు శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రులైనారు.

కం. "గోవిందనామ కీర్తన
గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి
త్రీవిభుడు నూఱుగొనియెను
గైవల్యము దొల్లి రెండు గడియలలోనన్" [53]

పూర్వం ఖట్వాంగుడనే రాజు గోవింద నామ కీర్తన ద్వారా రెండు గడియలల్లోనే కైవల్యం పొందాడని కీర్తన భక్తి ప్రాశస్త్యాన్ని కూడా పోతన తెలిపాడు.

లోక ప్రసిద్ధమైన హరినామకీర్తన ప్రాచీనత్వాన్ని తెలియజేయడంలో అన్నమయ్య కీర్తన భక్తి ప్రకటించ బడింది.

"నళిన దళాక్షుని నామ కీర్తనము
కలిగి లోకముల కలదొకటొ" [54]

అట్లే కీర్తనం బ్రహ్మపదార్థమని ఇది సామవేదం కంటే గొప్పదైనదని ప్రస్తుతించాడు.

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం
జాలెల్ల నడగించు సంకీర్తనం"
"సామమున కెక్కుడైన సంకీర్తనం" [55]

క్రింది కీర్తనలలో మేలైన రుచిని ఇచ్చే సంకీర్తనమే తనకు చాలని, అదే [illegible] అన్నమయ్య కీర్తన భక్తి వివరణం.

"చాలదా [illegible] సంకీర్తనము తమకు
[illegible]
"[illegible]
[illegible] సంకీర్తనాలు"

**స్మరణభక్తి :**

భగవంతుని విస్మరింపక నిరంతరం ధ్యానించుట స్మరణభక్తి. ఈ స్మరణ భక్తులలో ప్రహ్లాదుడు ముఖ్యుడు. "చక్రిచింతనలేని జన్మంబు జన్మమే?"[58] అన్న ప్రహ్లాదుని మాటలద్వారా పోతన స్మరణభక్తి ప్రకటితమైంది.

శ్రీకృష్ణునికి విరోధియైన కంసుడు తన సర్వకాల సర్వావస్థలయందు భయంచేత శ్రీహరిని స్మరించడం ద్వారా, కంసుని తత్త్వం తెలుస్తుంది. ఈ సందర్భంలో పోతన స్మరణభక్తిని ప్రకటించాడు.

తిరుగుచు గుడుచుచు ద్రావుచు
నరుగుచు గూర్చుండి లేచు చనవరతంబున్
హరి తలచి తలచి జగమా
హరిమయమని తలచెఁగంసుడాఱనియలుకన్"[59]

ఇక గోపికా స్మరణభక్తిని చూస్తే యోగీంద్రులకు సైతం సాధ్యం కాని భగవద్దర్శనం. గోపికలకు అత్యంత సులభంగా లభించుటకు కారణం స్మరణభక్తియే. శరద్రాత్రుల యందు శ్రీకృష్ణుని మురళీగానం విని మనోవీధిని స్మరించి కొందరు గోపికలు బంధ నిర్ముక్తులైన విధం తెలిపే సందర్భంలో పోతన స్మరణభక్తి ప్రకటితమైంది.

తరుణుల్ గొందరు మూలగేహముల నడ్డండించి రారాక్ష[illegible]
ద్విరహోగ్నిం బరితాప మొందుచు మనోవీధిన్ విభున్ మాధవున్
బరిరంభంబులు సేసి జారుడనుచున్ భావించియుం జొక్కిపొం
దిరి ముక్తిన్ గుణదేహముల్ విడచి ప్రీతిన్ బంధనిర్ముక్తులై[60]

హరిని స్మరించడం ద్వారా ముక్తి లభిస్తుందని శుకుడు పరీక్షిత్తుతో అన్న మాటల్లోని పోతన స్మరణభక్తి. "....నన్యమా హరినామ పంస్మరణ యొక్క ముహూర్తమాత్రము సాలు ముక్తిదమౌ నృపా..."[61]

"కలౌస్మరణాన్ముక్తిః" కలియుగంలో స్మరించడం వల్ల ముక్తి లభిస్తుంది. అన్న మాటను గుర్తుచేస్తున్న అన్నమయ్య [illegible] ప్రకటించాడు. హరిని, హరి పేరు తలచడం చేతనే తనను శ్రీ హరి [illegible] చెప్పాడు.

నిన్నుదలచి నీ పేరు [illegible]
నన్ను కరుణించితే నన్నిక [illegible][62]

అచ్యుతుని నామం స్మరించడం వల్ల కోరిన ధనమెల్లా లభిస్తుందని, ఆ నామమే అధికమైన ధనమని, నారదుడు మొదలైన వారిచే స్మరించబడిన నాలుకపైన ధనం ఇదేనని అట్టి నారాయణ నామమే నమ్మదగిన ధనమని నామస్మరణం గూర్చి తెలిపాడు.

ఇచ్చలో గోరే వెల్లా ఇచ్చేధనము
అచ్చుతు నామమేపో అధికపు ధనము

నారదాదుల వొగడే నాలుకపైధనము
సారసపు వేదాలతో చాటేధనము
కూరిమి మునులు దాచుకున్నట్టి ధనము
నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము[63]

హరి నామ స్మరణ ఆనందాన్ని కలిగిస్తుందని అందుకే ఆ శ్రీహరి నామాన్ని మరవవద్దని కలిదోషహరమైన ఆ నామాన్ని ఎల్లప్పుడు తలచమని తనివితో ఆ నామ స్మరణలో మునిగి తరించండని స్మరణభక్తిని ప్రకటించాడు.

"హరినామము కడు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా

నలినాక్షుని శ్రీ నామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలచవో తలచవో తలచవో మనసా

నగధరునామము నరకహరణము
జగదేకహితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా

కడిగి శ్రీ వేంకటపతి నామము
ఒడిబడినే సంవత్సరము
ఒడియాలంబిల నతిసుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా"[64]

**పాదసేవనాభక్తి :**

"పాదసేవనం నామ భగవత్పరిచర్యా చామరాందోళన పర్వమః రూపా" అని భక్తిప్రకాశం.[65]

బ్రహ్మ శ్రీకృష్ణుని ఉద్దేశించి పల్కిన వాక్కులందు పోతన పాదసేవనభక్తి తెలుస్తుంది.

దేవా! నీ చరణ ప్రసాద కణలబ్ధింగాక లేకున్న నొం
డే వెంటన్ జను నీ మహోమహిమ నూహింపంగ నెవ్వారికిన్ [66]

ఏలా బ్రహ్మపదంబు? వేదములకున్ వీక్షింపగా రాని ని
న్నీలోకంబున నీ వనాంతరమునందీమందలో(గృష్ణ యం
చాలాపాది సమస్తభావములు నీయందే సమర్పించు నీ
వ్రేలందొక్కని పాదరేణువులు పైవేష్టించినంజాలదే [67]

అన్న బ్రహ్మ పలుకులను బట్టి బ్రహ్మపదం కంటే యోగి బృందారక గణాల కంటే భగవత్ పాదస్పర్శ పవిత్రమైందని తెలుస్తుంది.

ఘోష భూమి వెడలి గోవుల మేపంగ
నీరజాభమయిన నీ పదములు
కసపు శిలలు దాకి కదునొచ్చునోయని
కలగు మా మనములు కమలనయన

భక్తకామదంబు బ్రహ్మసేవితమిలా
మండనంబు దుఃఖమర్దనంబు
భద్రకరమునైన భవదంఘ్రియుగము మా
యురములందు రమణ! యునుపందగదె [68]

పై గోపికా గీతాలను బట్టి గోపికల శ్రీకృష్ణపాదానుభక్తి వ్యక్తమవుతుంది.

అట్లే గోపికా పాదసేవనా భక్తికి ఉదాహరణగా గల క్రింది పద్యంలో శ్రీహరి పాదప్రాశస్త్యం చెప్పబడింది.

సీ॥ "ఈ చరణంబులే యిందునిభావన,
సనకాది మునియోగ సరణినొప్పు
నీ పాదతలములే యెలనాగ శ్రుతివధూ
సీమంత వీథులజెన్నుమిగులు
నీపదాబ్జంబులే యిభకులోత్తమయాన
పాలేటి రాచూలి పట్టుగొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ!
ముక్తికాంతా మనోమోహనంబు" [69]

శ్రీహరి పాదాలు సనకాది మునియోగుల మార్గాన్ని సూచిస్తాయి. అతని పాదతలం శ్రుతి వధూ సీమంత వీధుల్లో ప్రకాశిస్తుంది. అతని పాదాబ్జం పాలేటి రాచూలి పట్టుగొమ్మ. అతని సుందరమైన పాదాలు ముక్తిప్రసాదాలు అని తెలుస్తుంది.

సుదాముడు బలరామకృష్ణులను కోరిన వరం గమనిస్తే పాదసేవన భక్తి సుదాముని మాటల్లో పోతన కనిపిస్తాడు.

నీ పాద కమలసేవయు
నీ పాదార్చకుల తోటి నెయ్యమును నితాం
తాపార భూతదయయును
తాపస మందార మాకు దయసేయగదే[70]

అని భగవానుని పాదసేవ, తత్ పదార్చకులతోటి స్నేహం, ప్రాణికోటిపై దయ, ప్రసాదించమని కోరడంలో సుదాముని పాదసేవన భక్తి వెల్లడవుతుంది.

నీ పాదాబ్జము బ్రహ్మపూజితముగదా[71] అన్న పోతన గారి మాటల్లో బ్రహ్మచే పూజింపబడే శ్రీహరి పాదాలు పవిత్రతను కొనియాడుతుంది. బ్రహ్మ పాదసేవాభక్తి తత్పరుడని కూడా తెలుస్తుంది. ఇదే విషయాన్ని అన్నమయ్య క్రింది సంకీర్తనలో బ్రహ్మపాదసేవాభక్తి తత్పరుడని తెలిపాడు.

"శ్రీకాంతుడ నీపాదసేవకులయినవారు... బ్రహ్మాదులు"[72]
శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ పాదమే శరణు[73]

ప్రామాణికులైన ప్రపన్నులకు కామధేనువు, కల్పవృక్షం శ్రీహరి అని, మోక్షంకోరేవారికి ధరణీ ధరుని పాదసేవే భాగ్యాన్ని ఇస్తుందని తెలిపారు.

కామధేనువిదె కల్పవృక్షమిదె
ప్రామాణ్యముగల ప్రపన్నులకు
ధరణీ ధరుపాదసేవే భోగము
పరమంటెరిగిన ప్రపన్నులకు[74]

అంతేకాక శ్రీహరి పాదప్రాశస్త్యం గురించి క్రింది సంకీర్తనలో తెలిపాడు అన్నమయ్య. ఇందులో వామనావతార ఘట్టం. అహల్యాపాపవిమోచన ఘట్టాలు తలపుకు తెస్తాయి.

బ్రహ్మకడిగిన పాదము
బ్రహ్మము తానెనీ పాదము

చెలగి వసుధ గొలిచిన నీపాదము
బలితల మోపిన పాదము,
తలకక గగనము తన్నినపాదము
బలరిపు గాచిన పాదము

కామిని పాపము కడిగిన పాదము
పాముతలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము

పరమయోగులకు పరిపరి విధముల
పరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము[75]

బ్రహ్మచే కడగబడినది, బ్రహ్మం తానె అయినది, భూమిని కొలిచినది, బలితలపై మోపినది, ఆకాశాన్ని తన్నినది (తాకినది) ఇంద్రుని కాపాడినది, అహల్య పాపాన్ని కడిగినది, కాళీయమర్దన చేసినది, ప్రేమతో లక్ష్మిచేత ఒత్తబడినది, పరమయోగులకు పరిపరివిధాల కైవల్యాన్ని ఇచ్చేది అయిన ఈ పాదము తిరు వేంకటగిరిలో స్థిరంగా నిలిచి పరమ పదాన్ని ప్రసాదించడానికై వున్నది అని కొనియాడాడు.

క్రింది కీర్తనలో కూడా అన్నమయ్య పాదసేవనాభక్తిని ప్రకటిస్తూ శ్రీహరి పాద ప్రాశస్త్యాన్ని కొనియాడాడు.

"ఈ పాదమే కదా యిలయెల్ల గొలిచినది
ఈ పాదమే కదా యిందిరా హస్తముల కితవైనది

ఈ పాదమే కదా యిందరును మ్రొక్కెడిది
ఈ పాదమే కదా యీ గగనగంగ పుట్టినది
ఈ పాదమే కదా యెలమి పెంపొందినది
ఈ పాదమే కదా యిన్నిటికిని యెక్కుడైనది

ఈ పాదమే కదా యిభరాజు దలచినది
ఈ పాదమే కదా యింద్రాదులెల్ల వెదకినది
ఈ పాదమే కదా యీ బ్రహ్మ కడిగినది
ఈ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది

ఈ పాదమే కదా యిహపరము లొసగెడిది
ఈ పాదమే కదా యిల నహల్యకు కోర్కెనిచ్చినది
ఈ పాదమే కదా యీక్షింప దుర్లభము
ఈ పాదమే కదా యీ వేంకటాద్రిపై నిరవైనది" [7]

భూమిని కొలిచినది (వామనావతారం) ఎల్లప్పుడు లక్ష్మీదేవి తన చేతులతో ఆ పాదాలను ఒత్తడం చేత లక్ష్మిహస్తాలకు నిలయమైనది, అందరిచే మ్రొక్కబడినది, ఆకాశగంగ పుట్టినది. ప్రశస్తమైనది, అధికమైనది, ఇభరాజు తలచినది, బ్రహ్మచే కడగబడినది, బ్రహ్మాండాన్ని ఆక్రమించినది, ఇహపరాలను ఇచ్చేది, చూడటానికి అరుదైనది, అయిన ఆపాదం ఇప్పుడు శ్రీ వేంకటాద్రిపై స్థిరంగా ఉంది అని తెలిపాడు.

## అర్చనభక్తి :

'అర్చనం పూజా' అని భక్తిప్రకాశము.[77] "గౌరవిత ప్రీతి హేతు క్రియాపూజా" అని దేవపూజా రహస్యము అను నిర్వచనాలను బట్టి గౌరవింపబడువారికి ప్రీతి హేతువైన సమస్తక్రియలు పూజ అనబడును. ఆ పూజ అర్చనమని తెలుస్తుంది.

పనిచేయటమే అర్చన అని స్పష్టమవుతుంది.

"కమలాక్షునర్చించు కరములు కరములు"[79] అని ప్రహ్లాదుని మాటల్లో పోతన అర్చనభక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

అట్లే కుబ్జను అర్చనాభక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.

సుదాముని ఇంటి నుండి బయలుదేరిన శ్రీకృష్ణుడు సుగంధ లేపనాలు కంసునికి తీసుకొని పోతున్న కుబ్జను చూసి ఆ లేపనాలు తనకిమ్మని అడిగితే ఆమె చెప్పిన తీరులో అర్చనాభక్తిని ప్రకటించాడు పోతన.

చక్కనివాడ వౌదు సరసంబుల నొంపకు మెల్లవారికిన్
జక్కదనంబు లెక్కడివి చారుశరీర! త్రివక్రయంద్రునే
నిక్కము కంసుదాసిని వినిర్మల లేపన విద్య దాననన్
మిక్కిలి రాజుమెచ్చు(దగ మీరు విలేపముల్ ధరింపరే"[80]

శ్రీ కృష్ణుని పొగడుతూ తన రూపవక్రతను నివేదించింది. సుగంధ లేపనాలను ధరించమని కోరింది. ఆ లేపనాలను స్వీకరించిన శ్రీకృష్ణుడు కుబ్జ యొక్క చుబుకాన్ని స్పృశించి వక్రతను పోగొట్టి అందమైన కాంతగా మార్చడం కుబ్జ యొక్క అర్చనాభక్తి ఫలితమే.

నిరంతరం అర్చన భక్తి ద్వారా బ్రహ్మాదిదేవతలు పొందలేని ఉన్నతమైన స్థానాన్ని పొందుతారని పోతన అర్చనాభక్తిని కొనియాడాడు.

"హరిచరణారవింద యుగళార్చన సన్నుతిభక్తియోగముల్
నిరతము గల్గువారె భవనీరజ గర్భుల కందరాని భా
సురపదమందుం జేరుదురు సూరి జనస్తవనీయ! యట్టిస
త్పురుషుల పూర్వజన్మఫలమున్ గణుతింపదరంబె యేరికిన్" [81]

శ్రీకృష్ణునికి నిరంతరం మానసికార్చన చేసేవారు గోపికలు. వారు విశిష్టమైన అర్చనా భక్తులు అనటానికి ఉదాహరణ క్రింది పద్యం.

ఒక్క లతాంగి మాధవుని యుజ్జ్వల రూపము చూడ్కి తీగెలం
జిక్కఁగఁబట్టి హృద్గతముఁజేసి వెలింజనకుండ నేత్రముల్
గక్కున మూసి మేనఁబులకంబులు గ్రమ్మఁగఁగౌగలించుచున్
జొక్కములైన లోచవులఁజొక్కుచు నుండెను యోగికైవడిన్" [82]

ఇట్లు వారి యొక్క మానసిక స్థితికి మెచ్చిన పరమాత్ముడు ఈవిధంగా అన్నాడు.

పాయని గేహశృంఖలముఁబాసి నిరంతర మత్పరత్వముం
జేయుచు నున్న మీకు బ్రతిసేయ యుగంబులనైన నేరనన్
బాయక గొల్పు మానసము ప్రత్యుపకారముగా దలంచి నా
పాయుట తప్పుగాఁగొనక భామినులారా! కృపన్ శమింపరే! [83]

అని భగవానుడు కూడా ప్రత్యుపకారం చేయ సమర్థుడు గాడని పలుకడానికి, గోపికలు నిర్దోషమైన తలపుతో నిరంతరార్చన చేయడమే కారణం. కాబట్టి వారు బ్రహ్మ మొదలైన వారిచే, మునివరులచే నమస్కరించబడ్డారు. అన్నమయ్య అర్చన భక్తిని గురించి ఈ విధంగా ప్రకటించాడు.

నిన్ను బూజించే వారి నిజ పరతత్త్వమవు
యున్నిటా నీదాసులకు యేలికవు [84]

అని భగవంతుని అర్చించే వారికి నిజమైన పరతత్త్వం లభిస్తుందని, దాసులకు అతడే ఏలిక అని, అర్చన భక్తిని తెలిపాడు.

"నిత్యపూజలివో నేరిచినవోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి

తనువే గుడియట తలయే శిఖరమట
పెను హృదయమే హరి పీఠమట
కనుగొన చూపులె ఘనదీపములట
తన లోపలి అంతర్యామికిని

పలుకే మంత్రమట పొదైన నాలికే
కలకలమను పిడి ఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలపు లోపల నున్న దైవమునకు

గమన చేష్టలే అంగరంగగతియట
తమిగల జీవుడే దాసుడట
అమరిన వూర్పులే ఆలవట్టములట
క్రమముతో శ్రీ వేంకటరాయనికి"[85]

తనలోని అంతర్యామికి శరీరమే ఒక దేవాలయం. తల దాని శిఖరం, హృదయం స్థానం హరిపీఠం, చూచే చూపులు (కనులు) ఘనదీపాలు. తనలోని దైవానికి మాటే మంత్రం నాలుకే కలకలమను శబ్దాన్ని కలిగించే పిడిఘంట, నలువైన రుచులే (బ్రహ్మపదార్థం) నైవేద్యాలు. శ్రీ వేంకటేశ్వరుని కోసం చేసే గమన చేష్టలే అంగరంగ గతియని, జీవుడే ఆ దేవుడికి దాసుడని అమరిన ఊర్పులే ఆలవట్టాలు అని పరమాత్మకు నిత్యం తాను చేసే పూజావిధానాన్ని తెలిపాడు.

"అర్చనం పూజా" "భక్తిప్రకాశము" చెప్పినట్లుగా పూజ అర్చన భక్తిగా అన్నమయ్య పై సంకీర్తనలో మానసిక అర్చన భక్తి చేశాడు. అట్లే నిండు మనసే నీ పూజ అని నిజమైన మనస్సు గల్గి వుండడమే అర్చన భక్తి అని తెలిపాడు.

"నిండుమనసే నీ పూజ
అండ గోరకుండుటదియు నీ పూజ"[86]

అర్చన విధానంలో షోడశోపచారాలు కలవు. క్రింది సంకీర్తనలో అన్నమయ్య శ్రీహరికి సమర్పించిన షోడశోపచారాలు అతని అర్చన భక్తిని ప్రకటిస్తుంది.

"షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి

అలరు విశ్వాత్మునకు ఆవాహనమిదె సర్వ
నిలయునకు ఆసనము నెమ్మినిదే
అల గంగాజనకునకు అర్ఘ్యపాద్యాచమనాలు
జలధి శాయికిని మజ్జనమిదె

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూషణములివె
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిరిమిదే కోటిసూర్యతేజునకు దీపము

అమృత మధనునకు అదివో నైవేద్యము
గమిచంద్రనేత్రునకు,కప్పురవిడెము
అమరిన శ్రీ వేంకటాద్రిమీది దేవునకు
తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో"[87]

ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, ప్రదక్షిణ నమస్కారం, నీరాజనం మొదలైన షోడశోపచారాలను మానసపూజగా చేశారు అన్నమయ్య.

## వందనభక్తి :

వందనమనగా నమస్కరించుట, ఇది మిగిలిన భక్తిమార్గాల కంటే అత్యంత శీఘ్ర అనుగ్రహ ప్రదమైంది.

"మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు
మా మే వైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః"[88]

నీ మనస్సు నాయందే లగ్నమొనర్చి, నాకే నమస్కరించు. ఈ విధంగా నాయెందే భక్తితత్పరతతో తదేక నిష్ఠ గల మనస్సుతో నన్ను ఆశ్రయిస్తే తప్పక నన్నే పొందుతావు" అని భగవానుని మాటలు.

తల్లిదండ్రులు, గురువులు, భాగవతులు, వీరికి చేసే వందనం భగవత్ అనుగ్రహాన్ని కల్గ జేస్తుందని భాగవతము చెప్తుంది. ఈ వందనంలో వినయం, అనునయం, స్తోత్రపాఠం, ప్రార్థన అనేవి సమ్మిళితమై వుంటాయి. ఇట్టి భక్తులలో ముఖ్యుడు అక్రూరుడు. బలరామకృష్ణులను చూసి పాదాలకు నమస్కరించడం చేత శరీరం పులకించి ఆనంద భాష్పాలను రాల్చిన అక్రూరుని వందన భక్తి పోతనలో కన్పిస్తుంది.

“కనివారల పాదములకు
వినయంబున మ్రొక్కి భక్తి వివశుండగుచుం
దనువున పులకాంకురములు
మొనయగ నానంద భాష్పములు జడిగురియన్” [89]

అక్రూరుని ద్వారా పోతన వందనాభక్తిని ప్రకటించాడు. అక్రూరునిలాగే వందనాభక్తితో ముక్తి పొందినవారు ఎందరో వున్నారు.

దేవకీ గర్భకుడై వున్న పురుషోత్తముని బ్రహ్మాది దేవతలు, నారదాది మునులు పలు విధాల స్తుతించారు.

“గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీనృకే
సరివై భిక్షుడవై హయాననుడవై క్ష్మా దేవతాభర్తవై
ధరణీనాథుడవై దయాగుణ గణోదారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే” [90]

పై పద్యంద్వారా, పోతన వందన భక్తిని ప్రకటిస్తూ విష్ణువు అవతారాలు కీర్తిస్తున్నట్లు తెలుస్తుంది.

అట్లే కాళియుని భార్యలైన నాగకాంతలు శ్రీకృష్ణునికి భక్తితో నమస్కరించిన విధం పోతన వందన భక్తికి నిదర్శనం. ఇందులో పోతన సగుణ నిర్గుణ రూపానికి నమస్కరించాడు.

తే॥ “నెఱిననంతుడవై దర్శనీయ రుచివి
కాక సూక్ష్ముడవై నిర్వికారమహిమ
దనరి కూటస్థుడన సమస్తంబు నెఱుగు
నీకు మ్రొక్కెద మాలింప నిర్మలాత్మ” [91]

అన్నమయ్య వందన భక్తిని క్రింది సంకీర్తనల ద్వారా ప్రకటించిన విధం గుర్తింపదగి వుంది.

“మరుతంత్రములలోన మరగేటికి
శిరసువంచి మొక్కేను చెప్పరే యాతనికి” [92]

“నమో నారాయణాయ నమో
సమధికానందాయ సర్వేశ్వరాయ” [93]

"నళినాక్షు నీకు నమస్కరించిన
ఫలము వొగడ నిక బ్రహ్మకు వశమా"[94]

"నవనీత చోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో

హరి నారాయణ కేశవాచ్యుత కృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుందగోవింద
నర నారాయణ నమో నమో

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారకా
నగరాధినాయక నమోనమో

వైకుంఠ రుక్మిణీ వల్లభ చక్రధర
నాకేశ వందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననుత నమో నమో"[95]

"నారాయణాయ నమో నమో నానాత్మనే నమోనమో
ఈ రచనలనే ఎవ్వరు దలచిన ఇహపరమంత్రములిందరికి"[96]

పై కీర్తనలో భగవంతుని నామరూప గుణాదుల్ని కీర్తించి నమస్కరించి దేవేంద్రునిచే దేవతలచే కీర్తించబడే శ్రీకర గుణనిధి అయిన శ్రీ వేంకటేశ్వరునికి వందనభక్తిని ప్రకటించాడు అన్నమయ్య.

"ఈ రచనలు" అనే మాటకు అర్థం కీర్తనలు. కీర్తన ద్వారా ఇహపరసౌఖ్యాన్ని పొందవచ్చని అన్నమయ్య తెలియజేస్తూ అన్ని ఆత్మలు తానైయున్న ఆ నారాయణునికి వందనమాచరిస్తున్నాడు.

"నమో నమో లక్ష్మీనారసింహ
నమో నమో సుగ్రీవ నరసింహ"

"నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నానశత్రుల సంహరించవే" [98]

శ్రీ వేంకటేశ్వరునికి నమస్కరించిన మాత్రాన శత్రువులబారి నుండి తప్పించుకోవచ్చని తెలియజేస్తున్నాడు. అంతేకాక తన జీవితంలో ఏదో ఒక సందర్భంలో ఈ అవసరం అన్నమయ్యకు వచ్చి వుంటుందని అనిపిస్తుంది. అందుకే 'నీవాడనని నన్ను నిందించే శత్రువును చావగొట్టి వానినిట్టే సంహరించవే" అని పై కీర్తనలో చెప్పుకున్నాడు.

"నారాయణ నమో నమో
నారద సన్నుత నమోనమో"

"ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర తిరువేంకటనాయక
నాదప్రియతే నమోనమో" [99]

నారదునిచే స్తుతింపబడేవాడు, సకలాగమాలతో పూజింపబడేవాడు, ఆ ఆదిదేవుడైనవాడు, సంగీతప్రియుడు, మోహనరూపుడు, యాదవకుల తిలకుడు, వేదోద్ధరుడు అయిన శ్రీ వేంకటేశ్వరునికి నమస్కారం అని అన్నమయ్య వందనాభక్తిని ప్రకటించాడు.

**దాస్యభక్తి :**

"దాస్యం కర్మార్పణం తస్యకైంకర్య మపిసర్వదా"[100] అనే నిర్వచనాన్ని బట్టి సర్వకర్మలు భగవదర్పణ చేసి కైంకర్యమొనరించుట దాస్యభక్తి అని తెలుస్తుంది. ఇదే విషయం ఆంధ్ర మహాభాగవతంలో ఇలా వుంది.

"కరణత్రయంబు చేతను
నరుడే కర్మంబు సేయు నయ్యైవేళన్.
హరికర్పణమని పలుకుట
పరువడి సుజ్ఞానమండ్రు పరమమునీంద్రుల్"[101]

రుక్మిణీ కల్యాణ ఘట్టంలో పోతనలో కన్పించే దాస్యభక్తి ఇలా వుంది.

"నీరజాతనయన, నీ వనమాలికా
గంధమబ్బలేని ఘ్రాణమేల
ధన్యచరిత! నీకు దాస్యంబుసేయని
జన్మమేల యెన్ని జన్మలకును"[102]

శ్రీహరికి దాస్యం చేయని జన్మవృధా అంటూ పోతన దాస్యభక్తి ప్రకటించాడు

గోపికల వస్త్రాపహరణ ఘట్టంలో గోపికల దాస్యభక్తిని ప్రకటిస్తూ పోతన ఇలా తెలియజేశాడు.

"......... కృష్ణ! యోచెల్ల నీచెంతన్ దాసులమై చరించెదము, మా చేలంబులిప్పింపవే"[103]

క."వచ్చెదము నీవు పిల్చిన
నిచ్చెదమేమైన గాని యెటు జొరుమనినన్
జొచ్చెదము నేడు వస్త్రము
లిచ్చి మముంగరుణతోడ నేలుము కృష్ణా"[104]

పిలిస్తే రావడం, అన్నీ ఇవ్వడం, పొమ్మన్నచోటికి పోవడం ఇవన్నీ దాసీ లక్షణాలే. ఇచ్చెదమేమైన గాని అనడంలో వారు సర్వస్వం భగవదర్పితం గావించుటకు సిద్ధంగా వున్నారని తెలుస్తుంది.

"సంసార జీమూత సంఘంబునిచ్చునే చక్రిదాస్య ప్రభంజనము లేక?"[105] అంటూ దాస్యభక్తి ప్రాశస్త్యాన్ని ప్రహ్లాదుని మాటల్లో పోతన తెలియజేశాడు.

అన్నమయ్య దాస్యభక్తిని, ప్రాచీనత్వాన్ని, ప్రాశస్త్యాన్ని కొనియాడిన విధం ఇలా వుంది.

ఆదికి అనాది హరిదాస్యంబిది
వేదాంతంబుల వెలసినది

సోదించి కనిరి శుకనారదాదులు
పాదుగ నిశతమ భాగ్యము కొలది[106]

హరిదాస్యం అనాది అని, వేదాంతాలలో చెప్పబడినదని, శుకనారదాది నిత్యముక్తులచే ఆచరించబడేదని, దాస్యభక్తి ప్రబోధాన్ని, ఆచారాన్ని అన్నమయ్య ప్రకటించాడు.

"అంది నీకు భక్తులైన యల మహానుభావుల
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీ వేంకటేశ కడు నీ బంటుకు
సందడి బంటనవుటే చాలదా నాకు" [107]

భాగవతుల (శ్రీహరి భక్తులు) పైభక్తి కలిగివుండడం, వారికి సేవ చేయడం మంచిదని అన్నమయ్య చెప్పిన మాటల్లో దాసానదాసుడను అన్న అనన్య దాస్యభక్తి కల్పిస్తుంది.

శ్రీ వేంకటేశ్వరా, నేను నీ దాసుడను. నా బాగోగుల గురించి నీకు చెప్పనక్కరలేదు. నన్ను రక్షించువాడవు నీవేనంటూ దాస్యభక్తిని ప్రకటించాడు.

"నీ దాసుల భంగములు నీవుజూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా" [108]

"అన్యధా శరణంనాస్తి త్వమేవ శరణం మమ" అన్న భావనతో అన్నమయ్య మేము నీ దాసులం నీవు మమ్ము రక్షించే రాజువు అని దాస్యభక్తిని ప్రకటించాడు.

"నీవేలికవు మాకు నీ దాసులము నేము
ఆవల నితరుల నేమడుగ బొయ్యేమా"[109]

నిర్మలంగా పూనిన దాసులకు ఎల్లవేళలా సౌఖ్యాన్ని ఇచ్చేవాడు ఆ జనార్ధనుడే, శ్రీహరి దాస్యం ఒక్కటే నమ్మదగింది అన్న అన్నమయ్య దాస్యభక్తి క్రింది సంకీర్తన ద్వారా ప్రకటించబడింది.

"సంతత సౌఖ్యము జనార్ధనుడే
అర్మిలి సంపదలనంతుని తగులు
నిర్మలముగ పూనిన దాసులకు [110]

నీదాస్యమొకటే నిలిచినమ్మగలది
శ్రీ దేవుడవు నీ చిత్తము నా భాగ్యము [111]

పరగుశ్రీ వేంకటపతి తన దాసుల
నరుదుగ గాచే ననంతుడితడు"[112]

ఎక్కడ పుట్టినా, ఎక్కడ ఉన్నా శ్రీహరిపై దాస్యభక్తిని గలిగి వుంటేచాలు అంటూ దాస్య భక్తి ప్రకటించాడు.

"యెందు జనించినా నేమి యెచ్చోటనున్ననేమి
కందువ నీ దాస్యము గలిగితేచాలు" [113]

**సఖ్యభక్తి :**

"భగవంతుని ప్రభావ, తత్త్వ, రహస్య మహిమల గ్రహించి విశ్వాస పూర్వకముగా సఖ్య భావనతో నాతని రుచి కనుగుణముగా రూపొందుట, అతని ననన్యముగా ప్రేమించుట, అతని గుణరూప లీలాదుల యందు ముగ్ధుడై నిరంతరము ప్రపన్నముగా నుండుట సఖ్యభక్తి"[114]

పరమాత్ముని స్నేహితునిగా భావించి సేవించుట సఖ్యభక్తి, దాస్యభక్తి పరిపక్వం చెంది సఖ్యభక్తిగా పరిణమిస్తుంది. ఇందులో ప్రేమ, సన్నిహిత సంబంధం వుంటుంది. ఈ సఖ్య భక్తిలో ముఖ్యుడు కుచేలుడు.

కుచేలుడు శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చిన సందర్భంలో, రుక్మిణీదేవి తన స్వహస్తాలతో వింజామరలు వీస్తుంది. దీన్ని బట్టి శ్రీకృష్ణునికి, కుచేలునికి మధ్యగల సఖ్యమెట్టిదో తెలుస్తుంది. ఇది పోతన సఖ్యభక్తికి నిదర్శనం.

ఏమి తపంబుజేసె నొకొ యీ ధరణీ దివిజోత్తముండు దోల్
జామున యోగి విస్ఫుర దుపాసకుడై తనరారు నీ జగత్
స్వామి రమాధినాథునిజ తల్పమునన్ వసియించి యున్నవా
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవులెంతవారలున్[115]

తనమృదుతల్పమందు వనితామణి యైన రమాలలామ పొం
దుననెడగా దలంపక యదు ప్రవరుండెదురేగి మోదమున్
దనకగ గౌగిలించి యుచిత క్రియలన్ బరితుష్టు జేయుచున్
వినయమునన్ భజించె ధరణీ సురుడెంతటి భాగ్యవంతుడో[11]

కుచేలుని భగవానుడు ఆదరించిన తీరు స్పష్టంగా తెలుస్తున్నది. అట్లే కుచేలునికి శ్రీకృష్ణునిపై గల భక్తిభావం క్రింది పద్యంలో ఇలా వుంది.

"గురుమతిఁదలపగ త్రిజగ
ద్గురుడ వనందగిన నీకు గురుడనగా నొం
డొరుదెవ్వడింతయును నీ
కరయంగ విడంబనంబయగు గాదె హరీ"[117]

శ్రీకృష్ణుడు గోపబాలురు చల్దులు అరగించే సందర్భంలో గోపబాలుర సఖ్యభక్తి కన్పిస్తుంది.

వనజాక్షుడు మున్నరిగిన
మునుపడగా నతని మేము ముట్టెదమనుచున్
జని మును ముట్టని వానిన్
మునుముట్టిన వాడు నవ్వు మొనసి నరేంద్రా[118]

"వనజాక్షుడు మున్నరిగిన" అనే పదంలో జీవుడు బ్రహ్మ వీరి మధ్య జరిగే ఆట వ్యక్తమవుతుంది. అందుకే వీరి మధ్య కలయిక జీవబ్రహ్మైక్యంగా గుర్తించవచ్చు. అందుకే శ్రీకృష్ణుడు వారి మధ్య గూర్చొని నవ్వుచు వినోదంగా చల్దులారగించడం చూచిన దేవతలు కూడా ఆశ్చర్యం చెందారు.

"సంగడీల నడుమ జక్కన గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుడమరులు వెఱగంద
శైశవంబు మెరసి చల్ది గుడిసె"[119]

శ్రీకృష్ణుని నిర్యాణం గూర్చి అర్జునుడు ధర్మరాజుతో చెప్పిన తీరు అతని సఖ్యభక్తిని తెలియజేస్తున్నది.

మనసారథి మన సచివుడు
మనవియ్యము మనసఖుండు మనబాంధవుడున్
మన విభుడు గురుడు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా[120]

పై పద్యంలో అర్జునుడు శ్రీకృష్ణుని సఖుడుగానే గాక విభుడు, గురుడు, దైవం అని సంబోధించడం అతని నిర్మలమైన సఖ్యభక్తిని తెలియజేస్తుంది.

సఖ్యభక్తి ద్వారా అర్జునుడు శ్రీహరి విశ్వరూపాన్ని దర్శించే భాగ్యానికి నోచుకొన్నాడని అన్నమయ్య సఖ్యభక్తిని ప్రకటించాడు.

బలువగు తన రూపము జూపె
కలదింతయు ఘనతెరిఁగించెన్

పాండవ రక్షణ పరుడై నరునకు
నండనె తెలిపె మహామహిమ
దండె విడచి తన దయతో నర్జును
డుండగ మగటి మివాడబలికె[121]

పాండవులను రక్షించడానికై అర్జునునికి గీతోపదేశం చేశాడు. ఇది సఖ్యభక్తిలో అర్జునునికి మాత్రమే సాధ్యమైంది. ఆ గీతోపదేశ సారాంశమే ఇది అని అన్నమయ్య ఇలా తెలియజేశాడు.

అని ఆనతిచ్చె కృష్ణుడర్జునునితో
వినియాతని భజించు వివేకమా

భూమిలోన జొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల
ధీమపాన మోచేటి దేవుడనేను
కామించి సస్యముల కలిగించి చంద్రుడనై
తేమల పండించేటి దేవుడనేను

దీపనాగ్నినై జీవదేహముల అన్నములు
తీపుల నరగించే దేవుడనేను
ఏపున నిందరిలోని హృదయములోన నుండు
దీపింతు తలపుమరపై దేవుడనేను

వేదములన్నిటిచేత వేదాంతవేత్తలచే
ఆదినే వెదగదగిన ఆ దేవుడను
శ్రీదేవితో గూడి శ్రీ వేంకటాద్రి మీద
పాదైన దేవుడను భావించవేను"[122] అని భగవానుడే తన తత్వాన్ని తెలియజేశాడు.

క్రింది కీర్తన ద్వారా భగవంతునికి భక్తునికి నర నారాయణులకు గల సఖ్యభక్తి వ్యక్తమవుతున్నది.

"ఏల మోసపోయిరొకొ యెంచి యాకాలపు వారు
బాలకృష్ణుని బంట్లై బ్రతుకవద్దా
దరునికి విశ్వరూపున్నది జూపనంటేను
నరహరి యితడని నమ్మవద్దా" [123]

**ఆత్మనివేదన భక్తి :**

"ఆత్మదేహః తస్యనివేదనం భగవతి సమర్పణం యద్వా ఆత్మనః ఆత్మీయస్య దేహదారాదే"[124] దేహదారులను భగవత్ అర్పణం గావించుట ఆత్మనివేదనం అవుతుందని తెలుస్తుంది.

జీవాత్మ, పరమాత్మ స్వరూపం అని భావించుటే ఆత్మజ్ఞానం, ఇట్టి అహంకార రహితమైన అభేద దృష్టితో కూడిన ఆత్మనివేదనమే ఆత్మలో నెఱుక అని పోతన మతం. దీనికే ప్రపత్తి, శరణాగతి, ఆత్మనిక్షేపం, న్యాసం అన్న నామాంతరాలున్నాయి.

వామనావతార ఘట్టంలో బలిచక్రవర్తి ఇచ్చిన మాట కోసం శ్రీహరి అడిగిన మూడు అడుగుల నేలలో ఒక అడుగు భూమి, రెండో అడుగు ఆకాశం సరిపోగా మిగిలిన ఒక్క అడుగు తన శిరస్సుపై ఉంచమని నిరయానికి, ప్రాప్త నిగ్రహానికి, పదవికి, హీనతకు, బంధానికి, అర్థబంగానికి, దుఃఖానికి, బాధపడనని ఆత్మ నివేదన భక్తిని ప్రకటించాడు.

"సూనృతంబు గాని నుడియదు నాజిహ్వ
బొంక జాల(నాకు బొంకులేదు
నీ తృతీయ పదము నిజము నాశిరమున్
నెలవుసేసి పెట్టు నిర్మలాత్మ

నిరయమునకు ప్రాప్త నిగ్రహమునకును
పదవి హీనతకును బంధమున
కర్థభంగమునకు నఖిల దుఃఖమునకు
వెఱవ దేవ! బొంక వెఱచినట్లు"[125]

వచ్చినవాడు సాక్షాత్తు మహావిష్ణువు నీవు మోసపోతున్నావు అని శుక్రాచార్యుడు చెప్పినా వినకుండా బలిచక్రవర్తి కీర్తికాముడు కాబట్టి తన మనస్సులో చెడు అభిప్రాయం కలగకుండా అన్న క్రింది మాటల్లో ఆత్మ నివేదనా భక్తి గమనించవచ్చు.

కారేరాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతింబొందరే?
వారేరీ? సిరిమూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై
బేరైనంగలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా?"[126]

"నీవే తప్ప నితఃపరంబెరుగ"[127] అని గజేంద్రుడు ఈశ్వర సన్నిధానంలో కల్పించుకొని ఆత్మనివేదన భక్తిని ప్రకటించిన విధం పోతనలో గమనించవచ్చు.

"లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరంబెరు గ మన్నింపందగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!"[128]

"ఓ కమలాప్త! యోవరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో! కవియోగ వంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యోమునీశ్వర మనోహర! యో విపుల ప్రభావ! రా
వే కరుణింపవే, తలపవే, శరణార్థిని నన్నుగావవే"[129]

అట్లే అన్నమయ్యలోని ఆత్మనివేదన భక్తి గమనార్హం. అలసి సొలసి నీయందు భక్తిచేతునో లేదో అని, భగవంతుడైన నీకు నివేదించకుండా నేను ఏమీ భుజించనని, నా మనస్సు నీకు కప్పంగా పెట్టానని నన్ను రక్షింపు అని వేడుకుంటున్న అన్నమయ్య మాటల్లోని ఆత్మనివేదన భక్తి వెల్లడవుతుంది.

"అలతునో సొలతునో నేనీయందు భక్తిసేతునో సేయనో
యెలిమి నీకు నివేదించక యేమేమి భుజియింతునో
తలచేటి నా మనసే నీకును ధనముగా కప్పము వెట్టితిని
పలుమరు నన్నును తగవుకు దియ్యక పరమాత్మననుగావటవో"[130]

భవబంధాలను విడనాడాలంటె అంతరంగాన్ని సర్వస్వాన్ని శ్రీహరికి సమర్పించాలని ఆత్మనివేదన భక్తి ప్రకటించాడు అన్నమయ్య.

"అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటె
వింత వింత విధముల వీడునా బంధములు

మనుజుడై ఫలమేది మరిజ్ఞాని యౌదాకా
తనువెత్తి ఫలమేది దయగలుగుదాకా
ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాకా
పనిమాలి ముదిసితే పాసెనా భవము

చదివియు ఫలమేది శాంతము కలుగుదాకా
పెదవెత్తి ఫలమేది ప్రియమాడుదాకా
మదిగల్గి ఫలమేది మాధవు దలచుదాకా
యెదుట తాను రాజైతే ఏలెనా పరము

పావనుడై ఫలమేది భక్తి కలిగిన దాకా
జీవించి ఫలమేది చింత దీరుదాకా
వేవేల ఫలమేది వేంకటేశుఁగన్నదాక
భావించి తా దేవుడైతే ప్రత్యక్షమౌనా"[131]

భగవంతుని మీద విశ్వాసంతో కూడిన భక్తిని ప్రకటించి తన సర్వస్వం భగవంతునికి అర్పించి, నేను నిమిత్తమాత్రుణ్ణి, అన్ని చర్యలకు కారకుడు ఆ భగవంతుడేనన్న తత్త్వంతో మెలగడం ఆత్మనివేదనా భక్తిని ప్రకటిస్తుంది.

"అంతయునీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ

కులమును నీవే గోవిందుడా, నా
కలిమియు నీవే కరుణానిధీ

తలపును నీవే ధరణీధరా, నా
నెలవును నీవే నీరజనాభా

తనువును నీవే దామోదరా, నా
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విట్ఠలుడా నా
వెనకముందు నీవే విష్ణుదేవుడా

పుట్టుగు నీవే పురుషోత్తమా, కొన
నట్టనడుము నీవే నారాయణా,
యిట్టె శ్రీ వేంకటేశ్వరుడా నాకు
నెట్టన గతి యింక నీవే నీవే"[132]

నీవే గతియని వేడుకోవడం 'శరణాగత తత్త్వం'. అది ఆత్మనివేదన భక్తికి నామాంతరం. మచ్చునకు కొన్ని కీర్తనలు.

"దైవమా నీవేగతి మా తప్పులు వసిలేదు
శ్రీ వల్లభుడవు నీవే చేకొని కావగదే"[133]

"తే శరణమహం తేశరణమహం
శైశవకృష్ణా తేశరణం గతోస్మి"[134]

"పరమాత్మ పరమాణురూప శ్రీ
తిరువేంకటగిరి దేవా శరణు"[135]

నవవిధ భక్తిమార్గాలను ప్రకటించిన పోతన, అన్నమయ్యలు నవవిధ భక్తి ప్రాశస్త్యాన్ని [illegible] ద్వారా భక్తి వలన భగవంతుని అన్న విషయాన్ని విష్ణుతత్త్వాన్ని లోకానికి తెలియచేశారు. తద్వారా ప్రజలలో భక్తితత్త్వాన్ని పెంపొందించారు.

భాగవతం పేర్కొనిన నవవిధ భక్తితత్త్వాలు నారద, శాండిల్యులు కూడా తమ భక్తి సూత్రాలలో వివరించారు. అందు నారదుడు నవవిధ భక్తి తత్త్వాలకు సమానమగు వాటిని ఏడింటిని చెప్పడంతో పాటు వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, తన్మయాసక్తి, పరమవిరహాసక్తి అని మరికొన్ని భక్తితత్త్వాలను చేర్చి పదకొండు

భేదాలని తెలిపాడు.[136] నారదుడు చెప్పిన విశేషములగు నాలుగు భక్తితత్వాల లక్షణాలు కూడా పోతన, అన్నమయ్యలలో కనిపిస్తుంది. ఆ లక్షణాలు గలవి ఇవి.

## వాత్సల్యభక్తి :

భగవంతుని యందు అనురాగం, ఆప్యాయతలతో కూడిన వాత్సల్యం కలిగి ఉండుట వాత్సల్య భక్తిని ప్రకటిస్తుంది. ఇది ఎక్కువగా తల్లిదండ్రులలో కనిపిస్తుంది. తన బిడ్డ మీద తల్లిదండ్రులకు గల మక్కువ, ప్రేమ ఈ భక్తిని కలిగివుంటుంది. బాలకృష్ణుడు శకటాసురుని తన పాదంతో కూలతన్నిన సందర్భంలో యశోద చిన్నికృష్ణునకు ఏమైందోనని ఆతురతతో పరుగు పరుగున వచ్చి లాలించిన విధమిది.

"అలసితివి గదన్న! యాకొంటివి గదన్న!
మంచియన్న! యేడ్పు మానుమన్న!
చన్నుగుడువు మన్న! సంతస పడుమన్న!
యనుచుఁజన్ను గుడిపె నర్భకునకు"[137]

ఇందు తల్లి, బిడ్డపై చూపే వాత్సల్య భక్తిని పోతన తన్మయత్వంతో చిత్రీకరించాడు.

కం॥ కొడుకు నొకనాడు దొడపై
నిడుకొని, ముద్దాడి, తల్లి యెలిమి నివురుచోఁ
గడు దొడ్డ కొండశిఖరము
వడువున బ్రేగయ్యెనతడు వసుధాధీశా! [138]

తృణావర్తుడను రాక్షసుడు సుడిగాలి రూపంలో కృష్ణుని ఎత్తుకొని పోవుటకు ముందు, జరిగిన సందర్భంలో తల్లి వాత్సల్యం వ్యక్తమవుతుంది.

పూతన చిన్ని కృష్ణునికి చనుబాలు తాగించాలనే ప్రయత్నంలో వాత్సల్యం చూపిన విధం ఇది.

కం॥ చనునీకుఁగుడుపఁ జాలెడి
చనువారలు లేరు, నీవు చనవలె, ననుచుం
జనుగుడిపి, పీద నిలుకడఁ
జనదాన, ననంగ వేడ్కఁజనుఁజనుగుడుపన్ [139]

కం॥ నాచను బాలోక గ్రుక్కెడు
నోచిన్ని కుమార త్రావు మొయ్యన పిదపన్
నీ చెలువ మెఱుగ వచ్చును
నాచెలువము సఫలమగును నళినదళాక్షా [140]

పై పద్యంలో పోతన చెప్పిన పూతనలోని కపట వాత్సల్యం పూతన మనస్తత్వాన్ని తెలియజేస్తున్నది. చిన్నికుమారా! నా చనుపాలు త్రాగితే నీ అందం, సౌందర్యం పెరుగుతుంది. నా అందం నా సౌందర్యం సఫలమవుతుంది అని పూతన అనడంలోని వాత్సల్యం, చిన్నికృష్ణునికి పాలు ఇవ్వడమే తన జన్మకు సార్థకత అన్న భావనతో పల్కినట్లు తెలుస్తుంది. అందుకే పోతన ఇంకో విషయాన్ని కూడా చెప్పాడు.

కం॥ వెన్నుని కొకమఱి విషమగు
చన్నిచ్చిన బాలహంత్రి చనెనట దివికిన్?
వెన్నునిగని పెంచుచుదన
చన్నిచ్చిన సతికి మఱియు జన్మము గలదే? [141]

విషమగు పాలు ఇచ్చిన పూతనకు కూడా మోక్షం వచ్చిందని పోతన చెప్పిన విషయం విచిత్ర మనిపించినా ఇది సత్యం. ఎందుకంటే పూతన కపట వాత్సల్యంలో తన జన్మ సాఫల్యాన్ని సాధించింది.

వామనావతార ఘట్టంలో అదితి చూపించిన వాత్సల్యం పోతన వాత్సల్య భక్తికి నిదర్శనం.

కం॥ "అన్నా రమ్మని దగ్గఱఁ
జన్నుల పాలేఱ వాఱ సంశ్లేషిణియై
చిన్నారి మొగము నివురుచు
గన్నారం జూచెఁగన్న కడుపై యుంటన్" [142]

అన్నమయ్య వాత్సల్య భక్తిని తన కీర్తనల్లో ప్రకటించిన విధం ఇది. బిడ్డ ఆకలి తల్లికి తెలుస్తుంది. యశోద శ్రీకృష్ణుని లాలించిన విధం గమనార్హం.

"ఇట్టిముద్దులాడి బాలుడేడవాడు వాని
పట్టితెచ్చి పొట్టనిండ పాలుపోయరె

గామిడై పొరితెంచి కాగెడి వెన్నలలోన
చేమపూవు కడియాల చేయిపెట్టి
చీమకుట్టెనని తన చెక్కిట కన్నీరుజార
వేమరు వాపోవువాని వెద్దువెట్టరే

ముచ్చువలె వచ్చి తన ముంగుమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగబెట్టి
నొచ్చెనని చేయితీసి నోరు లెల్లఁబొల్లుగార
వొచ్చెలి వాపోవు వాని నూరడించరే [143]

ముంగిట నిలుచున్న ముద్దుకృష్ణుని రూపాన్ని వర్ణిస్తూ కృష్ణుడు వేకువ జాముననే లేచి ఆకలి అని తన తల్లిని అడుగుతూ కన్నులు నులుపుకొనుచున్నాడని ఆ బిడ్డను ఎత్తుకొనరే అనుచు అన్నమయ్య యశోదవలె కృష్ణుని యందు వాత్సల్య భక్తిని ప్రదర్శించాడు.

ముద్దుగార నిదె ముంగిట నిలుచున్నాడు
వొద్దకేగి చెలులెల్ల వూరడించరే

వేకువజామున లేచి వేడుక కృష్ణుడు తల్లి
ఆకలయ్యీననుచు వొయ్యనె మంచము దిగి
కాకలతో వసివాడి కన్నులు పులుముకొంటూ
మొకరుచున్నవాడు యెత్తుకొరె బిడ్డని [144]

ఉగ్గువెట్టరే వోయమ్మా చె
యొగ్గీనీదె శిశువోయమ్మా

కడుపులోని లోకమ్ములు గదలీ
నొడలూచకరే వోయమ్మా
తొడికెడి సరుగన తొలగదీయరే
వుడికెడి పాలివి వోయమ్మా

చప్పులు వట్టుక సన్నపు బాలుని
నుప్పర మెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నదిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా

తొయ్యలు లిటుచేతుల నలగించక
వుయ్యలనిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
నొయ్యన తిట్టకు రోరమ్మా" [145]

**కాంతాసక్తి :**

భక్తుడు నాయిక వలె భగవంతుని నాయకుడుగా భావించి సేవ చేయడంలో ఆసక్తిని కలిగి వుండటాన్ని కాంతాసక్తి అనవచ్చు. రుక్మిణీ కల్యాణ ఘట్టంలో పోతన కాంతాసక్తిని రుక్మిణీ ద్వారా ప్రకటించాడు.

"ప్రాణేశ! నీమంజుభాషలు వినలేని
 కర్ణరంధ్రంబుల కలిమియేల?
పురుషరత్నమ! నీవుభోగింపగాలేని
 తనులతవలని సౌందర్యమేల
భువనమోహన! నిన్నుఁబొడగానగా లేని
 చక్షురింద్రియముల సత్త్వమేల?
దయిత! నీయధరామృతంబానగాలేని
 జిహ్వకు ఫల రససిద్ధియేల?

నీరజాతనయన! నీ వనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణమేల
ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని
జన్మమేల యెన్ని జన్మములకు? [146]

పై విషయాన్ని బ్రాహ్మణుని చేత శ్రీకృష్ణునికి తెలియజేసిన రుక్మిణీదేవి యొక్క కాంతాసక్తిని గమనిస్తే ప్రతివాడు భగవంతుని కరుణా కటాక్షానికి

కాంతాసక్తిని మించినది లేదు అన్న నిర్ణయానికి రావడం తథ్యం. ఇది పోతనలో పెల్లుబికిన కాంతాసక్తికి నిదర్శనం. అట్లే అన్నమయ్య కాంతాసక్తిని ప్రకటించిన విధంగమనార్హం.

"కాపురాలు సేసెది యేకాలమో కాని
ఆపరాలు తమకములందుకోనే పట్టెను"[147]

"అదిగాక సౌభాగ్యమదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికి గలదా

ప్రాణవల్లభుని ఔడబాసి మరుబాణముల
ప్రాణబాధల నెగులుపడుటేటి వలపే
ప్రాణేశ్వరుడు దన్ను బాయజూచిన యపుడు
ప్రాణంబుమేనిలో బాయంగవలదా

ఒద్దికై ప్రియునితో నొడగూడి యుండినపు
డిద్దరై విహరించుటిది యేటివలపే
పొద్దువోకలకుందయ పొలయలుక కూటములు
బుద్ధిలో బరవశము పొందంగవలదా

చిత్తంబు లోపలను శ్రీ వేంకటేశ్వరుని
హత్తించివాడు దానయ వుండవలదా
కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల
తత్తరము మున్నాడి తగులంగ వలదా?"[148]

తన్మయాసక్తి:

భగవంతునిలో ఐక్యం పొందుటకు ఆసక్తిని కలిగి ఉండుట తన్మయాసక్తి అనబడుతుంది. వామనావతార ఘట్టంలో బలిచక్రవర్తి అనిన మాటలను బట్టి పోతనలో తన్మయాసక్తి బోధపడుతుంది.

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతింబొందరే
వారేరీ? సిరిమూట గట్టికొనిపోవంజాలిరే? భూమిపై
బేరైనంగలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

అదిన్ శ్రీసతి కొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపై గపోల తటిపై బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందుకరంబు క్రిందగుట, మీఁదై నాకరంబుంట, మేల్
గాదే? రాజ్యము గీజ్యమున్ సతతమే? కాయంబు నాపాయమే"[149]

బలిచక్రవర్తి ఇచ్చిన మాట కోసం, వామనునికి మూడడుగులు దానం చెయ్యడానికి ఉపక్రమించాడు. వచ్చినవాడు మహా విష్ణువని, అతని నమ్మవద్దని ఎన్ని నీతులు చెప్పి వారించినా వినకుండా బలి జీవితం శాశ్వతం కాదని, కీర్తి ప్రతిష్టలే శాశ్వతమని భావించాడు. అందులో సాక్షాత్తు శ్రీ మహావిష్ణువునే తన దగ్గరకు వచ్చాడని తెలిసి తన్మయత్వానికి లోనయ్యాడు బలిచక్రవర్తి. పై జరిగిన సన్నివేశంలో పోతన బలిచక్రవర్తి పాత్రలో లీనమైనాడు. అందుకే పై రెండు పద్యాలు పోతన తన్మయీభావానికి ప్రతీకలని చెప్పవచ్చు.

పరమాత్మ కంటే భిన్నమైన వస్తువు లేదనే భావనతో మైమరచి ఉండుట తన్మయత్వం. తన్మయత్వం లేని భక్తి భక్తి అనబడదు. భక్తి రీతుల అన్నింటిలో తన్మయత్వం కనిపిస్తుంది. అంటే ఈ భక్తి మిగిలిన భక్తి మార్గాలలో అంతర్భూతమై ఉంటుంది. అయితే దాస్య, సఖ్య, వాత్సల్య, ఆత్మనివేదన భక్తిలో అధికంగా కనిపిస్తుంది.

శరద్రాత్రియందు కృష్ణుడు కనుమరుగైనపుడు గోపికలు భూతలంలో వెలిప్రఖ్యాతుడగునట్టి వానిని కాళింది తీర వనాంతరాలలో వెదకుతూ అతని గూర్చి స్థావర జంగమాలన్నింటిని పేరుపేరున ప్రశ్నించిన సందర్భం తన్మయాసక్తి వలనే అలా జరిగింది మచ్చుకు ఒకటి.

తే॥ "పొగడఁదగువాని గానరే? పొగడలార!
యీడెరుంగని విభుఁజూపుఁ డీడెలార
మొల్లమగుకీర్తివాడేడి? మొల్లలార!
శుకని గదితుని జెపుడు కింశుకములార!

క॥ తరుణీ కుచకుంకుమయుత
హరికంధర దామగంధమడరెడుఁ జూడ్కుల్
హరిఁగనిన పగిదిఁదనరెడి
హరిణీ! హరిజాడఁజెబ్యమయ్యెడిఁజెపుమా!" [150]

అంతా శ్రీహరిమయమే అంటూ శ్రీహరితత్త్వాన్ని కొనియాడిన తీరులో అన్నమయ్య తన్మయీ భావం వ్యక్తమవుతుంది. ఈ తన్మయీభావమే అన్నమయ్య విషయంలో విశిష్టాద్వైతంగా వెల్లివిరిసింది.

"ఎదుట ఎవ్వరు లేరు ఇంతా విష్ణుమయమె
వదలక హరిదాస వర్గమైన వారికి
చిత్తములో భావమెల్ల శ్రీ వేంకటేశుడే
హత్తిన ప్రకృతి ఎల్లా అతని మాయే
మత్తిలి ఈతని కంటె మరిలేదు ఇతరములు
తిత్తిదేహపు బ్రతుకు తెలిసేటి వారికి" [151]

అట్లే క్రింది కీర్తన కూడా అన్నమయ్య తన్మయత్వానికి నిదర్శనం.

"హరియే యెరుగును యందరి బ్రతుకులు
యిరవై యీతని యెరుగుటే మేలు"[152]

## పరమ విరహాసక్తి :

భక్తుడు భగవంతుని ఎడబాటును సహించలేని తత్త్వం గలవాడైతే అది పరమ విరహాసక్తి అనబడుతుంది. శ్రీకృష్ణుడు గోపికలను పరమ విరహాసక్తులను చేసి భక్తి పారవశ్యాన్ని కలిగించాడు.

"నను సేవింపుచునున్న వారలకు నేనా రూపముంజూపఁజా
చిన జాలించి మదించి వారు మదినన్ సేవింపరోయంచుని
ర్ధనికుండాత్మధనంబు చెడ్డ నెపుడున్ దత్పారవశ్యంబు(దా
ల్చిన భంగిన్ ననుఁజూసి మత్ప్రియుడుదా(జింతించునా రూపమున్"[153]

అని పరమాత్ముడే స్వయంగా పలికాడు. అట్టి విరహాసక్తి పొందిన గోపికలు జపతపోవ్రత దాన సత్కర్ముల వలన కలుగు ముక్తిని, శివసనకాది విమలచిత్తంలో కన్పించని భక్తిని, జన్మకర్మరాహిత్యం ప్రాప్తిని పొందారు.

"నమ్మితి నామనంబున సనాతనులైన యుమా మహేశులన్
మిమ్ముఁబురాణ దంపతుల మేలు భజింతుగదమ్మ! మేటి పె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరింబతిఁజేయుమమ్మనిన్
నమ్మినవారి కెన్నటికి నాశములేదు గదమ్మ! యీశ్వరీ!"[154]

శ్రీకృష్ణుని విరహాన్ని సహించలేని రుక్మిణి తన ఇలవేల్పు అయిన గౌరీదేవి: శ్రీకృష్ణుని భర్తగా చేయమని ప్రార్థిస్తున్న పై సన్నివేశం రుక్మిణి విరహాసక్తి బోధపడుతుంది. శరద్రాత్రియందు కృష్ణుడు తన మురళీ గాన మాధుర్యాన్ని వి: గోపికలు వచ్చిన సందర్భంలో గోపికలను తన్మయుల్ని చేసి ఒక్క క్షణం కన్పించకపోగా ఒక గోపిక విరహం క్రింది పద్యాలలో చూడవచ్చు.

"నల్లనివాడు పద్మనయనంబులవాడు, కృపారసంబు పై
జల్లెడువాడు, మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబుదెచ్చెనో
మల్లియలార! మీ పొదలమాటున లేడు గదమ్మ! చెప్పరే!" [155]

"దట్టపు విరహాగ్ని శిఖలు తరుణుల వేప
న్నెట్టుం బలుకవు చూడవు
కట్టిడివి గదా కుమార కరుణోదారా!" [156]

అన్నమయ్య గోపికయై చరించిన విధం అతని పరమ విరహాసక్తి: తెలియజేస్తుంది.

"వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంటా

చెందమ్మి కన్నులవాడు చేతిపిల్లగోవివాడు
యిందు వచ్చె కంటిరా యేమిరే యమ్మ
మందల పసువులవాడు మకరాంకముల వాడు
యెందునున్నాడో చెప్పరే యేలదాచేరమ్మా" [157]

అని తాను గోపికనై గొల్లవాడలో ఉండే కృష్ణుని కోసం వచ్చానని, ఆ కృష్ణుడు తామర పూరేకుల వంటి కన్నులు కలవాడనీ, మకరాంకాలు కలిగినవాడనీ, వాడు ఇక్లే వచ్చాడనీ, మీరు చూచి వుంటే ఎక్కడ వున్నాడో చెప్పమని దాచిపెట్టి నన్ను బాధించవద్దని పరమ విరహాసక్తిని ప్రకటించాడు అన్నమయ్య.

పై పోతన గోపిక శ్రీకృష్ణుని రూపురేఖల్ని వివరిస్తూ శ్రీకృష్ణుడి జాడ తెలుపమని మల్లియల్ని అడగడం, అన్నమయ్య గోపికయై గోకులంలోని వారిని అడిగిన పె పదంలోని సందర్భాలు ఒక్కటే అని తెలుస్తున్నది.

ఈవిధంగా నవవిధ భక్తిమార్గాలు నారదభక్తి విశేషాలే కాక వైరభక్తి అనబడే వేరొక భక్తిని ప్రతిపాదించింది భాగవతం.

వైరభక్తి :

భగవంతుని విరోధిగా భావించి ద్వేషభావంతో ఆతనికి పరతంత్రమై ఉండుట వైరభక్తి. భగవంతుని శత్రుభావంతో నిరంతరం తెగనాడుచుండడంవల్ల భగవద్భావతీవ్రత యినుమడించి ముక్తి కలుగునని యందలి ప్రధాన సందేశం. ఏ మార్గంలోనైనా హరికి పరతంత్రులై ఉండుట ప్రధానమని భాగవత ప్రబోధం. అందుకే

"బాంధవమున నైనఁబగనైన వగనైన
ప్రీతినైనఁ బ్రాణభీతి నయిన
భక్తినైన హరికి పరతంత్రులై యుండు
జనులు మోక్షమునకు జనుదురధిప" [158]

అని వైరభక్తిచే ముక్తి పొందినవారిలో శిశుపాలుడు ముఖ్యుడని శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పిన సందర్భంలో వైరభక్తి ప్రతిపాదించబడింది.

"చక్రికిం బగతుడై మూడుండు చైద్యుండు పెంపునఁగైవల్యంబునొందె" [159]

భగవంతుడు నిర్వికారుడని కులగోత్రాలు లేనివాడని తల్లిదండ్రులు లేనివాడని బహురూపాలు తానై చరించేవాడని చెప్పడంలో శిశుపాలుడు విరోధంతో హరికి పరతంత్రుడైన విధం తెలుస్తుంది. ఇందులో శిశుపాలుడు శ్రీకృష్ణుని నిందిస్తున్న సందర్భంలో అంతర్లీనమైన స్తుతి కనిపిస్తుంది. అందుకే తనలో ఐక్యం చేసుకొన్నాడు శ్రీకృష్ణుడు.

సీ॥ "గురుదేవ శూన్యుండు కులగోత్రరహితుండుఁ
దలిదండ్రులెవ్వరో తడవఁగాన
మవ్వులఁబోరలేదు నాదిమధ్యావసా
నంబులందరయ మానంబులేదు
బహురూపియై పెక్కుభంగుల వర్తించు
వావివర్తనములు వరుసలేవు
వరిశింప విశదపదంబధుండు దలపోయ
మానినిమిత్తంబున మాపివద్యు

తే॥ బరగమున్ను యయాతి శాపమునఁజేసి
వాసికెక్కదు యాదవ వంశమెల్ల
బహ్మతేజంబు నెల్లఁగోల్పడిన యితడు
బ్రహ్మఋషి సేవ్యుడగునె గోపాలకుండు

కం॥ జారుడు జన్మావధియును
జోరుఁడు ముప్పోకలాఁడు సుమహిత పూజా
చారక్రియలకు నర్హుఁడె
వారక యితడనుచున శుభవాక్య స్ఫూర్తిన్" [160]

ఇందులో శిశుపాలుడు విరోధంతో హరికి పరతంత్రుడైన విధం స్పష్టంగా తెలుస్తుంది. అట్లే విరోధ భావంతో సర్వకాల సర్వావస్థలయందు హరిని తలచి జగమూ హరిమయమని చూచిన కంసుని తత్త్వం ఎలా వుందో పోతన ఇలా ప్రకటించాడు.

సీ॥ "శ్రవణ రంధ్రముల నేశబ్దంబు వినబడు
నది హరి పలుకని యాలకించు
నక్షిమార్గమున నెయ్యని చూడబడునది
హరిమూర్తి గానోపునంచు జూచు
దిరుగుచో దేహంబుఁదృణమైన సోకిన
హరికరా ఘాతమో యనుచుఁగలఁగు
గంధంబు లేమైన ఘ్రాణంబు సోకిన
హరిమాలికా గంధమనుచు నదరు

బలుకులెవ్వియైనఁబలుకుచో హరిపేరు
పలుకఁబడియె ననుచు భ్రమసి పలుకుఁ
దలపు లెట్టివైనఁదలఁచి యా తలఁపులు
హరి తలంపు లనుచు నలుగఁదలచు" [161]

ఈ వైరభక్తి అన్నమయ్యలో కన్పించదు కాని అన్నమయ్య నానా విధ భక్తులను మరికొన్నింటిని తెలిపాడు.

చేసే పూజలను 'రాక్షసభక్తి' అని హరిదాసులకు సేవ చేయుట తురీయభక్తి అని, ఫలితం ఆశించి చేయుట 'తామసభక్తి' అని అతడేగతి అని భావించుట 'వైరాగ్యభక్తి' అని, శరణాగతతత్త్వమే నిర్మలభక్తి అని, నమ్మి శ్రీ వేంకటేశ్వరునికి కైంకర్యం చేసి తట్టు ముట్టులేనిదే తగిన నిజభక్తి అని, అన్నమయ్య భావించినట్లు తెలుస్తుంది.

పైన అన్నమయ్య చెప్పిన నానావిధ భక్తిమార్గాలలోనే త్రిగుణాత్మకమైన భక్తివిధానాలు, భాగవతము తెలిపిన నవవిధ భక్తిమార్గాలు, వైరభక్తి, నారద ఏకాదశ ఆసక్త్యాది భక్తివిధానాలు ఉన్నాయని తెలుస్తుంది.

### భక్తి–రసం :

భక్తిరసం అనే విషయాన్ని పరిశీలించాల్సినపుడు శ్రీ మద్భాగవత పురాణ పరిశీలనలో నాగసిద్ధారెడ్డి గారు చెప్పిన విషయాలు గమనించవచ్చు. "........భగవత్సంబంధమైన రతి వ్యభిచారి భావములలోనే చేరుననియు, అది స్థాయీ భావమునందు కొనలేపోవుటచేత దానికి రసత్వము సిద్ధింపదనియు దశరూపకమున ధనంజయుడు వివరించెను"

మమ్మటుడు కావ్యప్రకాశమున "రతిర్దేవాది విషయా వ్యభిచారీ తథాంచితః భావఃప్రోక్తః" అని భక్తిభావముగ మాత్రమే నిర్దేశించినాడు. ఇట్లే హేమచంద్ర, జగన్నాథ పండిత, విశ్వనాథకవి రాజాది అలంకారికులు పలువురు భక్తికి రసత్వము నంగీకరింపరైరి. వీరి వాదములను ఖండించుచు భక్తికి రసత్వ సిద్ధిని ప్రతిపాదించినవారిలో ఉజ్జ్వల నీలమణి కర్త రూపగోస్వామి భక్తి రసాయనకర్త, మధుసూధన సరస్వతి ప్రముఖులు. [163]

పై విషయాన్ని పరిశీలించినపుడు విభానుభావ సాత్త్విక వ్యభిచారీ భావాలచేత పరిపుష్టి నొంది స్వాధుత్వాన్ని పొందిన స్థాయి భావమే రసమని అలంకారికుల నిర్వచనమని తెలుస్తుంది. అయితే మానవునిలో భక్తికి పూర్వుల సంస్కృతి సంప్రదాయం పూర్వజన్మ సంస్కారఫలితం కారణాలుగావుంటాయి. ఈ భక్తి సాత్త్విక వ్యభిచారీ భావాల ఆరోహణ క్రమంలో పరిపుష్టమైన స్థాయిని అందుకొని ప్రేమరూపమైన భక్తి జనించినపుడు భక్తికి రసత్వం సిద్ధిస్తుందని చెప్పవచ్చు.

ఈ భక్తి భక్తునిలో మొదట ద్వైతంగా అంకురించి అద్వైత భావాలకు పునాదిగా విశిష్టాద్వైత భావంగా స్థాపించబడుతుంది. భక్తికి పూర్ణ రసత్వం సిద్ధించడమంటే ఇదేనని చెప్పవచ్చు.

## భక్తి-నవరసాలు :

పోతన అన్నమయ్యలు నవవిధభక్తి ప్రాధాన్యతతో పాటు నవరసాలను కూడా పోషించారు. రసం అంటే రుచి కలిగినది అని చెప్పవచ్చు. ఈ రుచి ఆస్వాదించే కొద్దీ శారీరక మానసిక గతులు తప్పి తన్మయీ భావానికి లోనుకావడం జరుగుతుంది.

నవరసాలు వాటి స్థాయీ భావాన్ని చేరాలంటే ఏకాగ్రతతో కూడిన భక్తి ఖచ్చితంగా వుండాలి. భక్తిలేని నవరసాల నటన, రచనలు రక్తికట్టవు,. కాబట్టి భక్తిలేనిదే రసం లేదు.

రసరాజమైన (అంగిరసం) శృంగారమే మధురభక్తి. ఇందులో భక్తితో కూడిన శృంగార చేష్ట తన్మయీ భావాలు వుంటాయి. శ్రీ కృష్ణుడు కువలయా పీడనాన్ని వధించేటప్పుడు శ్రీకృష్ణునిలోని నవరసాలు పోతన మనోనేత్రాలకు దర్శనమిచ్చాయి.

"మహిత రౌద్రంబున మల్లులకశనియై
నరుల కద్భుతముగ నాధుడగుచు
శృంగారముగఁబురస్త్రీలకుఁగాముడై
నిజమృత్యువై కంసునికి భయముగ
మూఢులు బీభత్సమును బొందవికటుడై
తండ్రికి దయరాగ తనయుడగుచు
ఖలులకు విరసంబుగా దండియై
గోపకులకు హాస్యంబుగఁగులజుడగుచు

బాంధవులకు ఁబ్రేమ బాసిల్ల వేలుపై
శాంత మొనర యోగిజనులకెల్లఁ
బరమతత్త్వమగుచు భాసిల్లె బలునితో
మాధవుండు రంగమధ్యమందు"[164]

అట్లే అన్నమయ్య ఈ నవరసాలను అలమేల్మంగలో దర్శించాడు.

"నవరసములదీ నళినాక్షి
జవకట్టి నీకు జవిసేసీ

శృంగారరసము చెలియ మొకంబున
సంగతి వీరరసము గోళ్ళ
రంగగు కరుణ రసము పెదవులను
అంగపు కుచముల నద్భుతరసము

చెలిహాస్యరసము సెలవులనిండి
పలుచని నడుమున భయరసము
కలికివాడి కన్నుల బీభత్సరసము
అలబొమ జంకెనల అదె రౌద్రంబు

సతి రతి మరపుల శాంతరసంబిదె
అతి మోహము పదియవ రసము
ఇతవుగ శ్రీ వేంకటేశ గూడితివి
సతమై యీమెకు సంతోషరసము" [165]

కోమలరసాలు: శృంగార, కరుణ, హాస్య, శాంతరసాలు
ఉద్ధతరసాలు: వీర, భయ, బీభత్స, రౌద్రరసాలు
ఉభయ రసం: అద్భుతరసం
అన్నమయ్య పదవ రసం: అతిమోహము

"సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా"[166] = ప్రేమభక్తి స్వరూపిణి అని నారదసూత్రం. అందువల్ల మోహము అనే పదానికి అర్థం ప్రేమ అని చెప్పవచ్చు. "అతిమోహము పదియవరసము" అని అన్నమయ్య పై సంకీర్తనలో తెలియజేశాడు. దీనిని బట్టి అతిమోహము అంటే అనన్యప్రేమ అనుకొన్నపుడు భక్తి రసమని తెలుస్తుంది.

## భక్తి ప్రాశస్త్యం- పోతన అన్నమయ్య :

శ్రీహరి నాథ గుణ లీలావిభూతుల్ని వర్ణించిన పోతన అన్నమయ్యల రచనలు భక్తి ప్రధానమైనవి. శృంగార అధ్యాత్మికం, అధ్యాత్మ వైరాగ్యం వీరిలో కనిపిస్తుంది. కావ్యం శృంగార ప్రధానమైంది ఎందుకంటే శృంగారం కావ్యానికి అంగిరసం. అందుకే ప్రతి కవిలోను శృంగారపరమైన భావన ఉంటుంది. అయితే

దీన్ని భక్తితో సమర్పణ చేయడమే వీరు చేసినటువంటి ప్రత్యేకత. భక్తుడు తనకు రుచిగా ఉంటుందని ఏ వస్తువు అనిపిస్తుందో దానితోనే ప్రసాదం చేస్తాడు. దీన్ని మనసు నిష్టలతో భక్తితో భగవంతునికి సమర్పిస్తాడు. దీనినే భక్తి అనవచ్చు. రుచి గలిగిన వస్తువు శృంగారమైతే ఆధ్యాత్మికమైంది ప్రసాదం. భక్తితో కూడినది సమర్పణం. దీన్నే వైరాగ్యం అనవచ్చు. ఎందుకంటే భగవంతునికి భక్తి ప్రధానం. ప్రసాదం ఎంత తియ్యగా వున్న భక్తి ఎన్నిపాళ్లు ఉందా అని భగవంతుడు చూస్తాడు.

"భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు" అన్నట్లుగా పోతన, అన్నమయ్యలు చేసిన పని ఇదే. వారికి రుచిగల శృంగార వస్తువును తీసుకొని, ఆధ్యాత్మిక భావంతో అందంగా సృష్టించి దాన్ని యోగ్యుడైన భగవంతునికి భక్తితో సమర్పించారు. అంటే శృంగారపరమైన కావ్య కన్యకను ఆధ్యాత్మిక భావంతో రచించి (సృష్టించి) బాలరసాల సాల నవ పల్లవ కోమలమైన భాగవతమును కూళలకు ఇవ్వటం పడువృత్తియని తెలుసుకొని యోగ్యుడైన భగవంతునికి భక్తితో సమర్పించాడు పోతన. అట్లే సాళువ నరసింహరాయల ఆస్థానంలో అన్నమయ్య పాడిన 'ఏమొకో చిగురుటధరమున' అనే సంకీర్తన విని రాజముగ్ధుడై తనపై కూడా సంకీర్తన వ్రాయమని అడిగితే నరహరిని కీర్తించు నా జిహ్వా నొరులనుతింప నోపదుజిహ్వా అని రాజధిక్కారానికి కూడా వెనుకాడకుండా సంకీర్తనల్ని వేంకటాంకితం చేశాడు అన్నమయ్య.

వీరిరువురు దేవతా విగ్రహాలను చెక్కిన శిల్పులని అనిపిస్తుంది. శిల్పి దేవతా విగ్రహాన్ని చెక్కేటపుడు శృంగారపరమైన అంగాలను శృంగారభావంతోనే చెక్కినప్పటికి ఏకాగ్రతత కూడిన భక్తి ఉంటుంది. ఇదే శృంగార ఆధ్యాత్మికం, అది అందంగా రూపుదిద్దుకుంటూ ఉంది అని అనిపిస్తే ఆనందంతో తన్మయీ భావానికి లోను కావడం జరుగుతుంది. ఇదే ఆధ్యాత్మ వైరాగ్యం. ఇది చూపరులకు ఆస్వాదించేవారికి ఆధ్యాత్మికంగానే కనిపిస్తుంది. ఎందుకంటే అది దేవతా విగ్రహం. దీనిని భక్తితోనే చూడాలి.

"నసాధయతి మాం యోగోన సాంఖ్యం ధర్మఉద్ధవ
నస్వాధ్యాయ స్తపస్త్యాగో యధాభక్తిర్మమోర్జితా"[167]

"భాగవతము" భక్తికి ప్రతీక, పోతన చెప్పిన క్రింది పద్యాలలోని భక్తి ప్రశంస గమనించదగింది

"భాగవత పురాణ ఫలరసాస్వాదన
పదవిగనుడు రసిక భావవిదులు"

భాగవతపురాణ ఫలరసం = భాగవతములోని భక్తి "బాలరసాలసా సవపల్లవ కోమల కావ్యకన్యక"= భాగవతములోని భక్తి. భక్తే భాగవతం భాగవతమే భక్తి అన్న విషయాన్ని పోతన తెలిపాడు. తద్వారా భక్తి ప్రాశస్త్యం భాగవత ప్రాశస్త్యం తెలుస్తుంది.

మోక్షప్రాప్తికి సాధనాలుగా పూర్వులు జ్ఞాన కర్మ భక్తిమార్గాలు నిర్దేశించార అందు యోగ్యమైంది భక్తిమార్గం. అందుకే పోతన వ్రతాలవల్ల క్రతువుల వ దానాల వల్ల శౌచ శీల తపం వల్ల సాధ్యంకాని (చిక్కని) భగవంతుడు భ వశుడౌతాడని విశ్వసించాడు.

"చిక్కడు వ్రతముల గ్రతువుల
జిక్కడు దానములు శౌచశీల తపములం
జిక్కడు యుక్తిని, భక్తిని
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధముసుండీ"[168]

క్రింది పద్యం ద్వారా పోతన హరి భక్తిలేనివారి జీవితాలు వ్యర్థం అ తెలియజేయడం ద్వారా భక్తి ప్రాశస్త్యం చెప్పబడింది.

"అంధేదూదయముల్ మహాబధిర శంఖారావముల్ మూకస
ంథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ
మిత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్" [169]

నిరంతరం భక్తిభావంతో వున్నవారు బ్రహ్మ కూడా పొందలేని భాసురపదాన్ని పొందగలరని చెప్పాడు.

"హరిచరణారవింద యుగళార్చన సన్నుతి భక్తియోగముల్
నిరతము గల్గువారె భవనీరజ గర్భుల కందరాని భా
సురపద మందుఁజేరుదురు సూరి జనస్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మ ఫలమున్ గణతింపఁ దరంబె యేరికిన్?"[17]

హరి భక్తితో కావ్యాలు రాయడంచేత కవులు కైవల్యాన్ని పొందుతారు అని పోతన విశ్వసించాడు.

"ప్రస్ఫీన భక్తిని హరిపైఁ
గబ్బంబులు సెప్పి కవులు కైవల్యశ్రీ
కబ్బుదురుట హరిపోషణ
మబ్బిన తలిదండ్రులెచటి కబ్బుదురో తుదిన్" [171]

భక్తితో హరిజన్మ కథల్ని చదివిన వానికి సంసార దుఃఖం తొలగిపోతుందని చెప్పుతున్నాడు.

"అతి రహస్యములైన హరిజన్మకథనంబు
మనుజుడెవ్వడేని మాపురేపు
జాలభక్తితోడఁజదివిన సంసార
దుఃఖరాశిఁబాసి తొలగిపోవు" [172]

"భక్తియుక్తుడు లోకేశ పదమునొందు"[173] అని ఏ పని చేసినా భక్తితో చెయ్యాలన్నదే పోతన మతంగా తెలుస్తుంది. వివిధ కర్మలచేత సాధ్యంకాని భగవంతుడు భక్తికివశుడని అన్నమయ్య భావించాడు.

"సకల కర్మముల చేత సాధ్యముకాని నీవు
వొక యించుకంత భక్తి కాగిలోనైతివి" [174]

సకల శాంతికరమైనది సర్వేశ్వరునిపై భక్తి అని అది తనకు అబ్బింది కాబట్టి అదే తనను బ్రతికిస్తుందని విశ్వసించాడు.

"సకల శాంతికరము సర్వేశ నీపై భక్తి సర్వేశ
ప్రకటమై మాకు నబ్బే బ్రతికించునదియె సర్వేశ" [175]

శ్రీ వేంకటపతిపై గల పదిలమైన భక్తి మోక్షానికి మార్గం అని తెలిపాడు.

"పదిలమై వేంకటపతి భక్తి కలిగితేను
తుదిపదంబునకెల్ల తొడవునపుడే" [176]

అందుకే కోనేటిరాయుడైన శ్రీ వేంకటేశ్వరుని భక్తితో కొలవండని తెలియజేస్తున్నాడు అన్నమయ్య.

"కొలువుడీ భక్తి కొండల కోనేటి
నిలయుని శ్రీనిధియైన వాని" [177]

యుక్తితో ఆలోచిస్తే పరమ సుఖాన్ని ఇచ్చేది భక్తి అని తెలుస్తుంది.

"భక్తి నీపై దొకటె పరమసుఖము
యుక్తి చూచిన నిజంబొక్కటేలే"[178]

అచ్యుతునిపై భక్తి రహస్యమైంది. ప్రతిలేని పరమ పావనమైంది. అందు
సనకాది మునులు నేర్పుతో భక్తి ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. అయితే అది పూర్వ
సుకృత ఫలంగా అబ్బుతుందని తెలుస్తుంది.

"అతి రహస్యమిది అచ్యుతుపై భక్తి
ప్రతిలేని పరమ పావనము
చతురులై తెలిసిరి సనకాది మునులు
తతి దొరుకుట సుకృత ఫలము కొలది"[179]

ఎల్లప్పుడు ఆనందాన్ని ఇచ్చేది ఆ సర్వేశ్వరునిపై భక్తి మాత్రమే అని తెలుస్తుంది

"సదానందము సర్వేశ్వరా నీ
పదారవిందము పై భక్తి" [180]

శ్రీ వేంకటేశ్వరునికి దాసుడైన మాత్రాననే భక్తి కలుగుతుందని అన్నమయ
తెలియజేస్తున్నాడు.

"మహిలో శ్రీ వేంకటేశ మది నీ దాసుడనైతి
బహుభక్తి నీ మీద పచరించేనయ్యా" [181]

భక్తి ప్రాశస్త్యాన్ని కొనియాడుతున్న క్రింది సంకీర్తనలలో నవవిధ భక్తివిధానా
ఉన్నట్లు కనిపిస్తుంది.

"ఇహమేకాని పరమేకాని
బహుళమై హరి నీపై భక్తేచాలు

యెందు జనించిన నేమి యెచ్చోట నున్ననేమి
కందువ నీ దాస్యము గలిగితే జాలు
అంది స్వర్గమే కాని అలనరకమే కాని
అందపు నీ నామము నా కబ్బుటే చాలు

దొరయైన జాలుగడు దుచ్ఛపు బంటైన జాలు
కరగి నిన్ను దలచగలిగితే చాలు
పరులు మెచ్చిన మేలు పమ్మి దూషించిన మేలు
హరి నీ సేవాపరుడౌటే చాలు

యిల జదువు రానీ యిటు రాకమాననీ
తలపై నీ పాదముల తగులే చాలు
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీ శరణమే చాలు"[182]

ఇందులో భక్తి నిర్వచనం, భక్తితత్త్వం, భక్తిభేదాలు, భక్తిమార్గాలు, మధురభక్తి, భక్తిరసం, భక్తి ప్రాశస్త్యం గురించి ప్రస్తావించడం జరిగింది.



# పాదసూచికలు

1. "పూజ్యేష్వనురాగో భక్తి రిత్యనదేశః"- శబ్దకల్పద్రుమము
2. అథాతో భక్తి జిజ్ఞాసా సాపరానురక్తిరీశ్వరే - శాండిల్య భక్తిసూత్రం
3. గీతాభాష్యం - 10-66- రామానుజులు
4. తైత్తిరీయారణ్యకం. ఈ అరణ్యకంలో అరుణి ప్రజాపతిని ఆత్మకల్యాణ కోసం ఉత్కృష్టమైన ఉపాయాన్ని కోరుతాడు. అందుకు ప్రజాపతి సత్యం తపం, దమం, శమం, ధర్మం, దానం, ప్రజోత్పత్తి, అగ్నిపూజ అగ్నిహోత్ర, యజ్ఞమానస, ఉపాసన న్యాసాలను బోధించి, అందులో న్యాస శ్రేష్టమని ఉపదేశిస్తాడు.
5. త్వం అసాక్మమ్ తవస్మాసి-ఋగ్వేదం 8-92-32
6. తం పత్నీభిః అనుగచ్ఛేమ దేవాః పుత్రైర్భ్రాతృభిుత
వాహిరణ్యైః నాకం గృష్ణానాః సుకృతస్య లోకే
తృతీయే పృష్టే అధిరోచనే దిపః (యజుర్వేదం 150-50)
7. గోపాల పూర్వతా పిన్యుపనిషత్తు(నారద భక్తి సూత్రం-18)
8. "యప్రీతి రవివేకానాం విషయేష్వన పాయినీ
త్వం అనుస్మరత సామే హృదయాన్మాపసర్పతు" (విష్ణుపురాణం 1-206
9. "సవై పుంసాం పరో ధర్మో యతో భక్తి రధోక్షజే
అహైతుక్య ప్రతి హతా యయా త్మాసంప్రసీదతీ"
10. "అనన్యమమతా విష్ణామమతా ప్రేమసంగతా
భక్తి రిత్యుచ్యతే భీష్మ ప్రష్లోదోద్భవ నారదైః (నారదపాంచరాత్రము, నా భ.సూ.పుట-17)
11. "మహాత్మ్య జ్ఞాన పూర్వస్తు సుదృఢః సర్వతో ధికః
స్నేహోభక్తి రితి పోక్తస్తయా ముక్తిర్నచాన్యథా
జ్ఞానపూర్వం పరస్నేహో నిత్యాభక్తి రితీర్యతే
మధ్వాచార్యుల మహాభారత తాత్పర్య నిర్ణయం (నారద భక్తి సూత్రం పుట-22)

12. మయ్యావేశ్య మనోమేమాం నిత్యయుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయో పేతాః తేమే యుక్తతమా మాతాః (12-2)
13. మయ్యేవ మన ఆధత్స్వమయి బుద్ధిం నివేశయ
నివనిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః (12-8)
14. సాత్వస్మిన్ సరమ ప్రేమరూపా (నారద భక్తి సూత్రం-2)
15. కథా దిష్వతి గర్గ (నారద భక్తి సూత్రం-17)
16. అత్మరత్యవిరోధేనేతి శాండిల్య (నారద భక్తి సూత్రం-18)
17. పూజాదిష్వనురాగ ఇతిపారాశర్యః (నారద భక్తి సూత్రం-16)
18. సూత్రభాష్యం (4-1-1)
19. "ధ్యానంచ తైల ధారావద విచ్ఛిన్న స్మృతి సంతానరూపమ్
ధ్రువాస్మృతిః స్మృతి లమ్భే సర్వగ్రన్థీనాం విప్రమోక్షః (శ్రీభాష్యం 1-1-1)
20. రామకృష్ణ బోధామృతం - ప్రచురణ-రామకృష్ణసేవాశ్రమం-మద్రాసు
21. **Swmi Vivekananda Complete Works Vol.III,P.P.31**
22. **Naradabhakthi Suthra-P.P.-5 Swami Sivananda Saraswathi**
23. నారద భక్తిసూత్రం 56- "గౌణీత్రి విధాగుణ భేదాదార్తాది భేదాద్వా"
24. నారద భక్తిసూత్రం-పుట-119 జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి
25. ఆంధ్ర మహా భాగవతం-3-944,945,946
26. కామోత్కంఠిత గోపికల్..........(7-18)
27. సంకీర్తన సంపుటం-3-260, నానా భక్తులివి నరుల మార్గములు 2-469
("బహుభక్తి నీమీద పచరించేనయ్య")
28. భగవద్గీత-7వ అధ్యాయం-16వ శ్లోకం
29. నారద భక్తి దర్శనం, పుట-120, జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి
30. తెలుగు సాహిత్యంలో భక్తితత్త్వం, పుట-169, కొడాలి సోమసుందరం
31. దక్షిణ భారతీయ భాషలలో శ్రీ వేంకటేశ్వర వాఙ్మయము, సంపాదకుడు-జి.డి.నాయుడు, పుట128
32. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1010

33. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-18-14
34. ఆంధ్ర మహాభాగవతం-10-పూ-827
35. ఆంధ్ర మహాభాగవతం -10-పూ-828
36. ఆంధ్ర మహాభాగవతం -10-పూ-1708
37. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-99
38. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-17
39. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-223
40. సంస్కృత భాగవతం-7-5-23
41. ఆంధ్ర మహాభాగవతం-7-167
42. భక్తిరాసామృత సింధువు-2-43
43. ఆంధ్ర మహాభాగవతం-10-పూ-549
44. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-355
45. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-322
46. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1043
47. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-464
48. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-2-48
49. ఆంధ్ర మహా భాగవతం-7-169
50. ఆంధ్ర మహా భాగవతం 7-169
51. ఆంధ్ర మహా భాగవతం-3-243
52. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-988
53. ఆంధ్ర మహా భాగవతం-2-11
54. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-34
55. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-343
56. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-343
57. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-16
58. ఆంధ్ర మహా భాగవతం-7-170
59. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-85
60. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-966
61. ఆంధ్ర మహా భాగవతం-2-8
62. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-27

63. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-27
64. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-408
65. భక్తిప్రకాశమ్ పుట-65
66. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-566
67. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-570
68. ఆంధ్ర మహా భాగవతం-10-పూ1045,1047
69. ఆంధ్ర మహాభాగవతం-10-పూ-1029
70. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1268
71. ఆంధ్ర మహా భాగవతం-1-247
72. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-286
73. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-155
74. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-488
75. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-191
76. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-66
77. భక్తి ప్రకాశమ్, పుట-90
78. దేవపూజారహస్యము-పుట-33
79. ఆంధ్ర మహా భాగవతం-7-169
80. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1274
81. ఆంధ్ర మహా భాగవతం-3-243
82. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1061
83. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1078
84. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-173
85. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-82
86. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-6-31
87. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-134
88. భగవద్గీత-అధ్యాయం-9-34 శ్లో
89. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1198

90. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-100
91. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-679
92. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-18-84
93. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-245
94. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-131
95. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-24
96. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-380
97. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-348
98. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-454
99. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-4-32
100. భక్తి రసామృత సింధువు-1-183
101. ఆంధ్ర మహా భాగవతం-11-42
102. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1708
103. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-827
104. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-828
105. ఆంధ్ర మహా భాగవతం-7-170
106. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-261
107. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-23
108. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-266
109. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-55
110. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-259
111. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-20
112. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-504
113. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-131
114. ఆంధ్ర మహా భాగవతం- భక్తితత్త్వోన్మీలనము పుట-639
115. ఆంధ్ర మహా భాగవతం-10-ఉ-981
116. ఆంధ్ర మహా భాగవతం-10-ఉ-983

117. ఆంధ్ర మహా భాగవతం-10-ఉ-1004

118. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-457

119. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-496

120. ఆంధ్ర మహా భాగవతం-1-356

121. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-296

122. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-438

123. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-503

124. సంస్కృత భాగవతము-శ్రీధర వ్యాఖ్య-7-5-23

125. ఆంధ్ర మహా భాగవతం-8-641, 642

126. ఆంధ్ర మహా భాగవతం-8-589

127. ఆంధ్ర మహా భాగవతం-8-90

128. ఆంధ్ర మహా భాగవతం-8-90

129. ఆంధ్ర మహా భాగవతం-8-92

130. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-302

131. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-437

132. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-385

133. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-445

134. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-401

135. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-155

136. "గుణమాహాత్మ్యా సక్తి, రూపాసక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయాసక్తి, పరమవిరహాసక్తి, రూపా ఏకదా అపి ఏకదశాభవతి". (నారద భక్తి సూత్రం-82)

137. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-259

138. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-261

139,140. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-221,222
141. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-241
142. ఆంధ్ర మహా భాగవతం-8-515
143. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-4-2-20
144. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-24-160
145. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-92
146. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1709
147. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-27-577
148. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-230
149. ఆంధ్ర మహా భాగవతం-8-590,592
150. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1015,1016
151. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-5-502
152. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-255
153. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1076
154. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1741
155. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1010
156. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-999
157. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-18-14
158. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-973
159. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-972
160. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-786,787
161. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-87
162. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-429
163. శ్రీ మద్భాగవత పురాణ పరిశీలనము-పుట-29,30
164. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-1322
165. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-7-282
166. నారదా భక్తిసూత్రం-2

167. సంస్కృత భాగవతం-11-14-20
168. ఆంధ్ర మహా భాగవతం-7-243
169. ఆంధ్ర మహా భాగవతం-7-168
170. ఆంధ్ర మహా భాగవతం-3-243
171. ఆంధ్ర మహా భాగవతం-10-పూ-350
172. ఆంధ్ర మహా భాగవతం-1-64
173. ఆంధ్ర మహా భాగవతం-8-657
174. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-56
175. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-74
176. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-20
177. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-1-44
178. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-222
179. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-261
180. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-369
181. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-3-260
182. అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-2-131

# సాహిత్య దృక్పథాలు - పోతన, అన్నమయ్య

కవుల యొక్క దృక్పథం వారి సాహిత్య నిర్మాణంలో తెలుస్తుంది. దృక్పథం అంటే తత్త్వం, ఉద్దేశం, భావన, ఆలోచనా విధానం అనే అర్థంలో చెప్పవచ్చు. పోతన అన్నమయ్యల విషయంలో దృక్పథం అన్నమాట నైతికంగా రెండు రూపాలుగా లేదా రెండు విడిపదాలు (దృక్, పథం) అర్థంలో అన్వయించినట్లయితే వారి దృక్ (చూపు) కైవల్యంపై ఉంది. ఆ కైవల్యం చేరడానికి వారు ఎంచుకున్న పథం (మార్గం), భాగవతా రచన (పోతన), సంకీర్తన (అన్నమయ్య) ప్రక్రియలు. పోతన భాగవత రచన అనే మార్గం శ్రీకృష్ణ స్వరూపం. అన్నమయ్య సంకీర్తన అనే మార్గం శ్రీ వేంకటేశ్వర స్వరూపం. కైవల్యం పొందాలనే వీరిరువురు వారి వారి మార్గంలో విష్ణుతత్త్వాన్ని కీర్తిస్తూ పయనించారు. అలా పయనిస్తూ, వారు ప్రత్యక్షంగా చూసిన చెట్టూ, పుట్టా, రాయీ రప్ప మనిషి, జంతువు, కన్పించిన ప్రతి వస్తువు విష్ణు స్వరూపాలు (విష్ణావతారాలు)గానే గోచరించాయి. వీరు అంతర్లీనంగా (పరోక్షంగా) దర్శించినది నిర్గుణ రూప అనంతుణ్ణి. వీరికి దప్పిక గొన్నా, ఆకలివేసినా భగవత్ కథా గుణ నామలీలా విభూదుల్ని మాత్రమే పానం చేశారు.

"హితేన సహితం సాహిత్యం....." సమాజ శ్రేయస్సులో సాహిత్యానికి చాలా ప్రాధాన్యం ఉంది. సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపించడానికి సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకున్న మహనీయులెందరో ఉన్నారు. అయితే భక్తితో సదా భగవత్ కీర్తనల్ని పానంచేస్తూ భక్తి సాహిత్యాన్ని వెలువరించిన (అందించిన) ఏ కొద్దిమంది భక్తి కవులలో పోతన, అన్నమయ్యలు చెప్పదగ్గవారు. వీరి నోటి (కలం) వెంట వచ్చిన (జాలువారిన) సాహిత్యం నీతి, హితోపదేశాలను తెలిపే సుబోధ సాహిత్యమేకాక, మానవ జీవిత పరమార్థాన్ని, నిత్యానందాన్ని ఇచ్చి అధిక సుఖదమైనది అయిన మోక్షాన్ని ప్రసాదించే సాధనంగా ఉపకరిస్తుంది. మోక్షం కోరేవారు, వీరు పయనించిన (మోక్ష) మార్గంలో కేవలం భక్తితో పయనిస్తే చాలు కైవల్యాన్ని పొందగలరని సూచించారు.

## పోతన సాహిత్య దృక్పథం :

"సరసుని మానసంబు సరసజ్ఞుడెరుంగును"[1] అన్నట్లుగా భగవద్భక్తుడైన పోతన మనస్సు (దృక్పథం) ను తెలుసుకోవడానికి భక్తితో కూడిన పరిశీలన

అవసరం. పోతన దృక్పథం తన భాగవత రచనలో కన్పించినంత వరకు కనుక్కోవడానికి ప్రయత్నించాలి.

## భాగవత రచన- కైవల్యదృష్టి:

భక్తి ద్వారా ముక్తిని పొందాలన్నదే ప్రధానంగా పోతనలో కన్పించే దృక్పథం. అందుకే భక్తి ప్రాశస్త్యాన్ని అనేక పద్యాలలో కొనియాడాడు. ఆ పద్యాలు భక్తితత్వం అనే ప్రకరణలో ఉదహరణగా చెప్పడం జరిగింది. "పూర్ణజీవితము, పూర్ణ జ్ఞానము, పూర్ణ సుఖము. ఇవియే మానవుని పరమ గమ్యములు"[2] మానవ జీవిత పరమార్థం కైవల్యం. ఈ కైవల్యం "గోవింద నామ కీర్తన" (2-11) ద్వారానే సాధ్యమవుతుంది. ఆ గోవిందుని కీర్తించే అవకాశం భాగవతం ఇస్తుంది. కావున పోతన ముక్తిప్రదాయకమైన భాగవతాన్ని కైవల్యం పొందడానికి రచిస్తున్నానని భాగవత ప్రారంభ పద్యంలోనే తన కైవల్య కాంక్షను ఇలా తెలిపాడు.

శా॥ "శ్రీ కైవల్యపదంబుఁజేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁగేళిలోల విలసద్దృగ్జాల సంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్"(1-1)

అంటే పోతన కైవల్యానికి సాధనోపాయం భాగవతానువాదం అని గుర్తించాడు. కారణం "హరినామ స్తుతి జేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళి సురుచిర భ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుగొందు"నని (1-94). "................ ఈ భాగవతమున విష్ణుసేవాబుద్ధి విస్తరిల్లు, మోక్షగామునకు మోక్షంబు సిద్ధించు" (2-7) అని అందుకే "ప్రబ్బిన హరిభక్తిని హరిపై కబ్బంబులు సెప్పి కవులు కైవల్య శ్రీకబ్బుదురట" (10-పూ-356) అన్న విశ్వాసం కలిగింది. అందులో శ్రీరాముడే కనిపించి "శ్రీ మహాభాగవతంబు తెనుగుసేయుము నీకు భవబంధంబులు దెగునని" (1-15) చెప్పడంలో రెట్టింపు నమ్మకం కలిగింది. "పురాకృత శుభాధిక్యంబు (1-19)" అనుకూలించింది. (నన్నయ తిక్కనాది కవులు భాగవతాన్ని తెలుగుజేయక పోవడం) కాబట్టి, "వేఱొండుగాథ బలుకగనేల" (1-16) అనుకొన్నవాడై "కామింపకయును సర్వము కామించియునైన ముక్తి కామించి తగన్ లోమించి పరమ పురుషుని నేమించి భజిస్తూ" (2-39) "సిద్ధ మునివర్తనుడై" (1-313) "సమ్మతి శ్రీహరికిచ్చి" (1-11) భాగవతాన్ని రచించాడు.

"మోక్షమంటే శాశ్వత సుఖానుభవం"[3] అలాంటి శాశ్వతానందాన్ని పొందగోరే ముముక్షువులకు పోతన భాగవతం సులభ పఠనం. కావున అది సార్వకాలికమై, సార్వజనీయమై మనగలదు అని చెప్పవచ్చు.

**లౌకికాయిష్టత :**

"............శ్రీకృష్ణ కథాసుధారసము సంప్రీతాత్ములై భక్తిగ్రోలిన పుణ్యాత్ములు గాంతురిందు సుఖముల్ నిర్ధూత సర్వాఘులై అనయంబున్ దుదిగాంతు రచ్యుత పదంబైనట్టి కైవల్యమున్" (10-ఉ-1332) అంటూ భాగవత రచనా రహస్యాన్ని ధ్వనింపజేసిన పోతన అలౌకికమైన (మోక్షం) వస్తువును లేదా ఆనందాన్ని పొందగోరినవాడు. కావున సిరిసంపదలు మొదలైన లౌకిక వస్తువు లేదా ఆనందాన్ని కాంక్షించలేదు. అందులో లౌకికమైన వస్తువులు అనిత్యాలు, అశాశ్వతాలు అని పోతన దృష్టి. కావుననే పోతన నిత్యసంతోషి, నిత్య సంతృప్తి గల వయోమనః పరిణతి కలవాడుగా కనిపిస్తాడు అనడానికి క్రింది పద్యాలే నిదర్శనాలు.

"కారేరాజ్యులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతింబొందరే
వారేరీ సిరిమూటగట్టుకొనిపోవంజాలిరే భూమిపై(
బేరైనంగలదే శిబిప్రముఖులు బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!" (8-589)

"కడమల్ గాదు గదా?? భవన్నిలయముల్" (1-265)

"కలుగడే నాపాలి కలిమి సందేహించి కలిమిలేములు లేక కలుగువాడు" (8-87) "హోము హిరణ్యదానములు పుచ్చుకొనంగ, ధనంబులేమియున్‌దేము" (1-465)

విష్ణుదేవుని మూర్తితత్త్వాన్ని కన్నుల ముందు సర్వదా దర్శించేవాడు పోతన. ఆయనకు లౌకిక వస్తు విషయాల మీద మనసు మరలడానికి అవకాశమే లేదు. పోతనకు భగవంతుని చింతించడం తప్ప భవచింతన లేదు.

**శ్రీరామస్తుతి:**

భాగవత స్కంధ అద్యంతాలలో పోతన శ్రీరామస్తుతి చేయడంలో గల ఉద్దేశం భాగవతారంభ పద్యాల్లోనే కనిపిస్తుంది.

"ఏ కథలందు పుణ్యశ్లోకులు హరిసెప్పబడు సూరిజనులచే
నాకథలు పుణ్యకథలని యాకర్ణింపుదురు పెద్దలతి హర్షమున్" (8-21)

అనుకొన్నవాడై భాగవత రచనా కుతూహలుడై వున్న పోతన శివుని ప్రార్థిస్తుంటే "........... మన్నామాంకితముగ శ్రీ మహా భాగవతంబు తెనుగుజేయుము" (1-15) అని చెప్పినవాడు రాముడే. భాగవతాన్ని "పలికించు విభుండు రామభద్రు"డే (1-16) కాబట్టి శ్రీరాముడే తనచే యీ పని చేయిస్తున్నట్టు భావించిన పోతన స్కంధాద్యంతాలలో శ్రీరాముని స్తుతించినట్లు తెలుస్తుంది. మరొక విషయాన్ని గమనిస్తే అష్టాక్షరీ మంత్రంలో 'రా'జీవం, పంచాక్షరీ మంత్రంలో 'మ' జీవం కావున రామ అనే శబ్దం అంత ప్రభావవంతమైంది. నిత్యానందాన్ని ప్రసాదించేది, ముక్తిప్రదాయకమైనది కూడా రామమంత్రమే అని చెప్పవచ్చు. పరమ భాగవతుడైన హనుమంతుడు కూడా శ్రీరామభక్తితోనే చరితార్థుడైనాడు.

రంగనాథ, భాస్కర, మొల్ల రామాయణం మొదలైన రామాయణ గ్రంథాలు విరివిగా

**షష్ఠ్యంతాలు (అంకితం) :**

శ్రీరాముడు "...........మన్నామాంకితంగా భాగవతాన్ని రచించమని తద్వారా నీకు భవబంధాలు తెగిపోతాయని చెప్పినా షష్ఠ్యంతాలలో శ్రీకృష్ణుని స్తుతించాడు పోతన. కారణం తన చేత భాగవతాన్ని పలికించినవాడు రాముడు.[4] అంటే భాగవత రచనకర్త పోతన దృష్టిలో శ్రీరాముడే. కాబట్టి గ్రంథభర్తగా కృష్ణుని యెంచుకున్నట్టు తెలుస్తుంది. అంతేకాక విష్ణుతత్త్వాన్ని కొనియాడిన పోతన దృష్టిలో రామునికి, కృష్ణునికి భేదమే లేదు. విష్ణువే రాముడైనా, కృష్ణుడైనా. వారిద్దరే విష్ణువు.

**స్మార్తభక్తి :**

"శ్రీవైష్ణవమునకు భాగవతము ప్రధానమైన ప్రమాణగ్రంథము"[5] అయితే పోతన భాగవత రచనలో అద్వైత భావం కల స్మార్తుడుగా కనిపిస్తాడు. పోతన తల్లిదండ్రులు శైవులు. తండ్రి శైవమత శాస్త్ర మతము గనినవాడు. తల్లి సదాశివ పాదయుగార్చనానుకంపానయ వాగ్భవాని. అన్న తిప్పయ ఈశ్వరసేవాకాముడు. పోతన పూర్వ వంశస్థులంతా సదాశివార్చనాసక్తులు. అందుకే "హరిజన్మకథనంబు"

తెలిపే భాగవత రచనాసక్తుడై పోతన మొదట "......... హరికి నిత్యప్రియుడు హరుని" (4-879) ధ్యానించాడు. "చేతులారంగ శివుని పూజించి నోరునొవ్వం హరికీర్తినుడివి"న పోతన దృష్టిలో, సాహిత్య సృష్టిలో శైవ వైష్ణవ భేద దృ లేదు. కారణం - రామమంత్రాన్ని సదా ధ్యానం చేసేవాడు శివుడు. శి అర్చించి పూజించేవాడు రాముడు. కావున 'హరికి నిత్యప్రియుడగు హరు అన్న పోతన మాటల్లోనే హరిహరులు పరస్పర నిత్యప్రియులు అన్న పో భావన అర్థమవుతుంది. "శైవులకు శివుడే కనిపిస్తాడు. వైష్ణవులకు విష్ణు కనిపిస్తాడు. తిక్కనకు ఇద్దరూ ఒక్కటిగా కనిపిస్తారు. పోతనకు ముందువెనుక శివవిష్ణువులు కన్పించారు"[6] పోతన బాలకృష్ణునిలో శివుని దర్శించిన విధ ఇలా వుంది.

సీ॥ "తనువున నంటిన ధరణీపరాగంబు
పూసిన నెఱిభూతిపూఁతగాక
ముందట వెలుఁగొందు ముక్తాలలామంబు
తొగల సంగడికాని తునుక గాఁగ
ఫాలభాగంబుపైఁబరగు గావలిబొట్టు
కాముని గెల్చిన కన్నుగాఁగ
కంఠమాలికలోని ఘన నీలరత్నంబు
కమనీయమగు మెడకప్పుగాఁగ

హారవల్లు లురగ హారవల్లులు గాఁగ
బాలులీల ప్రౌఢబాలకుండు
శివుని పగిదినొప్పె శివునికిం దనకును
వేఱులేమిఁ దెలుప వెలయునట్లు" (10-పూ-296)

అంతేగాక, సందర్భానుసారంగా శివుని స్తుతించి శివునిపై గల భక్తి ప్రకటించాడు అనడానికి మచ్చుకు మరికొన్ని ఉదాహరణలు.

సీ॥ "భూతాత్మ! భూతేశ! భూతభావనరూప!
దేవ! మహాదేవ! దేవవంద్య
యీ లోకములకెల్ల నీశ్వరుండవు నీవ
బంధమోక్షములకుఁ బ్రభుఁడ వీవ

యార్తశరణ్యుండవగు గురుండవు నిన్నుఁ
గోరి భజింతురు కుశలమతులు
సకలసృష్టి స్థితి సంహారకర్తవై
బ్రహ్మవిష్ణు శివాఖ్యఁ బరఁగు దీవు
పరమగుహ్యమైన బ్రహ్మంబు సదసత్త
మంబు నీవ శక్తిమయుఁడ వీవ
శబ్దయోని వీవ జగదంతరాత్మవు
నీవ ప్రాణ మరయ నిఖిలమునకు (8-222)

ఆ॥ మూఁడు మూర్తులకును మూఁడు లోకములకు
మూఁడు కాలములకు మూలమగుచు
భేదమగుచు మది నభేదమై యొప్పారు
బ్రహ్మ మనఁగ నీవ ఫాలనయన! (8-227)

"..........గౌరీశ్వరుడు దక్కనన్యుడు. విశ్వభయదక్షిషము మ్రింగి లయంగలడే" (10-పూ-1104)

పై పద్యాలలో మహేశ్వరుని భూతాత్మ అని, భూతేశుడు అని, ాతభావనారూపుడని, దేవుడని, మహాదేవుడని, దేవతలచే స్తుతించబడేవాడని, ◌్వరుడని, బంధమోక్షాలకు ప్రభువని, సృష్టి స్థితి సంహారకర్త తని, బ్రహ్మం, క్తి, అంతరాత్మ తానే అని కొనియాడాడు.

హరిహరులిద్దరు పోతనకు ఇష్టదైవాలే. శివధ్యానం, రామస్తుతి, కృష్ణాంకితం (కృష్ణవర్ణనం) చేసిన పోతన శివరామకృష్ణ నామధేయుడుగా నిపిస్తాడు. పరమాత్మ లేదా భగవంతుడనబడే ఫాల (విష్ణువు)లోనే పెరుగు, న్న, నెయ్యి వున్నాయని తెలియజేశాడు.

**నాథ శబ్దం :**

పోతవ భాగవత రచనలో శ్రీనాథ పదం ఎనిమిది సార్లు ప్రయోగించాడని లుస్తుంది. శ్రీనాథునకు పోతన సమకాలికుడని, చరిత్రకారుల నిర్ణయం. అంతేకాక ోతన శ్రీనాధునకు బావమరిది అని ప్రచుర ప్రచారంలో ఉన్న నమ్మకం కాబట్టి ోతన శ్రీనాధ పదప్రసక్తిని తేవడం శ్రీనాథకవిని స్మరించినట్లవుతుందా? అన్న

ప్రశ్నార్థకం మరియు ఎనిమిదిసార్లు ప్రయోగించడం వల్ల అష్టమూర్తియైన మహేశ్వరుని పూర్ణమూర్తిని పోతన ఇందులో నిక్షేపించాడా అన్న ఊహ పండితాభిప్రాయంలో కనిపిస్తుంది.

పోతనకు శ్రీనాథుని పట్ల భక్తిగౌరవాలు, బంధుత్వం అయితే ఎనిమిదిసార్లే కాక మరికొన్నిసార్లు కూడా ప్రయోగించి వుండవచ్చుకదా! ఏదిఏమైనా శ్రీనాథకవిపై పోతనకు గల భక్తి శబ్దవాచకమైతే ఎనిమిదిసార్లు ప్రయోగించడానికి అష్టాక్షరీ మంత్రం కూడా మరొక కారణం అని చెప్పవచ్చు. శ్రీనాథుడైన శ్రీమన్నారాయణుని అష్టాక్షరీ మంత్రాన్ని నిరంతరం ధ్యానించి ముక్తికోసం భాగవతాన్ని రచించిన పోతన ఆ మంత్రంలో వున్న "ఓం నమో నారాయణాయ అన్న ఎనిమిది అక్షరాలలో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క శ్రీనాథ శబ్దం ప్రయోగించి వుండవచ్చు కదా అన్న సందేహం కూడా వస్తుంది.

శ్రీనాథ నాథా (8-203), శ్రీనాథ కథలు (4-386), శ్రీనాథ కళాంశజుడు (4-452), శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ (7-169), శ్రీనాథ సంప్రాప్తులై (8-382), శ్రీనాథుండంశ భాగ శిష్టత (10-పూ-66), శ్రీనాథుడు భక్తియుతులచేతంబోలెన్ (10-పూ-388), శ్రీనాథాకృతివైన నిన్నుగని (10-పూ-1647).

## గుణాలు :

పోతన తన గురించి ముఖ్యంగా "పరమేశ్వర కరుణాకలితుడను, సహజ పండితుడను, సాధునయ యుక్తుండను" అని మూడుమాటలు (గుణాలు) చెప్పాడు. ఈ విధంగా పోతన చెప్పడంలో గల ఉద్దేశం గమనిస్తే, శ్రీ పరమేశ్వర కరుణాకలితుడని సగర్వంగా, సహజపండితుడనని సవినయంగా, సాధునయ యుక్తుండనని సద్వివేకంగా చెప్పుకున్నట్టు తెలుస్తుంది.

## శ్రీ పరమేశ్వర కరుణాకలితుడు:

శ్రీ పరమేశ్వరుడు అంటే పోతన దృష్టిలో శివుడా, విష్ణువా అని కాదు. పోతన యొక్క "......... అఖిల భావములకు ఆత్మయు హేతువు" (8-385) అయిన భగవంతుడు. అతడే మోక్షకారకుడు. అంతేగాక శ్రీపరమేశ్వరుడు అన్న పదప్రయోగంలో 'శ్రీ'లో లక్ష్మీదేవి ఉంది. కాబట్టి పోతన దృష్టిలో మోక్షకారకుడు లక్ష్మీపతియే. అయితే పోతన శ్రీపరమేశ్వర కరుణాకలితుడు

కావడానికి కారణం తాను సర్వకాల సర్వావస్థల యందు హరి చింతనామృతాన్ని గ్రోలి తన్మయుడై చరించే ప్రహ్లాదతత్వం గలవాడు కావడమేనని తెలుస్తుంది.

"పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁడేతద్విశ్వమున్ భూవరా!" (7-123)

**సహజ పండితుడు :**

"చదువనివాడజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత గల్గున్" (7-130) అన్న పోతన సహజ పండితుడని చెప్పడంలో చదువురాని వాడు కాదు. తండ్రిలోని బహుకళానిధిత్వం సంక్రమించగా శ్రీపరమేశ్వర కరుణాకలితం తోడై పాండిత్య ప్రతిభ కలిగి సహజ పాండిత్యమబ్బింది. పూవు పుట్టంగానే పరిమళిస్తుందన్నట్లు. పోతన పుట్టగానే పరిమళించిన తెలుగు పుష్పం.

**సాధునయయుక్తుడు:**

తన పురాకృత శుభాధిక్యమేమో పోతనకు చిన్ననాటి నుండి భక్తిసంస్కారమల వడింది. అందులో పోతన వంశ పూర్వుడు సుభగుడైన భీమనమంత్రి సౌందర్య స్ఫురణ, తండ్రి లలితమూర్తిత్వం, తల్లి దయామయిత్వం పోతన సాధునయయుక్తికి కారణాలు కావచ్చు. భాగవతంలో కంస, శిశుపాలాది విష్ణువిరోధులు భగవత్ తత్వాన్ని తెలుసుకోలేక దురహంకారంతో గర్వంతో శ్రీకృష్ణుని నిందించే సందర్భాలున్నాయి. అలాంటి సందర్భంలో భగవత్ భక్తికి మాత్రమే స్థానమైన తన మనస్సు గాయపడకుండా సాధునయత్వం గల పోతన యుక్తితో వ్యాజస్తుతివరమైన వ్యంగ్య విధానాన్ని అవలంబించడం ద్వారా సాధునయయుక్తుండన్న గుణాన్ని సార్థకం చేసుకున్నాడు.

**నిర్గుణభక్తి :**

భక్తితో సదా భగవంతుని ధ్యానించేవాడు భక్తుడు. ధ్యానంలో ఏకాగ్రత కుదరడానికి మొదటి ప్రయత్నంగా ఏదో ఒక వస్తువుపై మనసు లగ్నంచేసి సదా ఆ వస్తువునే దర్శించాలి. ఆ వస్తువు భగవద్విగ్రహమైతే భక్తితో ఆ భగవత్స్వరూపాన్ని మనసులో దర్శించి ఏకాగ్రత సాధిస్తాడు. అలా సాధించిన భక్తుడు విగ్రహ

స్వరూపాన్ని కూడా మరచి ప్రపంచ స్వరూపుడైన భగవంతుని చూడగలుగుతాడు. అంటే తాను విగ్రహ రూపంలో చూసిన దైవం ప్రపంచంలోని అన్ని వస్తువుల్లోనూ కనిపించి భగవంతుడు విశ్వవ్యాపకుడన్న నిజాన్ని తెలుసుకుంటాడు. ఇదే స్థితి పోతనలో కూడా జరిగింది. పోతనకు ధ్యానం చేసే గుణం ఉంది.[8] శివరూపాన్ని దర్శించి ధ్యానంచేస్తే శ్రీరామ సగుణరూపం కనిపించింది. భాగవత రచనా ధ్యానంలో పోతన అవతారాది రూపాలను సగుణంగానే దర్శిస్తూ విశ్వవ్యాపకుడైన (విష్ణుతత్త్వాన్ని) విష్ణు నిర్గుణత్వాన్ని కొనియాడాడు (దర్శించాడు).

"హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన! వింటే" అని చెప్పగలిగారు (2-17)

కలడంబోధి గలండుగాలి గల డాశకాశంబునం గుంభిన్
గలడగ్నిన్ దిశలం బగళ్ళనిశలన్ ఖద్యోత చంద్రాత్మలన్
గలడోంకారమునం ద్రిమూర్తుల ద్రిలింగ వ్యక్తులందంతటన్
గలడీశుండు గలండు దండ్రి! వెదకంగానేల యీయాయెడన్" (7-274)

"ఇందుగలడందు లేదను
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందేగలడు దానవాగ్రణి వింటే" (7-275)

పై పద్యంలో భగవంతుడైన విష్ణువు విశ్వవ్యాపకుడని, సర్వాంతర్యామియని ఇక్కడున్నాడా, అక్కడున్నాడా అన్న సందేహమే అక్కరలేదని తెలిపాడు పోతన. ఈ సారాంశంలో తేలిందేమిటంటే భగవంతుడు నమ్మినవారికి నిధి, నిధానం అని తెలుస్తుంది.

## విష్ణు (పరబ్రహ్మ)తత్త్వం :

వ్యాసుడు శ్రీకృష్ణుని భగవత్ స్వరూపుడుగానే సంబోధించాడు.[9] అంటే శ్రీకృష్ణుడు స్వయంగా భగవానుడే గాని భగవదవతారం కాదు.[10] అలాంటి

........ భగవంతుడును, సాక్షాద్విష్ణుండును నైన కృష్ణుడు" (2-174) పోతన భాగవత ఆరాధ్యదైవం ఆతడే పోతన పాలిట పరబ్రహ్మం.[11] ఆ పరబ్రహ్మతత్త్వాన్ని ఈ విధంగా కొనియాడాడు పోతన.

సీ॥ "విశ్వంబునీవయై విశ్వంబుజూచుచు
విశ్వంబుజేయుచు విశ్వమునకు
హేతువై పంచభూతమాత్రేంద్రియ
ములకు మనః ప్రాణబుద్ధి చిత్త
ములకెల్ల నాత్మవై మొనసిగుణంబుల
నావృతమగుచు నిజాంశభూత
మగు నాత్మచయమున కనుభూతి సేయుచు
మూఢహంకృతులనే ముసుగువడక

తే॥ నెఱిననంతుడవై దర్శనీయ రుచివి,
కాక సూక్ష్ముడవై నిర్వికారమహిమ
దనరి కూటస్థుడైన సమస్తంబు నెఱుగు,
నీకు మ్రొక్కెదమాలింపు నిర్మలాత్మ" (10-పూ-679)

"ఎవ్వనిచేజనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
ఎవ్వని యందుడిందుఁబరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వఁడనాది మధ్యలయుడెవ్వడు సర్వముఁదానయైన వా
డెవ్వడు వానినాత్మభవునీశ్వరునే శరణంబువేడెదన్" (8-73) అంటూ

శరణాగత తత్త్వాన్ని ప్రకటించాడు.

అన్ని రూపులు తానైయున్న ఆ విష్ణుతత్త్వాన్ని ఎవరి భావనకు తగిన విధంగా దర్శించడం జరుగు తుందని అలాంటివారికి కంకణాలు ఎన్ని వున్నా బంగారం ఒకటే కదా! అలల్లు ఎన్ని వున్నా సముద్రమొక్కటే కదా! ఇందులో వస్తుభేదం లేదని తెలియజెప్పాడు

సీ॥ "భావించి కొందఱు బ్రహ్మంబునీవని
తలపోసి కొందఱు ధర్మమనియు
జర్చించి కొందరు సదసదీశ్వరుడని
సరవిఁగొందఱు శక్తి సహితుడనియు
జింతించి కొందఱు చిరతరుండవ్యయు
డాత్మతంత్రుడు పరుండధికుడనియు
దొడరి యూహింతురుతుదినద్వయ
సదసద్విశిష్ట సంశ్రయుడవీవు

తే॥ తలపనొక్కింత వస్తుభేదంబు గలదె
కంకణాదుల పసిడి యొక్కటి యగాదె
కదలు పెక్కైన వార్ధి యొక్కటి యగాదె
భేదమంచును నిను వికల్పింపరాదు" (8-386)

విష్ణుతత్త్వాన్ని స్తోత్రరూపాలుగా కీర్తించాడు. రుద్రుడు ప్రచేతసులకు శ్రీహరితత్త్వాన్ని తెలియజేసే సందర్భంలో శ్రీహరి నామ, రూప, గుణ లీలావిభూతుల్ని కొనియాడిన విధం విష్ణు సహస్రనామ మంత్రాలుగా గోచరిస్తాయి.

సీ॥ "పంకజనాభాయ, సంకర్షణాయ, శాం
తాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేంద్రియాత్మనే సూక్ష్మాయ, వాసుదే
వాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి
కారాయ కర్మవిస్తారకాయ, త్రయీ
పాలాయ త్రైలోక్యపాలకాయ
సోమరూపాయ, తేజో బలాఢ్యాయ స్వ
యంజ్యోతిషే దురంతాయ కర్మ

తే॥ సాధనాయ, పురాపురుషాయ, యజ్ఞ
రేతసే జీవతృప్తాయ, పృథ్వీరూప
కాయ, లోకాయ, నభసే-౦తకాయ, విశ్వ
యోనయే, విష్ణవే, జిష్ణవే నమో-స్తు

సీ॥ "స్వర్గాపవర్గ సుద్వారాయ, సర్వర
సాత్మనే పరమహంసాయ ధర్మ
పాలాయ సద్ధిత ఫలరూపకాయ కృ
ష్ణాయ, ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ ఘనసాంఖ్య యోగీశ్వరాయ, హి
రణ్యవీరాయ, రుద్రాయ శిష్ట
నాథాయ, దుష్టవినాశనాయ, శూన్య ప్ర
వృత్తాయ కర్మణే మృత్యవే, వి

తే॥ రాట్ఛరీరాయ, నిఖిలధర్మాయ వాగ్వి
భూతయే నివృత్తాయ సత్పుణ్యభూరి
వర్చసేఽ ఖిల ధర్మదేహాయ, చాత్మ
నేనిరుద్ధాయ, నిభృతాత్మనే నమోఽస్తు

సర్వసత్త్వాయ, దేవాయ, సన్నియామ
కాయ, బహిరంతరాత్మనే కారణాత్మ
నే, సమస్తార్థ లింగాయ నిర్గుణాయ
వేధసే జితాత్మక సాధవే నమోఽస్తు (4-702, 703, 704)

పోతన దశావతారాలలో విష్ణుతత్త్వాన్ని కొనియాడిన విధం గమనించదగింది. పోతన క్రింది పద్యాలలో దశావతారాలను తిర్యక్ మనుష్య, ఋష్య, జలచర అవతారాలుగావర్ణించాడు. "జన్మకర్మ శూన్యుండవైన నీవు తిర్యగాది జీవులయందు వరాహాది రూపంబులను, మనుష్యులందు రామాది రూపంబులను, ఋషులందు వామనాది రూపంబులను, జలచరంబుల యందుగాని మత్స్యాది రూపంబులును నవతరించుట లోక విడంబనార్థంబుగాని, జన్మ కర్మ సహితుండ వగుటం గాదు" (1-190)

| | | |
|---|---|---|
| తిర్యక్ అవతారాలు | : | వరాహ, నరసింహ, కూర్మ |
| మనుష్యావతారాలు | : | రామ, బలరామ, కల్కి |
| ఋష్యావతారాలు | : | వామన, పరశురామ, |
| జలచరావతారాలు | : | మత్స్య |

బ్రహ్మాది దేవతలు దేవకీ గర్భస్థుడైన విష్ణువును స్తుతించే సందర్భంలో దశావతార విశేషాలు కన్పిస్తాయి.

"గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీ నృకే
సరివై భిక్షుడవై హయాననుడవై క్ష్మాదేవతా భర్తృవై
ధరణీనాథుడవై దయాగుణ గణోద్ధారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే" (10-పూ-100)

శ్రీకృష్ణుడు పొరుగింట్లో వెన్న దొంగిలించినందుకు కోపంతో యశోద శ్రీకృష్ణుని శిక్షించాలని అనుకొంది. ప్రయత్నంతో పట్టుకున్నది గాని కొట్టడానికి చేతులు రాలేదు. చివరికి ఒక రోలుకు కట్టేస్తూ యశోద శ్రీకృష్ణునితో పల్కిన మాటల్లో దశావతారాలు కనిపిస్తాయి.

సీ॥ "తోయంబులివియని తొలగక చొచ్చెదు
తలచెదుగట్టైన దరలనెత్త
మంటితో నాటలు మానవు కోరాడె
దున్నత స్తంభంబు లూపబోయె
దన్యుల నల్పంబు లడుగంగఁబాఱెదు
రాచవేటల జాల అవ్వదెచ్చె
దలయవు నీళ్ళకు నడ్డంబు గట్టెదు
ముసలివై హరివృత్తి మొనయజూచె

ఆ॥ "దంబరంబు మొలకు నడుగవు తిరిగెద
వింకఁగలికి సేతలేల పుత్ర
నిన్ను వంపవ్రాల్ప నేనేరనని యొనీ
విట్టుక్రిందు మీద నెఱుగ కునికి" (10-పూ-375)

శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాలను అపహరించిన సందర్భంలో గోపికలు తమ వస్త్రాలను తమ కిమ్మని శ్రీకృష్ణుని ప్రాధేయపడుతున్న వారి మాటల్లో దశావతార ప్రస్తావన కనిపిస్తుంది.

సీ॥ "బహుజీవనముతోడ భాసిల్లియుండుటో
గోత్రంబు నిల్పుటో, కూర్మితోడ

మహినుద్ధరించుటో, మనుజ సింహంబవై
ప్రజలగాచుటో కాక బలిఁదెరల్చి
పిన్నవైయుండియు బెంపు వహించుటో
రాజులగెల్చుటో రణములోన
గురునాజ్ఞసేయుటో గుణనిధివై
బలప్రఖ్యాతిఁజూపుటో, భద్రలీల

ఆ॥ బుధులు మెచ్చభువిఁబ్రబుద్ధత మెఱయుటో
కలికితనము సేయఘనత గలదె
వావిలేదు వారి వారు నావారని
యెఱుగవలదెవలువ లిమ్ముకృష్ణ" (10-పూ-819)

చాణూరుడు శ్రీకృష్ణునితో అన్న క్రిందిమాటల్లో శ్రీకృష్ణ స్తుతి దశావతార ప్రస్తావనగా కనిపిస్తుంది.

సీ॥ "చలమున నినుదాసి జలరాశిఁ జొరరాదు,
నిగుడిగోత్రము దండ నిలువరాదు
కేడించి కుంభిని క్రిందికిఁబోరాదు
మనుజ సింహుండని మలయరాదు,
చేరినఁబడవైతుఁజెయ్యి సాఁపఁగరాదు,
బెరసి నాముందర బెరగరాదు
భూనాథ హింసకుబోరాదు, ననుమీఱి
శోధింతుగానలఁజొరగరాదు

ఆ॥ ప్రబలమూర్తి ననుచు భాసిల్లగరాదు
ధరబ్రబుద్ధుడనని దఱుమరాదు
కలికితనము చూపి గర్వింపగరాదు,
తరముగాదు కృష్ణ, తలగు తలగు" (10-పూ-1340)

భాష :

"ఆనాటి ప్రజలలో కొందఱికి సంస్కృత భాషాభిమానమధికము కాగా మఱికొందరికి తెలుగుపై మక్కువ ఎక్కువని తెలియుచున్నది".[12] అయితే నాటి నేటి సాహిత్యాభిరుచికి అనుగుణంగా తన సాహిత్యం సార్వకాలికమై ఉండాలన్నదే పోతన ఉద్దేశం అని తెలుస్తుంది.

"కొందఱికి తెనుగు గుణమగు
కొందఱికి సంస్కృతంబు గుణమగు రెండున్
కొందఱికి గుణములగు నే
నందఱి మెప్పింతుగృతులనయ్యెయడలన్"(1-18)

అన్న పోతన మాటల్లో సంస్కృత, తెలుగు పండితులను మెప్పించే రీతిలోనే గాక పామర జనకంగా కూడా భాగవత రచన సాగించి అందరినీ (వయోభేదం లేదు) మెప్పించే రీతిలో ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ పూనాడు. అనగా వ్యవహారిక భాషను ఎంచుకున్నట్లు తెలుస్తుంది. వ్యవహారిక భాషకు భక్తి కలం తోడై భక్తి సాహిత్యంగా రూపుదిద్దుకుంది. అందుకే భక్తి వున్న ప్రతి మనస్సులోనూ భాగవత పద్యాలు ప్రార్థనాగీతాలుగా వున్నాయి. నేటికి పాఠశాలల్లో పిల్లలు ప్రార్థనాగీతాలుగా పాడుకొనేవి భాగవత పాద్యలే, పల్లె ప్రజల నాలుకల్లోనూ నర్తించేవి భాగవత పద్యాలే. అంతేగాక సభలు సమావేశాలలో పురాణ కాలక్షేపాలలో కూడా ప్రార్థనాగీతాలుగా భాగవత పద్యాలు వాడుకోవడం ఇప్పటికి వాడుకలో వుంది. కారణం అవి కేవల పద్యరూపంలో వున్న సంగీతప్రదమైన గీతాలు. పోతనకు సంగీతంలో అభినివేశం వున్నట్లు కూడా భాగవత సాహిత్యంలో కన్పిస్తుంది.[13]

## విష్ణువృక్షం :

పోతన భాగవత ఫలాన్ని ఆస్వాదించి విత్తనాన్ని తెలుగు పొలంలో నాటి భక్తి అనే నీరు పోసి పెంచాడు. "దశావతారాలలో శ్రీకృష్ణావతారానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లే భాగవతం లోని పన్నెండు స్కంధాలలోనూ దశమ స్కంధానికి ఒక విశిష్ట స్థానం ఉన్నది"[14] అలాంటి దశమ స్కంధం ఆ చెట్టుకు మొదలు (మూల) శాఖ. ఇది విష్ణు (శ్రీకృష్ణ) రూపం కలిగినది. ఇది మోక్షప్రదాత. ఇతర శాఖలు ఆ చెట్టుకు మిగిలిన స్కంధ రూపాలుగా ఉన్నాయి. ఇవి భక్తి ప్రదాతలు. అందులో ఫలించే ఫలాలు భాగవత కథలు. స్ఫూర్తి ప్రదాతలు. నీడనిచ్చే ఆకులు ఆశ్రయాన్నిచ్చి హితోపదేశాన్ని బోధించే సూక్తి ప్రదాతలు.

ఉదాహరణకు కొన్ని సూక్తులు. కలిగిన కొలది దానం చెయ్యాలని అలా చెయ్యనివాడు ఉన్నా లేనివాడని తెలిపాడు.

అన్నమైన దోయమైన ద్రవ్యంబైన
శాకమైనఁదనకు జరుగుకొలది
నతిథిజనుల కడ్డమాడక యిడరేని
లేమ! వారు కలిగి లేనివారు (8-464)

అన్నీ వున్నా లేదని చెప్పేవాడు ప్రాణమున్న శవం లాంటివాడు.

"సర్వమైనచోట సర్వధనంబులు
నడుగలేదటంచు నన్నృతమాడు
చెనఁటి పందనేమిచెప్పఁబ్రాణముతోటి
శవమువాడు వాని జన్మమేల" (8-582)

పరులకు మేలు చేయడమే పరమ ధర్మంగా బోధించాడు.

"పరహితము సేయునెవ్వడు
పరమహితుండగును భూతపంచకమునకున్
బరహితమె పరమ ధర్మము
పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ! (8-235)

కొన్ని సందర్భాలలో తల్లినైనా, భార్యనైనా, ఇల్లైనా వదలి పెట్టాలి, అన్న విషయాన్ని క్రింది పద్యం తెలియజేస్తుంది.

'పొగడొందు జనని గాని
తగవున వర్తించునట్టి దయితయకానీ
తగనుండని గృహమున నుం
టగుఁజక్రవిహీన రథము నందుంటరయన్" (4-780)

వావివరుసలు లేకుండా ప్రవర్తించే వాడు జీవించి కూడా చచ్చినవాడితో సమానమని, వాడు నరకానికి పోతాడని తెలిపాడు.

"వావినెఱుంగని క్రూరుని
జీవన్మృతుండనుచు నిందసేయుదురతడున్
బోవును నరకమునకు దు
ర్భావముతో బ్రతుకుటొక్కబ్రతుకే తలపన్" (10-పూ-81)

బుద్ధిబలం, బాహుబలం కలిగినవాడు తల్లికి ఒక్కడుంటేచాల: తెలియజేశాడు.

"కడుపు బరువుగాగ గొడుకుల గనుకంటే
తల్లికొకడెచాలు బల్లిదుండు" (8-683)

తన ఇంటిలో ధనాన్ని తాను అనుభవించడానికి, దానధర్మాలకు, కీర్తికి ఆశ్రయించిన వారికి వినియోగించాలని చెప్పాడు.

సీ॥ "దనయింటగల సర్వధనమెల్ల నైదుభాగములు
గా విభజించి కామమునకు,.....

తే॥ అర్థమునకు, ధర్మ యశముల కాశ్రిత
బృందములకు సమత బెట్టునట్టి
పురుషుడిందుఁబూర్ణుడై మోదించు
దన్నుమానిచేత తగవుకాదు"

బంగారం వలె కాలం కూడా చాలా విలువైనదని కాలాన్ని వ్యర్థ చేయకూడదని తెలిపాడు.

"బంగారువంటి యీ బ్రతికెడు కాలంబు వోనాడగనేల పుణ్యచరిత" (1-391) మొదలైనవి పోతన సృష్టించిన విష్ణురూప వృక్షంలో కనిపించే నీతిపా బోధనలు. అయితే, అతి రహస్యమైన ఈ విష్ణురూప వృక్షాన్ని దర్శించాలన్నా ఆశ్రయించాలన్నా మోక్షకాంక్ష ఉండాలి. భక్తి గలవారికి మాత్రమే ఈ మో కాంక్ష పుడుతుంది.

**వస్తువు :**

ప్రతి కవి గ్రంథారంభంలో నమస్కారం, ఆశీర్వాదం, వస్తునిర్దేశం చేయాల లాక్షణికుల అభిప్రాయం. పోతన నమస్కారంలోనే వస్తునిర్దేశం చేశాడు. భాగవత "లలిత స్కంధము కృష్ణమూలము (1-20) కాబట్టి మహానందాంగనాడింభకుడై (1-1) శ్రీకృష్ణుని లీలాచరిత్ర ఇందలి వస్తువు అని ప్రారంభ పద్యంలోనే చెప్పాడ కారణం "ఉన్న పన్నెండు స్కంధాలలో దశమం, ఏకాదశం దాదాపు స్కంధాల సగభాగం శ్రీకృష్ణుని జీవితాన్ని ఉపదేశాన్ని వివరిస్తుండగా మొదట రెం

స్కంధాలలోనూ శ్రీకృష్ణావతార ప్రభావం, మూడవ స్కంధంలో ఆయన సమకాలంలో వర్తిల్లిన భక్తివతంసులు విదురోద్ధవుల స్మృతి రూప సంవాదం నిబద్ధమై ఉన్నాయి."[15] శ్రీకృష్ణుడు విష్ణువు అవతారమే గాక పోతన గ్రంథానికి కృతిభర్త. ఇతర కవులు కృతిభర్తలకు ఆశీర్వాదాలు కలుగుగాక అని ప్రారంభ పద్యాలలో ఆశీర్వచనాలు చేస్తారు. అయితే పోతన కృతిపతి భగవంతుడే కావున అతని స్మరణతోనే భాగవతాన్ని ప్రారంభించాడు.

**ఊహ:**

"కవిత్వములో ఊహకున్న స్థానము తక్కువది కాదు. భారతీయ సాహిత్యములో దానికి గణనీయ స్థానమే కలదు. ఈ ఊహ భావనల సమున్నత శక్తితో భాగవత కర్తయగు పోతన సుమనోహరమగు కవితా శిల్పమును చక్కగా నిర్మించాడు."[16]

పోతన ఊహలు సమగ్రంగా, విశదంగా ఉండి పాఠకుల మనోనేత్రాలకు సాక్షాత్కరిస్తాయి. ఈ ఊహలన్నీ పోతనకు భక్త్యావేశంతో కలిగినవే యని చెప్పవచ్చు. కారణం అవి సందర్భానుసారంగా భగవంతుని లీలా విభూతుల్ని భక్తుల తత్త్వాలను కొనియాడే సందర్భంలో అతని కలం నుండి పుట్టుకొచ్చిన అమృత ధారలు. ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించడానికి ఆయుధమనవసరం లేదని మనసుంటే చాలని తెలియజెప్పిన పోతన మానవుని సహజత్వాన్ని భగవంతునికాపాదించాడు.

గజేంద్రమోక్ష ఘట్టంలో విష్ణువు మకరి(మొసలి) నుండి గజేంద్రుని రక్షించే సందర్భంలో భక్తుని ఆర్తనాదం అనంతుని అయోమయ స్థితిలో పడేసింది, దాని ఫలితమే యీ క్రింది పద్యం పోతన కలం నుండి జాలువారింది.

"సిరికింజెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపడే
పరివారంబును జీరఁడభ్రగపతిం బన్నింపఁడాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాద ప్రోద్ధత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడఁడు గజ ప్రాణావనోత్సాహియై" (8-96)

భక్త రక్షణలో భగవంతుని పాత్ర ఎలాంటిదన్న ప్రశ్నకు ఈ పద్యమే సమాధానం చెపుతుంది. ఇదే ఘట్టంలో వైకుంఠంలో లక్ష్మీ మహావిష్ణువుల క్రీడావిన్యాసం ఊహామాత్రంగా పోతన దర్శించాడు.

"అల వైకుంఠపురంబులో నగరిలో ఆ మూలసౌధంబు దా
పల మందార వనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము "పాహి పాహి" యనఁగు య్యాలించి సంరంభియై"(8-

వామనావతార ఘట్టంలో చాలా వరకు ఊహాకల్పనలే కనిపిస్తా
వామనావతార మూర్తియైన మహావిష్ణువు బలిని మూడడుగుల దానమ
విశ్వాకారాన్ని ప్రదర్శించిన తీరు పోతన ఊహల్లో సాక్షాత్కరించింది.

"ఇంతింతై వటుడింతయై, మఱియుఁదానింతై నభోవీధిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై" (8-620

"రవిబింబంబుపమింప బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటి స్థలినుదంచ ద్ఘంటమై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడుఁదా బ్రహ్మాండమున్నిండుచోన్" (8-62

అట్లే రుక్మిణీ కల్యాణ ఘట్టంలో రుక్మిణికి కలిగిన సందేహం పోత
ఊహాకల్పితం.

"ఘనుడా భూసురుడేగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండిది తప్పుగా దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డను కూలింపఁదలచునో తలపడోఁ యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నా భాగ్యమెట్లున్నదో (10-పూ-172

అలాగే శ్రీకృష్ణుని దుడుకుచేతలు భరించలేని గోపికలు యశోదక
మొరపెట్టుకొన్న పల్లె వాతావరణం పోతన ఊహామాత్రంగాదర్శించినాడ
చెప్పవచ్చు.

ఓయమ్మ నీ కుమారుడు
మాయిండ్లనుఁబాలు పెరుగు మననీదమ్మా
పోయెదమెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ! (10-పూ-328)

గోపబాలుర, గొల్లభామల చర్యలు, గోపికా వస్త్రాపహరణంలో వర్ష, శర, హేమంత ఋతువర్ణనలు రాసక్రీడాభివర్ణనలు మొదలైనవి సమయానుగుణంగా సజాతులై ఊహానిర్మితాలుగా కనిపిస్తాయి. ఇవన్నీ పోతన సహజ పాండిత్యానికి, సరసజ్ఞతకు ప్రతీకలు.

ఉదాహరణకు కొన్ని :

సీ॥ "కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁజూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁదవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
దండ్రి! హరిఁజేరు మనియెడి తండ్రి తండ్రి" (7-169)

సీ॥ "మందార మకరంద మాధుర్యమునఁదేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁదూగు
రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాలపల్లవ ఖాదియై చొక్కు
కోయిల సేరునే కుటజములకు

బాలేందు చంద్రికా స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు

అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల! మాటలు వేయునేల?" (7-150)

"మన యశోద చిన్ని మగవాని గనెనట
చూసివత్తుమమ్మ సుదతులార" (10-పూ-183)

"బాలుండీతండని భావింతునందునా
యే పెద్దలును నేరరీ క్రమంబు
వెఱ పెఱుంగుటకు నై వెఱపితు నందునా
కలిగే లే కొక్కడు గాని లేడు
వెఱపుతో నా బుద్ధి వినిపింతు నందునా
తనుదానయై బుద్ధి తప్పకుండు
నొండెఱుంగక యింట నుండెడు నందునా
చొచ్చి చూడనిచోక చోటు లేదు

తన్ను నెవ్వరైనఁ దలపోయఁ బాఱెడు
నోజలేదు భీతియొక టెఱుంగఁ
డెలమి నూరకుండఁ డెక్కసక్కెముల నాడుఁ
బట్టి శాస్తి చేయు భంగి యెట్లు? (10-పూ-363)

"నీ పద్యావళులాలకించుచెవులన్ నిన్నాడు వాక్యంబులున్
నీ పేరంబనిసేయు హస్తయుగమున్ నీ మూర్తిపైఁజూపులున్
నీ పాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్
నీ పై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజ పత్రేక్షణా!" (10-పూ-406

స్థాయి- పోతన భక్తి :

ప్రధానంగా శ్రీహరి కథల్ని, భాగవతుల గాథల్ని తెలిపే భాగవతము క నిధానం. దీనిని భగవద్భక్తుడైన పోతన "సమ్మతి శ్రీహరికిచ్చి" (1-1) గవతాన్ని భక్తి సాహిత్యంగా రూపొందించి భక్తకవిగా ప్రసిద్ధి పొందాడు. క రసత్వాన్ని కల్పించిన కవిగా కన్పిస్తాడు. భాగవతాన్ని చదివినా, విన్నా, నం చేసినా "శ్రీహరి భక్తి వర్జితులకు" (7-168) సైతం భక్తి అలవడుతుంది. ందుకే పోతన విషయంలో భక్తి రసస్థాయికి చేరిందని చెప్పవచ్చు.

పోతన అన్ని రసాలను భాగవతంలో పోషించి తన రసపాటవాన్ని కటించాడు. రుక్మిణి కల్యాణ ఘట్టంలోని హార్దమైన అనురాగంలో శృంగారం. కాసుర సంహార ఘట్టంలో సత్యభామలోని వీర శృంగార మిళితం, అర్జునుడు కృష్ణ నిర్యాణ వార్తను ధర్మరాజుకు తెలిపే సందర్భంలో కరుణ, కంసాదుల ంహార ఘట్టాలలో వీర రౌద్రం, నృసింహ (ప్రహ్లాద చరిత్ర) అవతార ఘట్టంలో ద్ర, అద్భుతం, శ్రీకృష్ణుడు రుక్మిని పరాభవించే ఘట్టంలో హాస్య బీభత్సం, ంతి, భీష్మాదులు స్తుతించే సందర్భంలో శాంతం చక్కగా పోషింప బడింది. యితే "భాగవతంలో భక్తి అంగిరసం. శృంగార, వీర, కరుణాది రసాలు ంగరసాలు"[17] పోతనలో భక్తిరసం శృంగార, ఆధ్యాత్మికంగా కన్పిస్తుంది. ంగార భక్తిరసం "స్థూలదృష్టికి గోపికలు శ్రీకృష్ణుని యెడల ప్రదర్శించిన భావము కికమైన శృంగారము వలెనే గోచరించును. కాని సూక్ష్మముగా శీలించినప్పుడది లౌకికమును దైహికమునైన తుచ్ఛకామముకాక మోక్షరతితో ండిన యుజ్జ్వల శృంగారముగా గోచరించును."[18]

అంతేకాక వైరభక్తి కూడా పోతనలో రసస్థాయిని చేరింది. భాగవతంలో కృష్ణ విరోధులు. శ్రీకృష్ణుని నిందించే సందర్భాలలో పోతన అద్భుతమైన ్యంగ్య విధానాన్ని అవలంబించి తన మనస్సులో భక్తి చెడకుండా వ్యాజస్తుతి రంగా భక్తి రసత్వానికి భంగం కలగకుండా పోషించాడు. ఈ పద్ధతినే వలంబించి కాసుల పురుషోత్తమకవి ఆంధ్రనాయకశతకం రచించాడు.

క్తి రసం-శృంగారం :

"ఈ చరాచర జగత్తు శృంగారము లేక వృద్ధి పొందదు. సృష్టి హేతువగు ధునకర్మకు మూలం శృంగారభావమే. కనుక నది జగత్కారణమును,

జగదానందహేతువును నగు రసము. రెండు జీవుల పరమైక్యము దీనిలో తప్ప మరియొక్కదానిలో సాధ్యము కావు". [19]

శృంగార భక్తి రసం మధురభక్తిలో ప్రకటితం. నవవిధ భక్తితత్త్వం, వాత్సల్యతత్త్వం. ఆసక్తితత్త్వం, నానావిధ భక్తితత్త్వం ఈ మధురభక్తిలో చోటు చేసుకున్నవి. అలాంటి మధురభక్తిని ప్రకటించిన గోపికల్లో శృంగారాత్మకమైన భక్తిరసం కనిపిస్తుంది. అది జీవాత్మ, పరమాత్మ కోసం పడే తపన. అటువంటి వాళ్లను శ్రీకృష్ణపరమాత్మ ఆదరించాడు. క్రింది పద్యాలు గోపికలు శ్రీకృష్ణునితో అన్న మాటలు శృంగారాత్మకాలు.

సీ॥ " నీ యధరామృత నిర్ఝరంబులు నేఁడు
చేరి వాతెఱలపైఁ జిలుకకున్న
నీ విశాలాంచిత నిర్మల వక్షంబుఁ
గుచ కుట్మలంబులఁ గూర్పకున్న
నీ రమ్యతర హస్త నీరజాతంబులు
చికురబంధంబులఁ జేర్పకున్న
నీ కృపాలోకన నివహంబు మెల్లన
నెమ్మొగంబులమీఁద నెఱపకున్న

ఆ॥ నీ నవీన మాననీయ సల్లాపంబు
కర్ణరంధ్ర దిశలఁగప్పకున్న

మధిప! వినఁగఁదగదెయాఁడు కుయిలు" (10-పూ-994)

సీ॥ "ఈ చరణంబులే యిందునిభానన!
సనకాది ముని యోగసరణి నొప్పు
నీ పాదతలములే యెలనాఁగ! శ్రుతివధూ
సీమంత వీధులఁజెన్నుమిగుల
నీ

పాలేటిరాచూలి పట్టుకొమ్మ
లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ!
ముక్తికాంతా మనోమోహనంబు

ఆ॥ లీ యడుగుల రజమె యింతి! బ్రహ్మేశాది
దివిజవరులు మౌళిదిశలఁదాల్తు
రనుచుఁగొంద ఱబల లబ్జాక్షుఁదేగిన
క్రమముఁగనియు నతనిఁగానరైరి" (10-పూ-1029)

అలాంటి వారి మనస్సులను మరింత కట్టుదిట్టం చేయడానికి రుషోత్తముడు వాళ్ళకు తన తోటి సంగమాన్ని రుచి చూపించి వెంటనే ◌యమయ్యాడు. శ్రీకృష్ణుడు క్షణం కనిపించనంత మాత్రాన గోపికలు శ్రీకృష్ణుని రహ తాపాన్ని సహించలేక అన్వేషిస్తూ స్థావర జంగమాలనే వివక్ష లేకుండా న్మాదంతో భ్రాంతితో చెట్లను, తీగలను, పూలను, శ్రీకృష్ణుని జాడ చెప్పమని డిగే సందర్భంలో శ్రీకృష్ణుని వివిధ రూపాల వర్ణించే తీరులో పోతన గోపికయై రించి బ్రహ్మానందాన్ని పొంది శృంగార, భక్తి రసాన్ని స్థాపించాడు.

సీ॥ "పున్నాగ! కానవే పున్నాగవందితుఁ
దిలకంబ! కానవే తిలకనిటలు
ఘనసార! కానవే ఘనసార శోభితు
బంధూక! కానవే బంధుమిత్రు
మన్మథ! కానవే మన్మథాకారుని
వంశంబ! కానవే వంశధరునిఁ
జందన! కానవే చందనశీతలుఁ
గుందంబ! కానవే కుందరదను

తే॥ నింద్రభూజమ! కానవే యింద్రవిభవుఁ
గువలకృక్షమ! కానవే కువలయేశుఁ
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు
ననుచుఁ గృష్ణుని వెనకి రయ్యబ్జముఖులు" (10-పూ-1008)

ఉ॥ "నల్లనివాడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా
జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే
(10-పూ-1010)

తే॥ "పొగడఁ దగువానిఁ గానరే పొగడలార!
యీ తెఱంగని విభుఁజూపు డీడెలార!
మొల్లమగు కీర్తివాఁడేఁడి మొల్లలార!
శుకని గదితునిఁ జెపుఁడు కింశుకములార!" (10-పూ-1015)

ఆ విధంగా గోపికలు శ్రీకృష్ణుని అన్వేషిస్తూ ఉన్మత్తచిత్తులై వారు చేసిన చేష్టలు చిన్నికృష్ణుని బాల్య క్రీడలు, లీలలను గుర్తుకుతెస్తాయి.

సీ॥ "పూతననైయొక్క పొలఁతి చరింపంగ
శౌరినైయొక కాంత చన్నుఁగుడుచు
బాలుఁడై యొకభామ పాలకు నేడ్చుచో
బండి నేనను లేమఁబాఱఁదన్ను
సుడిగాలినని యొక్కసుందరి కొనిపోవ హరి
నని వర్తించు నబ్జముఖియు
బకుఁడనే నని యొక్క పడఁతి సంరంభింపఁ
బద్మాక్షుఁడను కొమ్మ పరిభవించు

ఆ॥ నెలమి రామకృష్ణులింతు లిద్దఱుగాఁగ
గోపవత్సగణము కొందఱగుదు
రసురవైరి ననుచు నబల యొక్కతె చీరుఁ
బసుల మనెడి సతుల భరతముఖ్య!" (10-పూ-1019)

కం॥ "వెన్నలు దొంగిలి తినియెడి,
వెన్నుఁడనని యొకతె నుడువ వేఱొక్కతె చే
సన్నల యశోద నంచును,
గ్రన్నన కుసుమముల దండఁ గట్టు నిలేశా!" (10-పూ-1021)

ఆ విధంగా గోపికల మనస్సులు శ్రీకృష్ణుడు ధ్యానమననంతో స్థిరపడ్డాక అప్పుడు వాళ్లకు పురుషోత్తముడు దర్శనమిచ్చాడు. వాళ్ళ ఆనందానికి అవధుల్లేవు. అతని స్పర్శతో ఆలనా పాలనతో వారి ఆర్తిని పోగొట్టి రాసక్రీడ, జలక్రీడ, మన్మథ క్రీడల్లో ఆనందింపజేశాడు. ఇందులో ప్రతి పాదంలోను ఒక అద్భుతమైన రమణీయ దృశ్యం, ఒక మనోహర ప్రణయభావం ఇలాంటి దివ్యమైన గోపిక శృంగారం తరువాత రుక్మిణీ కల్యాణ ఘట్టంలో శృంగార సిద్ధికై రుక్మిణి పడిన వేదనావస్థను పోతన వర్ణించిన తీరు శ్రీకృష్ణునికై రుక్మిణి పొందిన విరహవేదన గోపికా విరహవేదనకు తుల్యమైందని చెప్పవచ్చు. శృంగార భక్తిని రసస్థాయికి చేర్చడానికి మరొక అవకాశం రుక్మిణి ద్వారా పోతనకు కలిగింది.

మ॥ "ఘనులాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱు జన్మంబులన్
నినుఁజింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!
(10-పూ-1707)

ఈ విధంగా భాగవత శృంగారాన్ని మనోహరంగా తీర్చిదిద్దిన పోతన ఇతర రస ప్రధానమైన ఘట్టాల్లో కూడా శృంగారాన్ని పోషించాడు.

భక్తి రసం- **ఆధ్యాత్మికం :**

పోతనలో ఆధ్యాత్మిక రసం ఉప్పొంగి ఉరకలు వేసింది. దాని ఫలితమే కింది పద్యపుష్పములు. హరికథలను వినడం, కీర్తించడం, హరిని సేవించడం, వీక్షించడం, నమస్కరించడం, ఎల్లప్పుడు శ్రీహరి రూపాన్ని చిత్తంలో నిలుపుకోవడం, పోతన ఆధ్యాత్మిక తత్త్వానికి ప్రతీక.

శా॥ "నీపద్యావళులాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీపేరం బనిసేయు హస్తయుగమున్ నీ మూర్తిపైఁ జూపులున్
నీ పాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁజిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా!
(10-పూ-406)

మానవుడు సర్వేంద్రియాలు భగవంతునికై నియోగించాలి. భగవంతుని గుణ, లీల, విభూతుల్ని కొనియాడాలి. అర్చించాలి. భగవన్నామాన్ని చిత్తంలో సదాధ్యానించాలి అని చెప్పడంలో ఆధ్యాత్మిక రసం ప్రకటించబడింది.

సీ॥ "కమలాక్షు నర్చించు కరములు, కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁజూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁదవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తమునీ మీఁది బుద్ధి బుద్ధి

దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
దండ్రి! హరిఁజేరు మనియెడి తండ్రి తండ్రి" (7-169)

అంతేగాక హరికై వినియోగించని సర్వావయవములు, జన్మ వృధా అని తెలిపాడు. "హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్" (7-168) అంటూ తిట్టిపోశాడు. అందుకు ఈ క్రింది పద్యాలు ఉదాహరణ.

సీ॥ "సంసారజీమూత సంఘంబు విచ్చునే?
చక్రిదాస్య ప్రభంజనము లేక
తాపత్రయాభీల దావాగ్ను లాఱునే?
విష్ణుసేవామృత వృష్టిలేక
సర్వంకషాఘమౌ జలరాసు లింకునే?
హరి మనీషా బడబాగ్ని లేక
ఘన విపద్గాఢాంధకారంబు లణఁగునే?
పద్మాక్షు నుతి రవిప్రభలు లేక

తే॥ నిరుపమాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁగానవచ్చునే? ముఖ్యమైన
శార్ఙ్గకోదండ చింతనాంజనము లేక
తామిరసగర్భునకు నైన దానవేంద్ర!" (7-171)

సీ॥ "కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే?
పవన గుంభిత చర్మభస్త్రిగాక
వైకుంఠుఁబొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే?
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశుఁజూడని కన్నులు కన్నులే?
తనుకుడ్య జాల రంధ్రములు గాక
ఆ॥ చక్రిచింతలేని జన్మంబు జన్మమే?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే?
పాదయుగముతోడి పశువుగాక (7-170)

సీ॥ "అలరు జొంపములతో నభ్రంకషంబులై
బ్రతుకవే? వనములఁబాదపములు
ఖాదన మేహనాకాంక్షలఁ బశువులు
జీవింపవే? గ్రామసీమలందు
నియతిమై నుచ్ఛ్వాస నిశ్శ్వాస పవనముల్
ప్రాపింపవే? చర్మభస్త్రికలును
గ్రామసూకర శునకశ్రేణులింటింటఁ
దిరుగవే! దుర్యోగ దీనవృత్తి
తే॥ నుష్ట్రఖరములు మోయవే యురుభరములు
పుండరీకాక్షు నెఱుఁగని పురుష పశువు
లడవులందు నివాసములందుఁ బ్రాణ,
విషయ భర వృత్తితో నుంట విఫల మధిప!" (2-49)

సీ॥ "విష్ణుకీర్తనముల వినని కర్ణంబులు
కొండల బిలములు కువలయేశ!
చక్రి పద్యంబులు చదువని జిహ్వలు
కప్పల జిహ్వలు కౌరవేంద్ర!
శ్రీమనోనాథువీక్షింపని కన్నులు
కేకి పింఛాక్షులు కీర్తిదయిత!
కమలాక్షు పూజకుఁగాని హస్తంబులు
శవము హస్తంబులు సత్యవచన!
ఆ॥ హరిపద తులసీ దళామోదరతి లేని,
ముక్కు పందిముక్కు మునిచరిత్ర
గరుడగమను భజనగతి లేని పదములు,
పాదపముల పాదపటల మనఘ!" (2-50)

క॥ "శ్రీనాథ పరాఙ్ముఖులగు
హీనులు నొందంగఁజాల రిష్టార్థంబుల్" (8-326)

**భక్తిరసం- వైరం :**

క్రింది పద్యాలలో భగవంతుని నిర్వికారత్వం, నిర్గుణత్వం తెలుస్తుంది. అందరికి అయినవాడు, ఎవరికి ఏమీ కానివాడు భగ శబ్దార్థం కలవాడు అయిన భగవంతుని స్తుతిస్తూ బలి శుక్రాచార్యునితో అన్నమాటలు వైరభక్తి ప్రకటితం. తద్వారా భగవత్ విరోధుల్లో కూడా భక్తి రసస్థాయికి చేర్చాడు పోతన.

మ.కో॥ "ఎన్నఁడుం బరువేఁడబోఁడఁట యేకలం బఁట కన్నవా
రన్నదమ్ములు నైన లేరఁట యన్ని విద్యల మూలగో
ష్ఠిన్నెఱింగిన ప్రోడగుజ్జఁట చేతులొగ్గి 'వసింప నీ
చిన్నిపాపనిఁద్రోసిపుచ్చఁగ జిత్తమొల్లదు సత్తమా! (8-595)

అట్లే రుక్మిణీ కల్యాణ ఘట్టంలో రుక్మి శ్రీకృష్ణునితో అన్న కొన్ని మాటల్లో భక్తి ప్రకటించబడింది.

సీ॥ మాసరివాఁడవా మాపాపఁగొనిపోవ
    నేపాటి గలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెక్కడఁబెరిఁగితి
    వెయ్యది నడవడి యెవ్వఁడెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాద లెఱుఁగవు
    మాయఁగైకొనికాని మలయరావు
నిజరూపమున శత్రునివహంబు పైఁబోవు
    వసుధేశుఁడవు గావు వావి లేదు

ఆ॥ కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వమెల్లఁగొందుఁగలహమందు (10-పూ-1762)

చాణూర యుద్ధ ఘట్టంలో చాణూరుడు శ్రీకృష్ణుని పరోక్షంగా కీర్తించిన క్రింది పద్యం దశావతారాన్ని వర్ణిస్తుంది.

సీ॥ చలమున ననుడాసి జలరాశిఁ జొరరాదు
    నిగుడి గోత్రముదండ నిలుపరాదు
కేడించి కుంభినిక్రిందికిఁబోరాదు
    మనుజసింహుండని మలయరాదు
చేరినఁబడవైతు జెయ్యి సాపఁగఁరాదు
    బెరసి నాముందటఁ బెరుఁగరాదు
భూనాథ హింసకుఁబోరాదు నను మీఱి
    శోధింతుఁగానలఁ జొరఁగరాదు

ఆ॥ ప్రబలమూర్తి ననుచు భాసిల్లఁగారాదు
ధరఁబ్రబుద్ధుఁడ నని దఱుమరాదు
కలికితనము చూపి గర్వింపఁగారాదు
తరముగాదు కృష్ణ! తలఁగు తలఁగు (10-పూ-1340)

## భక్తి రసం- శృంగారాధ్యాత్మికం :

పోతనలో శృంగారాధ్యాత్మిక భక్తిరసం సమ్మిళితంగా రసస్థాయినందుకుంది. శృంగారాధ్యాత్మిక భక్తి రసానికి ఉదాహరణగా క్రింది పద్యాలను గమనించవచ్చు.

సీ॥ ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
        కర్ణరంధ్రంబుల కలిమియేల
    పురుషరత్నమ! నీవు భోగింపఁగా లేని
        తనులతవలని సౌందర్యమేల
    భువనమోహన! నిన్నుఁబొడగానఁగాలేని
        చక్షురింద్రియముల సత్త్వమేల
    దయిత! నీ యధరామృతం బానఁగా లేని
        జిహ్వకు ఫలరససిద్ధి యేల

ఆ॥ నీరజాతనయన! నీ వనమాలికా
    గంధమబ్బలేని ఘ్రాణమేల
    ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని
    జన్మమేల యెన్ని జన్మములకు (10-పూ-1708)

శా॥ ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
    బాదాబ్జంబులపైఁగపోలతటిపైఁ బాలిండ్లపై నూత్న మ
    ర్యాదంజెందు కరంబు గ్రిందగుట మీఁదై నా కరంబుంట మే
    ల్గాదే రాజ్యము గీజ్యముల్ సతతమే కాయంబు నాపాయమే
(8-591)

పోతన భాగవతంలోని పాత్రలన్నింటిలో తాను లీనమై పాఠకులను లీనమయ్యేటట్లు తన్మయుల్ని చేయడం పోతన ఉద్దేశ్యంగా తెలుస్తుంది. దాత, భక్తుడు, మిత్రుడు, విరోధి, తల్లిదండ్రి, నాయిక, నాయకుడు తానై చరించాడు.

"బాంధవముననైనఁ బగనైన వగనైనఁ
ప్రీతినైనఁ బ్రాణభీతినైన
భక్తినైన హరికి పరతంత్రులైయుండు
జనులు .........." (10-పూ-973)

భాగవతంలో ముఖ్యంగా కనిపించే పాత్రలు. ఆ పాత్రలు సజీవమూర్తులై ప్రత్యక్షంగా కంటికి కనిపించే రీతిలో తీర్చిదిద్దడంలో పోతన శిల్పచాతుర్యాన్ని ప్రకటించాడు. ఆ పాత్రల స్వరూప స్వభావాలు స్పష్టంగా పాఠకుల హృదయాలలో శాశ్వతంగా నిలిచేటట్లు చేశాడు. పోతన స్వరూప శిల్ప చాతుర్యమే కాక సంభాషణా చాతుర్యం భావచిత్రణ కనిపిస్తాయి.

**సంభాషణాచాతుర్యం:**

"**లేమా! దనుజులగెలవగ**

**లేమా! నీ వేలగణగి లేచితివిటురా**

**లేమా! నుమానవేనిన్**

**లేమా! విల్లందుకొనుము లీలంగేలన్**" (10-ఉ-172)

పై పద్యం నరకాసుర యుద్ధ సందర్భంలో శ్రీకృష్ణుడు సత్యభామతో అన్న మాటలు. "ఓ **లేమా!** రాక్షసులను గెలుచుటకు మేంలేమా! నీవేల కణగి లేచితివి. నీకా అవసరం రాదులే. ఇటు రాలే!" అన్న సంబోధనలో సంభాషణల చాతుర్యం కనిపిస్తుంది. అట్లే గోపికలు వస్త్రాపహరణ సందర్భంలో శ్రీకృష్ణునితో అన్న మాటలు క్రింది పద్యంలో గమనించవచ్చు.

"వచ్చెదము నీవు పిల్చిన
ఇచ్చెదమేమైన గాని యెటు చొరుమనినం
చొచ్చెదము నేడు వస్త్రము

లిచ్చి మముం కరుణతోడ నేలుము కృష్ణా" (10-పూ-828)

ఇలాంటి ఎన్నో సంభాషణాచాతుర్యానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. ఉదాహరణకు మరికొన్ని :

"ఎక్కడ నుండి రాక?" (9-391)
"వడుగా! ఎవ్వరివాడవు?" (8-549)
"**ఊరకరారు మహాత్ములు**" (10-పూ-284)

**భావచిత్రణ :**

వామనావతార ఘట్టంలో బలి మనస్సును గ్రహించిన పోతన భావచిత్రణకు క్రింది పద్యం ఉదాహరణ.

శా॥ ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁగపోలతటి పైఁ బాలిండ్లపై నూత్న మ
ర్యాదంజెందు కరంబు గ్రిందగుట మీఁదై నా కరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే(8-591)

బలి దానం చేయడానికి ఈ భావం ఒక ప్రధాన హేతువై ఒక ఉత్తమ భావ చిత్రణగా కనిపిస్తుంది. కృష్ణుడు పుట్టినప్పటినుండి మృత్యు భయంతో నిరంతరం హరిని తలచే కంసుని తత్త్వం పోతన భాగవత చిత్రణలో భాగవతతత్త్వాన్ని కొనియాడుతుంది.

సీ॥ "శ్రవణరంధ్రముల నే శబ్దంబు వినఁబడు
నది హరిపలు కని యాలకించు
నక్షిమార్గమున నెయ్యది చూడఁబడు నది
హరిమూర్తి గానోపునంచుఁ జూచుఁ
దిరుగుచో దేహంబుఁ దృణమైన సోఁకిన
హరి కరాఘాతమో యనుచుఁగలఁగు
గంధంబు లేమైన ఘ్రాణంబు సోఁకిన
హరి మాలికాగంధ మనుచు నదరుఁ

ఆ॥ బలుకులెవ్వియైనఁబలుకుచో హరిపేరు
పలుకఁబడియె ననుచు భ్రమసి పలుకుఁ
దలఁపు లెట్టివైనఁదలఁచి యా తలఁపులు
హరితలంపు లనుచు నలుగఁదలఁచు" (10-పూ-87)

"అల వైకుంఠపురంబులో", "మందార మకరందాది" పద్యాలెన్నో పోతన భావచిత్రణకు ప్రతీకలు. ఈ శిల్ప సంభాషణా చాతుర్యం, భావచిత్రణలే కాక నవరసాలను పోషించే నటనాచాతుర్యం కూడా పోతనలో కనిపిస్తుంది.

**వీరం :**

మధురభక్తికి ఆధారమైనది శృంగారం. గోపికలు శృంగార రస ప్రతీకలు. ఈ శృంగార రసం తర్వాత భగవంతుని మహత్త్వాన్ని ప్రకటించే వీరరసం ప్రధానమైంది. శ్రీకృష్ణుని రణక్రీడలన్నీ వీరరసానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. మచ్చునకు క్రింది పద్యం.

చ॥ "నుత నవపుండరీక నయనుండన నొప్పు మురారి రోషఘూ
ర్ణిత మహితారుణాబ్జదళనేత్రుడు(దానయి పంచె దైత్యుపై
దితిసుత కాననప్రకర దీపితశుక్రము రక్షించితా
శ్రితజన చక్రమున్ సతత సేవిత శక్రము దివ్యచక్రమున్" (10-ఉ-434)

**కరుణం :**

కృష్ణ నిర్యాణ ఘట్టంలో కరుణ రసం పోషించబడింది. శోకం దీని స్థాయీ భావం. అర్జునుడు కన్నీరు తుడుచుకుంటూ గద్గద స్వరంతో శ్రీకృష్ణుని నిర్యాణ వార్త ధర్మరాజుకు చెపుతున్న సందర్భంలో పఠితుల హృదయాలు కరిగించి కదలించే కరుణ రస భరితమైన హృదయం గల వాడుగా పోతన కనిపిస్తాడు.

క॥ "మన సారథి, మన సచివుఁడు,
మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్
మన విభుఁడు, గురువు,
దేవర మనలను దిగనాడి చనియె, మనుజాధీశా!" (1-356)

**అద్భుతం :**

వామనావతార ఘట్టంలో, నృసింహావతార ఘట్టంలో, కూర్మావతార ఘట్టంలో ఈ రసం పోషించబడింది. విస్మయం దీని స్థాయీభావం. కూర్మావతార కథలో విష్ణువు యొక్క లీలలు వర్ణించిన పోతన అద్భుత రసం చిత్రణకు క్రింది పద్యం ఉదాహరణ.

క॥ "తరిగాంౘ్రదలోన నొకఁడట,
తరికడవకుఁ గుదురు నాఁక త్రాడును జేరుల్
దరిగవ్వంబును దానఁట,
హరి హరి చిత్రలీల హరియే యెఱుఁగున్ " (8-205)

అట్లే వామనుని త్రివిక్రమ రూపంలోని ఆశ్చర్య స్వరూప దృశ్యం అద్భుత రసానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

మ॥ "ఒక పాదంబున భూమిఁగప్పి దివి వేఱొంటన్ నిరోధించి యొం
డొకటం మీఁద జగంబు లెల్లఁదొ్ఁడి నొండొంటన్ విలంఘించి ప
ట్టక బ్రహ్మాండ కటాహముం బగిలి వేంద్రంబై పగుల్ గానరా
నొకఁడై వార్ధృగలక్ష్యుఁడై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్"(8-623)

హాస్యం :

శ్రీకృష్ణుడు గోపబాలురతో చల్దులారగించే నందర్భంలో, రుక్మికి పరాభవం జరిగిన నందర్భంలో, బ్రహ్మదేవుడు కూడా గుఱ్ఱుమని నిద్రపోతాడని వర్ణించిన నందర్భంలో, వేశ్యలు ఋష్యశృంగుని గూర్చి పలికిన మాటలలో హాస్యం వర్ణించబడింది. హాసము దీని స్థాయీభావం.

సీ॥ "మాటిమాటికి వ్రేలుమడిచి యూరించుచు
యూరుఁగాయలు దినుచుండు నొక్కఁ
డొకని కంచములోని దోడిసి చయ్యన మ్రింగి
చూడులేదని నోరుసూపు నొక్కఁ
డేగు రార్గుర చల్దులెలమిఁ బన్నిదమాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ
డిన్నియుఁదగఁబంచి యిడుట చెన్నెలి తన
మనుచు బంతెనగుండులాడు నొకడు

ఆ॥ కృష్ణుఁజూడు మనుచుఁ గికురించు పరు మ్రోలి
మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు
నవ్వు నొకడుఁ సఖుల నవ్వించు నొక్కఁడు
ముచ్చటాడు నొకఁడు మురియునొకఁడు" (10-పూ-494)

మ॥ "నెఱి నెల్లప్పుడు నిల్చి ప్రాణిచయమున్ మీలింప నిర్మించి పీఁ
పిఱియ స్సీల్చుచు నావులింపుచు నజుం డేసృష్టియున్ మాని మే
నొఱఁగన్ ఱెప్పలు మూసి కేల్దలగడై యుండంగ నిద్రింపుచున్
గుఱు వెట్టం దొడఁగెన్ గల ల్గనుచు నిర్ఘోషింపుచున్ భూవరా!"(8-711)

సీ॥ "సేమమే యని సతుల్ చేతుల గ్రుచ్చి
కర్కశకుచంబులు మోపి కౌఁగిలించి
చిర తపోనియతి దస్సితి గదా యని మోముఁ
గంఠంబు నాభియుఁగలయుఁబుణికి
క్రొత్తదీవన లివి కొనుమని వీనుల
పొంత నాలుకలఁ జప్పుళ్ళు చేసి
మా వనంబుల పండ్లు మంచివి తిను మని
పెక్కు లడ్వంబులు ప్రీతి నొసఁగి

తే॥ చర్మవస్త్రము వదలించి భర్మకాంతి
మించి చెలఁగు పీతాంబర మిచ్చి వెసను
మనము సొక్కింప నతనిఁజేకొనగ వారి
మఱుఁగునకుఁ జేరె నతఁడువే మరగి వారి" (9-694)

రౌద్రం :

ప్రహ్లాద ఘట్టంలో హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో విష్ణుధిక్కారం చేసే విధం రౌద్రాన్ని ప్రకటిస్తుంది. క్రోధం దీని స్థాయీభావం.

శా॥ "నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండు, నాకంటె నీ
భూతశ్రేణికి రాజులేఁడొకఁడు సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నేవెదకితిన్ బల్మాఱు నారాయణుం
డేత ద్విశ్వములోన లేఁడు మఱి వాఁడెందుండురా దుర్మతీ!" (7-271)

బీభత్సం :

శ్రీకృష్ణ బాణాసుర యుద్ధ ఘట్టంలో యుద్ధ వర్ణన బీభత్సాన్ని వ్యక్తపరుస్తుంది. జుగుప్స దీని స్థాయీభావం. "దునిసిన శిరంబులును, దునుకలైన కరంబులును, దెగిన కాళ్ళును, డ్రస్సిన వ్రేళ్లను, దుమురులైన యెముకలును, బ్రోవులైన ప్రేవులును, నులిసిన మేనులును, నలిసిన జానువులును" (10-ఉ-414)

భయానకం :

గజేంద్ర మోక్ష ఘట్టంలో ఏనుగుల గుంపును చూసి ప్రాణభీతితో ఇతర జంతువులు పరిగెత్తడం భయానకాన్ని ప్రకటిస్తుంది. భయం దీని స్థాయీభావం.

సీ॥ "పులుల మొత్తంబులు పొదరిండ్లలోఁ దూఱు
ఘోరభల్లూకముల్ గుహలు సొచ్చు
భూదారములు నేలబొఱియలలో డాఁగు
హరిదంతముల కేగు హరిణచయము
మడుఁగుల జొరఁబాఱు మహిష సంఘంబులు
గండశైలంబులఁగవులు ప్రాఁకు
వల్మీకములు సొచ్చు వనభుజంగంబులు
నీలకంఠంబులు నింగి కెగయు

తే॥ వెఱచి చమరీమృగంబులు విసరు వాల
చామరంబుల విహరణశ్రమము వాయ
భయద పరిహేల విహరించు భద్రకరుల
గాలి వాఱిన మాత్రాన జాలిఁ బొంది" (8-29)

**శాంతం :**

శమము దీని స్థాయీభావం. ప్రహ్లాద ఘట్టంలో ప్రహ్లాదుని భక్తిపూరిఽ శాంత స్థితి క్రింది పద్యంలో గమనించవచ్చు.

ఉ॥ తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి కో
పన్నగశాయి! యో ధనుజభంజన! యో జగదీశ! యో మహా
పన్న శరణ్య! యో నిఖిలపావన! యంచు నుతించుఁగాని తాఁ
గన్నుల నీరుదేఁడు భయకంప సమేతుఁడు గాఁడు భూవరా!(7-193)

అట్లే సుదాముని శాంతరసోల్లాసానికి క్రింది పద్యం ఉదాహరణ.

క॥ "నీ పాదకమల సేవయు,
నీ పాదార్చకుల తోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును,
దామసమందార! నాకు దయసేయఁగదే! (10-పూ-1268)

**అనువాద విధానం- పోతన దృష్టి:**

"వేదకల్పవృక్ష విగళితమైన" భాగవతాన్ని "సరళ సుందరమగు కథానువాద విధానముతో బాటు, విగళిత వేదాంతర స్థితికిఁ గొనిపోవ జాలిన స్వరూప

స్తారముతోటి భావనానువిధానము మేళవింపబడినది."[20] అయితే, పోతన ‌గవతానువాదం చేయసంకల్పించినపుడు తాను అన్నమాటలో ఆత్మస్థైర్యం. ‌ణకువతనం కనిపిస్తాయి.[21]

పోతన మూలానికి మించి భాగవతానువాదం కేవల కథాసారాంశ ప్రధానంగా చేశాడు. మనసుకు హృద్యంగా ఉన్న భాగాలు మాత్రం యథాతథంగా అనువదించడం, అనవసరమనిపిస్తే వదలిపెట్టడం లేదా తగ్గించడం, అవసరమనిపిస్తే నూత్న వర్ణనలు, అన్యదా కల్పనలు అమూలకంగా సృష్టించడం, క్లిష్టమైన తాత్త్విక విషయాలు చెప్పవలసి వచ్చినపుడు వ్యాఖ్యాన సహాయాన్ని పొంది వివరణ రూపంగా అనువదించడం జరిగింది.

"తస్మాద్వైరానుబంధేన నిర్వైరేణ భయేనవ
స్నేహాత్ కామేనవా యుంజ్యాత్ కథంచిన్నేక్షతే పృథక్" (సం.భాగ-7-1-28)

పోతన దీనిని యించుమించు యధాతథంగా యిలా అనువదించినట్లు కనిపిస్తుంది.

ఆ॥ అలుకనైనఁ జెలిమి నైనఁగామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁడగు హరిఁ
జేరవచ్చు వేఱు సేయఁడతఁడు (7-14)

"ఇనుమయస్కాంత సన్నిధి" అన్న పద్యం మూలశ్లోకానికి (7-5-14) యథాతథమైన అనువాదం. ఏదిఏమైనా పోతన అనువాదంలో అమూలక సృష్టి దాదాపు వెయ్యి పద్యాల దాకా ఉండవచ్చుని పండితుల అభిప్రాయం. దానికి గల కారణం పోతనలోని భక్త్యావేశం. ఔచిత్యధోరణి కావచ్చు. సప్తమ స్కంధంలో పోతన ప్రహ్లాదుడై చరించిన తీరులో అమూలక సృష్టికి అదుపులేదని చెప్పవచ్చు. చదివించిరి ననుగురువులు (7-166), అంధేందూదయముల్ (7-168), కమలాక్షు నర్చించు కరములు కరములు (7-169), మోదముతోడ దైత్య కుల ముఖ్యుడు (7-137), ఉత్సాహప్రభు మంత్ర శక్తియుతమె (7-139), అనుదిన సంతోషణములు (7-145), సురలందోలుటయు సురాధిపతులన్ స్రుక్కించుటో (7-146), మందార మకరంద మాధుర్యమునదేలు (7-150) మొదలైనవి.

అట్లే, పోతన గజేంద్ర మోక్ష ఘట్టంలోని అమూలక సృష్టికి ఉదాహరణ అలవైకుంఠ పురంబులో (8-95), సిరికింజెప్పడు శంఖచక్రయుగమున్ (8-96), తనవెంట సిరి లచ్చివెంట నవరోధరాతముల్ (8-98), తనవేంచేయు పథంబు బేర్కొనడు(8-100), అని వితర్కింపుచు (8-101), తాటంకాచరణంబతో (8-102), అడిగినవి (8-103), నిటలాలకము వెంట నివుర జుంజుమ్మను (8-104), వినువీధింజనుదేర గాంచిరమరుల్ (8-105), అయ్యవసరంబున కుంజరేంద్ర పాలన పారవశ్యంబున (8-106) మొదలైన పద్యాల వరుసక్రమము గమనిస్తే పోతన భక్తిపారవశ్యము కలిగినపుడు మూలాన్ని మరిచిపోవడం వల్ల అమూల్యమైన పద్యాలు వెలువడ్డాయని చెప్పవచ్చు. అట్లే వామనావతార ఘట్టంలో అమూలక పద్యాలెన్నో కనిపిస్తాయి. దశమ స్కంధంలో అడుగడుగునా అమూలక సృష్టి దర్శనమిస్తుంది.

పోతన భక్తిభావంతో రాక్షసులను సైతం మోక్షకులుగా చేయగలడు. పూతన బాలకృష్ణునికి చనుగుడప ప్రయత్నించు సందర్భంలో శ్రీకృష్ణుని ముద్దాడుతున్నట్లు నటిస్తూ పల్కిన మాటల్ని గమనిస్తే పోతన పూతనకు కూడా మోక్షాన్ని ప్రసాదించే ప్రయత్నంచేసి సఫలుడయ్యాడని తెలుస్తుంది. దీనికి గల నిదర్శనం క్రింది పద్యలేనని చెప్పవచ్చు.

కు॥ ఆ పాపజాతి సుందరి,
యాపాపనిపాన్పుఁజేరనరిగి కరములన్
లేపి చనుంగవ శిశువున్,
మోపుచు ముద్దిడి శిరము మూర్కొని పలికెన్ (10-పూ-218)

కు॥ చను నీకుఁగుడుపఁజాలెడి
చనువారలు లేరు నీవు చనవలె నునుచున్
చనుగుడిపి మీఁద నిలుకడఁ
జనుదాన ననంగ వేడ్కఁజనుఁజను గుడుపన్ (10-పూ-219)

కు॥ నా చనుఁబాలొక గ్రుక్కెఁడు,
నో చిన్నికుమార! త్రావు మొయ్యన పిదపన్
నీ చెలువ మెఱుఁగవచ్చును
నాచెలువము సఫలమగును నళినదళాక్షా (10-పూ-220)

ఈ విధంగా శత్రువును మిత్రునిగా, దైత్యులను భక్తులుగా మార్చగల క్రియుక్తులు పోతనకు మాత్రమే సాధ్యమయ్యాయని చెప్పవచ్చు. "ఇట్లు క్తిరసపూరితములైన భగవత్తత్త్వ ప్రబోధకములైన ఘట్టములందే గాక దితర ఘట్టములందును పోతన అమూలక భావములత్యున్నత స్థాయిలో సానుభూతిని కలిగించుచుండును. సందర్భోచితములు, అనంతర కథకు రిపోషికములగు అష్టాదశ వర్ణనలు నలుపునపుడును, పరిపూర్ణములు, శిష్టములునైన రూపచిత్రణములు గావించునపుడును ఆయా పాత్రల నన్తత్వములను వెలువరించినపుడును చక్కని సంభాషణలు డిపించునపుడును మూలముకంటే భిన్నములైన విశేషములెన్నియో పోతన గవతమున నడుగడుగనా కానవచ్చును"[22] ఇవన్నీ పోతన భగద్భక్తికి తీకలై ఉన్నాయి.

క॥ జోజో కమలదళేక్షణ,
జోజో మృగరాజమధ్య జోజోకృష్ణా!
జోజో పల్లవకరపద!
జోజో పూర్ణేందువదన జోజోయనుచున్ (10-పూ-189)

ఆకాశవాణి పలుకులు విని కంసుడు దేవకిని చంపబోగా ఆ సమయంలో సుదేవుని కరుణరస పూరిత మాటలు మూలంలో కనిపించవు.

॥ అన్నవు నీవు చెల్లెలికి నక్కట! మాటలు చీరెలిచ్చుటో
మన్నన సేయుటో మధుర మంజుల భాషల నాదరించుటో
మిన్నుల మ్రోతలే నిజము మే లని చంపకుమన్న! మాని రా
వన్న! సహింపుమన్న! దగదన్న! వధింపకుమన్న! వేఁడెదన్ (10-పూ-26)

॥ చెలియల్ కన్నియ ముద్దరా లబల నీ సేమంబె చింతించు ని
ర్మల దీనిన్ బయలాడు మాటలకు నై మర్యాద వోఁగొట్టి స
త్కుల జాతుండవు పుణ్యమూర్తి వకటా! కోపంబు పాపంబు నె
చ్చెలి నోహోతెగ్రవేయఁబాడియగునే చింతించు భోజేశ్వరా!(10-పూ-28)

ఈవిధంగా పోతన అనువాద విధానం అమూలక సృష్టితో అలవోకగా గింది. పోతన కైవల్య దృష్టి స్కంధాద్యంతాలలో శ్రీరామస్తుతికి గల కారణాలు,

పోతన గుణాలు, అతడు భక్త్యావేశంతో కొనియాడిన విష్ణుతత్వం ద్వారా భక్తి రస స్థాయి చేరిందని చర్చించడం ఇందులో పోతనకు సంబంధించిన అంశాలు.

**అన్నమయ్య దృక్పథం :**

కీర్తన అంటే యిలా వుంటుందని, దాని స్వరూప స్వభావాన్ని తెలియజేసిన మొట్టమొదటి కవి, వాగ్గేయకారుడు, లాక్షణికుడు అన్నమయ్య. అందుకే తెలుగులోకం ఆయనను పదకవితా పితామహుడు, ద్రవిడాగమ సార్వభౌముడు అన్న బిరుదనామాలతో సత్కరించడంచేత మహాకవి అయినాడు. ఆ పదాలు హరి గుణగణాలను కీర్తించేవి కనుక హరి సంకీర్తనాచార్యుడని పిలువబడి ఆచార్యుడన్న మహోన్నత పదవినలంకరించి వాగ్గేయకారుడైనాడు. మొదటిగా సంస్కృత సంకీర్తన లక్షణ గ్రంథం (అలభ్యం) రచించి లాక్షణికుడైనాడు.

ఇతని తరువాతి కాలంలోని తెలుగు కవి, వాగ్గేయకారులందరికీ మరియు తెలుగేతర వాగ్గేయ కారులైన పురందరదాసు (కన్నడ), పాపనాశం శివన్ (తమిళం) మొదలైనవారికి కూడా ఆదర్శప్రాయుడు, మార్గదర్శకుడు అన్నమయ్య. తెలుగులో నాటి రామదాసు, త్యాగరాజాది వాగ్గేయకారుల నుండి నేటి బాలమురళీకృష్ణ మొదలైన వాగ్గేయకారుల వరకు అన్నమయ్య సాహిత్యాన్ని, సంగీతాన్ని, బాణీని, గౌరవించి ఆస్వాదించినవారే.

అన్నమయ్య సంకీర్తనా సాహిత్యం ద్వారా అతని దృక్పథం ఏమిటన్నది గమనిస్తే ప్రధానంగా "ముక్తి, భక్తి, శక్తి" అనే మూడు అంశాలు కనిపిస్తాయి. శ్రీహరి "ఒక్కడే మోక్షకర్త!" (2-186) దానికి తగిన ఉపాయం "ఒక్కటే శరణాగతి" (2-186) అంటూ ముక్తిని కాంక్షించాడు. ఆ శ్రీహరి వేంకటేశ్వర నామంతో వేంకటనగం మీద వెలసియున్నాడని, భక్తితో "కైవల్యపదము వేంకటనగమదివో" అంటూ తిరుమల చేరి నాలుగు యుగాలందు ప్రకాశవంతంగా వెలుగొందుతున్న తిరువేంకటాద్రిని ప్రశంసించాడు.[23] శ్రీ వేంకటాద్రివిభుని అనేక రీతుల కొనియాడాడు.

"నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమైయుండు సం
స్తుత్యుఁడీ తిరువేంకటాద్రివిభుఁడు (పల్లవి)

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాతఁ-
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాతఁ-
డేమూర్తి నిజమోక్షమియ్యఁజాలెడునాతఁ-
డేమూర్తి లోకైకహితుఁడు

యేమూర్తి నిజమూర్తి యేమూర్తియునుఁగాడు
యేమూర్తి త్రైమూర్తు లేకమైన యాతఁ-
డేమూర్తి సర్వాత్ముఁడేమూర్తి పరమాత్ముఁ
డామూర్తి తిరువేంకటాద్రివిభుఁడు (నిత్యా)

యేదేవుదేహమున నిన్నియును జన్మించె
నేదేవుదేహమున నిన్నియును నణఁగె మరి
యేదేవు విగ్రహం బీసకల మింతయును
యేదేవు నేత్రంబు లినచంద్రులు

యేదేవుఁడీజీవులిన్నింటిలో నుండు
నేదేవుచైతన్యమిన్నిటికి నాధార-
మేదేవుఁడవ్యక్తుఁడేదేవుఁడద్వంద్వుం-
డాదేవుఁడీవేంకటాద్రివిభుఁడు (నిత్యా)

యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు
యేవేల్పుపాదకేశాంతం బనంతంబు
యేవేల్పు నిశ్వాసమీ మహామారుతము
యేవేల్పు నిజదాసు లీపుణ్యులు

యేవేల్పుసర్వేశుఁడేవేల్పు పరమేశుఁ-
డేవేల్పు భువనైక హిత మనోభావకుఁడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము
ఆవేల్పు తిరువేంకటాద్రివిభుఁడు" (నిత్యా) (1-75)

"అదిమపూరుషుఁడచ్యుతుఁడచలుఁ డనంతుండమలుఁడు
ఆదేవుఁడీతఁడేపో హరి వేంకటవిభుఁడు

ఏకార్ణవమై ఉదకములేచిన బ్రహ్మాండములోఁ
బైకొనియుండఁగ నొక వటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొక శిశువై వడఁ దేలాడిన-
శ్రీకాంతుఁడీతఁడెపో శ్రీవేంకటవిభుఁడు (అది)

అరుదుగ బలిమద మడఁపఁగ నాకసమంటిన రూపము
సరుగన భూమియంతయు నొకచరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁడీతఁడేపో పతి వేంకటవిభుఁడు (అది)

క్షీరపయోనిధిలోపల శేషుఁడు పర్యంకముగా
ధారుణియును సిరియునుఁ బాదము లొత్తఁగను
చేరువఁదను బ్రహ్మాదులు సేవింపఁగఁ జెలువొందెడి
నారాయణుఁడితఁడే వున్నత వేంకటవిభుఁడు (అది) (1-80)

పై సంకీర్తనల ద్వారా విష్ణుతత్వాన్ని, విష్ణుకథలను, అతని లీలలను, గుణ గుణాలను తెలియజేశాడు అన్నమయ్య.

ఇలా సర్వాంతర్యామి అయిన విష్ణుతత్వాన్ని లోకానికి చాటిచెప్పే దిశగా పయనించిన అన్నమయ్య ఒక వైష్ణవ తేజోశక్తిగా దర్శనమిస్తాడు. ఆ తేజోశక్తికి కారణం ఆలోచిస్తే కలియుగంలో ధర్మసంస్థాపన కొరకు కల్కి (భగవంతుడు) తన ఆయుధమైన ఖడ్గాన్ని నందకాంశ సంభూతుడైన అన్నమయ్య రూపంలో అవతరింప జేసినట్లు సుబోధమవుతుంది.

## సంకీర్తనలు- స్వరూపదృష్టి:

తేనెటీగ వివిధ పుష్పాలనుండి పుప్పొడిని తెచ్చి (ఆస్వాదించి) తీయనైన తేనె తయారుచేసినట్లు అన్నమయ్య సర్వ వాఙ్మయ సారాన్ని హరినామ సంకీర్తనలుగా చేశాడు.

"సకల సంగ్రహము సకల సంచయము
అకృతసుకృత మిది హరినామం (పల్లవి)

సకలవేదశాస్త్రముల సార మిది
సకల మంత్రరాజంబు నిది
సకల పురాణరసముల మధుర మిది
అకుటిల పావనం హరినామం (సక)

సకలతత్త్వ సంశయ ఖండనమిది
సకల కర్మ నిశ్చయమునిది
సకల విధి రహస్య ప్రధాన మిది
అకారణ హితం హరినామం (సక)

సకల దేవతా స్వామిప్రియంబిది
సకల లోకరక్షణము నిది
ప్రకటం వేంకటపతినామాంకిత-
మకించనధనం హరినామం" (సక) (1-349)

ఈ సంకీర్తనలు పరిమళించిన భగవత్ "కీరితి రూప పుష్పములు" (2-338) ఆ సంకీర్తన పుష్పాలతో నిరంతరం శ్రీ వేంకటేశ్వరుని పూజించాడు. అన్నమయ్య తన సంకీర్తనలు మంత్రాలని చెప్పాడు.[24] ఆ కీర్తనలు మానవుని దైనందిన జీవితంలో కూడా ఉపయోగకరంగా ఉండాలన్న ఉద్దేశం అన్నమయ్యలో కనిపిస్తుంది. అందుకే బాల్యానికి అవసరమైన లాలిజోల పాటలు, యౌవనానికి అర్హమైన శృంగార సంకీర్తనలు, గృహస్థానికి అనుగుణంగా నీతి, హిత బోధనలు, వార్ధక్యానికి తగిన ఆధ్యాత్మిక కీర్తనలు, వైరాగ్యతత్త్వాలు యితని సంకీర్తనలలో కనిపిస్తాయి. అంతేకాక లోకంలోని ప్రతి వస్తువును, ప్రతి విషయాన్ని, ప్రతి అంశాన్ని సంకీర్తనలుగా వెలయించాడు. శ్రీవేంకటేశ్వరునికి కానుకగా సమర్పించాడు.

పల్లవి, చరణాలు గల ఈ సంకీర్తనల్లో ముఖ్యంగా కేంద్రీభూతమైన అర్థం పల్లవిలో ఉండడంచేత చరణాలన్నిటికి ఏకవాక్యత కలిగించడానికి చివరిలో పల్లవి పునరావృతమవుతుంది.[25] అన్నమయ్య ఈ సంకీర్తనల్లో యతి, ప్రాస

నియమం, శ్రీ వేంకటముద్ర ఖచ్చితంగా పాటించినట్లు తెలుస్తుంది. అన్ని సంకీర్తనలు అనేక వర్ణనలతో కూడి సర్వాలంకార శోభితాలై వున్నాయి.

ఈ సంకీర్తనలు ప్రబంధ, కథాఖ్యాన, మంతస్తోత్ర, వ్యాఖ్యాన, సంభాషణ రూపాది వివిధ రకాల సంకీర్తనలుగా కూడా గోచరిస్తున్నాయి. అన్నమయ్య సంకీర్తనలు శృంగార అధ్యాత్మికాలని పండితులు పరిష్కరించడం జరిగింది. దాదాపు శృంగార సంకీర్తనలన్నీ ప్రబంధ రూపాలుగా దర్శనమిస్తాయి.[26] ఇక అధ్యాత్మిక కీర్తనల్లో కొన్ని నరసింహ, రామకృష్ణావతారాది కథాఖ్యాన రూపాలుగా ఉన్నాయి.

**నరసింహావతార కథ :**

"కంభమున వెడలి ఘననారసింహము
కుంభిని హిరణ్యుగొలిచెను (పల్లవి)
తొడికి దైత్యుఁదన తొడపైకి దిగిచి-
కడుపుచించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడ దగిలించుక మెరసీ వాడే (కంభ)

పెదవులు చింపుచు పెనుగోళ్ల నదిమి
వుదుటుబునుక గొరికుమియుచును
సదరపు గుండెలు చప్పరించుచును
మెదడు గందముగ మెత్తీవాడే (కంభ)

దేవతల భయముదీర్చి యంకమున
శ్రీవనితను గృపసేయుచును
పావనపైటహో బలగిరిదైవము
శ్రీ వేంకటగిరి జెలగీవాడే" (కంభ) (3-506)

**రామావతార కథ :**

"ఈతడువో రాముడు ఏకాంగవీరుడు
ఏతలజూచినా తానె ఇరవుకొన్నవాడు (ఈతడు)

చిరుతప్రాయమునాడు శివుని విల్లు విరచి
మెరసి సీతను పెండ్లాడి మించినవాడు
తటి పదునాలుగువేల దానవుల నిమిషాన
జటిసి తానొక్కడే చదిపినవాడు (ఈతడు)

ఓడక విల్లెక్కుపెట్టి ఊరకే ఒక్కమ్మునను
ఏడుతాళ్ళుధరను కూలనేసినవాడు
జూడగా కొండలచేత జలనిధి గట్టించి
వేడుకతో లంకమీది విడిసినవాడు (ఈతడు)

రావణ కుంభకర్ణాది రాక్షసులను పరిమార్చి
ఈవల అయోధ్య పట్నమేలినవాడు" (ఈతడు) (29-6)

## కృష్ణావతార కథ :

కనియు గానరు నీమహిమ కౌరవ కంస జరాసంధాదులు
మనుజులు దనుజుల జంపిరనగ వినిమరి నీ శరణము చొరవలదా

పుక్కిటనే లోకములు చూపి పూతకిచన్నటు దాగితివి
పక్కననే బండిదన్ని విరిచితివి బాలులు సేసేటి పనులవియా
అక్కరతో తృణావర్తునణచితివి ఆబోతుల కీటణచితివి
చిక్కించి యనలముచేత మింగితి శిశువులు సేసేటి పనులివియా

తొడిబడ మద్దులు భువిపై గూలగదొబ్బి యఘాసురు జంపితివి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పడచులు చేసేటి పనులివియా
అదరి బ్రహ్మమాయకు బ్రతిమాయలు అట్టేగడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగ గొట్టితి పిన్నలు సేసేటి పనులివియా

కాళింగుని మదమణచి దవ్వుగా కడగడలకు బోజోసితివి
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గోవాళు సేసేటిపనులివియా
యీలీల శ్రీ వేంకటాద్రిమీదనే యిందరికిని పొడజూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటి పనులివియా" (3-277)

అట్లే యీతని కీర్తనలు మంత్ర స్తోత్ర రూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఉదాహరణకు క్రింది సంకీర్తనలు గమనించతగినవి.

"మాధవా కేశవా మధుసూదనా విష్ణు
శ్రీధరా పదనఖం చింతయామి యూయం

వామన గోవిందా వాసుదేవ ప్రద్యుమ్న
రామరామకృష్ణ నారాయణాచ్యుత
దామోదరా నిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో

పురుషోత్తమా పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణా అధోక్షజా
నరసింహ హృషీకేశ నగధరా త్రివిక్రమా
శరణాగత రక్ష జయజయ సేవే

మహిత జనార్ధనా మత్స్యకూర్మ వరాహ
సహజ భార్గవ బుద్ధజయ తురగ కల్కి
విహిత విజ్ఞాన శ్రీ వేంకటేశ శుభకరం
అహమిహ తవపదదాస్యం అనిశం భజామి" (4-330)

"నిత్యాయ విబుధ సంస్తుత్యాయ నిత్యాధి
పత్యాయ మునిగణ ప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానస సాం
గత్యాయ జగదవనకృత్యాయ తే నమో

అక్రమోద్ధత బాహు విక్రమాతిక్రాంత
శుక్ర శిష్యోన్మూలనక్రమాయ
శక్రాది గీర్వాణ వక్రభయభంగ నిర్
వక్రాయ నిహతారి చక్రాయతే నమో

అక్షరాయతి నిరపేక్షాయ పుండరీ-
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణ విజ్ఞానదక్ష యోగీంద్ర సం
రక్షానుకంపా కటాక్షాయ తే నమో

కరిరాజవరదాయ కౌస్తుభా భరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణీంద్ర కోటీర తరుణీ మనస్స్తోత్ర
పరితోషచిత్తాయ పరమాయ తే నమో

పాత్రదానోత్సవప్రథిత వేంకటరాయ
ధాత్రీశ కామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిర గాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రి నిలయాయ తే నమో" (1-269)

"నవనీత చోర నమోనమో
నవమహిమార్ణవ నమో నమో

హరి నారాయణ కేశవాచ్యుత కృష్ణ -
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నర నారాయణ నమో నమో

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారకా-
నగరాధినాయక నమో నమో

వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననుత నమో నమో" (3-24)

"నారాయణాయ నమో నమో నానాత్మనే నమోనమో
ఈ రచనలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి

గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో నమో
ఈ వరుసలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీ మహిళా పతయే నమో నమో శిష్టరక్షణే నమో నమో
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
ఈ మేరలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి

పరిపూర్ణాయ నమో నమో ప్రణవాగ్రాయ నమో నమో
చిరంతనా శ్రీ వేంకటనాయక శేషశాయినే నమో నమో
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో
ఇరవుగ నీగతి నెవ్వరు దలచిన ఇహపరమంత్రములిందరికి" (1-380

అదే విధంగా భగవద్గీతకు వ్యాఖ్యాన రూపాలుగా కనిపించే కొన్ని కీర్తనలు గమనించదగినవి.

**వ్యాఖ్యానరూపం :**

"వాసాంసి జీర్ణాని యధావిహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి
తథాశరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహి"
(2-22, భగవద్గీత

చినిగిన వస్త్రాలు విడిచి మనిషి నూతన వస్త్రాలు ధరిస్తాడు. అదే విధంగా శిథిలమైన శరీరాన్ని విడిచి క్రొత్త దేహాలలో ఆత్మ ప్రవేశిస్తుంది.

"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనం క్లేదయన్త్యాపో నశోషయతి మారుతః" (2-23, భగవద్గీత)

"అచ్ఛేద్యో యమదాహ్యో యమక్లేద్యో శోష్య ఏవచ
నిత్య స్సర్వ గతః స్థాణుః అచలో యం సనాతనః" (2-24, భగవద్గీత)

"అవ్యక్తో యమచింత్యోయం అవికార్యోయముచ్యతే
తస్మాదేవం విదిత్వై నానుశోచితు మర్హసి" (2-25, భగవద్గీత)

ఆత్మను ఆయుధాలు నశింపజేయజాలవు, అగ్ని దహింపలేదు, నీరు తడుపలేదు, వాయువు శోషింపజేయలేదు, ఇది నరకబడదు. దహింపబడదు. తడుపబడదు, ఎండింపబడదు, నిత్యం అంతట నిండి వుంటుంది. ఇది స్థిరం, సనాతనం, ఇంద్రియాలను గోచరింపదు, మనసుచే ఊహించుటకు కూడా శక్యం కాదు. వికారం లేనిది. అట్టి ఆత్మతత్త్వాన్ని తెలుసుకొని దుఃఖానికి దూరంగా వుండాలి.

పై భగవద్గీత సారాంశానికి అన్నమయ్య సంకీర్తనలో కనిపించే వ్యాఖ్యానప్రాయమైన ఉదాహరణ.

"దేహినిత్యుడు దేహములు అనిత్యాలు
ఈహల నామనసా ఇది మరువకు మీ

గుది పాతచీరమాని కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహిమొగి గొత్తమేనిమోచు
అదన చంపగ లేవు ఆయుధమ్ము లీతని
కదిసి అగ్నియు నీరు గాలియు చంపగలేవు

యీతడు నరకువడడు యీతడగ్ని కాలడు
యీతడు నీట మునుగడు యీతడు గాలిబోడు
చేతనుడై సర్వగతుడౌ చెలియించడేమిటను
యీతల ననాది యీతడిరవు గదలడు

చేరికానరానివాడు చింతించరానివాడు
భారపు వికారాల పాసినవాడీ ఆత్మ
అరయ శ్రీ వేంకటేశునాధీన మీతడని
సారము తెలియుటే సత్యం జ్ఞానము" (2-419)

శ్రీకృష్ణుడు అర్జునునికి తెలిపిన భగవద్గీత సారాంశం భగవత్తత్త్వం క్రింది సంకీర్తనలో గమనించవచ్చు

"అని యానతిచ్చె కృష్ణుడర్జునునితో
విని యాతని భజించు వివేకమా

భూమిలోన చొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల
దీమసాన మోచేటిదేవుడ నేను
కామించి సస్యములు కలిగించి చంద్రుడనై
తేమల పండించేటి దేవుడ నేను

దీపనాగ్నినై జీవదేహముల అన్నములు
తీపుల నరగించేటి దేవుడ నేను
ఏపున నిందరిలోని హృదయములోన నుందు
దీపింతు తలపు మరపై దేవుడ నేను

వేదములన్నిటిచేత వేదాంతవేత్తలచే
అది నేనెరగతగిన ఆ దేవుడను
శ్రీదేవితోఁగూడి శ్రీ వేంకటాద్రి మీద
పొడైన దేవుడను భావించ నేను" (2-438)

**సంభాషణ రూపం :**

శ్రీరాముడు అరణ్యవాస సమయంలో రావణుడు సీతను అపహరించ సీతను బాసిన రామయ్య లక్ష్మణునితో అన్న మాటలు సంభాషణాత్మక సంకీర్తన ఉదాహరణ.

రాముడు : కానకుంటి మిందాక కంటి మాడకుపోదము
లక్ష్మణుడు : కానీలే అందుకేమి కళవళమేలయ్యా (పల్లవి)

రాముడు : తొంగిచూచె నదె సీత తూరుపున(దమ్ముడా
లక్ష్మణుడు : సంగతి ఇందురుడింతె సతి గాదయ్యా

రాముడు : చెంగటనే పెదవకగా తేరి వచ్చీ జూడరాదా
లక్ష్మణుడు : రంగులవెన్నెలలింతే రామచంద్ర చూడుమా (కాన)

| | | | |
|---|---|---|---|
| రాముడు | : | పొంచి చేత బిలిచీని పొద దండనెదె సీత | |
| లక్ష్మణుడు | : | అంచెలదీగె ఇంతే అటుగాదయ్యా | |
| రాముడు | : | యెంచనేల దవ్వులను యెలిగించి వినరాదా | |
| లక్ష్మణుడు | : | పెంచపు నెమలిగాని పిలుపుగాదయ్య | (కాన) |
| రాముడు | : | నిలుచుండి చూచెనదె నిండు గొలకులో సీత | |
| లక్ష్మణుడు | : | కలువబింతె ఆపె గాదయ్యా | |
| రాముడు | : | కలికి శ్రీ వేంకటాద్రి కాగిలించె నిదెనన్ను | |
| లక్ష్మణుడు | : | తలపులో నాకె నిన్ను దగిలుండు నయ్యా | (కాన) (26-105) |

అత్తాకోడళ్ళ సంభాషణ గల క్రింది కీర్తనలో లక్ష్మీసరస్వతులు అత్తాకోడళ్ళై చరించిన విధం గమనించదగింది.

| | | | |
|---|---|---|---|
| అత్త | : | రావె కోడల రట్టడి కోడల | |
| కోడలు | — | పోవేపోవే అత్తయ్య పొందులు నీతో చాలును | |
| అత్త | : | రంకెలు వేయుచు రాజులెదుట నీవు<br>కొంకు కొసరులేని కోడల | |
| కోడలు | : | పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల<br>అంకెలదిరిగేవు అత్తయ్యా | (రావె) |
| అత్త | : | ఈడాడ నలుగురు నేగురు మొగలతో<br>కూడి సిగ్గులేని కోడల | |
| కోడలు | : | వాడకు పదుగురి వలపించుకొని నీవు<br>అడాడ తిరిగేవు అత్తయ్యా | (రావె) |
| అత్త | : | బొడ్డున పుట్టిన పాపనికి నిన్ను<br>గొడ్డురు [illegible] కోడల | |
| కోడలు | : | గుడ్డము పైనున్న కోనేటిరాయుని<br>అడ్డగించుకొంటివత్తయ్యా 5-313 | (రావె) |

జానపద సాహిత్యంలో కనిపించే బావా మరదళ్ళ శృంగార పూరితమైన సంభాషణా రూపం క్రింది సంకీర్తనలో కనిపిస్తుంది.

బావ : ఏలే ఏలే మరదలా
మరదలు : చాలు చాలును చాలును
చాలు నీ తోడి సరసాలు బావ

బావ : గాటపు గుబ్బలు కదలగ కులికేవు
మాటల తేటల మరదలా

మరదలు : చీటికి మాటికి చెనకేవు వట్టి
బూటకాలు మానిపోవే బావ

బావ : అందిందె నన్ను అదలించి వేసేవు
మందమేలపు మరదలా

మరదలు : సందుకో తిరగేవు సటకారి ఓ బావ
పొందుకాదిక పోవే బావా

బావ : చొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువ సేసిన మరదలా

మరదలు : గక్కున నమ వేంకటపతి గూడితి
దక్కించుకొంటివి తగువైతి బావ (5-163)

## సంకీర్తన సంకల్పం-ముక్తి :

"నా నాలికపై నుండి నానా సంకీర్తనలు
పూనినాచే పొగిడించితివి
వేనమాల వెన్నుడా వినుతించనెంతవాడ
కానిమ్మని నాకీ పుణ్యము గట్టితివింతె అయ్యా" (2-338)

అని అన్నమయ్య చెప్పిన మాటల్లో అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర వరప్రసాది అని తెలుస్తుంది. ఆ భగవత్ సంకల్పంతోనే అన్నమయ్య ఆడిన మాటెల్ల అమృత కావ్యంగా, పాడిన పాటెల్ల వరమగానంగా భాసించింది.

అయితే, శ్రీ ఆదివన్ శఠగోపయతిచే మంత్రోపదేశం పొంది వేదాధ్యయనం చేయడం చేత పరిపక్వ మనస్కుడై రోజుకొక్క సంకీర్తనకు తక్కువ గాకుండా శ్రీ వేంకటేశ్వరుని కీర్తించి దర్శించాలన్న నియమం పెట్టుకొని 32 వేల సంకీర్తనలు రచించాడు. ఈ సంకీర్తనా సంకల్పం అన్నమయ్యలో కలగడానికి గల ఉద్దేశాన్ని గమనిస్తే సంగీత సాహితీ కలయిక కీర్తన. సంగీతమనగా సామవేదం. ఆ సామవేదం భగవత్ స్వరూపం. భగవంతుడు సామగానలోలుడు. సామవేదమందలి గాన మాధుర్యమే అందలి విభూతి కావచ్చు. అందుకే వేదాలలో సామ వేదాన్ని, దేవతలలో ఇంద్రుడను, ఇంద్రియాలలో మనస్సును, భూతాలలో చైతన్యశక్తిని నేనే అని స్వయంగా భగవంతుడే గీతలో ఇలా చెప్పాడు.

"వేదానాం సామవేదోస్మి దేవానా మస్మి వాసవః
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మిచేతనా" (భగవద్గీత)

ఇక సాహిత్యం భగవత్ గుణనామ లీలా విభూతుల్ని కొనియాడేది. ఇలాంటి కీర్తనద్వారా సర్వపాపాలు నశిస్తాయి.[27] కలియుగంలో కీర్తనవల్లనే మోక్షం లభిస్తుంది[28] అన్న విశ్వాసం అన్నమయ్యలో ఉన్నట్టు తెలుస్తుంది. అందుకే "………. నీతని సంకీర్తన మోక్షమునకు" (3-63) అని తెలిపాడు. అట్లే ముక్తికి మార్గాన్ని ఇలా తెలియజేశాడు.

"అరసి వేరొకచో ముక్తడుగగవలదు
సారపు లౌకిక విమోచనమే ముక్తి

మొగి పుణ్యపాపవిముక్తియే ముక్తి
వెగటు ప్రపంచపు విముక్తియే ముక్తి
తగులు సంసార బంధవిముక్తియే ముక్తి
జగములో కలుగు యాశాముక్తే ముక్తి

కామక్రోధాది సంగవిముక్తే ముక్తి
వేమారు రుచులపై విముక్తేముక్తి
నాముల దేహాభిమానపు ముక్తేముక్తి
మెడి కోరికల సంపద ముక్తేముక్తి

ముందువెనకల కర్మమోచనమే ముక్తి
అంది సుఖదుఃఖ భయముక్తేముక్తి
కందువ శ్రీ వేంకటేశుని గని యందే శరణని
విందుల నితర సేవావిముక్తేముక్తి" _____ (2-370)

అంటూ శరణాగతతత్త్వంతో ముక్తిని కాంక్షించి శ్రీహరి ప్రశస్తిని సంకీర్తనల ద్వారా కొనియాడాడు. కారణం ముక్తి అనేది హరిభక్తి కీర్తనల వల్ల లభించేది మాత్రమే. అది ఆకాశంలో, పాతాళంలో, స్వర్గాది లోకాలలో, భూమి నలుమూలలా కనిపించేది కాదు. కోటి జన్మలెత్తినా, సకల శాస్త్రాలు చదివినా, మోక్ష మార్గం కనిపించదు అంటూ క్రింది సంకీర్తన ద్వారా అన్నమయ్య తెలియజేశాడు.

"కలదందేలో సర్వము గలదు కామితార్థమును గలదు
కలదు కలదు శరణాగతులకు హరి కైంకర్యంబున మోక్షము గలదు

ఆకాశంబున మోక్షము వెదకిన నందులోపలా లేదు
పైకొని కానెంత వెదకిచూచిన పాతాళంబున లేదు
యీకడ ధరలో మూలమూలలను యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతి చింతించి యాసల జిక్కక తొలగిన నందే కలదు

కోటిజన్మములు యెత్తిన ముక్తికి కొనమొదలేమియు గనరాదు
వాటపు సంసారములో కర్మకు వార్థి యీదినా కానరాదు
కూటువతో స్వర్గాదిలోకములు గోరి వెదకినా కనరాదు
గాటపు కేశవభక్తి కలిగితే కైవల్యము మతి గానవచ్చును

సకల శాస్త్రములు చదివినా పరము చక్కటి మార్గము దొరకదు
వికటపు పటవేల్పుల నెందరి గడువెదకి కొలిచినా దొరకదు
అకలంకుడు శ్రీ వేంకటగిరి పతి అంతరంగమున నున్నాడనుచు
ప్రకటముగా గురుడానతిచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు"(3-446)

అందుకే భగవత్ సంకీర్తనద్వారా అన్నమయ్య ముక్తి పొంది "అనంత గరుడ ముఖ్యులైన సూరి జనులతో ఘననారదాది భాగవతులతో" (2-151) సమానమై వెలుగొందాడు. "తిరుమల కలియుగ వైకుంఠమనియు, విగ్రహ రూపమున వెలసియున్న వేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే యనియు

శిష్టాద్వైతము నిరూపించుచున్నది".[29] కావున సాక్షాత్తు దివినుండి (వైకుంఠం) ...వికి (ఏడుకొండలు) దిగివచ్చిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు, ...క్షాత్తు విష్ణుమూర్తి. అన్నమయ్య అదృష్టం కొద్దీ అతి చేరువలో సాక్షాత్కరించి ...వస్తువైనాడు. శ్రీ వేంకటేశ్వరునికి, శ్రీ మహావిష్ణువుకు అభేదంగా కీర్తించిన భక్తుడు అన్నమయ్య. ఆతరువాత తరిగొండ వేంగమాంబాది కవి ...గ్గేయకారులు శ్రీ వేంకటేశ్వరుని కవితావస్తువుగా కీర్తించారు.

## 32 వేల సంకీర్తనల సంకల్పం :

అన్నమయ్య 32వేల సంకీర్తనలు రచించాడని "పరమతంత్రములు ముప్పదిరెండువేలు" అన్న చిన్నన్న మాటల వల్ల తెలుస్తుంది. అయితే అన్నమయ్య 32వేల సంకీర్తనలు మాత్రమే ఎందుకురాయాలి? ఈ సంకల్పానికి గల కారణం ఏమిటి అని ఆలోచిస్తే కొన్ని కారణాలు కనిపిస్తాయి. గౌరిపెద్ది రామసుబ్బాశర్మగారి అభిప్రాయంలో యిలా వుంది. అహోబిల పీఠాధిపతి అయిన ఆదివన్ శఠగోపయతి అన్నమయ్యకు నరసింహ మంత్రాన్ని ఉపదేశించాడని ఆ మంత్రం ద్వాత్రింశదృక్షరాలు గల మంత్రరాజమని ఆ మంత్రాన్నే అన్నమయ్య రోజూ ఉపాసిస్తూ రోజుకొక్క సంకీర్తన చొప్పున అక్షరానికి వేయి సంకీర్తనలు రచించడం ద్వారా 32వేల సంకీర్తనలు రచించాడని తెలుస్తుంది.[30]

"హరేరామ హరేరామ రామరామ హరేహరే
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే"

అన్న షోడశనామ మహామంత్రమే కలి కల్మషనాశనం. దాన్ని మించిన ఉపాయం సమస్త వేదాలలో గాలించినా కనిపించదు. దీన్ని బ్రహ్మ నారదునికి ఉపదేశించినట్లు కలిసంతరోపనిషత్తు చెపుతుంది అని శ్రీ సముద్రాల లక్ష్మణయ్య గారు తన అన్నమయ్య భక్తితత్త్వం అన్న శీర్షికలో చెప్పారు.[31]

పై విషయాన్ని గమనిస్తే ఈ షోడశ మహామంత్రంలో వున్న అక్షరాలు కూడా 32 కాబట్టి అన్నమయ్య షోడశ నామ మహామంత్రంలో వున్న 32 అక్షరాలలో అక్షరానికి వెయ్యి చొప్పున 32వేల సంకీర్తనలు రచించి వుంటాడని కూడా చెప్పవచ్చు.

పరమేశ్వరుడు చెప్పిన తారకమంత్రం విష్ణువు సహస్ర నామాలకు సమానమైనది. ఇందులో కూడా 32 అక్షరాలు ఉండడం విశేషం.

"శ్రీరామరామరామేతి రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే"[32]

విష్ణు సహస్రనామ స్తోత్రంలో ప్రతి శ్లోకంలో 32 అక్షరాలుండడం గమనార్హం. మొత్తంమీద 32సంఖ్యకు విశిష్ట ప్రాధాన్యముందని గ్రహించవచ్చు. అందులో తన సంకీర్తన ప్రాశస్త్యాన్ని అన్నమయ్య "అన్ని మంత్రములిందె ఆవహించెను, ఇన్ని మంత్రములకెల్ల ఇందిరనాధుడె గురి" (4-438) అని చెప్పాడు. కాబట్టి ఈ మంత్ర స్వరూపాలకు 32వేల సంకీర్తనలకు సంబంధముందని చెప్పవచ్చు. అయితే వేల సంఖ్యమాటేమిటి అన్నప్పుడు "వేయి పడగలతోడ వెలసిన శేషు"ని (3-65)పై పవళించిన శ్రీ మహావిష్ణువు "వేనామాల వెన్నుడు" (2-338) వేనోళ్ళ కొనియాడదగినవాడు అని తెలియజేయడానికి అన్నమయ్య వేయి సంఖ్యను యెంచుకున్నట్టు తెలుస్తుంది.

**సాహిత్యం :**

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమవీథులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక అన్నయ్య వచోనూత్నక్రియల్ చెన్నగున్"[33]

అంటూ చినతిరుమలాచార్యుడు, అన్నమయ్య సాహిత్య ప్రశస్తిని కొనియాడిన తీరులో అన్నమయ్య సాహిత్యమెలాంటిదో తెలుస్తుంది.

కవి తన సాహిత్యం సార్వకాలికమై ఉండాలని కోరుకుంటాడు. అలా వుండాలంటే, భాష, భావం అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండాలి. అంటే పండిత, పామర రంజకమైనటువంటి సాహిత్యం సార్వకాలికమై మనగలదు. "అన్నమయ్య సంకీర్తనలు ద్రవిడ వేదాంతమని కీర్తింపబడుతున్న ఆళ్వారుల పాశురాలతో సరిపోల్చదగినవి"[34] "ఈయన సాహిత్యమంతయూ శ్రీ వైష్ణవ సిద్ధాంతంపై నాధారపడినది. ఆ మత ప్రచారమునకు వీరికి వాఙ్మయమంతయు నడుముకట్టుకొని నిలిచినది"[35] అన్నమయ్య శిష్ట వ్యవహారం సామాన్య ప్రజా వ్యవహారంలో వున్న భాషకు గ్రాంధికానికి మూడింటికి ప్రాధాన్యమిచ్చాడు. పండితుల్ని మెప్పించడానికి సంస్కృతంలో కొన్ని కీర్తనలు, వేంకటాచల మాహాత్మ్యం రచించాడు. శిష్టులకు ప్రీతి కలిగించడానికి శిష్ట వ్యవహారిక

భాషను, జానపదులను అలరించడానికి గ్రామ్యభాషను సంకీర్తనలలో ఉపయోగించాడు.

"నేనందఱి మెప్పింతు కృతులనయ్యెయడలన్" అన్న పోతన భావానికి తగినట్టుగా అన్నమయ్య తత్త్వం ఉన్నట్లు కనిపిస్తుంది. అందరికీ అనుకూల సాహిత్యాన్ని అందించాలనే దృక్పథం అన్నమయ్యది. ఆ సాహిత్యానికి పశుపక్ష్యాదుల్ని సైతం ఆకర్షించే సంగీతాన్ని సమ్మిళితం చేసి సర్వమానవాళికి సులభతరమైన కీర్తనరూపాన్ని నిర్మించాడు. మానవుడు వార్ధక్యంలో ముక్తికోసమని రామాయణ, భాగవతాలను చేతబట్టి చదవడం ప్రారంభిస్తాడు. అయితే, ఇది కేవలం చదువుకున్నవాళ్ళకు మాత్రమే సాధనోపాయం. కాని అన్నమయ్య సాహిత్యం అలాకాకా చదువులేని పామరులను సైతం వినడం లేదా పాడుకోవడానికి అవకాశాన్ని ఇచ్చే సంకీర్తనలుగా కనిపిస్తాయి. అవి

"సురలకు, నరులకు సొరిదివిన
నరుడు తాళ్ళపాక అన్నమయ్య పదములు

చక్కెరై చవిచూపి జాజులై తావిచల్లి
నక్కజపు మాతువజ్రాలై మెరసీనీ

పన్నీరై పైబూసీ  ఁగప్రంబై చలువరేచి
మిన్నగల ముత్యములై మెయినిండీని
నెట్టనవేదాంతములై నిత్యములై పొడసూపి
పుట్టుతోనే గురువులై బోధించీని!"[36] అని పెదతిరుమలాచార్యుడు స్తుతించగా చినతిరుమలాచార్యుడు ఈ విధంగా కీర్తించాడు.

"వేదంబులు పౌరాణిక వాదంబుము వరకవిత్వ వాణీవీణా
నాదంబులు కృత సుజనాహ్లాదంబులు తాళ్ళపాకయన్నయ పదములు"[37]
"జగతిగడు జెల్లుబళ్లై నగినగి భాషించునట్టి వానుడి పలుకులు
తనదన రహిచెడు బువ్వల సొగసుడుగన్ బిసికి కంపుసూపిన భంగిన్"[38]

అందుకే అన్నమయ్య కీర్తన సాహిత్యం జనరంజకమైంది. పిల్లవాడు నిద్రపోవాలంటే "జో అచ్యుతానంద జోజో ముకుందా" లాంటి లాలి పాటలు పాడడం, పిల్లవాడికి గోరుముద్దలు తినిపించాలన్న చందమామ రావె, జాబిల్లిరావె లాంటి అనునయ కీర్తనలు పాడడం నాటినుండి నేటి వరకు కొనసాగుతోంది.

ఉంటే అవి జనరంజకాలు కాబట్టి ప్రజాదరణ పొందగలిగాయి. అంతేకాక మానవునికి అన్ని సందర్భాల్లోను ఉపయోగపడే విధంగా అన్నమయ్య కీర్తన సాహిత్యం ఉండడం విశేషం. ఉదాహరణకు: పండుగలు, పబ్బాలు, పెండ్లి, ఉత్సవాలు, లాలి, జోల, ఉయ్యాల, మేలుకొలుపు, సువ్విపాటలు, దంపుళ్ళు, అల్లోనేరెళ్ళు, గొబ్బిళ్ళు, జాజర, సోది, హంస, తుమ్మెద, చిలక, తందనాలు, ఏలలు, కోలాటాలు, చందమామ, శోభనం, ఆరతి, నివాళి, ధవళ, మంగళ, సాసముఖ, కూగూగులు, తాత్త్వికాలు, చాగుబళాలు- ఇవేకాక బాలక్రీడా సంకీర్తనలు, దివ్యనామ సంకీర్తనలు మరియు నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, పర్వోత్సవ, బ్రహ్మోత్సవ మొదలైన ఉత్సవ సంకీర్తనలెన్నో రచించాడు. అన్నమయ్య సాహిత్యం ద్వారా ఆనాటి తిరుమల ఆలయ విశేషాలు, చారిత్రక రాజకీయ సామాజిక అంశాలు తెలుసుకోవచ్చు. అన్నమయ్య ఆనాటి బ్రహ్మోత్సవాలలో స్వామి ఊరేగే వాహనసేవా కార్యక్రమాన్ని ఈ క్రింది కీర్తనలలో సూచించాడు.

"తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను

తిరుదండెలపైనేగీ దేవుడిదే తొలినాడు
సిరుల రెండవనాడు శేషునిమీద
మురిపేన మూడొనాడు ముత్యాలపందిరి క్రింద
పొరి నాలుగోనాడు పువ్వు కోవిల లోను

గక్కన ఐదవనాడు గరుడుని మీద
ఎక్కెను ఆరవనాడు యేనుగుమీద
చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువ తేరును గుర్రమెనిమిదోనాడు

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
ఎనసి శ్రీ వేంకటేశుడింతి అలమేల్మంగతో
వనితల నడుమను వాహనాలమీదను" (7-122)

అంతేకాక కన్నులపండుగ (26-303), గుండెరాయి చేస్కొని (28-496), [illegible] (20-507), మిసాలమీదటి తేనె (2-53),

రాతిగుండె (12-9), సూదివెంట దారమాయె (3-139), ఇంటిలోని పోరు (12-199), కాయో పండో (12-160), కనులెల్ల ఎఱ్ఱనాయె (3-405), చీటికిమాటికి (27-84), గోరుచుట్టుపై రోకటపోటు (5-238), నీరుకొలది తామెర (22-250), పిలువని పేరంటమై పిరుగొనవేడుక (18-276), వెన్నపట్టుకుని నేయి వెతకనేల (23-69), నీటముంచు పాలముంచు (9-224), పట్టినదల్లా బంగారము (30-45), ముంజేతికంకణమునకద్దమా 928-9) మొదలైన ఎన్నో పలుకుబళ్ళు, సామెతలే కాక తెలుగు నుడికారాలు, జాతీయాలు, లోకోక్తులు సందర్భానుసారంగా ప్రయోగించాడు అన్నమయ్య. వీటి వాడకంలో ఆనాటినుండి ఈనాటి వరకు ప్రజల వాడుకలో తేడా రాలేదు. దీనినిబట్టి అన్నమయ్య కీర్తన సాహిత్యం ఎంత ప్రాచుర్యం పొందిందో తెలుస్తుంది. పిల్లవాళ్ళ దగ్గరనుంచి పెద్దవాళ్ళ వరకు అన్నమయ్య కీర్తన సాహిత్యంపై ఆసక్తిని కనపరచడం ద్వారా పండిత పామర రంజకత్వంగల సాహిత్యంగా చెప్పబడింది.

అన్నమయ్య సాహిత్యంలో అన్యదేశ్యాలు కూడా చూడవచ్చు. అరబ్బీ, ఉర్దూ, కన్నడం, తమిళం; హిందీ మొదలైన భాషాపదాలకు ఉదాహరణలు గమనించదగినవి.

**అరబ్బీ, ఉర్దూ, హిందీ పదాలు :**

జగడాలు, జగడించు, బావురే, సెబానందురటె, జూటరి, జూటు, కుళ్ళాయి, కబురులే, బొజులు, పచరించేవే, పచారుపై ఇంచుక్కు గలబి, గలభా, దట్టీ, ఉలుపా, గజరా, జోరున.

**కన్నడ పదాలు :** బెకకకేపొద్దు, బెళుకు, అప్పణి, అప్పణ.

**తమిళపదాలు:** ఉదయవరులు, తిరుమంత్రము, తిరువాముడి, మొదలారి, తిరుమణి, పల్లాండు, పెరుమాళ్లు, తిరువేంగళప్పడు, విణ్ణాపజి, అళగిరి, చూడికుడుతనాంచారి, వేష్టవలు.

ఈ విధంగా ఆనాడు ప్రచారంలో ఉన్న అన్యదేశ్యాలు అన్నమయ్య సంకీర్తనల్లో చోటుచేసుకున్నాయి. తద్వారా ఆనాటి భాషపై అన్నమయ్యకు గల అధికారం స్పష్టమవుతుంది.

అన్నమయ్య వివిధ ప్రాంతాలలో సంచరిస్తూ కీర్తించిన కీర్తనల్లో ఆ ప్రాంతపదపారిభాషికాలు, మాండలికాలు ప్రయోగించాడు. కాబట్టి అన్ని ప్రాంతాల

వారికి అర్థమయ్యే విధంగా కూడా ఈ సాహిత్యం వుందని చెప్పవచ్చు. జానపదులను ఆకట్టుకోడానికి వృత్తిపరమైన సంకీర్తనలెన్నో రచించాడు. ఉదాహరణకు క్రింది వ్యవసాయం వర్తకం. వైద్యం, మొదలైన వృత్తిపరమైన సంకీర్తనలను గమనించవచ్చు.

**వ్యవసాయం :**

కీర్తన : పంటల భాగ్యులు వీరా బహు వ్యవసాయులు
అంటిముట్టి ఇట్ల గాపాడుదురు ఘనులు (3-359)

**వర్తకం :**

కీర్తన : వాడల వాడల వెంటవాడివో వాడివో
నీడనుండి చీరలమ్మే నేతిబేహారి (1-275)

**వైద్యం :**

కీర్తన : కొనరో కొనరో మీరు కూరిమి మందు
ఉనికి మనికి కెల్ల నొక్కటే మందు (1-237)

**గొల్లెత :**

కీర్తన : కుందనంపు మై గొల్లెత
యెందును బుట్టని యేతరి జాతి (5-92)

**కులవాచకాలు :**

కీర్తన : పొడనైన శేషగిరి బోయనాయుడు
విడువకిందరిగాచు వెడబోయేనాయుడు (1-460)

**కళాస్వరూపం :**

సంగీత, నాట్య, కవిత్వ కళా స్వరూపం అన్నమయ్య సంకీర్తనలు. మానసిక ఆనందాన్ని ప్రసాదించడమే కళ యొక్క ప్రధాన ఉద్దేశం. ఇది అలౌకికం. అనుభవైక వేద్యం. అన్నమయ్య సంగీత సాహిత్యాలకు సమ ప్రాధాన్యమిచ్చిన వాగ్గేయకారుడు. ఆయన సాహిత్య ప్రపంచం శ్రీ వేంకట వల్లభ శృంగారాధ్యాత్మ పరమైనవి.

అతని సంగీత జ్ఞానం అపారమైనది. సంకీర్తన లక్షణ గ్రంథం సంస్కృతంలో రచించిన సంగీతవేత్త.

సంగీత ప్రస్తావన :

అన్నమయ్య సంకీర్తనలో దేశీయ సంగీత సంబంధమైన జానపద ధోరణులున్నాయి. ఈ సంకీర్తనలకు రాగాలను సూచించిన మొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. అన్నమయ్య సంకీర్తనలలోని రాగాలు- అమరసింధు, ఆందోళి, అబాలి, అరభి, ఆహిరి, ఆహిరినాట, కన్నడగౌళ, కన్నడ బంగాళం, కాంబోది, కుంతలవరాళి, కురంజి, కేదారగౌళ, కొండమలహరి, కోకిలపంచమం, కౌశి, గంభీరనాట, గుండక్రియ, గుజ్జరి, గుమ్మకాంబోది, గౌళ, ఘంటారావం, జాళి, చాయ, చెంచుమలహరి, ఛాయానాట, తెలుగుకాంబోది, తోడి, ధన్నాసి, దేవక్రియ, దేవగాంధారి, దేశాక్షి, దేశి, దేసాళం, ద్రావిడభైరవి, నట్టనారాయణి, నాగగాంధారి, నాగవరాళి, నాట, నాదరామక్రియ, నారణి,నారాయణి, నీలాంబరి, నడవంజరం, పాడి, ప్రతాపనాట, పిసాళం, ఫలమంజరి, పూరభి, పూర్వగౌళ, బాలహంస, బౌళి, బౌళిరామక్రియ, భంగాళం, భల్లాటి, భూపాలం, భైరవి, మంగళకౌశిక, మధ్యమావతి, మనోహరి, మలహరి, మాళవి, మాళవిగౌళ, మాళవశ్రీ, ముఖారి, ముఖారిపంతు, మేఘరంజని, మేచబౌళి, రామక్రియ, రామగౌళ, రీతిగౌళ, రేవగుప్తి, లలిత, పరాటి, వరాళి, వసంతం, వసంతవరాళి, వేళావళి, శంకరాభరణం, శుద్ధదేశి, శుద్ధవసంతం, శోకవరాళి, శ్రీ, సామంతం, సామరాగం, సామవరాళి, సాళంగం, సాళంగనాట, సావేరి, సింధురామక్రియ, సోమరాగం, సౌరాష్ట్రం, సౌరాష్ట్రగుజ్జరి, హిందోళం, హిందోళ వసంతం- ఇంకా కొన్ని పదాలు రాగ నిర్దేశరహితంగా ఉన్నాయి. పైన పేర్కొన్న రాగనామం అన్నమాచార్య పదాలకు రాగ ప్రాధాన్యాన్ని సూచిస్తుంది.

"యతులుం బ్రాసయులుం బదంబులును మాత్రానీకముల్ సం
గతులుం గల్గి నిబంధనామ పదమాఖ్యార్థ సంయుక్త స
త్కృతియై తాళ్ళ (కుల) పాతయన్న యగురూక్తిన్ లోక విఖ్యాతమై
ఆతత మార్దీక సితా సుధారస రుచిస్ఫీతంబునై చెన్నగున్"[39] అని చెలగే ఈ నిబంధ పదాలలోని నడక, తాళ నిర్ణయం బహుశ రసజ్ఞలోక సుపరిచితాలు. కాబట్టి కేవల రాగనామాన్ని అన్నమయ్య పేర్కొని ఉండవచ్చు.

పదంలో పాట, రాగం రెండింటిని అన్నమాచార్యులు కూర్చిన తీరు అనన్య సామాన్యం. ఆయన సంగీత జ్ఞానానికి తుదిమెట్టు.

"రతి నీ పలుకులకు రామ నడపులకు
గతిఁగూడఁ గడమరాగము సేయు మీ

పిల్లఁగోవిరవములు బెరయించఁగా నదే
గొల్లెతల ముద్దులకుఁగూడె సుతి
పల్లవపుఁబదముల పాటలు వాడుమఁ
గల్లగాదు కడమ రాగము సేయుమీ

ముందు నీ సంతపు రవమునకు గోపికలెల్ల
కుందణపు టందెలకుఁగూడె సుతి
చిందుల రాగములు చిలికించి చిలికించి
కందువులఁగడమ రాగము సేయుమీ

పెనఁగే నీ పూరువులు పెరుగమ్మె కాంతల
కొనగోరి తాఁకులకుఁగూడె సుతి
చెనకితి విందరిని శ్రీ వేంకటేశ్వర
కనుచొక్కి కడమరాగము సేయుమీ" (24-114) ఈ విధంగా అన్నమయ్య సంగీతాన్ని రాగప్రశస్తిని తన పదాల్లో ప్రదర్శించాడు.

**నాట్యాభినయం :**

అన్నమాచార్యులవారు ఆడుతూ, పాడుతూ అంటే అభినయిస్తూ నర్తించి పాడి తన సంకీర్తన పుష్పాలతో శ్రీ వేంకటేశ్వరుని అర్చించి తన జీవితాన్ని సుగమనం చేసుకున్నాడు. తెలుగులో పదాభినయం క్షేత్రయ్యతోనే ప్రారంభమైందని, అది ఆనాడు సిద్ధేంద్రయోగి భామాకలాపంలోను ఉండేదని తెలుస్తుంది. నారాయణ తీర్థుల శ్రీకృష్ణలీలాతరంగిణిలోని తరంగాల అభినయం, కూచిపూడి సాంప్రదాయంలో ఉండేదని విజ్ఞుల అభిప్రాయం. అన్నమాచార్య సంకీర్తనల్లోని అభినయాన్ని గుర్తించిన నాట్యకళాకారులు తమ నాట్య ప్రదర్శనలో ఎన్నో శృంగారాధ్యాత్మిక సంకీర్తనలు వినియోగించుకుంటున్నారు. అన్నమాచార్యుల సంకీర్తనల్లో నాట్యాభినయానికి సంబంధించిన సంకీర్తనలకు ఉదాహరణలు:

"అలరులు కురియగ నాడెనదే
అలకల కులుకుల నలమేల్మంగ

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెర మరుగున నాడెనదే
వరుసగ పూర్వపుదువాళపు తిరుపుల
హరి(కరగింపుచు నలమేల్మంగ

మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపుతళుకులు
అట్టిటు చిమ్ముచు నలమేల్మంగ

చిందులపాటల సిరిపొలయాటల
అందెల మ్రోతల నాడెనదే
కందువ తిరు వేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేల్మంగ" (5-24)

పై సంకీర్తన ద్వారా అలమేల్మంగ చిందుల పాటల సిరిపొల యాటలతో అందెల గజ్జెలు మ్రోగుతుండగా శ్రీ వేంకటపతి మెచ్చుకొనే విధంగా నాట్యం చేసిందని తెలుస్తుంది.

"తిరొతిరొ జవరాల తిత్తి తిత్తి ఈ
తరలమైన నీ తారహార మదురే

ధిమి ధిమ్కి తోంగ తొంగ దిద్ధిమిక్కి అరే
మమారే పాత్రారావు మజ్జా మజ్జా
కమలనాథుని తమకపుటింతి నీకు
అమరె తీరుపు ఇదె అవధరించగదో

ఝుకజక్క జంఝుం ఝుణకిణాని
ప్రకటపు మురువొప్పె భళాభళా
సకల పతికి సరసపు కొమ్మ నీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెముల

మాయి మాయి అలమేలు మంగనాచ్చారి(మతి
బాయని వేంకటపతి పట్టపురాణి
మ్రోయ చిరుగజ్జెల నీ మ్రోతలానేని
సోయగమైన నీ సొలపు చూపమరె" (6-47)

నాట్యానికి పాటతో పాటుగా జతుల ప్రాధాన్యత కూడా వుంది. అలాంటి జతులతో అలమేల్మంగ నాట్యం చేసిందని, ఆమె నాట్య ప్రశస్తిని కొనియాడుతున్న పై కీర్తనలలో అన్నమయ్య అలమేలుమంగ యొక్క దివ్యమైన నృత్యాన్ని అతి మనోహరంగా శ్రీ వేంకటేశ్వరుని మైమరిపించే విధంగా అభినయించిన శృంగార లీలా విలాసాలను అభివర్ణించి తరించారు.

## కవిత్వ గుణాలు :

ఒక ఉత్తమ కవికి ఉండవలసిన కవిత్వగుణాలు అన్నమయ్యలో కనిపిస్తాయి. భావన నైపుణ్యం, ఊహలు, చమత్కృతి ప్రతి సంకీర్తనలోను చూడవచ్చు. అందుకే అవి మరింత మనోజ్ఞంగా, జనరంజకంగా ఉండి పఠితులను, గాయకులను ఆహ్లాదపరిచే విధంగా ఉంటాయి.

మేష వృషభాది పన్నెండురాశులను కాంతాపరంగా చెప్పి అన్న మాచార్యులు ఎంతగానో తన జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానాన్ని తెలుపుతూ భావనా నైపుణ్యాన్ని ప్రకటించాడు.

"ఇన్ని రాసులయునికి యింతి చెలువపురాశి
కన్నె నీ రాశికూటమి గలిగిన రాశి

కలికి బొమవిండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికి మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలఁగు హరిమధ్యకును సింహరాశి

చిన్ని మకరాంకపుఁబయ్యెద చేడెకు మకరరాశి
కన్నెపాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైఁడితులఁదూఁగు వనితకుఁదులరాశి
తిన్ననివాఁడి గోళ్ళసతికి వృశ్చికరాశి

ఆముకొను నొరపుల మెరయు నతివకు వృషభరాశి
గామిడిగుట్టు మాఁటలసతి కర్కాటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమవెంకటపతిఁగలసె ప్రియమిధునరాశి" (5-143)

అట్లే అన్నమయ్య అలమేల్మంగ హావభావాలను నవరసాలతో వర్ణించిన తీరు అనన్యసామాన్యం.

"నవరసములది నళినాక్షి
జవకట్టి నీకు జవిచేసి"

శృంగారరసము చెలియమొకంబున
సంగతి వీరరసము గోళ్ళ
రంగగు కరుణ రసము పెదవులను
అంగపు కుచముల అద్భుతరసము

చెలిహాస్యరసము సెలవుల నిండి
పలుచని నడుమున భయరసము
కలికివాడి కన్నుల బీభత్సరసము
అలబొమ జంకెనల అదెరౌద్రంబు

సతిరతి మరపుల శాంతరసంబిదె
అతి మోహము పదియవరసము
ఇతవుగ శ్రీ వేంకటేశ గూడితివి
సతమై యీపెకు సంతోషరసము" (7-282)

క్రింది సంకీర్తనలో ఒక్కొక్క అంశం కార్యకారణ సంబంధంతో ఒప్పారుతుంది. ప్రియుని మదన సుఖరాజ్యాన్ని నిలపడానికి నాయిక యౌవనమే ఒక పెట్టనికోట అని, ప్రియుని మనస్సులోని చీకటిని పోగొట్టడానికి నాయిక కంటిచూపే మేఘంలోని మెరుపని చెప్పిన తీరులో అన్నమయ్య భావనా నైపుణ్యం కనిపిస్తుంది.

"అతివ జవ్వనము రాయలకు బెట్టిన (ట్టని) కోట
పతిమదన సుఖరాజ్య భారంబు నిలుప

కాంతకనుచూపు మేఘంబులోపలి మెఱుగు
కాంతుని మనంబు చీకటివాపను
ఇంతిచక్కని వదన మిందుబింబము విభుని-
వంత కనుదోయి కలువల జొక్కజేయు

అలివేణి ధమ్మిల్ల మంధకారపు భూమి
కలికి రమణునకు నేకతమొసగను
పొలతికి బాహువులు పూవుదీగెల కొనలు
పొలసి ప్రాణేశు వలపుల లతల బెనచ

పంకజానన రూపు బంగారులో నిగ్గు
వేంకటేశ్వరుసిరులు వెదచల్లగా
చింకచూపుల చెలియచేంత మదనునించేత
యింకా నతనినె మోహించంజేయంగను" (5-112)

ఏ పద్యకవికి తీసిపోని రీతిలో అన్నమయ్య భావనానైపుణ్యంతో పాట
ఊహాశాలితతో కూడిన ప్రతిభా సంపద అద్భుతమైంది.

"ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తురినిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కదా

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపైతోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు
నిలువున పెరుకగ నంటిన నెత్తురుకాదుకదా

పడతికి చనుగవ మెఱుగులు పైపైపయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెలకాదుకదా

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగులివేమో వూహింపరే చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపు చెమటల అందము కాదుకదా" (5-82)

**చమత్కృతి :**

అన్నమయ్య తన సంకీర్తన రచనలో చమత్కృతిని కవిగా తన సామర్థ్యాన్ని ప్రకటించుకున్నాడు. శృంగార నాయిక వాపోయిన తీరులో చమత్కృతిని సాధించాడు. ఎంతో మనోరంజకంగా, సహృదయులకు ఆనందకరంగా ఉంటుందనడానికి క్రింది కీర్తన అందుకు ఉదాహరణ.

"ఉండఁబాసీనడవిలో నొకతెనేను
ఎండలు నీడలు గాసీ నేమి సేతురా

చిన్ని నా నడుము చూసి సింహము దగ్గరెనంటా
ఉన్నతపుఁగుచముల కొరసెఁగరి
మున్నిటి పొందులు వైరమునుఁజేసె మృగపతి
యిన్నిటికి నగ్గమైతి నేమిసేతురా

నిండు నానడపుచూచి నెమలి దగ్గరవచ్చె
బండుసేసి నారుసూచి పాయదుపాము
రెండుజూచి పగయు గూరిమి దోచెనింతలోనే
యిండె పట్టె నిన్నిటికి నేమిసేతురా

కోరి నా పలుకువిని కోవిల దగ్గరవచ్చె
చేరీ నా మోవికిదె చిలుకనేఁడు
గారవాన నిన్నియు వేంకటగిరి విభుఁడా
యేరా యిట్టె చేకొంటి నేమిసేతురా" (5-173)

**అన్నమయ్య భావనలో శ్రీ వేంకటేశ్వరుడు:**

వేంకట అన్న శబ్దంలోని ఆర్తజనుల పాపాలు పోగొట్టే దైవం శ్రీవేంకటేశ్వరుడని తెలుస్తుంది. అయితే అన్నమయ్య అమటిమొక్కులవాడు, అదిదేవుడు, వడ్డికాసులవాడు, గొడ్రాళ్ళకు బిడ్డలిచ్చే గోవిందుడు, కోరిన వరాలిచ్చేవాడు, శ్రీవేంకటేశ్వరుడని కొనియాడాడు.

"అమటి మ్రొక్కులవాడే అదిదేవుడేవాడు
తోమని పళ్యాలవాడే దురితదూరుడే

వడ్డికాసులవాడే వనజనాభుడే పుట్టు
గొడ్రాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే
ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడే వాడు
అలమేల్మంగా వేంకటాద్రినాథుడే"[40]

అయితే, నిజమైన భక్తులకు మాత్రమే "నిధియు నిధానము" (4-42
"ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే" (2-159) శ్రీవేంకటేశ్వరు
ఆతడు పిండంతె నిప్పటి, నీరు కొలది తామెరవు లాంటి వాడ
"భావింపనున్నాడిందరి భాగ్యమువలెను" (20-406) అని అన్నమయ్య చెప్పి
తీరులో భావన కొలది భగవంతుడన్న సత్యం విదితమవుతుంది. ఎందుకం
భగవంతుని తత్త్వాన్ని పూర్తిగా తెలుసుకోవడం అసాధ్యం. నానామూర్తులు
నగధరురూపు పెక్కునామాలు, బిరుదులు అనంతాలు. ఆతడు విహరిం
భూములువేవేలు అంటూ అన్నమయ్య కీర్తించిన క్రింది కీర్తన దానికి ఉదాహరణ

"ఇటు నిను తెలియగ ఎంతటివారము
తటుకున నాసల తగులుటగాక

నానామూర్తులు నగధర నీరూపు
యే నెలవుల నిన్నెటువలె దలచుట
పూని నీ భావము పొందుగా తెప్పగా
వీనులు చల్లగా వినుటే కాక

పెక్కునామములు బిరుదులనంతము
లెక్కడ కొలదిగ నెన్నని పొగడుట
యిక్కువ సేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుటగాక

వేవేలుగలవు నీ విహారభూములు
యేవిధమున ఎందెందని తిరుగుట
శ్రీవేంకటేశా నీ శృంగారమెల్లను
సేవించి ముదమున చెలగుటగాక" (2-305)

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని సగుణ, నిర్గుణ రూపాల్ని దర్శించారు. శ్రీవేంకటేశ్వరుడు విశ్వవ్యాపకుడు, శాశ్వితుడు, పుట్టుకలేనివాడు సర్వ పరిపూర్ణుడు. నిర్వాణమూర్తి, ఉర్వీధరుడు, పార్వతీస్తుత్యుడు, నానాప్రభావుడు, సహస్రముఖుడు, మునుల హృదయాలలో నివసించేవాడు, పరమ యోగీంద్రుడు, దురితదూరుడు అని తెలియజేసే క్రింది కీర్తనలో అన్నమయ్య నిర్గుణ దృష్టి కనిపిస్తుంది.

"విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ
శాశ్వతున కూహింప జన్మమికనేడ

సర్వపరిపూర్ణునకు సంచారమికనేడ
నిర్వాణమూర్తికిని నిలయమికనేడ
వుర్వీధరునకు కాలూద నొకచోటేడ
పార్వతీస్తుత్యునకు భావమికనేడ

నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
ఆనన సహస్రునకు నవ్వలివలేడ
మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞానస్వరూపునకు కానవిననేడ

పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురితదూరునకు సంస్తుతినిందలేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ
హరికి నారాయణున కవుగాములేడ" (1-355)

అన్నమయ్య దర్శించిన సగుణ నిర్గుణాలు శృంగారాధ్యాత్మికాలు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని ప్రియుని నుంచి పరబ్రహ్మ వరకు భావించి దర్శించాడు. ప్రియుడుగా భావించిన శృంగార సంకీర్తనలన్నీ అన్నమయ్య శృంగారాత్మక ధ్యానంలో తాను పొందిన అనుభూతులే అని చెప్పవచ్చు. అవి వియోగ శృంగార చేష్టలతో మొదలై సంయోగంతో ధ్యానఫలం ముగుస్తుంది. అంటే మొదటి రెండు చరణాలలో కనిపించే విరహం భరించరానిదిగా వుండి చివరి చరణంలో సంయోగాన్ని పొందడం గమనించవచ్చు. అందుకే చివరి చరణంలో నన్నేలెను,

కలిసితిని, కూడితిని మొదలైన పదాలతో ముగుస్తుంది. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో అష్టవిధ నాయికా భేదాలు, సంయోగ, విప్రలంభ శృంగార వర్ణనలు విశేషంగా చోటుచేసుకున్నాయి. అలౌకిక శృంగార పరమార్థాన్ని వివరించే మధుర సంకీర్తనకు ఉదాహరణగా క్రింది కీర్తనలు గమనించవచ్చు.

"ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మరి
ఇదిగాక వైభవం బికనొకటి కలదా

అతివజన్మము సఫలమై పరమయోగివలె
నితర మహాపేక్షలన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతతవిజ్ఞాన వాఘనవోలెనుండె

తరుణి హృదయము కృతార్థతబొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజాసన మనోజయమంది ఇంతలో
సరిలేక మనసు నిశ్చలభావమాయ

శ్రీవేంకటేశ్వరుని చింతించి పరతత్త్వ
భావంబునిజముగా బట్టి చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయ" (5-17)

పై సంకీర్తన జీవబ్రహ్మైక్యాన్ని సూచిస్తుంది. శృంగారపరంగా నాయికగా, ప్రతినాయికగా, దాదిగా, చెలికత్తెగా, గోపికగా, రాయబారిగా, మహానాయికగా దర్శనమిస్తాడు అన్నమయ్య. అంతేకాక "అలమేల్మంగ వారమగుట చాలదా" (27-439) అంటూ స్వామి అనుగ్రహం కోసం అలమేలుమంగను పొగడి ఆమె అనుగ్రహాన్ని, సహాయాన్ని పొందాలన్న తపన అన్నమయ్యలో ఉన్నట్లు కనిపిస్తున్నది.

"అతడు నీవాడినట్టి అన్ని పనులుంజేసు
శ్రీతరుణివి మమ్ము రక్షించవమ్మా

యేలవమ్మా మమ్మును యెక్కితివి పతివురము
నీలీలలేమి సేసినా నీకు జెల్లును
బాలకివన్నిటా నీవు పనిగొంటివాతనిని
కీలు నీచేనున్నది రక్షించవమ్మా

మన్నించవమ్మ మమ్ము మగడు నీ చేతివాడు
సన్నలనీచేతలెల్ల సాగివచ్చేనీ
అన్నిటా చక్కని దానివట మీదట దొరవు
యెన్నికెకెక్కె నీ బ్రదుకిక గావవమ్మా

యీడేరించవమ్మ మమ్ము నిట్టే యలమేల్మంగవు
గూడితి శ్రీ వేంకటేశు గోరినట్టెల్లా
యీడులేనిదానవు నేమూడిగాలవారమిదె
వేడుకలెల్లా నీ సొమ్మే వెలయించవమ్మా" (27-438)

అని వేడుకున్నాడు. అంతేగాక "అలమేల్మంగనే నేను" (29-148) అన్న మాటల్లో తానే అలమేల్మంగ కావాలన్న కోరిక అన్నమయ్యలో కనిపిస్తుంది. కారణం అలమేల్మంగ రూపలావణ్యం, ఆమె గొప్పతనం అలాంటిది. కావున ప్రేమతో శ్రీ వేంకటేశ్వరుడు తానే వచ్చి పెండ్లాడాడు. కావున అలమేల్మంగ స్వాధీనపతిక అయినది.

"శ్రీ మహాలక్ష్మి యటసింగారాలకే మరుదు
కాముని తల్లియట చక్కదనాల కేమరుదు
సోముని తోబుట్టువట సొంపు కళలకేమరుదు
కోమలాంగి ఈ చూడికుడుత నాంచారి"

కలశాబ్ధి కూతురట గంభీరాల కేమరుదు
తలప లోకమాతయట దయ మరి ఏమరుదు
జలజ నివాసినియట చల్లదన మేమరుదు
కొలది మీర ఈ చూడికుడుత నాంచారి

అమరవందితయట అట్టే మహిమ ఏమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీ వేంకటేశు తానె వచ్చి పెండ్లాడే
కొమెర వయస్సు ఈ చూడికుడుత నాంచారి" (26-197)

అన్నమయ్య స్వామి సాన్నిధ్యాన్ని ఆకాంక్షించి మోక్షాన్ని పొందాలని భావన కలిగి వున్నట్లు కనిపించే శృంగారాత్మక సంకీర్తనకు ఉదాహరణ:

"తమ్ములాల అన్నలాల తల్లులాలనే
నెమ్మనపు హరిబాసి నిలువనేనికను

కొమ్మలాల మరుకోట కొమ్మలాలవో
యమ్మలాల తొలరెనా యక్కలాల
తమ్మిరేకు కన్నుల యాతని బాసినే
నుమ్మల సొమ్మల చేతనుండలే నికను

చెలులాల కలికి తొయ్యలులాలవో
యెలజవ్వనముల మోహినులాల
చెలువంపు హరి దలిచిననాకు నే
నులుకు కన్నీరాపకుండలేనికను

బోటులాల జవ్వనపు మేటులాలవో
గాటపు దురుముల చీకటులాల
వాటమైన వేంకటేశ్వరుబాసినే
నాటదాననై జన్మమందలేనికను" (5-99)

ఇది శృంగారాత్మక భావన అయితే ఆదిమధ్యాంత రహితుడు, సర్వరక్షకుడు అయిన శ్రీ వేంకటేశ్వరుని ఇతనికంటే మరి దైవము కానము, ఎక్కడ వెతికిన ఇతడే అంటూ కీర్తించిన క్రింది సంకీర్తనద్వారా విష్ణు తత్వాన్ని కొనియాడాడు. ఈ కీర్తనలో దశావతార ప్రస్తావన కనిపిస్తుంది. ఇందులో మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, బలరామకృష్ణులు ఇద్దరూ ఒకే అవతారంగా భావించినట్లు తెలుస్తుంది. బుద్ధావతారాలు, కల్కావతారాన్ని ప్రకటించారు.

"ఇతనికంటే మరిదైవము కానము యెక్కడ వెదకిన నితడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారముతానె

మదిజలధులనొకదైవము వెదకిన మత్స్యావతారంబితడు
అదివో పాతాళమందు వెదకితే ఆదికూర్మ మీ విష్ణుడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదరక కొండల గుహలవెదకితే శ్రీ నరసింహుడున్నాడు

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
పలువీరులలో వెదకిచూచితే పరశురాముడొకడైనాడు
తలపున శివుడును పార్వతివెదకిన తారకబ్రహ్మము రాఘవుడు
కెలకుల నావులమందల వెదకిన కృష్ణుడు రాముడునైనారు

పొంచి అసురకాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు
మించిన కాలము కడపట వెదకిన మీదటికల్క్యవతారము
అంచెల జీవులలోపల వెదకిన అంతర్యామై మెరసెను
యెంచుక ఇహమున పరమున వెదకిన యీతడే శ్రీ వేంకటవిభుడు"

(3-370)

అన్నమయ్య "సర్వం విష్ణుమయంబను భావము సత్యం సత్యం బిన్నిటను సర్వేశ్వరుడే పొందేటి వస్తువు శరణాగతియే వుపాయము" (4-90) అని శ్రీ వేంకటేశ్వరుని శరణాగతతత్త్వంతో కొనియాడాడు.

"అరసినన్ను గాచినాతనికి శరణు
పరము నిహము నేలేపతికిని శరణు

వేదములు దెచ్చినట్టి విభునికి శరణు
ఆదిమూలమంటే వచ్చినతనికి శరణు
యేదెసా తానైయున్న యీతనికి శరణు
శ్రీదేవి మగడైన శ్రీపతికి శరణు

అందరికి ప్రాణమైన అతనికి శరణు
ముందు మూడు మూర్తుల మూర్తికి శరణు
దిందుపడి దేవతల దేవునికి శరణు
అంది మిన్ను నేలనేకమై నతనికి శరణు

తానే చైతన్యమైన దైవానకు శరణు
నానా బ్రహ్మాండాలనాధునికి శరణు
అనుక శ్రీ వేంకటాద్రి యందునుండి వరములు
దీనుల కిందరికిచ్చే దేవునికి శరణు"  (3-374)

వేదాలు రక్షించినవాడు, ఆదిమూలమైన వాడు, అంతా తానై ఉన్నవాడు, లక్ష్మికి భర్త అయినవాడు, అందరికి ప్రాణమైనవాడు, మూడుమూర్తుల మూర్తిత్వం గలవాడు, దేవతలను రక్షించేవాడు, నింగినేల ఏకమైనవాడు, చైతన్యమైనవాడు, నానాబ్రహ్మాండాలకు నాథుడైనవాడు, అడిగిన వరాలు ఇచ్చేవాడు, ఇహపరాలను ఇచ్చి తనను రక్షించినవాడు అయిన శ్రీ వేంకటేశ్వరుని శరణు అంటున్నాడు.

శ్రీహరి శరణాగత వత్సలుడని, ఆర్తరక్షకపరాయణుడని కీర్తించిన క్రింది సంకీర్తనలో అహల్య యందు బంధుత్వం, కరి యందు ఆర్తరక్షణత్వం, ద్రౌపదియందు ఆపదుద్ధారకత్వం, విభీషణుని విషయంలో శరణాగతి తత్త్వం, శబరియందు భక్తవాత్సల్యతత్త్వం, సుగ్రీవుని యందు అనాధ నాథుడవను బిరుదు, పరీక్షిత్తుని యందు నిర్హేతుక ప్రేమ, ప్రహ్లాదుని యందు కింకరాధీనుడను బిరుదు, గోవర్ధనగిరినెత్తినపుడు సర్వజీవులందు దయాపరతత్త్వం, సాందీపుని యందు ప్రతిజ్ఞాపాలకత్వం దర్శించినాడన్నమయ్య.

"అరుదు నీ చరిత్రము హరి నేనిదియే తలుచుకొని
శరణంటి గావు మిదియె విన్నపము సరిలేరు నీకు

పరగ నీ యకారణ బంధుత్వ మహల్యయందు గంటిమి
కరియందు నార్తరక్షకత్వము మెరయగంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము కంటిమి
శరణంటే గాచుట ధర విభీషణునందు గంటిమి

మును భక్తవత్సలత్వము నీకు శబరియందు గంటిమి
అనాథనాధుడవు నీవగుట సుగ్రీవునందు గంటిమి
పెనగి నిరుహేతుక ప్రేమ పరీక్షితునందు గంటిమి
నిను గింకరాధీనుడవి ప్రహ్లాదునియందు గంటిమి

గోవర్ధనమందు సర్వజీవ దయాపరత్వము గంటిమి
భావించి సాందీపునియందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవ శ్రీ వేంకటేశ్వర నీవు ద్రిష్ట వరదుడవగుట
తావైన నీ కోనేటిదండ నొసగే యందే గంటిమి" (2-321)

అందుకే "సర్వోపాయముల జగతినాకితడే ఉర్వీధరుడు పురుషోత్తముడితడే" అంటున్న ఈ సంకీర్తన చరణాలలో అన్నమయ్య తిరుమలలో చేసే దినచర్య, ఆతని తత్త్వం తెలుస్తుంది.

"సకలగంగాది తీర్థ స్నానఫలములివి స్వామి పుష్కరిణి జలమేనాకు
సకల పుణ్యక్షేత్రవాస యాత్రలివి సరి వేంకటాచల విహారమిదియే
సకల వేదాధ్యయన శాస్త్రపాఠంబులివి శౌరి సంకీర్తనంబిదియె నాకు
సకల కర్మానుష్ఠానముల ఇతనికిచ్చుట జాతుపడి కైంకర్యమిదియె

ఉపవాస తపములివి ఇతని ప్రతాపంబులొగి భుజింపుటె నాకు దినదినంబు
జపరహస్యోపదేశంబులితని పాదజలంబులు శరణనేటి సేవయొకటె
ఉపమింప పుణ్యపురుషుల దర్శనము నాకు నొగి విచటి బహు వృక్షదర్శనంబు
యెపుడు పుణ్యకథాశ్రవణంబులిచ్చోటి యెన్నగల బహు పక్షికలకలంబు

తలపుగల యోగంబులందు శ్రీవైష్ణవుల దగులు సంవాస సహయోగంబు
వెలయ నిందుమహోత్సవంబు లిన్నియు నితని విభవంబులెసగు తిరునాళ్ళు నాకు
చెలగి యిటు దేవతా ప్రార్థనింతయునాకు శ్రీ వేంకటేశ్వరుని శరణాగతి
అలరు నా సంపదలు ఇతని పట్టపురాణి అలమేల్మంగ కడకంటిచూపు" (2-132)

అన్నమయ్య వివిధ ప్రాంతాలలో తాను సందర్శించిన నరసింహ రామకృష్ణాది విష్ణు అవతారాలను శ్రీ వేంకటేశ్వరుని కభేదంగా వర్ణిస్తూ విష్ణుతత్త్వాన్ని కొనియాడుతూ ఆ అవతారాలలో శ్రీ వేంకటేశ్వరుని ఆపాదించాడు. "ఈతడే హరుదు ఈతడే అజుడు" (4-2-477) అంటూ శ్రీకృష్ణుని స్తుతించిన ఈ కీర్తనలో శ్రీ వేంకటేశ్వరునికి శివబ్రహ్మలకు భేదంలేదని తెలిపాడు. శివబ్రహ్మలను శ్రీ వేంకటేశ్వరునిలో దర్శించాడు అన్నమయ్య. అట్లే, "కాలకూట విషమైన గ్రక్కున మింగినవనాటి నీలవర్ణుడే మా నిజదైవము" (1-214) అని చెప్పడంలో శివకేశవులకు భేదం లేదని అన్నమయ్య

భావనాదృష్టిగా కనిపిస్తుంది. శ్రీ వేంకటేశ్వరుని అన్నమయ్య పరబ్రహ్మ స్వరూపంగా మోక్షాన్ని ప్రసాదించే ప్రభువుగా కొనియాడాడు.

"అతడే పరబ్రహ్మ మతడే లోకనాయకు
డతనికంటే మరియధికులు వేరయ్యా

కమలవాసిని లక్ష్మి కలదా యెవ్వరికైనా
గమలనాభునికి నొకనికే కాక
కమలజుడైన బ్రహ్మకలడా యెవ్వని నాభి
నమరవంద్యుడు మా హరికేకాక

అందరు నుండెడి భూమి యన్యులకు గలదా
అందపు గోవిందునికే ఆలాయగాక
చెందిన భాగీరథి శ్రీపాదాల గలదా
మందరధరుడయిన మాధవునికి గాక

నిచ్చలు నభయమిచ్చే నేరుపు యెందుగలదా
అచ్చుగ నారాయణుని యందేకాక
రచ్చల శరణాగత రక్షణ మెందుగలదా
తచ్చిన శ్రీ వేంకటాద్రి దైవానికే కాక" (3-470)

"అన్ని విభవముల అతడీతడు
కన్నుల వేవేలు గల ఘనుడితడు

ట్ల విభుడితడు
నాదబ్రహ్మపు నడుమితడు
ఆదినంత్యములకు నరుదితడు
శ్రీదేవుడు సరసిజనాభుడితడు

భవములణచు యదుపతి యితడు
భువనములిన్నిటికి బొడవితడు
దివికి దివమైన తిరమితడు
పవనసుతునేలిన పతి ఇతడు

గరుడని మీదటి ఘనుడితడు
సిరులిందరికి నిచ్చే చెలువితడు
తిరువేంకటనగము దేవుడితడు
పరమ పదమునకు ప్రభువితడు" (4-2-23)

**సామాజిక దృష్టి :**

సమాజంలో ప్రధానంగా భగవద్భక్తిని పెంపొందించి ప్రజలకు మంచి సంస్కారము నేర్పి వారిని సజ్జనులుగా మార్చాలనే ఉద్దేశం అన్నమయ్యలో కనిపిస్తుంది. అందుకు అన్నమయ్య హితాన్ని బోధించే సద్గురువుగా, సంస్కర్తగా కనిపిస్తాడు.

పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీ వేంకటేశ్వరుని దృష్టిలో ఉచ్ఛ, నీచ భేదాలు లేవని తెలిపాడు. అందరూ సమానులని సర్వసమానత్వాన్ని ప్రబోధించాడు. బ్రహ్మంతో నిండిన ఈ లోకంలో భేదాలు లేవు. వేటినీ వేరుచేసి చూడకూడదు. ఇందులో హెచ్చు, తగ్గులు లేవు. ప్రాణులంతా ఒకటే. అందరికి శ్రీహరి అంతరాత్మ. రాజు నిద్రా, బంటు నిద్రా ఒకటే. తనకే జ్ఞానం ఉందనుకునే బ్రాహ్మణుడు, చెప్పులుకుట్టే చండాలుడు మెట్టి తిరిగే నేల ఒకటే. దేవతలకైనా, పశుపక్ష్యాదులకైనా కామసుఖం ఒకటే. పగలూ, రాత్రీ ధనవంతుడికి ఒకటే. బీదవాడికి ఒకటే. రకరకాల రుచులతో భోజనం చేసేవాడి ఆకలీ, దొరికింది తినేవాడి ఆకలీ ఒకటే. దుర్వాసనను మోసేగాలీ, సువాసనను మోసేగాలీ ఒకటే. ఏనుగుమీద కాసే ఎండా, కుక్క మీద కాసే ఎండా ఒకటే. పుణ్యాత్ముల్నీ, పాపాత్ముల్నీ సమానంగా కాపాడేది శ్రీ వేంకటేశ్వర నామం ఒకటే అని అన్నమయ్య చాటాడు.

"తందనాన ఆహి తందనాన పురె తందనాన భళా తందనాన
బ్రహ్మమొకటె పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే పర బ్రహ్మమొకటే

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలుండేటి సరిభూమి యొకటే

అనుఁగు దేవతలకును అల కామసుఖమొకటే
ఘనకీట పశువులకు కామసుఖమొకటే
దినమహోరాత్రములు తెగి ధనాఢ్యునకొకటే
వొనర నిరుపేదకును వొక్కటే అవియు

కొరలి శిష్టాన్నములు కొనునాకలొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాకలొకటే
పరగ దుర్గంధములపై వాయువొకటే
వరుస పరిమళముపై వాయువొకటే

కడగి యేనుగుమీద కాయు యెండొకటే
పుడమి శునకము మీద పొలయు నెండొకటే
కడుపుణ్యును పాపకర్ములను సరిగావ
జడియు శ్రీ వేంకటేశ్వరు నామమొకటే" (2-385)

"వైష్ణవులు గానివారలెవ్వరూ లేరు. విష్ణుప్రభావమీ విశ్వమంతయు గాన" (1-36), "యెంచి చూడరో జనులార ఇందీవరాక్షుడు రక్షకుడు" (2-235) అంటూ ప్రజలలో వైష్ణవభక్తిని పెంపొందించడానికి చేసిన ప్రయత్నంలో వెలువడిన సంకీర్తనలకు ఉదాహరణ.

"ఇతడొకడే సర్వేశ్వరుడు
సితకమలాక్షుడు శ్రీ వేంకటేశుడు

పరమయోగులకు భావ నిధానము
అరయ నింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కౌగిటి సౌఖ్యము
సిరులొసగే ఈ శ్రీ వేంకటేశుడు

కలిగి యశోదకు కన్నమాణికము
తలచిన కరికిని తగుదిక్కు
అల ద్రౌపదికిని ఆపద్బంధుడు
చెలరేగిన ఈ శ్రీ వేంకటేశుడు

తగిలిన మునులకు తపముల సత్ఫలము
ముగురు వేల్పులకు మూలము
ఒగి నలమేల్మంగ కొనరిన పతి యితడు
జిగిమించిన ఈ శ్రీ వేంకటేశుడు" (4-298)

"తానె తానె ఇందరి గురుడు
సానబట్టిన భోగి జ్ఞానయోగి

అపరిమితములైన యజ్ఞాలు వడిజేయ
ప్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మయోగి

అన్నిచేతలును బ్రహ్మార్పణ విధిజేయ
మన్నించు బుద్ధులను మరుగజెప్పి
ఉన్నత పదమున కొనరంగ కరుణించు
పన్నగ శయనుడై బ్రహ్మ యోగి

తనరగ కపిలుడై దత్తాత్రేయుడై
ఘనమైన మహిమ శ్రీ వేంకటరాయడై
ఒనరగ సంసార యోగము కృపసేయు
అనిమిష గతులను అభ్యాసయోగి" (4-355)

"భావములోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా

హరియవతారములే అఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరినామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి హరి యనవో మనసా

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా

అచ్యుతడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రిమీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా" (3-561)

"సేవింపరో జనులాల చేరి మొక్కరో
భావింప నున్నాడిందరి భాగ్యము వలెను

జలకమాడి వున్నాడు సర్వేశ్వరుడు నిగ్గు
గలిగిన మంచి నల్లకలువ వలెను
ఎలమి కప్పురకాపు ఇదె చాతుకున్నవాడు
వెలలేని యట్టి పెద్ద వెండికొండవలెను

అందముగా తట్టుపుణుగు అలదుకనున్నవాడు
కందువ ఇంద్రనీలాల గనివలెను
ముందటి వలెనె తా సొమ్ములు నించుకున్నవాడు
పొందిన సంపదలకు పుట్టినిల్లువలెను

మించి అలమేల్మంగ మెడగట్టుకొన్నవాడు
మంచి బంగారు తామరపువ్వువలెను
ఎంచగ శ్రీ వేంకటేశుడిదే కొలువై వున్నవాడు
నించిన దాసులపాలి నిధానము వలెను" (20-40

"హరినామము కడు ఆనందకరము
మరుగవో మరుగవో మనసా

నలినాక్షుని శ్రీ నామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలచవో తలచవో తలచవో మనసా

నగధరునామము నరకహరణము
జగదేకహితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా

కడిగి శ్రీ వేంకటపతి నామము
బడిబడివే సంపత్కరము
అడియాలంబిల నతిసుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా" (4-408)

ఈ విధంగా హరితత్త్వాన్ని, గుణగణాలను తెలియజేస్తూ, హరినామస్మరణ మరవవద్దని, "హరినొల్లని వారసురులు సుండో" (2-164) అంటూ భగవంతుని కీర్తించనివారు రాక్షసులని మనసా, వాచా, కర్మణ భవగద్విషయమై ఉండాలని తెలిపారు.

"హరిగొలువని కొలువులు మతి అడవిగాచిన వెన్నెలలు
గరిమల అచ్యుతు విననని కథలు భువి గజస్నానములు
పరమాత్మునికి గాని తపంబులు పాతాళముల నిధానములు
మరుగురునికి గాని పూల పూజలు మగడులేని సింగారములు

వైకుంఠు నుతియించని వినుతులు వననిధి కురిసిన వానలు
ఆ కమలోదరు గోరని కోరికె లందని మానిఫలంబులు
శ్రీకాంతునిపై జేయని భక్తులు చెంబుమీది కనకపు పూత
దాకుని విష్ణుని తెలియని తెలుపులు తగవేటి నడిమిపైరులు

వావిరి గేశవు నొల్లని బతుకులు వరతగలవు చింతపండు
గోవిందుని కడుమొక్కని మొక్కులు గోడలేని పెనుచిత్రములు
భావించి మాధవుపై లేని తలపులు పలు మేఘముల వికారములు
శ్రీ వేంకటపతి గరుణ గలిగితే జీవులకివియే వినోదములు"(2-235)

మూర్ఖుని మనసు రంజింపజేయలేమన్న విషయాన్ని అన్నమయ్య క్రింది సంకీర్తనలో స్పష్టంగా తెలిపాడు.

"భారమైనవేఁపమాను పాలువోసి పెంచినాను
తీరనిచేఁదేకాక తియ్యనుండీనా

పాయదీసి కుక్కతోక బద్దలువెట్టి బిగిసి
చాయకెంత గట్టినాను చక్కనుండీనా
కాయపు వికార మిది కలకాలముజెప్పినా
పోయినపోకలేకాక బుద్ధివినీనా

ముంచిముంచి నీటిలోన మూలనానబెట్టుకొన్నా
మించిన గొడ్డలి నేడు మెత్తనయ్యీనా
పంచమహాపాతకాలబారిబడ్డ చిత్త మిది
దంచి దంచి చెప్పినాను తాకి వంగీనా

కూరిమితో దేలుదెచ్చి కోకలోన బెట్టుకొన్నా
సారెసారెగుట్టుగాక చక్కనుండీనా
వేరులేని మహిమల వేంకటవిభుని కృప
ఘోరమైన ఆస మేలుకోర సోకీనా" (1-287)

మానవునిలో భక్తి మంచి ప్రవర్తనా నియమావళి, మంచి సంస్కారం వుండాలని అన్నమయ్య క్రింది సంకీర్తన ద్వారా తెలియజేశారు.

"అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటె
వింత వింత విధముల వీడునా బంధములు

మనుజుడై ఫలమేది మరిజ్ఞాని యౌదాకా
తనువెత్తి ఫలమేది దయగలుగుదాకా
ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాకా
పనిమాలి ముదిసితే పాసెనా భవము

"చదివియు ఫలమేది శాంతము కలుగుదాకా
పెదవెత్తి ఫలమేది ప్రియమాడు దాకా
మదిగల్గి ఫలమేది మాధవు దలచుదాకా
యెదుట తాను రాజైతే ఏలెనా పరము

పావనుడై ఫలమేది భక్తి కలిగిన దాకా
జీవించి ఫలమేది చింత దీరుదాకా
వేవేల ఫలమేది వేంకటేశుగన్నదాక
భావించి తా దేవుడైతే ప్రత్యక్షమౌనా" (1-437)

త్రికరణ శుద్ధిగా చేసే పనులు ఏవైనా అవి భగవంతుని, లోకాన్ని కూడా మెప్పించే విధంగా వుంటాయని తెలిపే క్రింది సంకీర్తన ద్వారా పరిపూర్ణమైన మనస్సు, హరిని కీర్తించే మాట (వాచ) శ్రీ వేంకటపతికి చేయెత్తి నమస్కరించే పని (కర్మ) మానవుని పరమ గమ్యాలని తెలిపాడు.

"త్రికరణశుద్ధిగ చేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును
ఒకటి కోటి గుణితంబగు మార్గములుండగ ప్రయాసపడనేల

తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగాకావేరి
కనకబిందు యమునా గయాది ముఖ్యక్షేత్రంబుల సంతతమున్
దినకర సోమ గ్రహణకాలముల తీర్థాచరణలు చేసిన ఫలములు
తను దానే సిద్ధించును వూరకే దవ్వులు తిరుగగ మరియేలా

హరియను రెండక్షరములు నుడివిన అఖిలవేదములు మంత్రములు
గరిమ ధర్మశాస్త్ర పురాణాదులు క్రమమున చదివిన పుణ్యములు
పరమ తపోయోగంబులు మొదలగు బహుసాధనముల సారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలిది వెదకగనేలా

మొదల శ్రీ వేంకటపతికిని చేయెత్తి మొక్కిన మాత్రము లోపలనే
పదిలపు షోడశదాన యాగములు పంచమహా యజ్ఞంబులును
వదలక సాంగంబులుగా చేసిన వాడేకాడా పలుమారు
మది మది నుండే కాయక్లేశము మాటికి మాటికి తనకేల" (2-236)

మానవులకు సంసారజీవితమే మంచిదని చెపుతున్నాడు అన్నమయ్య. అయితే వారు భగవంతునిపై భక్తి కలిగిఉంటే మంచిదని తెలుపుతూ వారు సమాజంలో ఎలా మెలగాలో అన్న విషయాన్ని తెలియజేసే క్రింది సంకీర్తనలో దశావతార సమన్వయం కనిపిస్తుంది.

"సంసారమె మేలు సకలజనులకును
కంసాంతకుని భక్తి గలిగితే మేలు

వినయపుమాటల విద్య సాధించితే మేలు
తనిసి అప్పులలోన దాగకుంటే మేలు
మునుపనె భూమి దన్నుమోచి దించకుంటే మేల
వెనుకొన్న కోపము విడచితే మేలు

కోరి ఒకరినడిగి కొంచపడకుంటే మేలు
సారెసారెజీవులను చంపకుంటే మేలు
భారపు టిడుములను పడకుండితేమేలు
కారించి తిట్ల కొడిగట్టకుంటే మేలు

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీ వేంకటాద్రి విభుని గొల్చి
యిరవై నిశ్చింతుడైతే నిన్నిటాను మేలు" (3-447)

మానవుడు కృషితో ఏమైనా సాధించవచ్చుని, పనియే ఆరాధన (**Work is worship**), పనిలోనే పరమాత్మను చూడవచ్చుని తెలియజేశాడు.

"మహినుద్యోగిగావలె మనుజుడైనవాడు
సహజివలె నుండేమీ సాధింపలేడు

వెదకి తలచుకుంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మఱచితే సృష్టి చీకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టిరావచ్చు
నిదిరించితే కాలము నిమిషమై తోచు

వేడుకతో జదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండింతే జడుడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ
కూడక సోమరియైతే గుణహీనుడౌను

మురహరుగొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెఱగకుండితే వీరిడియౌను
శరణంటే శ్రీ వేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండుడౌను" (2-212)

మోహం విడుచుటయే మోక్షమని, దేహం ఎఱుగుటే తెలివియని మానవుడు తెలుసుకోవలసిన కొన్ని విషయాలను తెలియజేస్తూ అలా తెలుసుకోనివారు ఎవరైనా ఉంటే అది వారి కులహీనతకు, మాలిన్యానికి నిదర్శనం అని తెలిపాడు.

"మోహము విడుచుటే మోక్షమది
దేహమెఱుగుటే తెలివీనదే

ననిచిన తన జన్మము(గర్భము(దన
పనియు నెఱు(గుటే పరమ మది
తనకు విధినిషేధములు(బుణ్యముల
ఘనత యెఱు(గుటే కలిమి యది

తఱ(దతి ప్రేమపుతల్లిదండ్రులను
యెఱ(గనిదే కులహీన తది
చఱల(బొరలి యాచారధర్మములు
మఱచినదే తనమలిన మది

కమ్మర(గమ్మర( గామభోగములు
నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకట నిలయునిదాసుల
సొమ్మయి నిలుచుట సుకృతమది" (1-263)

మనసుంటే మార్గముంటుందంటారు పెద్దలు. అంటే ఏ పనిసాధించాలన్నా మనసే ప్రధానం అని తెలుస్తుంది. ప్రయత్నం, పరిశీలన, ఆలోచనా శక్తి పటిష్టమైనవైతే జీవుడు దేవుడు కాగలడు అన్న విషయాన్ని అన్నమయ్య క్రింది సంకీర్తనద్వారా తెలిపాడు.

"అందాకాదాఁదాఁనే అంతకెక్కుడుగాడు
ముందువెనకెంచేనా ముఖ్యుడేయతడు

చిత్తమంతర్ముఖము సేసుకొననేర్చెనా
అత్తలనతడు యోగి అనబడును
సత్త సత్త నెడిసువిచారంబు గలిగెనా
ఉత్తమ వివేకియని ఊహింపబడును

భావము నభావమును పరికించి తెలిసినా
కైవల్యనిలయుడని కానబడును
దైవంబు తనమతి దలపోయనేర్చెనా
జీవన్ముక్తుడని చెప్పబడునతడు

అదరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిడువై జితేంద్రియ స్థిరుడాతడు
జడియు శ్రీ వేంకటేశ్వరుదాసుడాయనా
బడి బడి తుదపరబ్రహ్మమే అతడు" (2-452)

మానవుడు బానిస బతుకు బతకడం కంటే భగవంతునికి దాసుడై యుండడం మంచిదంటాడు అన్నమయ్య.

"ఛీఛీ నరులదేటి జీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక

అడవిలో మృగజాతియైనా కావచ్చుగాక
వడి నితరుల కొలువగ వచ్చునా
వుడివోని పక్షియై వుండనైనా వచ్చుగాక
విడువకెవ్వరినైనా వేడవచ్చునా

పసురమై వెదలేని పాటు పడవచ్చుగాక
కసివో నొరుల పొగడవచ్చునా
వుసురు మానైపుట్టి వుండనైనా వచ్చుగాక
విసువక వీరి వారి వేసరించవచ్చునా

యెమ్మెల పుణ్యాలు సేసి ఇలనేలవచ్చుగాక
కమ్మి హరిదాసుడు గావచ్చునా
నెమ్మది శ్రీ వేంకటేశ నీ చిత్తమెకాని
దొమ్ముల కర్మము లివి తోయవచ్చునా" (1-397)

"మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖమందనేలా

జుట్టెడు కడుపుకై చొరనిచోట్లుచొచ్చి
పట్టెడు కూటికై బతిమాలి
పుట్టినచోటికే పొరలి మనసువెట్టి
వట్టి లంపటము వదలనేరడుగాన

అందరిలోపుట్టి అందరిలో పెరిగి
అందరి రూపము లటుతానై
అందమైన శ్రీ వేంకటాద్రీశు సేవించి
అందరాని పదము అందెనటుగాన"

ఇతరుల మనసుకు ఆపద కలిగించకూడదని, ఇతరుల మేలు చూసి సహించరాని ఈర్ష్యాతత్త్వం ఉండకూడదని తెలిపాడు.

"పరుల మనసునకు అపదలు కలుగగజేయు
పరితాపకరమైన బ్రతుకేల
సొరిది ఇతరుల మేలు చూసి సైపగలేక
తిరుగుచుండెడి కష్టదేహమది యేల" (1-302)

పరనింద పనికిరాదు. మనలోని ఎన్ని దోషాలున్నా ఇతరుల్ని చూసి దూషించడం మానవ సహజం. అది తప్పు. అతికాముకత్వం కొరగానిది. బుద్ధి స్థిరంగా ఉండడం అవసరం. మతి చలించేది మంచిది కాదు. ఈ మంచిని పెంచుకుంటేనే మానవులకు సద్గతి కలుగుతుందని అన్నమయ్య ప్రబోధించాడు.

"ఇతర దూషణములు యెడసినగాక
అతికాముకుడు గాని యప్పుడుగాక
మతి చంచలము గొంతమానినగాక
గతియేల గల్గు దుర్గతులేల మాను"

పరధనాపేక్ష పనికిరాదు. కష్టపడి సంపాదించాలి. నిందలపాలు కాకుండా జీవించడం ఉత్తమ లక్షణం. విరసవర్తనం తనకు తనతోటివారికి దుఃఖాన్ని కలిగిస్తుంది. విరసవర్తనాన్ని విడనాడడమే ముఖ్యం. ఈ మంచి లక్షణాలున్నపుడు జీవితం సుఖమయం అవుతుంది. సమాజానికంతటికీ ఉపకరిస్తుంది అని ప్రబోధించాడు.

"పరధనముల యాశ బాసినగాక
అరిది నిందలు లేనియెప్పుడుగాక
విరసవర్తనము విడచినగాక
పరమేల కలుగు నాపదలేల మాను"

సముద్రంలో అలలు తగ్గిన సమయంలో స్నానంచేయాలనే కడలేని మనసుకు అంతంలేదని, దాహం తీరిన తరువాత తత్త్వాన్ని తెలుసుకోవచ్చులే అని అనుకొంటే ధాహం తీరేదిలేదు, తత్త్వం తెలుసుకునేది లేదు. శరీరమున్నంతకాలం కోరికలు తీరేది లేదు. ఆనందం కలిగేది లేదు. కాబట్టి భక్తికి వయసుతో పనిలేదని, "అందముగ తిరువేంకటాద్రీశు మన్ననలు" పొంది బ్రతకడం మంచిదని తెలియజేశాడు.

"కడలుడిపి నీరాడగా తలచువారలకు
కడలేని మనసుకు కడమయెక్కడిది

దాహమణగిన వెనుక తత్త్వమెఱిగెదనన్న
దాహమేలణుగు తా తత్త్వమే మెఱుగు
దేహంబుగలయన్ని దినములకును పదార్థ
మోహమేలణుగు తా ముదమేల కలుగు

ముందరెఱిగిన వెనుక మొదలు మఱచెదనన్న
ముందరే మెఱుగు తా మొదలేల మఱచు
అందముగ తిరువేంకటాద్రీశు మన్ననల
కందువెఱిగిన మేలు కలనైన లేదు" (1-226)

ధనం, కోపం, పరనింద, విషయవాంఛ, "పఱివోనియాస" ఇవన్నీ ఆపదలను సూచిస్తాయని అంటూ శ్రీ వేంకటేశ్వరుడే దైవమని నిరంతరం అతని సేవానందపరులై మానవులు మనగలిగితే మంచిదని తెలియజేశాడు అన్నమయ్య.

"ఎంత విభవము గలిగె నంతయును నాపదని
చింతించినది గదా చెడని జీవనము

చలముగోపంబుదనుజంపేటి పగతులని
తెలిసినది యదిగదా తెలివి
తలకొన్నపరనింద తనపాలి మృత్యువని
తొలగినది యదిగదా తుదగన్నఫలము

మెఱయు విషయములే తనమెడనున్న వురులుగా
యెఱిగినది యదిగదా యెరుక
పఱివోనియాస దనుబట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ

యెనలేని తిరువేంకటేశుడే దైవమని
వినగలిగినదిగదా వినికి
అనయంబు నతనిసేవానందపరులయి
మనగలిగినదిగదా మనుజులకు మనికి" (1-181)

అన్నీ దైవసంకల్పంమీదనే జరుగుతాయి. భగవంతుని ఆజ్ఞలేనిదే ఏమీ జరగదు. తాను ఒకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది అన్నట్లు నిదర్శనంగా మానవుని ఆలోచనా బుద్ధి అంతా భగవంతుడే. ఇదంతా భగవదనుగ్రహం మరియు ప్రాప్తంమీదనే ఆధారపడి వుంది.

"అంతయునతని మహామహిమే అత
డెంతసేసినా నెట్టయిననవును

రావలెనన్నవి రాకమానవు
పోవలెననన్నవి పోకుండవు
అవల నీవల అలమటలేటికి
దైవమొక్కడే తగిలిన గుర్తు

కాయపు గుణములు కలిగినవే భువి
నీయెడ జీవుడు యిటుగలడే
అయమిందుగా దవునన నెవ్వరు
కాయజగురుడొక్కడే ప్రేరకుడు

అంతరంగమే ఆత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడమాయ
చింతించి రక్షించ శ్రీ వేంకటేశుడు
మంతుకెక్కనిక మతకములేల" (3-562)

మాయామోహం కలిగిన మనసుకు శ్రీ వేంకటేశ్వరుని కరుణ కలిగితే అంతేచాలు అని తెలిపే క్రింది కీర్తనలో ఒక చర్యకు మరొక చర్య కారణంగా తెలుస్తుంది.

"మాయామోహము మానదిది
శ్రీ అచ్యుత నీ చిత్తమె కలది

యెంత వెలుగునకు నంతే చీకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధమ పథ్యము సరి
వింతే మిగిలెను వేసటే కలది

చేసిన కూలికి జీతమునకు సరి
పూసిన కర్మ భోగము సరి
వాసుల జన్మము వడి మరణము సరి
ఆసల మిగిలిన ధలపే గలది

మొలచిన దేహము ముదియుటకును సరి
తలచిన దైవము తనలోను
యిలలో శ్రీ వేంకటేశ నీ కరుణ
కలిగిన మాకెల్ల ఘనతే కలది" (3-566)

మానవులలో కొంతమంది అజ్ఞానంలో మునిగి ఇతరుల కార్యమంతా తమదేనని భావిస్తారు. అలాంటి వెఱ్ఱివారిని హెచ్చరిస్తున్నాడన్నమయ్య. బహుశా ఇది వ్యక్తిగతమైన అనుభవం అనిపించినా సోమరిపోతులు మాత్రం కావద్దంటున్నారు.

"వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడుకల్లంగ రాదా

ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యము గాదు
కుడిచివేసిన పుల్లె కుడువంగాం గాదు
బడినొకరు చెప్పినం బ్రతి చెప్పంబోతేను
అదరి శ్రీహరి కది అరుహము గాదు

నేతి బీరకాయ నేయి అందులేదు
రాతివీరునికి బీరము ఇంచుకాలేదు
ఘాత బూరుగుపండు కడుపులోన దూది
యేతుల నుడుగులు యెక్కునా హరికి

యెన్నగ శ్రీ వేంకటేశు దాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ
నున్నతితోబాడి రొకడెవ్వడో తాను
సన్న నొరసునట సమ్మతాహరికి" (2-494)

ఇలాగా నీత్యుపదేశం చేయడమే గాదు, ఆత్మ పరిశీలన అన్నమాచార్యులలో బహువిశిష్టంగా విదిత మవుతుంది. ఇది కేవలం ఆయన ఆత్మ పరిశీలనమే గాదు. అందరికి ఇది వారి వారి ఆత్మపరిశీలన.

"ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయజూడవే" (2-304)

ఇంకా ఆత్మపరిశీలన చేసుకోవడంలో పరాంకోటి అయిన సంకీర్తన అన్నమాచార్యుని జ్ఞానధన్యుని గావించింది.

"చదివితిదొల్లి కొంత చదివేనింకాగొంత
యెదిరి నన్నెఱగను యెంతైన నయ్యో

వొరుల దూషింతుగాని వొకమారైన నా
దురిత కర్మములను దూషించను
పరుల నవ్వుదుగాని పలుయోనికూపముఃా
నరకపు నా మేను నవ్వుకోను

లోకులగోపింతుగాని లోని కామాదులనేటి
కాకరి శత్రువుల మీద గడు గోపించ
ఆకడ బుద్ధులు చెప్పే అన్యుల బోధింతుగాః
లేకువ నాలోని హరిదెలుసుకోలేను

యితరుల దుర్గుణములెంచి, యెంచిరోతుగాని
మతిలో నాయాసలు మానలేను
గతిగా శ్రీ వేంకటేశుగని బ్రతికితిగాని
తతినిన్నాళ్ళ దాకా దలపోయలేదు" (4-74)

ఇలాగా ఆత్మ పరిశీలనతో సముచిత రీతిని నీత్యుపదేశం గావించిన ఉత్తమ దేశికుడు అన్నమాచార్యులు. అరిషడ్వర్గాలనేవి మానవుని అంతఃశత్రువులు. అవి అధికారం వహించి వశపరుచుకుంటాయి. వాటిని జయించడానికి ఒకే ఒక

మార్గం భగవన్నామ స్మరణ. తద్వారా భగవంతుడు మనల్ని కాపాడి. వాటిపై అధికారాన్ని కల్పిస్తాడని అన్నమయ్య తెలియజేస్తున్నాడు.

"కాయమనే పూరికి గంతలు తొమ్మిదియాయు
పాయక తిరిగాడేరు పాపపు తలారులు

కాముడని యెడి రాజు గద్దెమీదనుండగాను
దీముగోపపు ప్రధాని దిక్కులేలీని
కోమలవు జ్ఞానమెల్లాగొల్లబోయనాడనాడ
గామిదులై రింద్రియపుగాపు లెల్లా నిదివో

చిత్తమనే దళవాయి చింతలనే ఫౌజుపెట్టి
యిత్తల విషయములు యెన్నికిచ్చిరి
తుత్తుమురై కోరికెల దొండెము రేగగ జొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీబుట్టుగులు

బలు సంసారమనేటి భండారము ఘనమాయ
కలదీగి జవ్వనపు కైజీతము
యిలలో శ్రీవేంకటేశుడింతలో జీవుడనేటి
బలువుని రాజుజేసి పాలించె నన్నును" (1-488)

హరినెఱిగినవాడు సత్యసంపన్నుడు, పరనింద చేయనివాడు, భూతదయ కలిగినవాడు, పరులు తానేయని భావించేవాడు నిర్మలుడై ఆత్మనియతి గలవాడు, ధర్మతత్పర బుద్ధి గలవాడు, కర్మమార్గాలు వదలనివాడు, హరి భక్తి మరువనివాడు, జగతికి మేలు చేసేవాడు, అజాతశత్రువుగా బ్రతికేవాడు, ఆత్మ తెలిసినవాడు, శ్రీ వేంకటేశ్వరునికి దాసుడైనవాడు ఏ కులస్థుడైనా పర్వాలేదు అని తెలియజేశాడు.

"ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడె హరినెఱిగినవాడు

పరగిన సత్యసంపన్నుడైన వాడే
పరనిందసేయ తత్పరుడు కానివాడు
అరుదైన భూతదయనిధి యగువాడే
పరులు తానేయని భావించువాడు

నిర్మలుడై యాత్మనియతి గలుగువాడే
ధర్మతత్పర బుద్ధి తగిలినవాడు
కర్మమార్గములు గడవనివాడే
మర్మమై హరిభక్తి మఱవనివాడు

జగతిపై హితముగా చరియించువాడే
పగలేక మతిలోన బ్రదికినవాడు
తెగి సకలము నాత్మ తెలిసినవాడే
తగిలి వెంకటేశు దాసుడయినవాడు" (1-292)

వేదాలు చదివి విముఖుడై హరిభక్తిలేని సోమయాజికంటే ఏమీ తెలియని చదువులేని కులహీనుడైన విష్ణుపాదసేవనాసక్తి గలవాడైతే అతడే ఘనుడు. వేదాంత పఠన చేసే హరిభక్తిలేని సన్యాసి కంటే నరవిమాలిన కడజాతి కులం వాడైనా విష్ణుని కొరకు చింతించేవాడైతే అతడే ఘనుడని తెలియజేస్తున్నాడు.

"ఎక్కువ కులజుడైన హీనకులజుడైన
నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు

వేదములు చదివియు విముఖుడై హరిభక్తి
ఆదరింపని సోమయాజి కంటే
యేదియునులేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు

పరమమగు వేదాంత పఠనదొరికియు సదా

నరవిమాలిన అంత్యజాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకు నాతడేఘనుడు" (1-318)

"విజాతులన్నియు వృథా వృథా" అంటూ చాటిన క్రింది కీర్తన ద్వారా అందరిలోను అంతరాత్ముడై యున్నవాడు ఆ శ్రీహరియని, కావున ఆ శ్రీహరిపై భక్తి కలిగి వుండడమే సుజాతి యని తెలిపాడు.

"విజాతులన్నియు వృథా వృథా
అజామిళాదుల కదియే జాతి

జాతిభేదములు శరీర గుణములు
జాతి శరీరముసరితోడనే చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరి విజ్ఞానపు దాస్యంబిది యొక్కటే పో సుజాతి

హరి యిందరిలో నంతరాత్ముడిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి
ధరణిలోన పరతత్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి

లౌకికవైదిక లంపటులకు నివి
కైకొను నవశ్య కర్తవ్యంబులు
శ్రీకాంతుడు శ్రీ వేంకటపతి సేసిన సంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీ నామమే పో సుజాతి" (2-383)

అన్నమయ్య నాటి దురాచారాలను రూపుమాపే దిశగా ఎన్నో సంకీర్తనలు రచించాడు. దురాచారాలను నమ్మవద్దని, దిక్కు దెస అయిన ఆదిదేవుని మొక్కి సేవించి బ్రతకడమే మానవజీవితమని తెలిపాడు.

"మొక్కరో మోసపోక మీకు
దిక్కుదెస అయిన ఆదిదేవునికి

(మారుచే) తులియవద్దు మారుగాళ్ళియవద్దు
బీర(రా?) న గుండెలు గోసిపెట్టవద్దు
గోరపడి చిచ్చులోన కొండాలు చొణవద్దు
ఊరకే మీవారమని వున్నజాలు

సిడిదలలియ్యవద్దు జీవాల జంపవద్దు
బడిబడి పగ్గాల బారవద్దు
సిడిమీద బిత్తరపు బిమ్ములు చిమ్మగవద్దు
కడనుం................ దారి గన్నజాలు

బగ్గన యెక్కడ డొక్కపడునో యేమరవద్దు
బగ్గిపడ్డ యమబాధ బడవద్దు
యెగ్గుసిగ్గులేక వేంకటేశుని దాసులజేరి
అగ్గలపు పాదరేణువైన చాలు" (4-2-62)

మానవుడు లౌకికమైన ఆనందాన్ని పొందాలని తపన పడతాడు తప్ప అలౌకికమైన ఆనందాన్ని పొందాలని ప్రయత్నించడని తెలుపుతూ ఈ తత్వాన్ని మార్చుకోవాలని హెచ్చరిక చేస్తున్నాడు.

"ఏటి విచారము యెక్కడి ఆచారము
మాటున జీవుడింతేసి మాయలబొరలును

ధరనన్నియును గూర్చి దాచుకొనేది
పొరసి నానా సుఖభోగాలు చింతించుగాని
పరమునకేపాటి ప్రయాసపడడు

కడుపు నించుకొరకు గామ సుఖమునకేకా
చెడని వుద్యోగాలు సేయగోరును
ఘిడిసి లోకములెల్ల మెప్పించ నడచుగాని
చిడుముడి హరి మెప్పించేననలేదు

సారెసారె జచ్చి చచ్చి జననము నొందేదెల్లా
పూరగల కర్మములొగిజేయుట
మేరలేక నరులను మెచ్చుగ గొలుచుగాని
కూరిమి శ్రీ వేంకటేశు గొలువగలేదు" (3-560)


అన్నమయ్య దృక్పథానికి సంబంధించి ఇందులో ముక్తి, భక్తి, శక్తి, అన్న అంశాలను చర్చించాను. కలియుగంలో ముక్తికి సులభమైన మార్గం శ్రీహరి సంకీర్తన అని, భక్తితో పరబ్రహ్మతత్వాన్ని తాను కొనియాడడమే గాక, సమాజానికి కూడా విష్ణుతత్వాన్ని తెలియజేసిన వైష్ణవ తేజోశక్తి అన్నమయ్య అని తెలియజేయడం ఇందులోని ప్రధానాంశం.

# పాదసూచికలు

1. దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న
2. శ్రీ మద్భగవద్గీత ఉపోద్ఘాతము-పుట-6-శిష్టా సుబ్బారావు
3. శ్రీ మద్భాగవతము - ఏల్చూరీ మురళీధరరావు (పరిచయం-పుట-17)
4. "పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట" (1-16)
5. శ్రీ మహా భాగవతము - పీఠిక-పుట-77, తెలుగు విశ్వవిద్యాలయం
6. జయ సాహిత్య వ్యాసాలు - జి.డి.నాయుడు (భారత భాగవతాల్లో శ్రీకృష్ణ నిర్యాణం) పుట 157
7. శ్రీ మహాభాగవతము - సింహావలోకనం- పుట-
8. "మహేశ్వర ధ్యానంబు సేయుచు" 1-13
9. "ఏతే చాంశ కలాః పునః కృష్ణస్తు భగవాన్స్వయమ్" 1:3:27 సంస్కృత భాగవతము
10. 'వార్త' పత్రిక 2003, మార్చి నెల, మంగళవారం 25 తేది (డా॥ గోవిందరాజ శశిధరశాస్త్రి)
11. "ప్రతి నిముషము పరబ్రహ్మంబు వీక్షించి మదిఁజొక్కి వెలుపల మఱచువాడు (1-513) కేవల పరమేశ్వరుడయ్యె" (1-174)
12. శ్రీ కృష్ణభారతి -పుట -52
13. "........మంద్ర మధ్యమతారముల నింపు దళుకొత్తు రాగభేదములఁదనరి ద్వైత ఋషభ గాంధార నిషాద పంచషడ్జమధ్యమ స్వరము 2-188 (సంగీత స్థాయీభేదాలు, స్వరాలు, వాటి పేర్లు ఇవి సంగీతాభినివేశం ఉన్నవారికి మాత్రమే తెలుస్తాయి).
14. పోతన భాగవతము, దశమస్కంధము 2వ భాగము, సరళగద్యానువాదము - ప్రవేశిక - తి.తి.దే. ముద్రణ - 1998

15. శ్రీమద్భాగవతము -మహో విష్ణుభావన, పరిచయం -పుట-17, ఏల్చూరి మురళీధరరావు
16. ఆంధ్ర భాగవత విమర్శ పుట - 451
17. శ్రీ తల్లం పుల్లన్నగుప్త ధర్మనిధి ఉపన్యాసాలు - పుట - 34
18. శ్రీ తల్లం పుల్లన్నగుప్త ధర్మనిధి ఉపన్యాసాలు -పీఠిక - 82
19. ఆంధ్ర భాగవత విమర్శ- పుట - 381
20. శ్రీకృష్ణభారతి - పుట - 69 - ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి
21. "భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
    శూలికైన తమ్మి చూలికైన
    విబుధ జనుల వలన విన్నంత కన్నంత
    తెలియవచ్చినంత తేటపఱుతు"
22. శ్రీకృష్ణ భారతి -పుట - 69
23. "అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము
    లందు వెలుగొందీ ప్రభమీరగను"
24. "అన్ని మంత్రములిందె అవహించెను"
25. "పదముల యర్థము పల్లవి
    వదలక యన్నిటికి నేకవాక్యత సేయన్
    గుదిగ్రుచ్చినట్లు తగులై
    పదము తుదిన్ మరియుఁ బల్లవి యలరున్"
26. "పదములు, సమాస, ఘట, వర్ణనలు ఇవి యన్నియు ప్రబంధముల ధోరణిలోనివే" 'సాహిత్యానుశీల' పుట-41, గంగప్ప
27. "నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్" సం. భాగవతం 12-13-23
28. "కృతే యద్ ధ్యాయతో విష్ణుః
    త్రేతాయాఃయజతోముఖి
    ద్వాపరే పరిచర్యాయాం
    కలౌతు తద్ధరి కీర్తనాత్" మహాభారతము-శాంతిపర్వము-52

29. హిందూ ధర్మ పరిచయము-పుట-150, తి.తి.దే., 1992
30. సంకీర్తన సంపుటం-2, పీఠిక పుట-48
31. తెలుగు-వెలుగులు పుట-122, తి.తి.దే.,1983
32. శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రం, చిన్నపుస్తకం-పుట-30, ధర్మప్రచార పరిషత్, తి.తి.దే
33. చి.తి. సం.లక్షణం-12
34. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర-పుట-61, కేసర్లవాణి
35. సంకీర్తన సంపుటం 5 - పీఠిక పుట - 24
36. శేషాచార్యుల వ్రాతపతి
37. చి.తి.సం.లక్షణం-59
38. చి.తి.సం.లక్షణం-6
39. చి.తి.సం.లక్షణం-34
40. అన్నమాచార్యుల జీవిత చరిత్ర-పీఠిక



## పోతన, అన్నమయ్యల భావసామ్యాలు :

పోతన, అన్నమయ్యల సాహిత్యాన్ని పరిశీలిస్తే వీరిరువురు ఒకే భావసామ్యం కలిగినవారుగా కనిపిస్తారు. వీరిరువురు ఒకే మనోభావతత్త్వం గల పవిత్ర స్నేహితులా అన్న సందేహం కూడా వస్తుంది. అలోచిస్తే దీనికి రెండు కారణాలు కనిపిస్తాయి. ఒకటి ఇద్దరూ హరితత్త్వాన్ని కొనియాడినవారే. అందులో సాక్షాత్తు మహావిష్ణువే వీరి చిత్తంలో ఉండి అతని (శ్రీహరి) గుణగణాలను కీర్తింపజేశాడు.

"పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట" అని రామభద్రుడే తన చేత భాగవతాన్ని పలికించాడని పోతన చెప్పుకున్నాడు.

అట్లే అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుడే తన నాలుకపై నుండి నానా సంకీర్తనలు పలికించాడని చెప్పుకున్నాడు.

"నా నాలికపై నుండి నానా సంకీర్తనలు
పూనినాచే పొగిడించితివి
వేనామాల వెన్నుడా వినుతించనెంతవాడ
కానిమ్మని నాకీ పుణ్యము గట్టితివింతె అయ్యా"

కాబట్టి వీరి మనోభావాలు ఒక్కటిగా వుండడంలో ఆశ్చర్యం లేదు. కారణం వీరిరువురు అనన్యమైన భక్తిగల భగవత్ ఉపాసకులు. భక్తికి చిక్కిన విధంగా భగవంతుడు మరొక విధానానికి చిక్కడు (7-243) అని పోతన చెప్పినట్లుగా భక్తి గొప్పతనం అలాంటిది. భక్తిగల వీరి మనస్సుల్లో ఎల్లప్పుడు భగవంతుడు అంతరాత్మగా వున్నాడు. కావున ప్రత్యక్షంగా పోతన భాగవతాన్ని, అన్నమయ్య సంకీర్తనలను రచించినా పరోక్షంగా ఆ పని చేయించినవాడు శ్రీ మహా విష్ణువే అని తెలుస్తుంది. ఆ విధంగా భగవంతుడే మా నోటి వెంట పలికించాడని చెప్పుకొని వీరు వారి వినయాన్ని చాటుకున్నారు

"భాగవతము తెలిసి పలుకుట చిత్రము.., నేఁబలికిన భవహరమగునట"(1-17) అని పోతన, " నేనొక్కడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది పూని నా వల్లనే కీర్తిఁబొందేవు నీవు" (3-48) అని అన్నమయ్య చెప్పుకున్నారు.

పోతన పద్య పోకడలు, అన్నమయ్య కీర్తన పోకడలు గమనిస్తే భావసామ్యం కనిపిస్తుంది. శరద్రాత్రిలో గానంచేసే శ్రీకృష్ణుని సన్నిధికి చేరారు గోపికలు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు కొంతసేపు కనిపించకపోగా ఒక గోపిక శ్రీకృష్ణుని అన్వేషిస్తూ అతని రూపలావణ్యాలను ఇలా చెపుతుంది.

ఉ॥ "నల్లనివాడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా
జిల్లెడు మోమువాఁడొకడు చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియలార! మీ పొదలమాటున లేదు గదమ్మ చెప్పరే (10-పూ-1010)

ఇదే పద్యాన్ని పోలినది అన్నమయ్య కీర్తనలో కూడా కనిపిస్తుంది. అయితే ఇక్కడ అన్నమయ్య తానే ఒక గోపికయై గొల్లవాడలోని గోపికలను అడుగుతున్న సందర్భంలో శ్రీకృష్ణుని రూపురేఖలు వర్ణించ బడ్డాయి.

"వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంట

చెందమ్మి కన్నులవాడు చేతిపిల్లగోవి వాడు
ఇందువచ్చి కంటిరా యేలరే అమ్మ
మందల పశువుల వాడు మకరాంకముల వాడు
యెందున్నాడో చెప్పరే యేలదాచేరమ్మ

నెమలి పింఛమువాడు నీలి మేఘకాంతివాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మ
జమళి చేతులవాడు సంకుచక్రములవాడు
అమరనీపాల జిక్కునట చూపరమ్మ" (18-14)

పోతన అన్నమయ్య గోపికల విరహాన్ని గమనించినట్లయితే వీరిద్దరి గోపికల మనోభావాలు ఒక్కటిగా వున్నట్లు వ్యక్తమవుతాయి.

శ్రీకృష్ణుడు గోపబాలురతో చల్దులారగించే సన్నివేశంలో బ్రహ్మాది దేవతలు ఆశ్చర్యం చెంది కీర్తించిన సందర్భంలో పోతన, అన్నమయ్యల భావసామ్యాలు వారి క్రింది పద్య సంకీర్తనల్లో గమనించవచ్చు.

సీ॥ "కడుపున దిండుగా గట్టిన వలువలో
లాలిత వంశనాళంబు జొనిపి
విమల శృంగంబును వేత్రదండంబును
జాఱిరానీక డాపంక నిఱికి
మీగడ పెరుగుతో మేళవించిన చల్ది
ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేగి కొసరి తెచ్చివ యూరగాయలు
వ్రేళ్ళ సందులను దాపెలయనిఱికి

సంగడీల నడుమ జక్కన గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుడమరుట వెఱగంద
శైశవంబు మెఱసి చల్దిగుడిచె" (10-పూ-496) అని పోతన భావన.

అట్లే అన్నమయ్య ;

అచ్చపురాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ

ఊరుగాయలను నొద్దిక చద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవుల గొంటివి కృష్ణా

ఆకసమున కాపురముఖ్యులు
నాకలోకపు నాందులను
కైకొని యజ్ఞకర్తయాతడని
జోకగానియాడ జొక్కితి కృష్ణా" (4-2-46)

భగవంతుని కీర్తించని బ్రతుకులు వృధా అంటూ తెలియజెప్పే క్రింది పద్య సంకీర్తనల్లో పోతన, అనమయ్యల భావసామ్యం కనిపిస్తుంది.

సీ॥ "నారాయణుని దివ్య నామాక్షరములపైఁ
గరఁగని మనములు గఠిన శిలలు
మురవైరి కథలకు ముదితాశ్రు రోమాంచ
మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదల నున్న
కనక కిరీటంబు గట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి
వన దుర్గ చంద్రికా వైభవంబు

ఆ॥ కైటభారి భజన గలిగియుండనిఁవాడు,
గాలిలోన నుండి కదలు శవము
కమలనాభు పదము గనని వాని బ్రతుకు
పసి(డికాయలోని ప్రాణిబ్రతుకు" (2-51)

సీ॥ "కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే?
పవన గుంభిత చర్మభస్త్రిగాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే?
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే?
తనుకుడ్య జాల రంధ్రములు గాక

ఆ॥ "చక్రిచింతలేని జన్మంబు జన్మమే?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే?
పాదయుగముతోడి పశువుగాక (7-170)

హరిఁగొలువని కొలువులు మఱి యడవిఁగాసిన వెన్నెలలు
గరిమల నచ్యుత వినని కథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁగాని తపంబులు పాతాళముల నిధానములు
మరుగురునికిఁగాని పూవుల పూజలు మగఁడు లేని సింగారములు

వైకుంఠునినుతియించ వినుతులు వననిధిఁగురిసిన వానలు
ఆకమలోదరుఁగోరని కోరికె లందని మానిఫలంబులు
శ్రీకాంతునిపైఁజేయని భక్తులు చెంబుమీఁది కనకపుఁబూఁత
దాకొని విష్ణునె తెలియని తెలువులు తగ నేటినడిమి పైరులు

వావిరిఁగేశవునొల్లని బదుకులు వరతఁగలపు చింతపండు
గోవిందుని కటు మొక్కని మొక్కులు గోడలేని పెనుచిత్రములు
భావించి మాధవుపైలేని తలఁపులు పలుమేఘముల వికారములు
శ్రీ వేంకటపతి కరుణ గలిగితే జీవుల కివియే వినోదములు (2-235

పరమాత్మ తత్త్వాన్ని కొనియాడిన తీరులో పోతన, అన్నమయ్య భావసామ్యం క్రింది పద్య సంకీర్తల ద్వారా తెలుస్తుంది.

సీ॥ "భావించి కొందఱు బ్రహ్మంబునీవని
తలపోసిఁ కొందఱు ధర్మమనియు
జర్చించి కొందరు సదసదీశ్వరుడని
సరవిఁగొందఱు శక్తి సహితుడనియు
జింతించి కొందఱు చిరతరుండవ్యయు
డాత్మతంత్రుడు పరుండధికుడనియు
దొడరి యూహింతురుతుదినద్వయ
సదసద్విశిష్ట సంశ్రయుడవీవు

తే॥ తలఁపనొక్కింత వస్తుభేదంబు గలదె
కంకణాదుల పసిడి యొక్కటి గాదె
కడలు పెక్కైన వార్ధి యొక్కటిగాదె
భేదమంచును నిను వికల్పింపరాదు (8-386

అట్లే అన్నమయ్య,
"ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికు లాది భైరవుండనుచు

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులనుతలపుల కొలదుల భజింతురు
సిరుల మిమునే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన మన బుద్ధలకు ఘనుడవు

నీవలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల బాగీరథి దరిబావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్న దైవమని
ఈవలనే నీ శరణుననెదను ఇదియే పరతత్త్వము నాకు"(2-159)

పోతన, అన్నమయ్యలు విష్ణువును సర్వాంతర్యామిగా కీర్తించిన క్రింది పద్య ంకీర్తల ద్వారా వీరి భావసామ్యం కనిపిస్తుంది.

"హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువులేదు వంశ పావన వింటే?"(2-17, పోతన)

"విశ్వమెల్ల నీ విరాట్ రూపమే" (3-530, అన్నమయ్య)
"సర్వం విష్ణుమయంబుగాన" (2-381, అన్నమయ్య)
"విశ్వప్రకాశునకు వెలియదలోనేడ" (1-355, అన్నమయ్య)

శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నట్లు భగవత్ సంకల్పం మీదనే అన్నీ జరుగుతాయి. దైవానుగ్రహం వుంటే అన్నీ అబ్బుతాయని లేకపోతే లేదన్న విషయాన్ని తెలిపే క్రింది పద్య సంకీర్తనల ద్వారా పోతన, అన్నమయ్యల భావసామ్యం కనిపిస్తుంది.

"ధనము వీధిబడిన దైవవశంబున
నుండు బోవు ఘూలనున్ననైన
నడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమున జచ్చు" (7-49, పోతన)

"రావలెనన్నవి రాకమానవు
పోవలెనన్నవి పోకుండవు
ఆవల నీవల అలమటలేటికి?
దైవమొక్కటే తగిలిన గురుతు" (3-562, అన్నమయ్య)

పోతన, అన్నమయ్యల మనస్తత్వ భావాలు ఒకే విధంగా వుంటాయనడానికి క్రింది పద్య సంకీర్తనే నిదర్శనం.

"పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతనామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁడేతద్విశ్వమున్ భూవరా!" (7-123)

పై పద్యం ద్వారా సర్వకాల సర్వావస్థల యందు హరి ధ్యానంతో తన్మయత్వాన్ని పొందే ప్రహ్లాద తత్త్వం పోతనదని తెలుస్తుంది. అట్లే సంకీర్తన కంటే సుఖాన్నిచ్చేది మరొకటి లేదని, ఎల్లప్పుడు శ్రీహరి సంకీర్తన గానం చేస్తుండడమే ఇహపరసాధనం అన్న తత్త్వం కలవాడు అన్నమయ్య.

"ఇహపరసాధనమిదియొకటే
సహజపుమురారి సంకీర్తనొకటే" (4-16)

"సతతము శ్రీహరి సంకీర్తనం త
ద్వ్యతిరిక్త సుఖం వక్తుంనాస్తి"(1-4)

పోతన, అన్నమయ్యలిరువురు రాజాస్థానానికి దూరంగానున్నవారే. భక్తివిశ్వాసం కలవారు. వీరి బ్రతుకుతెరువు హరిసంకీర్తనం తప్ప అన్యుల కీర్తించి ధనసహాయాన్ని పొందాలన్న తత్త్వం కాదు. సంగీత త్రిమూర్తులలో ఒకరైన త్యాగరాజస్వామి వారిది కూడ వీరి తత్త్వమే. అందుకే అతడు నిధి చాలా సుఖమా. రాముని సన్నిధి చాలా సుఖమా" అని కీర్తించాడు. రాజాశ్రయానికి కూడా దూరంగా ఉన్నాడు. క్రింది పోతన, అన్నమయ్యల పద్యపదాలు గమనించినట్లయితే లౌకిక సంపద మీద ఏ మాత్రం వీరికి ఆశలేదు. అలౌకికమైనది, శాశ్వతమైనది అయిన ముక్తి సంపదపై వీరికి మక్కువ ఎక్కువ అని తెలుస్తుంది.

"నిన్నేకాని పలుకనేరవు మా జిహ్వా" (10-పూ-988,పోతన)
"నరహరి కీర్తన నానిన జిహ్వా
నొరుల నుతింప నోపదు జిహ్వా" (2-144,అన్నమయ్య)
"ధనమదాంధుల కొలువేల తాపసులకు"(2-21, పోతన)
"వడినితరుల కొలువగ వచ్చునా" (1-397, అన్నమయ్య)

భాగవతం రచించే అవకాశం రావడం పూర్వజన్మసుకృతమని పోతన భావించాడు.

"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విం బురాణావళుల్
తెనుగుంజేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిదెనింగించినా
జననంబున్ సఫలంబుజేసెద బునర్జన్మ లేకుండగన్" (1-19)

అట్లే, అన్నమయ్య కూడా భగవత్ సంకీర్తనలు గానం చేయడం సుకృతమని భావించాడు.

"నెమ్మది వేంటనిలయుని దాసుల
సొమ్మై నిలుచుట సుకృతమది" (1-263)

**భాగవత ప్రశంస :**

పోతన భాగవత ప్రశక్తిని, అన్నమయ్య సంకీర్తన ప్రశస్తిని కొనియాడారు.

పోతన : "నిగమములు వేయుచదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను
నిగమంబుఁబఠింప ముక్తి నివసనము బుధా"1-139

"వేదకల్పవృక్ష విగళితమై శుక
ముఖ సుధాద్రవమున మొనసియున్న
భాగవతపు పురాణ ఫలరసాస్వాదన
పదవిగనుకు రసిక భావ విధులు" (1-35)

"శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతంబైన
భాగవతంబు సద్భక్తితోడ
వినగోరువారల విమల చిత్తంబుల
జెచ్చర నీశుండు చిక్కుగాక" (1-34)

"సత్యం పరంధీమహి"యను గాయత్రీ ప్రారంభంబున గాయత్రీనామ బ్రహ్మ రూపంబై" (1-33)

లలిత స్కంధము గృష్ణమూలము శుకాపాలభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై (1-20)

"అతి రహస్యమైన హరిజన్మకథనంబు
మనుజుడెవ్వడేని మాపురేపు
జాలభక్తితోడఁజదివిన సంసార
దుఃఖరాశిఁబాసి తొలగిపోవు (1-64)

అన్నమయ్య :

అన్ని మంత్రములిందె ఆవహించెను (4-438)
అన్నిటికిది పరమౌషధము (4-358)

కలియుగంబునకు గలదిదయె-
వెలసిన పంచమవేదమె కలిగె (4-2-60)

పంచమవేదపు పద్మాక్షునామము
అంచెపాపహర మౌషదము (3-564)

కామధేనువిదె కల్పవృక్షమిదె
ప్రామాణ్యముగల ప్రపన్నులకు (2-488)

ఏవం శ్రుతిమత మిదమేవ త
ద్భావయతు మతఃపరం నాస్తి

అతులజన్మ భోగాసక్తానాం
హిత వైభవ సుఖమిదమేవ
సతతం శ్రీహరి సంకీర్తనం త
ద్వ్యతి రిక్త సుఖం వక్తుంనాస్తి

బహుళ మరణ పరిభవ చిత్తా నా
మిహపరసాధనమిదమేవ
అహివయన మనోహర సేవా త
ద్విహరణం వినా విధిరపినాస్తి

సంసార దురిత జాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర
శంసైవా పశ్చాదిహనాస్తి (1-4)

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల సడగించు సంకీర్తనం

సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతము దలచుడే సంకీర్తనం

సామజము గాచినది సంకీర్తనం
సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరిక సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం

జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యము లిచ్చు సంకీర్తనం
శమదమాదుల జేయు సంకీర్తనం

జలజాసనుని నోరి సంకీర్తనం
చలిగొండ సుత దలచు సంకీర్తనం
చలువ కదు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలచుడీ సంకీర్తనం

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం
సరుస వేంకట విభుని సంకీర్తనం
సరుగ నను దలచుడే సంకీర్తనం (1-343)

ఇహపర సాధన మిదియొకటె
సహజపు మురారి సంకీర్తనొకటే (4-16)

చాలదా హరి సంకీర్తనం గల
మేలది దీనినే మొరసిరి ఘనులు

తలప వేదశాస్త్రములు గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరి మంత్రమే దగబేర్కొని
అలవిమీర గడు నధికములైరి

యితర దైవముల నెఱగనేరక
ప్రతిలేని మహిమంబార్వతి
మతి దలపుచు హరిమంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె

చదువులు పలుమరు జదువనోపక
అదివో నారదాదులు
పదిలపై వేంకటపతి హరినామమే
వదలకిదియె జీవనమైమనిరి (1-205)
చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు
చాలదా హితమైన చవులెల్లనొసగ
తగు వేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ (1-52)

"నళిన దళాక్షుని నామ కీర్తనము
కలిగి లోకమున కలదొకటి" (4- 314)

"నారాయణాయ నమోనమో నానాత్మనే నమోనమో
ఈ రచనలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికీ

గోవిందాయ నమో నమో గోపాలయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో నమో
ఈ వరుసలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీ మహిళా పతయే నమో నమో శిష్టరక్షణే నమో నమో
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
ఈ మేరలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి

పరిపూర్ణాయ నమో నమో ప్రణవగ్రాయ నమో నమో
చిరంతనా శ్రీ వేంకటనాయక శేషశాయినే నమో నమో
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో
ఇరవుగ నీగతి నెవ్వరు దలచిన ఇహపర మంత్రములిందరికి"(1-380)

ఈ విధంగా భాగవత, సంకీర్తన ప్రాశస్త్యాన్ని కొనియాడి, ముక్తికోసం పోతన భాగవతాన్ని అన్నమయ్య సంకీర్తనలను రచించారు.

శ్రీ కైవల్య పదంబుజేరుటకునై చింతించెదన్" (1-1) అని పోతన తన కైవల్యకాంక్షను తెలిపాడు.

అట్లే అన్నమయ్య".............యీతని సంకీర్తన మోక్షమునకు"(3-63) అని మోక్షకాంక్షను తెలిపాడు.

భక్తి విధానాలను గురించి శ్రీకృష్ణ భాగవానుడు భగవద్గీతలో చెపుతూ అందులో మొదటి తరగతికి చెందినవారిని గురించి ఇలా చెప్పాడు.

"సతతం కీర్తయంతోమాం యతం తశ్చదృధవ్రతాః
సమస్యంత శ్చమాం శక్త్యా నిత్యయుకా ఉపాసతే" (భగవద్గీత 9-14)

. (నా గుణాలను, దివ్యనామాలను, అద్భుత లీలలను కీర్తిస్తూ నాకు భక్తి యుక్తులై ప్రణామాలు ఆచరించి తీవ్ర నిశ్చయంతో యత్నపరులై ఇంద్రియాలను మనస్సును నిగ్రహించి నాయందు మనస్సు లగ్నంచేసి నన్ను ఉపాసిస్తారు.)

ఈ మొదటి తరగతికి చెందినవారే పోతన, అన్నమయ్యలు. వీరిరువురి భక్తి ప్రాశస్త్యాన్ని కొనియాడారు. కవులు ఎందరైనా ఉండవచ్చు అయితే "చదువది ఎంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న యా చదువు నిరర్థకంబు" అన్నట్లు ఎంత పాండిత్యం ఉన్నా రసజ్ఞత అనే భక్తి సంస్కారం లేనివారి కావ్యాలు, రచనలు వన్నెకెక్కవు. అయితే ఈ భక్తి అనేది అందరికీ అలవడదు. అది పూర్వజన్మ సుకృతం కొద్ది లభిస్తుందని అంటాడు అన్నమయ్య.

**భక్తి ప్రశంస :**

"చిక్కడు వ్రతముల గ్రతువుల
జిక్కడు దానముల శౌచశీల తపములం
జిక్కడు యుక్తిని, భక్తిని
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధముసుండీ"

"అంధేదూదయముల్ మహాబధిర శంఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గ్రంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్"

"హరి చరణారవింద యుగళార్చన సన్నుతి భక్తియోగముల్
నిరతము గల్గువారె భవనీరజ గర్భుల కందరాని భా
సురపద మందుఁజేరుదురు సూరి జనస్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మ ఫలమున్ గణుతింపఁ దరంబె యేరికిన్?"

"ప్రబ్బిన భక్తిని హరిపైఁ
గబ్బంబులు సెప్పి కవులు కైవల్యశ్రీ
కబ్బుదురుట హరిపోషణ
మబ్బిన తలిదండ్రులెచటి కబ్బుదురో తుదిన్"

భక్తితో హరిజన్మ కథల్ని చదివిన వానికి సంసార దుఃఖం తొలగిపోతుందని చెపుతున్నాడు.

"అతి రహస్యములైన హరిజన్మకథనంబు
మనుజుడెవ్వడేని మాపురేపు
జాలభక్తితోడఁజదివిన సంసార
దుఃఖరాశిఁబాసి తొలగిపోవు"

"భక్తియుక్తుడు లోకేశ పదమునొందు" అని ఏ పని చేసినా భక్తితో చెయాలన్నదే పోతన మతంగా తెలుస్తుంది.

అన్నమయ్య :

"సకల కర్మముల చేత సాధ్యముకాని నీవు
వొక యించుకంత భక్తి కొగిలోనైతివి"

"సకల శాంతికరము సర్వేశ నీపై భక్తి సర్వేశ
ప్రకటమై మాకు నబ్బే బ్రతికించునదియె సర్వేశ"

"పదిలమై వేంకటపతి భక్తి కలిగితేను
తుదిపదంబునకెల్ల తొడవునపుడే"

అందుకే కోనేటిరాయుడైన శ్రీవేంకటేశ్వరుని భక్తితో కొలవండని తెలియజేస్తున్నాడు అన్నమయ్య

"కొలువుడీ భక్తి కొండల కోనేటి
నిలయుని శ్రీనిధియైన వాని"
"భక్తి నీపై దొకటె పరమసుఖము
యుక్తి చూచిన నిజంబొక్కటేలే"

"అతి రహస్యమిది అచ్యుతుపై భక్తి
ప్రతిలేని పరమ పావనము
చతురలై తెలిసిరి సనకాది మునులు
తతి దొరకుట సుకృత ఫలము కొలది"

"సదానందము సర్వేశ్వరా నీ
పదారవిందము పై భక్తి"

"మహిలో శ్రీ వేంకటేశ మరి నీ దాసుడనైతి
బహుభక్తి నీ మీద పచరించేనయ్యా"

"ఇహమేకాని పరమేకాని
బహుళమై హరి నీపై భక్తేచాలు"



**ఈ పుస్తక ప్రశంస, పఠన ఫలితం :**

**తే॥** పోతనన్నమయ్యల భావ పుణ్యచరిత
కలిమి బలిమియు నిచ్చేటి కావ్య వనిత
సకల శుభముల నొసగేటి సాధుమమత
మోక్షకాముకునకునిది ముక్తి దయిత

**తే॥** పతితులకుఁ భక్తి ఫలములఁ బంచుగాక
మించి అలమేలు విభుఁడది మెచ్చుగాక
వరములొసగను ప్రియమున వచ్చుగాక
ఇహపర సుఖములన్నియు నిచ్చుగాక

డా॥ వై. పరమేశ్వరుఁ

# రచయిత గురించి



**పేరు** డా॥ యడవల్లి పరమేశ్వరయ్య

B,Mus., M.A., Ph.D.,

తెలుగు లెక్చరర్ (SVCMD)

గాత్రం, వయోలిన్, కీబోర్డు కళాకారులు

**జననం** : 13-01-1974 (10-03-1974 సర్టిఫికేట్)

గోవిందప్పనాయుడు కండ్రిగ,

బి.యన్.కండ్రిగ మండలం,చిత్తూరుజిల్లా

**విద్యా, ఉద్యోగం**

1988-89 పదవతరగతి, బి.యన్. కండ్రిగ

1991-92 ఇంటర్మీడియట్, శ్రీకాళహస్తి

హార్మోనియంపై సంగీత సాధన ప్రారంభం, గురువు : గురప్ప (బావగారు)

1993-96 B. Music వయోలిన్, (SVCMD), తిరుపతి.

1997-98 "అన్నమాచార్య సంకీర్తనా స్కాలర్‌షిప్‌కోర్సు", ప్రథమశ్రేణి, టి.టి.డి.

1998 గాత్రకళాకారుడుగా (ప్రైవేట్) అన్నమాచార్య ప్రాజెక్టు, టి.టి.డి.

1999 టి.టి.సి.

1999-2001 ఎం.ఏ., తెలుగు యస్.వి.యు.

2003-2007 తెలుగు టీచర్, శ్రీవిద్యానికేతన్, రంగంపేట

2007 పి.హెచ్.డి. అవార్డు

**బహుమతులు - అవార్డులు**

1995-1996 బెస్ట్ స్టూడెంట్ అవార్డు, (SVCMD)

2000 సుగంధి కుంతల డివోషనల్ సాంగ్స్ కాంపిటీషన్‌లో ప్రథమశ్రేణి

2001 శాస్త్రీయ, లలిత సంగీతాలలో ప్రథమ శ్రేణి Cultural youth - festival, S.V.U.

2006 ప్రతిభా పురస్కారం GVR Cultural foundation, Hyderabad

**రచనలు - (అముద్రితాలు)**

రమణ మహర్షి చరిత్ర, అన్నమాచార్య చరిత్ర - నృత్యరూపకం

భక్త ప్రహ్లాద చరిత్ర, పర్యావరణ పరిరక్షణ - నృత్యరూపకం

శివునిపై కొన్ని కీర్తనలు

మైత్రీగేయం

ఇరవైకి పైగా అన్నమాచార్య సంకీర్తనలకు సంగీత కూర్పు

"అలమేలుమంగ విభుడ" అన్న మకుటంతో శతకం